# మారుతున్న ప్రపంచం ఇస్లామీయ ఆలోచనా విధానం

రచన

**సయ్యద్ సాదతుల్లాహ్ హుసైనీ**

తెలుగు అనువాదం

**బతూల్ హుమైర్వీ**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (Regd.)**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-2. ఫోన్:040-24564583

**Name of Book : Maruthunna Prapancham Islamiya Aalochana Vidhanam**

**Source : Badalti Huyi Duniya Aur Islami Fikr** ***(Telugu)***

**TIP Series No.** : **344**

Writer : **Syed Sadathullah Hussiani**

Translator : **Batool Humairvi**

*All Rights Reserved with Publishers*

1st Edition : January 2023

Copies : 1000

**Price** : **Rs.180/-**

ISBN : 978-93-81111-95-6

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24576237, 24564583
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయసూచిక


| | |
|---|---|
| భూమిక | 04 |
| ముందుమాట | 06 |
| నా మాట | 12 |
| అనువాదకుని మాట | 14 |
| 1. ఇస్లాం సంస్కృతీ సౌరభాలు | 15 |
| 2. బహుళ సమాజాలలో ముస్లిం సమాజ బాధ్యతలు | 30 |
| 3. సెక్యులరిజం– ఇస్లామీయ ఉద్యమం | 41 |
| 4. నేషనలిజం– ఇస్లాం– ఇస్లామీయ ఉద్యమం | 57 |
| 5. వలస విముక్తి వాదం– ఇస్లాం స్వేచ్ఛాయుత భావన | 71 |
| 6. భారతీయ సమాజంలో ఇస్లాం ప్రాతినిధ్యం | 90 |
| 7. భారతదేశంలో ఇస్లామీయ ఉద్యమ వికాసం– వర్తమాన కార్యాచరణ | 101 |
| 8. ఇస్లామీయ ఉద్యమం : సైద్ధాంతిక సవాళ్లు | 120 |
| 9. ఇస్లామీయ ఉద్యమ సాహిత్యం : దాని ముందున్న శాస్త్రీయ సవాళ్లు | 129 |
| 10. సంప్రదాయ వాదం, ఆధునిక వాదం : మౌలానా మౌదూది (రహ్మాలై) మధ్యేమార్గం. | 148 |
| 11. ధర్మ సంస్థాపనా దృక్పథంపై అభ్యంతరాలు : స్థూల పరిశీలన | 162 |

# భూమిక

స్పష్టమైన వైఖరి, సరళమైన రూపురేఖలు సైద్ధాంతిక ఉద్యమాలకు కావలసిన వనరులు. అందునా సైద్ధాంతిక ఉద్యమాలు సాధారణ సమాజాన్ని తమలో ఇముడ్చుకునేందుకు, ప్రజాబాహుళ్యాన్ని తమ వైపు ఆకర్షించాలని ఆకాంక్షించినప్పుడు దీని ప్రాధాన్యత మరింత అధికమవుతుంది.

మారుతున్న కాలంతో పాటు ఎన్నో సమస్యలు, సవాళ్లు ఉత్పన్న మవుతాయి. ఆయా సమస్యలు సవాళ్లను సమయానుకూలంగా అధిగమించడం, వాటికి సరైన దిశానిర్దేశన చేయడం, వాటిపై సరైన మార్గదర్శకత్వాన్ని అందించడం సైద్ధాంతికంగా సామాజికంగా ఉద్యమాలు ఆదరణ పొందేందుకు అతి ప్రధానమైన ఆవశ్యకత.

ఆధునిక ప్రపంచంలో ఇస్లామీయ ఆలోచనాసరళి అనే అంశంపై అమూల్యమైన, వైవిధ్యభరితమైన వ్యాసాల సంపుటి ఇది. ఈ సంపుటిలో సంస్కృతి, బహుళ సమాజాలు, సెక్యులరిజం, నేషనలిజం, లౌకికవాదం, జాతీయ తత్వం సామ్రాజ్యవాదం, సాంప్రదాయిక వాదాలు, అభ్యుదయ వాదాల వంటి అనేక అంశాలపై ఇస్లామీయ వైఖరి, విధానాలను వివరించే ఆలోచనాత్మక వ్యాసాలు న్నాయి. భారతదేశంలోని ఇస్లామీయ ఉద్యమాల ముందు సైద్ధాంతికంగా శాస్త్రీయంగా ఉన్న సవాళ్లు ఏమిటి? ఆయా సవాళ్లను అధిగమించేందుకు ఎటువంటి ప్రణాళికలు అవసరం అనే వాటిపై ఈ వ్యాసాలలో వివరణాత్మక విశ్లేషణ ఉంది.

ప్రస్తుత ప్రపంచంలో ఎదురయ్యే సమస్యలను సమగ్రంగా విశ్లేషించడం, ఇస్లాంపై ఉన్న అభ్యంతరాలను సమీక్షించడం, ఖురాన్ సున్నత్ బోధనల లోతైన అధ్యయనం చేయడం, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో దివ్య ఖురాన్ హదీసుల

మార్గదర్శకాలను పటిష్టమైన ఆధారాలు, పరిపక్వమైన ప్రకటనల వెలుగులో ప్రజా బాహుళ్యం ముందు ఉంచాలనే ఉద్దేశం హిదాయత్ పబ్లిషర్స్ స్థాపన మొదటి రోజు నుండే ఉండింది.

గౌరవనీయులు జనాబ్ సయ్యద్ సాదతుల్లాహ్ హుసైనీ గారి వ్యాసాల ఈ సంపుటి ఆ పరంపరలోని ప్రధాన భాగమే. ఈ వ్యాసాలలో అధునాతనం, సృజనాత్మకత, స్పష్టమైన వైఖరి, వివరణాత్మక విశ్లేషణ అన్నీ ఉన్నాయి. ఈ పుస్తకం సాధారణ ప్రజానీకంలో మెదిలే సందేహాలు సంశయాలకు సరైన సమాధానంగా, సైద్ధాంతిక స్థాయిలో ఇస్లామీయ ఉద్యమ శ్రేణులకు దిశానిర్దేశన చేసే ఆయుధం గా దోహదపడుతుందని ఆశిస్తున్నాం.

**అబుల్ ఆలా సయ్యద్ సుబ్హానీ...**

# ముందుమాట

ఇస్లామీయ ఉద్యమంలో సైద్ధాంతికంగా చర్చనీయాంశమైన కొన్ని కోణాలు, వ్యాసాలు ప్రసంగాల సంపుటి ఇది. గత ఏడెనిమిది సంవత్సరాలుగా జరిగిన ప్రసంగాలు, పత్రికలలో ప్రచురితమైన వ్యాసాలు, వీడియోల రూపంలో సోషల్ మీడియాలో వైరల్ అయిన అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

ఇస్లామీయ ఉద్యమం ఒక సైద్ధాంతిక ఉద్యమం. సైద్ధాంతిక ఉద్యమం సమాజంలో చర్చలను లేవనెత్తుతుంది. సామాజిక మార్పుకు కావాల్సిన విజన్, దాని కొరకు అవసరమైన తాత్విక పునాదులను అందిస్తుంది. అందులో భాగంగా పటిష్టమైన ఆధారాలను ప్రవేశపెడుతుంది. సమాజంలో ఉన్న ఇతరత్రా సిద్ధాంతాలు భావజాలాల గురించి కూడా స్పష్టమైన వైఖరి అవలంబిస్తుంది. సమర్థించవలసిన విషయాలలో వాటికి సంపూర్ణ మద్దతునిస్తుంది. సవరణలు సంస్కరణలు అవసరమైతే వాటిని కూడా పటిష్టమైన ఆధారాల ద్వారా వాదనల ద్వారా వివరిస్తుంది. దాని ఆలోచనలకు విరుద్ధమైన విషయాలపై కూడా స్పష్టంగా స్పందిస్తుంది.

మన దేశంలో ఇస్లామీయ ఉద్యమ ప్రస్థానం ఈ సైద్ధాంతిక విశ్లేషణల తోనే ప్రారంభమయ్యింది. మౌలానా మౌదూదీ తదితరులు, ఉద్యమాలకు ఆద్యులైన సిద్ధాంతకర్తలు హేతుబద్ధమైన రీతిలో ఇస్లామీయ ఆలోచనావిధానాన్ని ప్రవేశపెట్టారు. ఇస్లాం సమాజంలో కాంక్షించే మార్పును, వాటి రూపురేఖలను వివరించారు. అందుకోసం ధర్మసంస్థాపన లేదా ఇఖామతే దీన్ అనే సమగ్రమైన పారిభాషిక పదజాలాన్ని ఉపయోగించారు. ఆయా మేధావులు ఇస్లాంకు విరుద్ధమైన జీవన వ్యవస్థ, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులైన వారిని తీవ్రంగా విమర్శిస్తూ, వారి బలహీనతలు లోపాలను కూడా ఎత్తి చూపారు. స్వయానా

ముస్లిం సమాజంలో నెలకొన్న తప్పుడు భావాలు, తప్పుడు వైఖరులను కూడా తీవ్రంగా ఖండించారు.

ఈ మౌలిక సిద్ధాంతాలే కాక, స్వతంత్ర భారతంలో మారుతున్న పరిస్థితుల్లో అనేక మంది ఇస్లామీయ మేధావులు తమ వాదనలను ముందుకు తీసుకు వచ్చారు. ఈ విషయంలో మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ(రహ్మ), మౌలానా ఉరూజ్ ఖాద్రి(రహ్మ), డాక్టర్ నజాతుల్లాహ్ సిద్దీఖీ(రహ్మ), డాక్టర్ ఫజ్లుర్రహమాన్ ఫరీదీ(రహ్మ), డాక్టర్ అబ్దుల్ హఖ్ అన్సారీ(రహ్మ), మౌలానా సయ్యద్ జలాలుద్దీన్ ఉమ్రీ(రహ్మ) లాంటి మేధావుల పేర్లు ప్రస్తావించవచ్చు. ఆయా విద్వాంసులు మారుతున్న ఈ పరిస్థితులలో ఇస్లామీయ సిద్ధాంత రూపురేఖలను స్పష్టం చేశారు. ఆధునిక సామాజిక వాస్తవాలకు అనుగుణంగా ఇస్లామీయ సిద్ధాంతాల సరైన రూపురేఖలను స్పష్టం చేస్తూ, సరికొత్త సామాజిక వాస్తవాల మధ్య ఇస్లామీయ ఉద్యమ చర్చలకు అనుకూలమైన పునాదులను నెలకొల్పారు.

గత రెండు దశాబ్దాలుగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పెను మార్పులు సంభవించాయి. ఈ దశలో ఇస్లాం సైద్ధాంతిక శక్తిగా కూడా మనగలిగింది. ఈ పరిణామాలే ప్రపంచ వ్యాప్తంగా ఇస్లాం పట్ల భయాందోళ నలు అలాగే ఇస్లామోఫోబియాను సృష్టించాయి. అడుగడుగునా ఇస్లాం విరోధ శక్తులు కూడా ఉనికిలోకి వచ్చాయి. అంతే వేగంగా వారికి పురోగతి కూడా లభించింది. ఈ స్థితి గతులు ముస్లిం యువకుల్లో వివిధ రకాల ధోరణులను ఉసిగొల్పడమే గాక వారిని అగమ్యగోచర పరిస్థితులలో పడవేశాయి.

మరోవైపు గ్లోబలైజేషన్, శాస్త్రీయ సాంకేతిక అభివృద్ధి, ఆర్థిక రంగంలో ఏర్పడిన సరికొత్త మార్పులు కూడా ఎంతో ఉత్కంఠను సృష్టించాయి. సామ్రాజ్యవాద పడగలు ప్రపంచమంతా విప్పుకున్నాయి. అది ప్రపంచమంతటా తన గుత్తాధిపత్యాన్ని కొనసాగించడమే కాక ప్రపంచ వనరులను కూడా పూర్తిగా వశం చేసుకుంది. ఆర్థిక అసమానతలు తారస్థాయికి చేరాయి. బడుగు బలహీన వర్గాలలో తమ హక్కుల పట్ల అవగాహన కలగడమే కాక ఎల్లెడలా ప్రతి ఘటనా ఉద్యమాలూ లేచాయి.

ఆధునిక వాదం పుణ్యమా అంటూ మనుషుల ఆలోచనా విధానాలు మారాయి. ఆధునిక భావాలు కొత్త కొత్త అర్థాలు తొడగనారంభించాయి.

అరాచక వాదం, వలస విముక్తి వాదం, గుర్తింపు రాజకీయాలు ఇలాంటి ఎన్నో భావాలు పాశ్చాత్య పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయ భావనలను అందించాయి.

ఇస్లామీయ సిద్ధాంతాలు ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యాసాల సంపుటిలో ఉన్న కొన్ని సందేహాలను ఇస్లామీయ సిద్ధాంతాల వెలుగులో ఒక విద్యార్థిగా అవగాహన చేసుకునే ప్రయత్నమే. వివిధ సందర్భాలలో వ్రాసిన వ్యాసాల సంకలనమే తప్ప ఈ పుస్తకం క్రమబద్ధంగా వ్రాసింది కాదు. ఈ వ్యాసాలలోని అనేక చర్చలు ప్రాథమిక స్థాయికి సంబంధించినవనే అవగాహన రచయితకు ఉంది. చాలా వ్యాసాల్లో కేవలం సందేహాలను లేవనెత్తడానికే పరిమితం చేయడం జరిగింది. ఇస్లామీయ ఉద్యమ విద్వాంసులు ఈ చర్చలను మరింత ముందుకు కొనసాగిస్తారనే ఉద్దేశంతో ఈ వ్యాసాలను ప్రచురించడం జరిగింది. దైవ చిత్తమైతే రచయిత ఈ అంశాలపై ఇదే విధమైన ఇతర అంశాలపై కూడా మరింత వివరణాత్మకంగా తన కలాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయవచ్చు. జ్ఞానసంపన్నులైన పెద్దలకు, సోదరులకు నేను చేసే అభ్యర్థన కూడా యిదే.

సంపుటిలోని మొదటి వ్యాసంలో ఇస్లాం సాంస్కృతిక పునాదులు వాటి రూపురేఖలను స్పష్టం చేసేందుకు ప్రయత్నించడం జరిగింది. ఇది చాలా సులభ గ్రాహ్యమయిన అంశం, నిజానికి విద్యార్థుల ముందు చేసిన ఒక ప్రసంగానికి తరువాత వ్యాస రూపం ఇవ్వడం జరిగింది. అనేక మంది మేధావులు ఇస్లామీయ సంస్కృతి పై అమూల్యమైన రచనలు చేశారు. ఈ వ్యాసాలను లోతైన శాస్త్రీయ చర్చలకు పరిమితం చేయకుండా నాగరికతా సంస్కృతుల ఆధునిక, అభ్యుదయ వివాదాల నేపథ్యంలో ఇస్లాం సాంస్కృతిక పునాదులు, సాంస్కృతిక రూపురేఖలతో వాటికి ఉన్న అవినాభావ సంబంధాన్ని అవగతం చేసే ప్రయత్నం జరిగింది.

భారతదేశంలో ఉన్న ఇస్లామీయ ఉద్యమం అలాగే ఇతర ఉద్యమాలకు ఎదురవుతున్న ప్రధాన ప్రాథమిక సవాళ్ళ నేపథ్యంలో ఈ సంపుటిలో లౌకిక వాదం, జాతీయ తత్వం, బహుళ సమాజాలను కూడా చర్చనీయాంశం చేయడం జరిగింది. ఈ వ్యాసాల ఉద్దేశం ప్రస్తుత పరిస్థితుల్లో ఇస్లామీయ ఉద్యమాలు అవలంబించాల్సిన వ్యూహరచనలు, వర్తమాన కార్యాచరణలకు

సైద్ధాంతిక పునాదులు ఏమై ఉండాలి. ఆయా సందేహాలకు సమాధానాలు కనుగొనే ప్రయత్నం తప్ప ఇస్లాం ఆదర్శాలను ప్రస్తావించడం ఎంత మాత్రం కాదు. ఉద్యమ ఆద్యులైన మేధావులు ఆధునిక భావాలను విమర్శించిన సమయంలో ఆయా పారిభాషిక పదాలకు ప్రత్యేక అర్థాలు ఉండేవి. మారుతున్న ప్రపంచ స్వరూపంలో, ఆధునిక వాద ప్రపంచంలో ఆ పారిభాషిక పదాలు ఎన్నో అర్థాలలో ఉపయోగించబడుతున్నాయి. కనుక వాటి విషయంలో మన విధానాలు ఎలా ఉండాలనేది ఆలోచించడం, ఆయా పదబంధాలను పరిగణన లోకి తీసుకోవడం కూడా అవసరమే. ఈ వ్యాసాలలో ఆ ప్రయత్నం జరిగింది.

ప్రస్తుత కాలంలో వలస విముక్తివాదం ఒక ప్రధాన సిద్ధాంతంగా, సామాజిక ధోరణిగా మారింది. ప్రపంచవ్యాప్తంగా వలసవిముక్తివాదం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ముక్తిదాయకమయిన మార్గాలను అన్వేషించేందుకు దారులు తెరిచింది. మన దేశంలో దళితులు, ఆదివాసీలు ఇతర బడుగు బలహీనవర్గాల ఉద్యమాలు కూడా వాటి ప్రభావాలను అంగీకరించాయి. ఈ అంశంపై రాసిన వ్యాసంలో వలస విముక్తివాదం, ఇస్లాంలోని స్వేచ్ఛాయుత భావనలను చర్చ నీయాంశం చేయడం జరిగింది.

స్వతంత్ర భారత దేశంలో ఇస్లామీయ ఉద్యమాలు అవలంబించిన విధానాలు వాటి సైద్ధాంతిక పునాదులు ఏమిటి అనే ప్రశ్న తరచూ చర్చనీయాంశం అవుతూనే ఉంటుంది. దాన్ని కూడా భారతదేశంలో ఇస్లామీయ ఉద్యమాల సైద్ధాంతిక క్రమ వికాసం అనే అంశం పేరిట వివరణాత్మకంగా చర్చనీయాంశం చేసే ప్రయత్నం జరిగింది. ఆ వ్యాసంలో ఇస్లామీయ ఉద్యమ ప్రస్థానం మొదలైన ఆరంభంలో కారకమైన సైద్ధాంతిక కారణాలను కూడా విశ్లేషించడం జరిగింది. ఆ తరువాత ఉద్యమంలో వచ్చిన కొన్ని ఆచరణాత్మక మార్పులు సైద్ధాంతిక క్రమ వికాసానికి కారకమైన సామాజిక రాజకీయ సైద్ధాంతిక మార్పులను కూడా చర్చనీయాంశం చేయడం జరిగింది.

ఉద్యమ శాస్త్రీయ అవసరాలకు సంబంధించిన రెండు వ్యాసాలు కూడా ఉన్నాయి. ఆ వ్యాసాలలో ఒక సైద్ధాంతిక ఉద్యమం సైద్ధాంతిక కృషి శాస్త్రీయ పరమైన కృషి గట్టి ప్రయత్నాలు లేనిదే మనగలగదనే విషయాన్ని కూడా

వివరించడం జరిగింది. వాటిలో ప్రస్తుతం ఉన్న శాస్త్రీయ సవాళ్లను కూడా విశ్లేషించడం జరిగింది. ఆయా పరిస్థితుల్లో ఉద్యమాలు శాస్త్రీయమైన సైద్ధాంతిక మైన ప్రయత్నాలను ఎలా కొనసాగించాల్సిఉందనే విషయంపై కూడా వివరణ ఇవ్వడం జరిగింది.

ప్రస్తుతం ఇస్లామీయ ఉద్యమం మనదేశంలో చేయవలసిన ప్రధానమైన కృషి సందేశ ప్రచార కర్తవ్యం. ధర్మ సందేశం అంశంపై ఎంతోమంది ధార్మిక పెద్దలు రచనలు చేశారు. కనుక ఈ సంక్షిప్తమైన వ్యాసంలో సందేశ ప్రచార కార్యరంగంలో ఎదురయ్యే కొన్ని ఆచరణా పరమైన సమస్యల పరిష్కారం కనుగొనడం తప్ప సందేశ నియమ నిబంధనలు విధివిధానాలను వివరించడం జరగలేదు.

సంప్రదాయ వాదం ఆధునిక వాదం రెండిటికీ మధ్యేమార్గం రూపంలో ఇస్లామీయ ఉద్యమం ముందుకొచ్చింది. నేటి ప్రపంచ పరిస్థితుల్లో ఆధునిక వాదం ఆ తరువాత వివాదాల అనంతరం ఏర్పడిన సంఘర్షణలో తీవ్రత ఏర్పడింది. దాని ప్రతిఘటనగా సనాతన వాద నినాదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆ పరిస్థితుల్లో ఉద్యమం అవలంబించే మధ్యే మార్గాన్ని అవగతం చేసుకోవడం, పరస్పర అవగాహన అవసరం కూడా ఏర్పడింది. ఒక వ్యాసంలో ఈ పాఠాలనే పునరావృతం చేయడం జరిగింది.

ప్రస్తుత ప్రపంచంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ధర్మసంస్థాపనా భావనపై విమర్శల వర్షం కురుస్తోంది. ఈ విమర్శలకు కేంద్రబిందువు ఇస్లాం బద్ధ శత్రువులు ఓవైపయితే మరోవైపు ముస్లిం మేధావులు కూడాను. ధర్మసంస్థాపన భావనలపై ఆయా ముస్లిం మేధావులు చేసే విమర్శలపై తులనాత్మక విశ్లేషణ జరిగిన వ్యాసం కూడా ఒకటి ఉంది.

విద్వాంసులు ఈ కృషిని స్వాగతిస్తారనీ ఈ చర్చను మరింత ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నాము.

ఆయా చర్చలపై, సందేహాలు, సమీక్షలు, విమర్శలు, సమర్ధనలతో చర్చను ముందుకు తీసుకెళ్లడంలో తోడ్పడిన శ్రోతలు పాఠకులకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

హిదాయత్ పబ్లిషర్స్, సోదరుడు అబుల్ ఆలా సుభాని గారికి హృదయ

పూర్వక కృతజ్ఞతలు. ఆయన పట్టుదల, ప్రోద్భలం, నిరంతరచొరవ చూపక పోతే ఈ పుస్తకం ఉర్దూభాషలో వెలుగులోకి వచ్చేది కాదు.

డాక్టర్ రఫత్ సాహెబ్, మౌలానా రజీవుల్ ఇస్లాం నద్వీ సాహెబ్, మౌలానా మొహియుద్దీన్ గాజీ సాహెబ్‌లు కూడా, ప్రచురణకు ముందే ఈ పుస్తక డ్రాఫ్ట్‌ను అధ్యయనం చేశారు. కొన్ని అమూల్యమైన సలహాలు కూడా ఇచ్చారు. నేను వారికి రుణపడి ఉన్నాను వారికి మంచి ప్రతిఫలం ప్రాప్తి కావాలని వేడు కుంటున్నాను.

డాక్టర్ నజాతుల్లా సిద్ధీఖి సాహెబ్, అనారోగ్య కారణాల వల్ల ఈ పుస్తకంపై తన అభిప్రాయాన్ని అందించలేకపోయినప్పటికీ ప్రచురణకు మాత్రం తరచూ ప్రోత్సహిస్తూనే ఉన్నారు. వారికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాను. – ఆమీన్.

నా సహధర్మచారిణి డాక్టర్ నాజ్నీన్, తనయులు ఇజామ్, నాబిగ్‌లకు హృదయ పూర్వక ధన్యవాదాలు. ఈ పుస్తకం రాసే క్రమంలో వారు ఎంతో సంయమనంతో తమ సహకారమందించారు.

అల్లాహ్ నా ఈ చిరు ప్రయత్నాన్ని స్వీకరించు గాక! ఆమీన్.

اللهم ارنا الحق حقا وارزقنا اتباعه وارنا الباطل باطلا وارزقنا اجتنابه

**– సయ్యిద్ సాదతుల్లాహ్ హుసైనీ**

హుమాయూన్ నగర్

హైదరాబాద్

ఫిబ్రవరి 1, 2018.

# నా మాట

మౌలానా మౌదూదీ (రహ్మ) ఇస్లామీయ ఉద్యమాన్ని భారత ఉప ఖండంలో ప్రారంభించి నేటికి 75 సంవత్సరాలు దాటాయి. ఇస్లాంను సమగ్ర జీవన వ్యవస్థగా నిరూపించడానికి సమకాలీన సిద్ధాంతాలలోని లోపాలను ఎత్తిచూపుతూ ఇస్లాంను ప్రత్యామ్నాయంగా చూపవలసిన అవసరం రీత్యా ఆయన(రహ్మ)పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజం, ఫాసిజం, జాతీయవాదం, తదితర సిద్ధాంతాలపై సాధికారతతో, విస్తారంగా రాశారు. ఈ డభ్భయ్యేళ్ళ కాలంలో దేశ కాలమాన పరిస్థితులలో అనేక మార్పులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇస్లామీయ ఉద్యమం సమయానుకూల ప్రణాళికలతో ముందుకు వెళ్తుంది. ప్రపంచీకరణ తర్వాత దేశంలోని ప్రతి రంగంలోనూ పెనుమార్పులు వచ్చాయి, అనేక అసత్య సిద్ధాంతాలు తమ రంగును కోల్పోవడం ప్రారంభ మైంది. టెక్నాలజీ విస్తృతం కావడంతో నాగరికతలో పెనుమార్పులు వచ్చాయి. అసత్య విధానాలు, సిద్ధాంతాలు తమకు తాముగా బలహీనపడే సందర్భం వచ్చింది. ఈ మారిన పరిస్థితుల నేపథ్యంలో మౌలానా మౌదూదీ (రహ్మ) స్ఫూర్తితో నూతన సవాళ్ళను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావలసిన అవసరం ఉంది. ఈ ఆవశ్యకతను పూర్తిచేయడానికి మౌలానా మౌదూదీ(రహ్మ) సృష్టించిన సాహిత్యాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఉద్యమ కార్యకర్తలకు ఉంది. ఆయన(రహ్మ) రాసిన ప్రతి పుస్తకాన్నీ చదవాలి. అప్పుడే సమకాలీన సిద్ధాంతాల లోపాలపై అవగాహన వస్తుంది. మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం “మారుతున్న పరిస్థితులు– ఇస్లామీయ ఆలోచనా విధానం” కూడా మౌలానా మౌదూదీ (రహ్మ) రచనల పునాదిగా ప్రస్తుత అమీరె జమాఅత్ సయ్యిద్ సాదతుల్లా హుసైనీ గారు రచించారు. దీనిలో ప్రజాస్వామ్యం, జాతీయవాదం, లౌకికవాద సిద్ధాంతాలు ప్రస్తుత కాలంలో ఎలా తమ పునాదులను కోల్పోతున్నాయో వివరించారు,

ఇస్లామీయ ఆలోచనా విధానానికి ఎదురవుతున్న సవాళ్ళను విశదీకరించారు. సైద్ధాంతిక రంగంలో పని చేసేందుకు రోడ్ మ్యాప్ సూచించారు. ఇటీవలి కాలంలో ధర్మసంస్థాపనపై వస్తున్న అభ్యంతరాలకు కూడా ఈ పుస్తకంలో సమాధానాలను ఇవ్వడం జరిగింది. నిజానికి ఈ పుస్తకంలోని వ్యాసాలు ఆయా సందర్భాలలో సాదతుల్లాహ్ హుసైనీ గారు చేసిన ప్రసంగాలు.వాటిలో కొన్ని వ్యాసాలు జిందగీ నౌ, తర్జుమానుల్ ఖుర్ఆన్ పత్రికలలో కూడా ప్రచురిత మయ్యాయి. ఆ తర్వాత 'బదల్తీ హుయి దున్యా ఔర్ ఇస్లామీ ఫిక్ర్' పేరుతో ఉర్దూలో పుస్తక రూపంలోకి వచ్చాయి. అల్లాహ్ దయవలన ఆ పుస్తకం నేడు తెలుగులో ప్రచురించబడడం ఆనందదాయకం. అనువాదకురాలు సోదరి బతూల్ హుమైర్వీ సరళంగా, చక్కగా అనువదించారు. ఈ పుస్తకం తెలుగునాట పనిచేస్తున్న ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తల సైద్ధాంతిక అవసరాలను తీర్చేందుకు బహుధా ప్రయోజనకరం కాగలదని ఆశిస్తున్నాను.

వస్సలాం

**ముహమ్మద్ రఫీఖ్,**

అమీరె హల్ఖా

ఆంధ్రప్రదేశ్

విజయవాడ

13-12-2022

# అనువాదకుని మాట

ఈ పుస్తకం ఒక సాధారణ పుస్తకం ఎంత మాత్రం కాదు సుమా! ఇది రచయిత సయ్యద్ సాదతుల్లాహ్ హుసైనీ గారి ఓ పరిశోధనాత్మక పుస్తకం. ఆద్యంతం సైద్ధాంతిక భావధారలపై సాగిన సంక్లిష్టమైన పుస్తకం. అత్యున్నతమైన భాష, భావాల ప్రామాణికత ఆయన రచనల సొంతం. ఆ రచనలను మనసారా ఆస్వాదించినప్పుడే అనువాదానికి న్యాయం చేయగలం. ఈ పుస్తకంలో ఉన్న సైద్ధాంతిక భావాలన్నిటినీ నేను ఔపోసన పట్టకపోయినా అనువాద క్రమంలో వాటిని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని మరీ అనువాదం చేసే ప్రయత్నం చేశాను.

గీటురాయిలో వచ్చే కేవలం కొన్ని వ్యాసాలకే పరిమితమైన నా సాహిత్య కృషిని అభిమానించి, అభినందించి అపారమైన నమ్మకంతో ఈ పుస్తక అనువాద బాధ్యతలను నాకు అప్పగించిన ఆంధ్రప్రదేశ్ అమీరే హల్ఖా ముహమ్మద్ రఫీఖ్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను...

నా స్థాయికి మించిన సిద్ధాంత పరమైన అంశాలు గల పుస్తకం అనువదించేందుకు వచ్చినప్పటికీ ఉద్యమం నాకు నేర్పిన ఆశయ సంకల్పం, అంకిత భావాలే పుస్తకాన్ని అనువదించేందుకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. నాకు సాధ్యమైనంతవరకు అనువాదానికి న్యాయం చేయడానికి శాయశక్తులా కృషి చేశాను. అయినప్పటికీ ఎక్కడైనా తప్పులు దొర్లితే పాఠకులు విశాలమైన మనసుతో నా దృష్టికి తీసుకువస్తారని ఆశిస్తున్నాను.....

అల్లాహ్ నా ఈ చిరు ప్రయత్నాన్ని స్వీకరించుగాక...ఆమీన్..

**– బతూల్ హుమైర్వీ**

గుంటూరు...

# ఇస్లాం సంస్కృతీ సౌరభాలు

నేడు ప్రపంచ వ్యాప్తంగా సంస్కృతి ప్రధానాంశంగా మారింది. ముస్లింలు మతాన్ని సంస్కృతిని కలగాపులగం చేస్తుంటారని ఓ అపవాదు కూడా ఉంది. అదే విధంగా ముస్లింలు సాంస్కృతిక వ్యవహారాలలో తమ మాతృదేశాన్నే అనుసరించాలని, తమ సాంస్కృతిక వ్యక్తిత్వాన్నే పట్టుకొని వేలాడకూడదని కూడా వాదిస్తుంటారు. ఇదిలా ఉంటే కొంతమంది ముస్లింలు మాత్రం ఇస్లామీయ సంస్కృతి, ముస్లింల సంప్రదాయాల మధ్య తేడాను గ్రహించడంలో విఫలమవుతున్నారు. ఈ వ్యాసంలో చాలా సంక్షిప్తంగా సులభ గ్రాహ్యంగా ఇస్లామీయ సంస్కృతి పరిచయం, దాని విశిష్టతలను, ఇతర సంస్కృతులను అనుసరించే క్రమంలో పాటించే నియమ నిబంధనలను కూడా వివరించడం జరిగింది.

## అసలు సంస్కృతి అంటే ఏమిటి?

సంస్కృతి (Culture) నాగరికత (Civilization) లాంటి పారిభాషిక పదాలు తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, చరిత్ర తదితర శాస్త్రాలలో తరచూ కనిపిస్తాయి. విద్యావేత్తలలో ఈ పదాల అర్థాలపై భిన్నాభిప్రాయాలున్నప్పటికీ చాలామంది ఈ రెండింటిని ఒకే అర్థంలో ఉపయోగిస్తుంటారు.

సమాజంలోని ఉమ్మడి విలువలు, విశ్వాసాలు, జీవన విధానాలు, భావోద్వేగాల కలయిక పేరే సంస్కృతి. ఆయా విలువలు విశ్వాసాలు భావోద్వేగాల వ్యక్తీకరణ, జీవన విధానాలు, వేషధారణ, ఆహార అభిరుచులు

మనకు కళారూపాలలో కనిపిస్తుంటాయి. మనం ఏమిటి? (What we are) ఈ ప్రశ్నకు సమాధానం ద్వారా మన 'సంస్కృతి' ఏదో నిర్ధారితం అవుతుంది.

నాగరికత (Civilization) అంటే పట్టణాభివృద్ధి కొరకు ఉనికిలోకొచ్చిన సంస్థలు, సామాజిక వర్గీకరణ, సామూహిక నడవడిక, సాంకేతిక పురోగతులు, సమాచార సాధనాలు, ప్రజాసంక్షేమ పనులు, కట్టడాలు, కళా క్షేత్రాలు, పాలనా పద్ధతులూ ఒక్క మాటలో చెప్పాలంటే (what we have?) మన వద్ద ఏముంది అనే ప్రశ్నకు వచ్చే సమాధానాన్నిబట్టి మన నాగరికత ఎటువంటిదో నిర్ధారితం అవుతుంది. ఈ నిర్వచనం ప్రకారం నాగరికతకూ సంస్కృతికీ అవినాభావ సంబంధం వుందనేది కాదనలేని వాస్తవం. అయితే నాగరికతను మనిషి అభివృద్ధి పరుస్తాడు కనుక అతని విలువలు విశ్వాసాలు భావనలు భావోద్వేగాల ప్రభావం నాగరికతపై కూడా పడుతుంద నడంలో అతిశయోక్తి లేదు. కనుక ఈ వ్యాసంలో ఇస్లామీయ సాంస్కృతిక స్రవంతి, నాగరికతా పునాదులపై చర్చిద్దాం.

## ఇస్లాం సాంస్కృతిక పునాదులు

ఇస్లామీయ జీవన వ్యవస్థ ప్రత్యేకత ఏమంటే అది కొన్ని శాశ్వత విశ్వాసాలు, దృక్పథాలపై ఆధారపడి ఉంది. జీవన ప్రమాణాలన్నీ ఆ విశ్వాసాలు విలువల పైనే పరిఢవిల్లుతాయి.. ఆయా విశ్వాసాలపై నే ఇస్లాం నాగరికతా పునాదుల నిర్మాణం ఉంటుంది.

అందులో ప్రధానాంశం ఏకేశ్వరోపాసన. ఈ సృష్టికి సృష్టికర్త, యజమాని కేవలం అల్లాహ్ మాత్రమే, ఆయనకు ఎవరూ సాటి లేరు, సమస్త భూగోళాన్ని సృష్టించడమే కాకుండా విశ్వమంతటిపై ఆయన అధికారం కలిగి ఉన్నాడు. విశ్వంలో ఉన్న ప్రతిదీ ఆయన ఆజ్ఞలకు లోబడి ఉంది. అధికారమంతా ఆయనదే. జ్ఞానమంతా ఆయన అధీనంలోనే ఉంది.

ఈ భూమిపై దైవ సృష్టితాలలో మహోన్నతమైన సృష్టి మానవ సృష్టి. మనిషి దైవానికి ప్రతినిధి కూడానూ. మానవులంతా ఒకే తల్లిదండ్రుల సంతానం కాబట్టి ఒకే కుటుంబానికి చెందినవారు. వర్ణం వర్గం నిమ్నోన్నతల ప్రాతిపదికన ఎవరికీ ఎవరిపై ఎటువంటి ఆధిక్యతా లేదు. దైవంమానవుణ్ణి తన ప్రతినిధిగా ఎన్నుకొని, భూమ్యాకాశాల వనరులన్నిటినీ ఆయన వశం చేశాడు. తన ప్రవక్తల ద్వారా ఆయన తాను మెచ్చే జీవన విధానం, వ్యవస్థలను మనిషికి అందజేశాడు.

చిట్టచివరి ప్రవక్త తర్వాత దివ్యఖురాన్, మహాప్రవక్త ముహమ్మద్ (స) బోధనలే ప్రళయం వరకు దైవాభీష్టాన్ని తెలియజేసే మార్గదర్శకాలు.

మానవునికి లభించిన దైవ ప్రసాదాలన్నిటి విషయంలో అతను దేవుని సమక్షంలో జవాబు చెప్పుకోవాల్సి ఉంది. దైవాభీష్టానికనుగుణంగా జీవితం గడిపినట్లయితే పరలోకంలో సాఫల్యం, లేనియెడల ఆ దేవుని సమక్షంలో వ్యధాభరితమైన అవమానాన్ని చవిచూడాల్సి ఉంటుంది.

మానవుని ఏకైక లక్ష్యం దైవ ప్రసన్నత మాత్రమే. ఆ దైవ ప్రసన్నతను పొందేందుకై మనిషి దైవాన్ని విశ్వసించాలి. ఆయన్ని తన ప్రభువుగా అంగీకరించాలి. దైవాభీష్టానికనుగుణంగా జీవితం గడుపుతూ ఆయన అప్పగింతల పట్ల నీతి నిజాయితీలతో వ్యవహరించాలి. ఇదీ ఇస్లామీయ విశ్వాసాల సంక్షిప్త సారాంశం. ఈ విశ్వాసాల ద్వారా ఎన్నో నియమ నిబంధనలు వర్తిస్తాయి. మానవ జీవిత పరమార్థం తెలుస్తుంది. శాసనాలు, నైతిక వ్యవహారాలు, జీవన విధానాల విషయంలో మార్గదర్శకత్వం లభిస్తుంది. మానవ సమాజాల లక్ష్యాలు రూపొందుతాయి. మానవుల మధ్య సంబంధ బాంధవ్యాల స్వభావాలు తెలుస్తాయి. భావాలు, భావనలు, ఆలోచనలు ఆశలు ఆకాంక్షలకు ఆధారాలు లభిస్తాయి. ఈ నియమాలే ఇస్లాం సాంస్కృతిక సౌధాలు.

## ఇస్లామీయ సాంస్కృతిక విశిష్టతలు

ఈ సూత్రాల ప్రాతిపదికన నిర్మితమైన సాంస్కృతిక సౌదామినికి కొన్ని ప్రత్యేకతలున్నాయి.

## 1. ఏకేశ్వరోపాసన

ఇస్లామీయ జీవన వ్యవస్థ, ఇస్లాం సాంస్కృతిక ప్రధానాంశం తౌహీద్ అంటే దైవం ఒకే ఒక్కడని విశ్వసించడం.

దైవంపై అచంచల విశ్వాసం, విశ్వసామ్రాజ్యాధిపతి ఆయనేనని అంగీకరించడం, మనసులో దైవప్రేమను కలిగి ఉండడం, ఆశలు ఆకాంక్షలన్నీ ఆయనపైనే పెట్టుకోవడం, ఆయన ఆరాధనను, దాస్యాన్ని తమ జీవిత లక్ష్యాలుగా మలచుకోవడం, కష్టనష్టాల్లో ఆయన్నే మొరపెట్టుకోవడం, ఆయన నిర్ణయాలకు కట్టుబడి ఉండడం, ఆయనకే భయపడుతూ, ఆయన్నే

వేడుకుంటూ, ఆయన స్మరణలోనే సంతృప్తి పొందడం వంటివి విశ్వాస విశిష్టతలు. వాటి ద్వారా మనిషి ధైర్య సాహసాలు, విశాల భావాలు, సకారాత్మక ఆలోచనలు, సహన స్థయిర్యాలు, శాంతి సంతృప్తి లాంటి మానసిక శక్తులతో వర్ధిల్లుతాడు.

ఇస్లామీయ చరిత్రను గనుక అధ్యయనం చేస్తే ఆద్యంతం ప్రతి రంగంలో ఉత్సాహాలు ఉన్నత ఆశయాలే కనపడతాయి తప్ప ఒత్తిడి, నిరాశా నిస్పృహలు ఆత్మహత్యలకు ఇస్లామీయ సంస్కృతిలో కించిత్తు చోటులేదు.

## 2. ఆశయ స్పృహ

ఈ సంస్కృతికి సంబంధించిన ప్రతిదీ ఉన్నత ఆశయం కలిగి ఉంటుంది. ఆధునిక పాశ్చాత్య సంస్కృతిలో ఇది కనిపించదు. అక్కడ భోగలాలస, వినోద విలాసాలు తప్ప ఎటువంటి ఉన్నత ఆశయం, ఆదర్శాలు లేవని ఇట్టే తెలిసి పోతుంది. పెట్టుబడిదారుల సేవల్లో మునిగి ఉండడం లేదా తాత్కాలిక రాజకీయ, సామాజిక లక్ష్యాలను నెరవేర్చే దిశగా పావులు కదపటం. పాప్ సంస్కృతి, రాక్ మ్యూజిక్కు, పబ్బులు క్లబ్బుల సంప్రదాయాలు, అర్ధనగ్న వేషాలు, అశ్లీల సాహిత్యాలు ఆ సంస్కృతీ ప్రతీకలు.

ఇస్లాం వ్యక్తికీ సమాజానికి ఒక ఉన్నత ఆశయాన్ని ఆదర్శాన్నిస్తుంది. దేవుని దాస్యం, దైవ ప్రతినిధిగా మనిషి బాహ్యాంతరాలను ఉన్నతంగా తీర్చిదిద్దు తుంది. మానవ విలువలు, మానవసేవ ముఖ్యమని బోధిస్తుంది. కనుక ఇస్లామీయ సంస్కృతిలోని ప్రతీ పని ఆ లక్ష్యానికనుగుణంగానే రూపొందు తుంది. టెక్నాలజీ వుంటే మానవ సమస్యలను పరిష్కరించే విధంగానే ఉంటుంది. సాహిత్యం, కళలు ఉంటే వాటి ద్వారా మానవ సమస్యలకు పరిష్కార మార్గాలు లభించేలా చూస్తుంది. అవి ఇస్లాం శాశ్వత విలువలను ప్రతిబింబింపజేస్తాయి. రాజకీయ ఆర్థిక వ్యవస్థలు కూడా ఆ లక్ష్యాలకు అనుగుణంగానే ఉంటాయి.

పనికిమాలిన వ్యర్థ విషయాలను ఇస్లాం ఎట్టి పరిస్థితుల్లోనూ అభిలషిం చదు. చెస్, చదరంగం లాంటి ఆటల వల్ల ఎటువంటి శారీరక మానసిక వ్యాయామం కానీ మంచి ప్రయోజనం కానీ ఒనగూడదు కనుక అవి నిషిద్ధ క్రీడలు. చదరంగం ఆడిన వ్యక్తి తన చేయిని పంది మాంసం, రక్తంలో ముంచినట్లే. (సహీహ్ ముస్లిం)

పనికిమాలిన వినోదాలను, టైంపాస్ టెక్నాలజీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇస్లాం సమర్ధించదు. కవిత్వమైనా, కళలయినా అన్నీ ఒక ఉన్నత ఆశయానికి అద్దం పట్టేలా ఉంటాయి.

## 3. బాధ్యతాయుత భావన

ఇస్లామీయ సంస్కృతి ఒక బాధ్యతాయుతమైన (Responsible) సంస్కృతి. దేవుని భువిపై మానవులు దైవ ప్రతినిధులన్న భావన, అప్పగింతల భావన, దైవానికి జవాబు చెప్పుకోవాలనే భావనలు మనిషిని బాధ్యతారహితమైన పనులకు దూరంగా ఉంచుతాయి. దివ్య ఖుర్ఆన్‌లో విశ్వాసుల గుణగణాలను ప్రస్తావిస్తూ ఈ విధంగా చెప్పడం జరిగింది: వారు తమ అమానతులను పరిరక్షించేవారు తమ వాగ్దానాలను నిలబెట్టుకునేవారై ఉంటారు.

(అల్ మఆరిజ్ : 32).

ఆధునిక పాశ్చాత్య సంస్కృతిలో ఆద్యంతం బాధ్యతారాహిత్యం కనిపిస్తుంది. తత్కారణంగానే వారు కుటుంబ వ్యవస్థను కూలదోసే సామాజిక నైతిక నగుబాటుల పాలయ్యారు. ప్రమాదకరమైన ఆయుధాల ఆవిష్కరణలకు పురిగొల్పే సాంకేతికతను రూపొందించుకుని మొత్తం మానవ జాతి ఉనికినే ప్రమాదంలోకి నెట్టివేశారు. నింగి నీరు నేలనంతటా కాలుష్యమయం చేసి, భావితరాల భవిష్యత్తును సైతం ప్రశ్నార్థకంగా మార్చివేశారు.

ఇస్లామీయ సంస్కృతి మానవుణ్ణి, మానవ సంస్థలను బాధ్యతాయుతంగా మలుస్తుంది. ఒక ముస్లిం నదీ ఒడ్డున వుజూ చేస్తూ కూడా నీటిని ఎంత మాత్రం వృధా చేయడు. మహాప్రవక్త(స)సాద్ (రజి)ను వుజూ చేస్తుండగా చూసి, “సాద్! నీరు వృధా ఎందుకు చేస్తున్నావ”ని నిలదీశారు. ‘వుజూలో నీటిని కాస్త ఎక్కువ ఖర్చు చేయడం కూడా దుబారానేనా? ప్రవక్తా!’ అంటూ సాద్ (రజి) సందేహం వెలిబుచ్చగా దానికి ప్రవక్త (స) అవును, నీటిని జాగ్రత్తగా ఖర్చు చేయి, ఒకవేళ నీవు నది ఒడ్డున ఉన్నా సరే! అని సెలవిచ్చారు ప్రవక్త మహనీయులు(స).

(మిష్కాతుల్ మసాబీహ్)

యుద్ధ సమయంలో కూడా శత్రువుల విషయంలో ఇస్లాం నైతిక నిబంధనలను ఉల్లంఘించదు. “(ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చేయండి ఇది దైవభక్తికి సరిసమానమైనది”. (అల్ మాయిదా: 8) అని ప్రబోధిస్తుంది.

అశ్లీల మార్గాలు, దాని పర్యవసానంగా కుటుంబాలు కూలిపోయే ప్రమాదమున్న అన్ని మార్గాల నుండి ఇస్లాం పరిరక్షిస్తుంది.

అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి బహిరంగమైనవైనా సరే లేక గోప్యమైనవయినా సరే. (అల్ అన్ఆమ్: 151).

ఇస్లాం వృధా కాలక్షేపాలను కూడా నిషేధిస్తుంది. మనిషి జీవిత సమస్యల నుండి దృష్టి మళ్లించే పనికిమాలిన వినోద విహారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇష్టపడదు.

"జ్ఞానం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పించడానికి, ఈ మార్గం వైపునకు పిలిచే పిలుపును ఎగతాళి చేయడానికి మానవులలోనే మనసును రంజింపజేసే విషయాన్ని కొనుక్కుని తీసుకువచ్చేవాడు కూడా ఒకడుంటాడు. అటువంటి వారికి తీవ్ర అవమానకరమైన శిక్ష పడుతుంది".

(లుక్మాన్ :6)

కనుక ఇస్లామీయ సంస్కృతిలో ఓ ఇంజనీరు, సాహితీపరుడు, కళాకారుడు, ప్రతీ వ్యక్తీ తన కళా ప్రయోగంలో అత్యంత జాగ్రత్తగా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తాడు. మనిషి ధన మాన ప్రాణాలకు ధార్మిక నైతికతా నిబద్ధతలకు నష్టం వాటిల్లే ఎటువంటి కళనూ ప్రదర్శించడు.

## 4. శాశ్వత సుస్థిర విలువలు

ఇస్లాం సంస్కృతి కొన్ని శాశ్వతమైన విలువల (Permanent Values) పై నిర్మితమై ఉంది. ఖుర్ఆన్ హదీసుల ద్వారా నిరూపితమైన నైతిక నియమాలే శాశ్వత నియమాలు. కాగా, పాశ్చాత్య సంస్కృతి వద్ద ఎటువంటి సుస్థిరమైన విలువలు లేవు. నైతిక నియమాలు మనిషి వేసుకునే దుస్తుల మాదిరిగా అవసరానికి అనుగుణంగా మారుతుంటాయి. ఇస్లామీయ సంస్కృతిలో వడ్డీకి, విశృంఖలత్వానికి ఎటువంటి ఆస్కారం లేదు. ఈ సంస్కృతి లజ్జవ్రీడలకు సంబంధించిన ఒక శాశ్వత దృక్పథం కలిగి ఉంది. ఇస్లాం సాంస్కృతిక పునాదులైన శాశ్వత సుస్థిర భావనలపై రాజీపడే ప్రసక్తే లేదు. పేదల జీవన హక్కు, సంక్షేమ రాజ్యాల భావనలు స్వయానా దివ్య ఖుర్ఆన్ హదీసుల్లో రాతపూర్వకంగా ఉన్నాయి. దేశ వ్యవహారాలను అదుపులో ఉంచడంలో రాజ్యాంగం ఎంత కీలకమో ఇస్లాంలో ఉన్న సుస్థిర విలువలు కూడా యావత్తు

సంస్కృతిని అదుపులో ఉంచడంలో ఆ తరహా పాత్రనే పోషిస్తాయి. ఆయా విలువల కారణంగానే ఇస్లాం సాంస్కృతిక పునాదులు అత్యంత పటిష్టంగా ఉన్నాయి. వ్యక్తుల అశ్లీల మానసిక భావోద్వేగాలు, అసభ్య ప్రవర్తనలు, విశృంఖల వ్యవహారాలకు ఇక్కడ ఎటువంటి స్థానం లేదు. కనుకనే ఇస్లామీయ చరిత్రలో అజంతా ఖజురహెూ లాంటి అశ్లీల చిత్రాల ఆనవాళ్ళు కానీ ఆధునిక ఫ్రెంచి ఇంగ్లీషు నవలల్లాంటి అశ్లీల సాహిత్యం గానీ కనుచూపు మేరల్లో కూడా కానరావు.

## 5. మంచి విషయాలను గ్రహించే గుణాత్మక సౌందర్యం

తన విలువల పరిధిలో ఉంటూనే కొత్త కొత్త ప్రయోగాలు చేయడం, ఇతర జాతుల నుండి మంచి విషయాలను గ్రహించే గుణాత్మక శక్తి కూడా ఉండడం ఇస్లామీయ సంస్కృతి విశిష్టత. శాశ్వత విలువలు,తాత్కాలిక విలువల్లో తేడాను గ్రహించలేని జాతులకు కొత్త విషయాలను అంగీకరించే విషయంలో అయోమయం ఏర్పడుతుంది. పైగా తమ సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని కోల్పోయే భయాందోళనలు కూడా ఆవహిస్తుంటాయి. ఏ విషయాల్లో మార్పు సాధ్యం అవుతుందో, ఏ విషయాల్లో సాధ్యం కాదో, అంగీకార యోగ్యమైనవేవో, కానివేవో ఆ వ్యత్యాసం కూడా ఇక్కడ చాలా స్పష్టంగా ఉంది. కనుకనే ఒక ముస్లిం తన విలువలు విశ్వాసాల పరిధిలో ఉంటూనే ప్రతీ మంచి విషయాన్ని తాను కోల్పోయిన సంపదలా భావించి స్వీకరిస్తాడు.

ఇస్లాం ఎన్నడూ తన విలువలకు విరుద్ధమైన మహిళల అశ్లీల వేష ధారణను అభిలషించలేదు. (పాశ్చాత్య ప్రపంచం యావత్ ప్రపంచానికి ఒకే కోటు, షర్టు, టై ని (వేషధారణగా) ఇచ్చింది కానీ ఇండోనేషియా నుండి అమెరికా యూరప్‌ల వరకు నేడు డజన్ల కొద్దీ ముస్లిం మహిళల హిజాబ్ వేషధారణలు కనిపిస్తాయి. అనేక చోట్ల స్థానిక సంస్కృతిని అనుసరిస్తూ వేషధారణ ఉన్నప్పటికీ, అందులోనూ ఇస్లామీయ వేషధారణకు అనుగుణంగానే అనుకరణ జరిగింది. గ్రీకు తత్వాన్ని ముస్లింలకు పరిచయం చేసే ప్రయత్నం జరిగినప్పుడు కూడానూ ఇస్లామీయ సంస్కృతిలోని సున్నిత భావజాలం తన విలువలకు విరుద్ధమైన వాటిని ఏ మాత్రం అంగీకరించలేదు. ప్రయోజనకరమైన జ్ఞాన విజ్ఞానాలు విశ్వాసికి విలువైన సంపద కనుక అరబ్బులు హైందవ పండితుల

ద్వారా గణితశాస్త్రం నేర్చుకొని, అంకగణిత పరిజ్ఞానాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేశారు. ఇస్లాం సంస్కృతి ఒక ప్రత్యేక జాతికో, ప్రత్యేక ప్రాంతానికో చెందిన సంస్కృతి కాదు కనుకనే మంచి విషయాలను గ్రహించి వాటిని అంగీకరించే విషయంలో అది సహన భావంతో ప్రవర్తిస్తుంది.

## 6. విశ్వ జనీన సౌభ్రాతృత్వం

మానవ సమానత్వం, సోదరభావం, సౌభ్రాతృత్వం ఇస్లాం సాంస్కృతిక విశిష్టతలు. మానవులంతా ఒకే దైవానికి దాసులనీ, వారిలో ఎటువంటి భేద భావాలు లేవనేది ఇస్లాం మౌలిక విశ్వాసం. కుల మత వర్ణ వర్గ జాతిభేదాలను అంతమొందించడమే కాక జాత్యాహంకార భావాలను కూకటివేళ్లతో పెకలించి నేటి ఆధునిక ప్రపంచంలో అలరారుతున్న సామాజిక భేషజాలు కూడా అసమానతలకు మూల కారణమని చాటిన ఏకైక సంస్కృతి. నేటి ఆధునిక ప్రపంచంలో ఓ రాజ్యాధికారి భుజానికి భుజం కలిపి కూలీ నాలి చేసుకునే ఓ సాధారణ సగటు కూలితో పాటు రోజుకు ఐదు పూటలా నిలబడేందుకు సుముఖత చూపడం సాధ్యమేనా? అటువంటి దృశ్యమాలికలు కేవలం ఇస్లామీయ సంస్కృతిలోనే దర్శనమిస్తాయి. ఆ సోదర సమానత్వ భావాలు పైపై అద్దే రంగుల అద్దాలు ఎంత మాత్రం కావు. మానవత్వాన్ని నెలకొల్పి, సమస్త మానవజాతిలో సోదర భావాన్ని పెంపొందింప జేసే ప్రధాన సాధనాలు. ప్రపంచంలో ఏ మూలన అన్యాయం జరిగినా యావత్తు ముస్లిం ప్రపంచ మంతా ఆందోళనకు గురికావడమే ఆ ప్రేమైక వాతావరణానికి నిదర్శనం.

## 7. లజ్జా వ్రీడల భావన

లజ్జావ్రీడలు ఇస్లాం సంస్కృతికి ప్రధాన పునాదులు. ప్రతి ధర్మానికి ఒక విశిష్టత ఉంటుంది ఇస్లాం ప్రత్యేకత దాని నైతికతయే. (సునన్ ఇబ్నెమాజా)

ప్రవక్త(స) నైతికతను గొప్పసంపదగా అభివర్ణించారు. (నైతికత ఫలితం మంచి తప్ప మరొకటి ఉండదు. నైతికతలో ఆద్యంతం శుభాలే దాగుంటాయి.) (సహీహ్ బుఖారీ)

సద్గుణ సంపన్నుడయిన ఓ వ్యక్తి చెడు కార్యానికి తలొగ్గే సమయంలో అతని ఆంతర్యంలో అడ్డుపడే ఆందోళనలే నైతికతా విలువలు. ప్రకృతి

సహజంగా ప్రతి మనిషి తన ఆత్మగౌరవం, శీలసచ్ఛీలత, మనో కాంక్షల విషయంలో సున్నితంగా స్పందిస్తుంటాడు. వాటికి విరుద్ధమైన విషయాలలో అతని స్వభావంలో తీవ్రమైన అంతర్గతా సంఘర్షణ చెలరేగుతూ ఉంటుంది. మనో కాంక్షల దృష్టశక్తులు ఆ సహజ స్వభావాన్ని ప్రతినిత్యం అణచివేస్తూ మనిషిని అశ్లీలం వైపు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఇస్లాం నైతికతల సహజ స్వభావాన్ని పెంపొందింపజేస్తుంది. ఒక విశ్వాసి కేవలం సమాజం, సమాజంలోని మనుషుల పట్లనే కాక తన దైవం పట్ల కూడా నీతిగా వ్యవహరిస్తాడు. ఇటువంటి నైతిక సహజ స్వభావం, మనిషి వేషధారణ, మానవుల పరస్పర సంబంధ బాంధవ్యాలు, గోప్య వ్యవహారాల విషయంలో కూడా పరిశుద్ధమైన జీవనవిధానాన్ని నెలకొల్పుతాయి. ఇంకా సామాజిక, నైతిక పరమైన విషయాలలో ఒక ప్రత్యేకమైన పద్ధతిని ప్రోత్సహిస్తాయి... ఇదే ఇస్లాం విశిష్టత.

## 8. మానవ సాఫల్యం

దేవుని భువిపై దైవ ప్రతినిధులుగా మనగలగడమే మనిషి ప్రధాన ఆశయం. కనుక ఇస్లాం మానవ గౌరవం, మానవ సాఫల్యాలకు పెద్ద పీట వేస్తుంది. ఒక మనిషిని హత్య చేసినట్లయితే యావత్తు మానవాళిని హత మార్చడంతో సమానమనీ చెబుతుంది. భ్రూణ హత్యలు మహా పాపంగా, ఘోరమైన నేరంగా పరిగణిస్తుంది. ఆకలిదప్పులతో అలమటించడం మానవాళికి అవమానకరం కనుక ఒక వ్యక్తి ఆకలిదప్పులతో అలమటిస్తూ పడుకున్నట్లయితే ఆ ప్రాంత వాసులందర్నీ దోషులుగా నిలబెడుతుంది. పేదల పట్ల జాలి దయ సానుభూతి ఈ సంస్కృతి ప్రధాన ఉద్దేశాలు. తమ సర్వస్వాన్ని ధారపోసి సంతృప్తి చెందే దాతలు ఇక్కడ దర్శనమిస్తారు. తమ మేధో బుద్ధితో మానవ సమస్యలను మటుమాయం చేసే మహావిద్వాంసులు ఇక్కడ తారసపడతారు. కేవలం మానసిక ఆహ్లాదమే కాక మానవ సమస్యలను ప్రతిబింబింప జేసే కళాకారులు సాహితీ పరులు సయితం గోచరిస్తారిక్కడ.

## ఇస్లాం సంస్కృతి దృశ్యమాలికలు :

ఇన్ని విశిష్టతలు కలిగిన సంస్కృతి చరిత్రలో సృష్టించిన అద్భుత దృశ్య మాలికలు చూద్దాం.

ముస్లింలు తమ ప్రభుత్వాల ద్వారా సోదరభావం, సమానత్వాల సమాజాన్ని, న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసి చూపారు. ఇస్లాం చూపిన మానవ సౌభ్రాతృత్వం, సమానత్వ సిద్ధాంతాల కారణంగానే చరిత్రలో సుదీర్ఘ కాలం వరకూ అరబ్బులు, తుర్కీలు, బర్బర్లు, మొగల్, ఇరానియన్లు ఈజిప్షియన్లు సిరియన్లు, రోమన్లు కుర్దులు ఆఫ్రికన్లు ఇలా ఎన్నో అసంఖ్యాకమైన జాతులు గొప్ప పరిపాలనను అందించాయి. బర్బరులు పరిపాలించినప్పుడు అరబ్బులు వారిని అనుకరిస్తూ, సేవకులు సైతం పాలకులుగా మారారు. యూదులు తమ చరిత్రలో ఉస్మానియా సామ్రాజ్యంలో సుందరమైన సుపరిపాలనను అనుభవించారు. అక్కడ వారికి అన్ని విధాలా రక్షణ హక్కులూ లభించాయి. ముస్లిం పరిపాలకులు అపూర్వమైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారు. ఇంకా ఎన్నో విధాల సౌలభ్యాలను కలుగజేశారు. ఇస్లామీయ ప్రభుత్వ పరిపాలన, న్యాయ నిర్వహణ, సంక్షేమ కార్యాలు, రహదారి నిర్మాణాలు, తపాలా వ్యవస్థ, ప్రజా రక్షణ భద్రతా వ్యవస్థ, నీటిపారుదల ఏర్పాట్లు, ఆసుపత్రులలో రోగుల సంరక్షణ, సత్రాలు వితంతువులు, అనాథలు, అవసరార్థులు, అభాగ్యులకు చేయూతనందించిన తీరు వారందరికీ జరిగిన మేళ్ళను ఎందరో పాశ్చాత్య రచయితలు తమ గ్రంథాలలో సువర్ణ అక్షరాలుగా లిఖించిన సందర్భాలెన్నో ఉన్నాయి.

2. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం వర్తకులు పాటించిన వర్తక నీతి ఇస్లామీయ చరిత్రలో దేదీప్యమాన దృశ్యమాలిక. వారి ఉత్తమ ప్రవర్తన, నీతీ నడవడిక వల్లనే దక్షిణ భారతదేశం, ఆగ్నేయ ఆసియా చైనాలలో ఇస్లాం వ్యాపించింది. నేటికీ ఈ ప్రాంతాలు ప్రపంచ ముస్లిం జనాభాలో మూడవ వంతును కలిగి ఉన్నాయి.

3. ముస్లింలు భారతదేశం గ్రీకు పర్షియాల నుండి వివిధ శాస్త్రాలను నేర్చుకోవడం కూడా ఇస్లామీయ సంస్కృతికి అద్దం పడుతుంది. ఆయా శాస్త్రాలు ఇస్లామీయ విశ్వాసాలు విలువల ప్రయోజనానికి, మానవ సంక్షేమానికి ఏ మేరకు ఉపయోగకరమో పరిశోధించి మరీ చూపించారు. మానవాళికి ఉపయుక్తమయ్యే శాస్త్రాలను అంగీకరించడమే కాక అంబరాలను తాకే విధంగా వాటిని అభివృద్ధి పరిచారు. భారతదేశం గ్రీకు శాస్త్రీయ సంప్రదాయాలకు

వ్యతిరేకంగా కళాత్మక విలువలు విద్యలను కేవలం తాత్విక పరిశోధనలకే పరిమితం చేయకుండా మానవాళి సంక్షేమానికై ఉప యుక్తమయ్యేలా చేశారు. ప్రయోగాత్మక శాస్త్రం (Experimental Science) ప్రేరక పద్ధతుల (Inductive Methods) ఆవిష్కరణల ద్వారా మానవాళి సంక్షేమానికి అవసరమయ్యే సాంకేతికతను ప్రోత్సహించారు తుదకు సైన్స్ టెక్నాలజీల ఆధునికాభివృద్ధికి అంకురార్పణ చేశారు.

4. సాహిత్యంలో ముస్లిం సాహితీపరులు దైవ సంకీర్తనలు, ప్రవక్త కీర్తనలతో పాటు, నైతిక విలువల పురోగమనం, మానవ జీవిత సమస్యల స్పష్టీకరణ తమ సృజనాత్మకాంశాలుగా చేసుకున్నారు. కొందరు ముస్లిం సాహిత్య పరులు అర్థం పర్థం లేని కథలు, ప్రశంసా పద్యాలు, మద్యం మత్తులో జోగే యువత ప్రస్తావనలకు కూడా తమ సాహిత్యంలో చోటు కల్పించిన ఉదాహరణలున్నాయి. కానీ ఇది ఇస్లామీయ నాగరికతా నైతికతలకు నిదర్శనం ఎంతమాత్రం కాదు. ముస్లిం సమాజాలలో ఈ తరహా సాహిత్య పోకడలకు ఎలాంటి స్థానం లభించలేదు.

5. ఇస్లాం ఏకేశ్వరోపాసన విషయంలో చాలా ఖచ్చితంగా వ్యవహరి స్తుంది. బహు దైవారాధన, విగ్రహారాధనలకు దారితీసే తలుపులన్నిటినీ మూసి వేస్తుంది కనుక ఇస్లాం శిల్పాలను కళాత్మక చిత్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదు. ఇస్లామీయ చిత్రకారులు దానికి విరుద్ధంగా అందమైన కాలిగ్రఫీ కళలను ప్రోత్సహించారు. కార్యాలయాలు, ఇళ్లలో శిల్పాలు చిత్రాలకు బదులు దివ్య ఖుర్ఆన్ ఆయతులతో కూడిన తుగ్రాలను అలంకరించడం జరిగింది. భవనాలలో కూడా ప్రస్తుత ధోరణికి విరుద్ధంగా దివ్య ఖుర్ఆన్ ఆయతుల మనోహర దృశ్యాలు చెక్కబడ్డాయి.

6. ఆహారం, వేషధారణ విషయంలో కూడా ఇస్లాం సాంస్కృతిక ప్రామాణికతను రూపొందించింది. హలాల్ హరామ్‌ల వ్యత్యాసంతో పాటు ముస్లింలు విభిన్న స్థానిక ఆహారాలను స్వీకరించి, ఆస్వాదించి మరీ అత్యుద్భుత మైనటువంటి కొత్త కొత్త రుచులను అభివృద్ధి పరిచారు. ఫలితంగా టర్కీ ఇరానీ లెబనానీ మొగల్ అరబ్బీ హైదరాబాది పంజాబీ లాంటి డజన్ల కొద్దీ వంటకాలు ముస్లిం సమాజాలలో ప్రసిద్ధి చెందాయి. ఇదే అభిరుచి వేషధారణ విషయంలో కూడా అలవడింది. పలుచగా, బిగుతుగా ఉండే అర్ధనగ్న దుస్తులు అంగీకార

యోగ్యానికి నోచుకోలేదు. ఇస్లాం అభిరుచికి అనుగుణంగా శరీరాన్నంతా కప్పి ఉంచే వివిధ రకాల గౌరవప్రదమైన దుస్తులు ముస్లిం సమాజాలలో ప్రాచుర్యం పొందాయి.

7. సినిమా, సంగీతం నటన లాంటి విషయాలలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వాటికి సంబంధించి షరీయత్‌లో ద్వంద్వాభిప్రాయాలున్నాయి. నలుగురు ఇమాములు, ముస్లిం సమాజ మత పండితులు చాలామంది అధునాతన వాయిద్యాల సంగీతాన్ని నిషేధించారు. కానీ ఇబ్నె హజమ్, గజాలీ లాంటి మహా మేధావులు పరిమిత స్థాయిలోనే షరతులతో కూడిన అనుమతి నిచ్చారు. అర్థం పర్థం లేని అపసవ్య సంగీతం ముస్లిం సమాజాలలో ఎన్నడూ వృద్ధి చెందలేదు. కొంతమంది సూఫీలు కొన్ని సందర్భాల్లో పరిమిత స్థాయిలో సంగీతాన్ని ఉపయో గించారు. జానపద పాటలు, వివాహ శుభకార్యాలలో కూడ సంగీత వినియోగం జరిగింది. ఈ శతాబ్ది ఆరంభం వరకు ఇస్లామీయ ప్రపంచంలో థియేటర్ సంస్కృతి ప్రాచుర్యం పొందనప్పటికీ ముస్లింలు ఎటువంటి సంగీత సాధనాలు లేకుండానే గానకళను అభివృద్ధి చేశారు. దైవప్రవక్తపై ప్రేమాను రాగాలను వ్యక్తపరిచేందుకు, ఇస్లామీయ విలువలను ప్రోత్సహించేందుకు, యుద్ధ మైదానాలలో ఉత్సాహం ఉద్వేగాలను జనింప జేసేందుకుగాను దాన్ని ఉపయోగించారు. ఆడవారి అంగాంగ ప్రదర్శనలతో అర్థనగ్న అశ్లీల నృత్యాలను ఇస్లాం ఎన్నడూ అభిలషించలేదు.

8. ఆరాధనా వ్యవస్థ కూడా ఇస్లాం సంస్కృతికి అద్దం పడుతోంది. విభిన్న భౌగోళిక, వర్ణ వర్గ స్వరూపాలను ఒకే తాటిపై నిలబెట్టడంలో ప్రముఖ పాత్ర పోషించడమేకాక ఈ విధానం ఇస్లామీయ సంస్కృతిలోని సౌమనస్యాన్ని చాటుతుంది. ఇటువంటి కనులకింపైన దృశ్య మాలికలను ప్రపంచంలోని ప్రతి మూలనా ప్రతి కాలంలోనూ చూడవచ్చు. కొన్ని మనోహర దృశ్యాలు ముస్లింల పతనావస్థతో పాటు కనుమరుగై పోయినప్పటికీ ఈ కొన్ని మచ్చుతునకలు మాత్రం నేడు కూడా ప్రకాశమానంగా పరిఢవిల్లుతున్నాయి. ఉషోదయ కాంతి కిరణాలతో పాటు మసీదుల మీనార్ల నుండి ప్రతీ రోజు వివిధ సమయాల్లో దశలవారీగా ప్రార్థన కొరకు వెలువడే పవిత్ర స్వరాలు, పేద ధనిక తారతమ్యాలు లేకుండా అందరూ ఒకే లైనులో నిలబడి దైవమెదుట సాష్టాంగ పడే పవిత్ర దృశ్యాలు, జుమా రోజున ప్రార్థనకై తండోపతండాలుగా తరలి వచ్చే

పిన్నలు పెద్దలు యువకులు, పవిత్ర రమజాన్ ప్రభాత కిరణాలు, సహరీ ఇఫ్తార్‌ల సందళ్ళు, తరావీహ్‌లో పఠించే దివ్యఖుర్ఆన్ పారాయణం, జకాతు ఫిత్రా దానాలు, పండుగ కోలాహలం, అన్నిటికన్నా మహోన్నతమైన దృశ్యం యావత్ ప్రపంచం ఒకే చోట హాజరై మక్కాలోని పవిత్ర నేలపై దాదాపు 1400 సంవత్సరాల నుండి జరుగుతున్న సామూహిక హజ్ సమ్మేళనం ఇస్లాం ఆరాధనా వ్యవస్థలోని గొప్పదనాన్ని, మానవ సమానత్వం సోదర సుహృద్భావాలను ఉత్తమమైన రీతిలో చాటుతాయి. ఈ దృష్టాంతాలన్నీ ఇస్లామీయ సంస్కృతీ స్వభావం సహజత్వాల మహిమలను చూపుతాయి.

## ఆధునిక బహుళ సమాజాలలో ఇస్లాం అవలంబించే విధానం

సంస్కృతి విషయంలో ఇస్లామ్ దృక్పథం ఏమిటి? ముస్లింలు తమ సైద్ధాంతిక పునాదులపై సాంస్కృతిక నిర్మాణాలు ఎలా చేశారనే విషయం ఆయా అంశాల ద్వారా సుబోధకమయివుంటుంది. అయితే బహుళ సాంస్కృతిక సమాజాలలో ఇతర సంస్కృతుల పట్ల వ్యవహరించే తీరు ఎలా ఉంది, ఎలా ఉండాలనే విషయంపై కూడా కొన్ని సూత్రప్రాయమైన విషయాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి.

1. ఇస్లాంలో కొన్ని నిర్దిష్టమైన సిద్ధాంతాలు ఉన్నాయి. ఇస్లామీయ విశ్వాసాల పట్ల ప్రత్యేక అనుబంధం, బహు దైవోపాసనకు పూర్తిగా దూరంగా ఉండటం, ఖుర్ఆన్ హదీసు బోధనల వెలుగులో నైతిక నియమాలను పాటించడం, చెడులకు దూరంగా ఉండటం,

ఇస్లాం సూచించిన శాసనాంగ నిబంధనలు, ఆరాధనల వ్యవస్థ, జీవన విధానం, వేషధారణ, ఆహారపు అలవాట్లకు సంబంధించి హలాల్ హరామ్ ఆంక్షలు తదితర విషయాలలో ఇస్లాం ఎటువంటి రాజీకి సిద్ధపడదు. ఇతర సంస్కృతులలో మిళితమై తమ మూలాలను కోల్పోవడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అది సమ్మతించదు.

అందువల్లనే బహు దైవారాధనా మూలమైన వందేమాతరం, సరస్వతి వందనం లాంటివాటిని, పాశ్చాత్య సంస్కృతిలోని అశ్లీలం విశృంఖలత్వం, అర్ధనగ్న వేషధారణ, వడ్డీ ఇన్సూరెన్స్ లాంటి ఆర్థిక, రాజకీయపరమైన అధర్మ విషయాలను అంగీకరించే ప్రసక్తి ఎంతమాత్రం ఉండదు.

2. ఇస్లామీయ సంస్కృతి లక్ష్య బద్ధమైన జీవితానికి కట్టుబడి ఉంటుంది.

వృధా కాలక్షేపాలు, వీడియో గేములు వినోదాలకు అది వ్యతిరేకం. అర్థం పర్థం లేని ఆడంబరాలు, భోగలాలసలను అసలు ప్రోత్సహించదు కనుక అనవసర షాపింగులు అవసరానికన్నా ఎక్కువ పోగు చేసుకునే వస్తువులు, ప్రదర్శనా బుద్ధి లాంటి పోకడలకు ఇస్లామీయ జీవన విధానంలో ఎలాంటి స్థానం లేదు.

3. దేవుని భువిపై దైవ ప్రాతినిధ్య హక్కును నెరవేర్చడం, మానవ సేవ చేయడమే ఇస్లాం ధర్మ ఉన్నత ఆశయాలు. కనుక ఇస్లాం సాహిత్యాన్ని, సాంకేతికతను, కళలను ఇతరత్రా సాంస్కృతిక వనరులను ఆ సదుద్దేశ్యంతోనే వినియోగిస్తుంది. పైగా సాంకేతికత వినియోగం మానవ సమస్యలను పరిష్కరించే దిశగా ఉండాలని, సాహిత్య సరాగాలు, లలిత కళా వైభవాలు మనోహరమైన భావనలను రంజింపజేసి, మానవ సమస్యలను ప్రతిబింబింప చేసే విధంగా, ప్రజాభిప్రాయాన్ని మలిచే విధంగా ఉండాలని కాంక్షిస్తుంది.

4. ఆరాధనలు, ధర్మ వ్యవహారాల విషయంలోనూ దివ్య ఖుర్‌ఆన్ మహాప్రవక్త (స) చూపిన మార్గం పైనే కట్టుబడి ఉండాలని అంటుంది. ఆ విషయంలో పొడసూపే సరికొత్త పోకడలు, ఆధునిక ఆవిష్కరణలను బిద్‌అత్‌గా పరి గణిస్తుంది. కనుక ఆరాధనలు పండుగ వ్యవహారాలలో ఇతర సంస్కృతుల సంప్రదాయాలను సమర్థించే ప్రసక్తే లేదు. అటువంటి కొత్త మార్గాలను తొక్కే ప్రయత్నం కూడా ముస్లింలు చెయ్యరు.

5. ఈ సూత్రప్రాయ విలువలకు అనుగుణంగా ముస్లింలు తమ సంస్కృతి పరిధిలో ఉంటూ, ఇతర సంస్కృతులలో ఉన్న మంచి విషయాలను అంగీకరించ వచ్చు. వైజ్ఞానిక శాస్త్రాలు, కళలను మొత్తం మానవజాతి వారసత్వ సంపదగా భావించి వాటిని సద్వినియోగపరచుకొని, తద్వారా మానవ సంక్షేమం కొరకు వాటిని వినియోగించి అభివృద్ధి పరచాలి. జీవనశైలి ఆహారపు అభిరుచులు, వేషధారణ, సాహిత్యం, కట్టడాలు, కళాక్షేత్రాలు, సాంకేతికత ఆర్థిక రాజకీయ తదితర విధానాలలో కూడా ఇతర జాతులలో ఉన్న మంచి అంశాలను వినియోగించుకోవచ్చు.

6. ఇస్లామీయ ధర్మ వేత్తలు, పండితుల మధ్య భేదాభిప్రాయాలున్న విషయాలలో (ముఖాన్ని కప్పివేసే హిజాబ్, మ్యూజిక్, నటన) మనం ఉదార వైఖరిని అవలంబించాలి. సమంజసమైనవని భావించిన విషయాలను ఆచరించాలి. వాటి వ్యాప్తి కొరకు కృషి చేయాలి తప్ప ఇతర విధానాలను మార్గ

విహీనంగా భావించి తిరస్కరించే సంకుచిత స్వభావానికి మాత్రం గురి కాకూడదు. పాక్షిక విషయాలు, షరీయత్ అన్వయింపు వ్యవహారాలలో సహిష్ణుతా స్వభావం కూడా ఇస్లామీయ సంస్కృతి ప్రధాన విశిష్టతే.

7. ఇతరుల సాంస్కృతిక విషయాలు, సద్గుణాంశాల ద్వారా లబ్ధి పొందుతూ ప్రతీ సంస్కృతి తన ఆశయ సాధనకై ఆవిష్కరణల అవసరం కలిగి ఉంటుందనే విషయాన్ని మరచిపోకూడదు. ఇతరులపై ఆధారపడే సంస్కృతి అభివృద్ధి పథంలో మనజాలదు. ఒకవేళ అవసరమనుకుంటే ఇస్లామీయ పరిధిలో ఫిల్మ్ మేకింగ్ మ్యూజిక్, టెలివిజన్‌లను వినియోగించుకోవచ్చు కానీ అవన్నీ ఓ ప్రత్యేక సంస్కృతికి ప్రతీకలనీ, భోగలాలసాలను ప్రేరేపించే పరికరాలనే విషయాన్ని మరువకూడదు.వాటిని పరిమిత స్థాయిలోనే వినియోగించుకోవాలి. మన స్వంత సాంస్కృతిక వనరుల ద్వారానే మన సాంస్కృతిక లక్ష్యాలను సాధించగలం. వాటి కొరకు విజ్ఞతా వివేకాలు ఆవిష్కరణల అన్వేషణా సామర్థ్యాలు కూడా అవసరం. కొన్నేళ్ళకు ముందు టీవీలలో కేవలం సినిమాలు సీరియల్స్ తప్ప రియాల్టీ షోల ఊసే లేదు. ముస్లింలు తమ జ్ఞాన పిపాసను పదును పెట్టి విజ్ఞతతో వ్యవహరించినట్లయితే ఉత్తమ రియాల్టీ షోలకు ఆద్యులుగా మారి సత్యమేవ జయతే లాంటి కార్యక్రమాలను రూపొందించగలిగి ఉండేవారు. తరాల నుండి తరుముకొస్తున్న స్తబ్ధతను ఛేదించి ఇప్పటికైనా మన మేధో వికాసాలను వినియోగించుకుంటే సాంస్కృతిక లక్ష్యాలను నెర వేర్చుకునేందుకు, వాటిని ఇస్లామీయ అభిరుచికి అనుగుణంగా వందలకొద్దీ ఆధునిక ఆవిష్కరణలకు, సరికొత్త సృజనాత్మక కళలకు నాంది పలకవచ్చు.

*(హైదరాబాద్‌లోని ఓ శిక్షణా కార్యక్రమంలో చేసిన ప్రసంగం నవంబర్ 2010).....*

# బహుళ సమాజాలలో ముస్లిం సమాజ బాధ్యతలు

ఒకే భౌగోళిక ప్రాంతంలో పలు సాంస్కృతిక వర్గాల (Cultural Groups) సముదాయాల కలయికతో బహుళ సమాజాలు ఏర్పడుతాయి. ప్రతీ సంస్కృతిపై వర్ణం వర్గం భాష భావాల ప్రభావాలు తప్పక ఉంటాయి. ఆ ప్రాతిపదికనపైనే సాంస్కృతిక సముదాయాలు జనిస్తాయి. సాంస్కృతిక సముదాయాలు తమ వేషధారణ, ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలు ఇతరత్రా అభిరుచుల కారణంగా ఓ విధమైన ప్రత్యేక గుర్తింపును కలిగి ఉంటాయి. ఈ తరహా వ్యత్యాసం సమూహాల మధ్య తరచూ ఉద్రిక్తతలకు కూడా దారి తీస్తుందనడంలో సందేహంలేదు. ఆ సమస్యల పరిష్కారానికై ఆధునిక సామాజిక శాస్త్రంలో బహుళ సమాజాల గురించి వివిధ సిద్ధాంతాలు కూడా సూత్రీకరించబడ్డాయి. నేడు మూడింట ఒక వంతు ముస్లింల జనాభా ముస్లిమేతర మెజారిటీ దేశాలలో నివసిస్తూ ఉంది. ముస్లిం మెజారిటీ దేశాల్లో కూడా ముస్లిమేతర జనాభా ఉన్న దేశాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బహుళ సమాజాలను ముస్లింలు ఎలా చూస్తారు, ఆ సమాజాలలో వారి పాత్ర ఏమిటనే విషయం సర్వత్రా చర్చనీయాంశమైంది.

## ఇస్లామీయ చరిత్ర: బహుళ సమాజాలు

ఇస్లామీయ చరిత్రలో బహుళ సమాజాల గురించి ఆది నుంచి నిర్దిష్టమైన నియమాలు ఆచరణాత్మక అనుభవాలు ఉన్నాయి. అనేక మంది ప్రవక్తలు తమ సందేశ కార్యాన్ని బహు దైవారాధక సమాజాలలోనే ప్రారంభించారు. వారి ఆహ్వానాన్ని అంగీకరించిన ఫలితంగా సాధారణ సమాజానికి భిన్నంగా వారి

అనుయాయుల ప్రత్యేక సమూహాలూ ఏర్పడ్డాయి. ఆ విధంగా బహుళ సమాజాల గురించి మౌలిక మార్గదర్శకత్వాలు అనేక ప్రవక్తల జీవిత చరిత్రలలో మనకు కనబడుతాయి. హ(జత్ మూసా అలైహిస్సలాం అనుచర సమాజ స్థితిగతులు భారతదేశం ఇతర ఆధునిక బహుళ సమాజాల మాదిరిగానే ఉండేవి. హ(జత్ మూసా అలైహిస్సలామ్ ఈజిప్టు దేశంలో ఫిరౌను రాజ దురహంకార అణచివేతకు గురైన జాతి బనీ ఇస్రాయీల్ సంతతిలో జన్మించారు. అక్కడ ఉన్న అధికార వర్గం కిబ్తీలతో తరచూ సంఘర్షణలు జరిగేవి. స్వయాన దైవప్రవక్త మక్కా నుండి మదీనాకు వలస వెళ్ళినప్పుడు అక్కడ నాలుగైదు సాంస్కృతిక సమూహాలు ఉండేవి. మదీనాపురి చుట్టుపక్కల బహుదైవారాధకుల తెగలు కూడా ఉండేవి. దానికి తోడుగా ప్రభావవంతమైన యూదు సమూహాలు కూడా ఉండేవి. వారి సాంస్కృతిక కట్టుబాట్లు జీవన విధానాలు ఇతర అరబ్బు లకు భిన్నంగా ఉండేవి. ముస్లింలలో అన్సార్లు, ముహాజిర్ల కట్టుబాట్లు జీవన శైలిలో సయితం చాలా భిన్నత్వం ఉండేది. నలుగురు ఖలీఫాల కాలంలో వశమైన ప్రాంతాలు పర్షియా రోములలో, ఆ తరువాత ఉమయ్యా అబ్బాసీయుల హయాంలో ముస్లింల ప్రాంతాలలో అసాధారణ సాంస్కృతిక వైవిధ్యం (Cultural diversity) ఏర్పడింది. ముస్లింలతోపాటు యూదులు క్రైస్తవులు, హిందువులు, జొరాస్ట్రియన్లు, బహుదైవోపాసకులు, ఆసియా ఆఫ్రికాకు చెందిన అనేక స్థానిక మతావలంబీకులు ముస్లింల ప్రాంతాలలో తమ నివాసాలు ఏర్పరుచుకున్నారు. అదేవిధంగా జాతిపరంగా అరబ్బులు ఈరానియన్లు, తుర్కులు, బర్బరులు, ముగల్, పఠాన్ వంటి వందలకొద్దీ తెగలు (Ethnic Identities) ఇస్లామీయ పరిధుల్లో స్వతంత్రంగా ఉండనారంభించాయి. కనుక బహుళ సమాజాల అనుభవాల విషయంలో మధ్యయుగ చరిత్రకు అంత అనుభవం లేక పోయినప్పటికీ ఇస్లామీయ చరిత్రకు మాత్రం అపారమైన అనుభవం ఉందని చెప్పుకోవచ్చు.

ఇస్లామీయ చరిత్రను అధ్యయనం చేసినట్లైతే మధ్యయుగాల సమాజాలకు భిన్నంగా ముస్లిం సమాజాలలో అల్ప సంఖ్యాక వర్గాలు శాంతియుతంగా జీవించడమేగాక వారికి మతపరమైన రక్షణ కూడా లభించేది. ముఖ్యంగా సామాజిక వ్యవస్థ ఉస్మానియా పరిపాలకుల కాలంలో అత్యంత పటిష్టంగా ఉండేది. ప్రభుత్వాలు ముస్లిమేతరులకు ప్రత్యేక హక్కులు, మతపరమైన

చట్టాలను క్రమబద్ధీకరించడమేకాక న్యాయ వ్యవస్థను సమాంతరంగా అమలు చేసేవి. మొత్తానికి మైనారిటీలకు సకల విధాలా సాంస్కృతిక స్వయం ప్రతిపత్తులు లభించేవి. ఆధునిక ప్రపంచంలో అలరారుతున్న స్వతంత్ర ప్రభుత్వాలలో కూడా అల్పసంఖ్యాకుల హక్కుల భావన అంతగా అభివృద్ధి చెందలేదేమో మరి....

ముస్లిం ప్రభుత్వాల హయాంలో యూదులకు లభించిన రక్షణ యూదు చరిత్రలో మరువలేనిది. క్రైస్తవుల ప్రభుత్వాలకన్నా ముస్లింల ప్రభుత్వాలలోనే యూదులు సురక్షిత జీవనాన్ని కొనసాగించారు. ఈ విషయాన్ని యూదు చరిత్రకారులు బెర్నార్డ్ లూయిస్, క్లాడ్‌కేహన్, మార్క్‌కోహెన్ దాపరికం లేకుండా అంగీకరించారు.

### బహుళ సమాజాలు- ఆధునిక యుగం

ఆధునిక యుగంలో బహుళ సమాజాలపై వలసవాద రాజ్యాల పరిశోధకులు తమ అధ్యయనం ఆరంభించారు. భారతదేశం, దక్షిణ పశ్చిమాసియా తూర్పు దేశాలలో అధ్యయనం చేసినప్పుడు వలసవాద మేధావులకు అదో కొత్త పరిస్థితి ఎదురయింది. వారి అనుభవం ప్రకారం కేవలం బాహ్య ప్రభుత్వాల ఒత్తిడివల్ల బహుళ సమాజాలు పరస్పరం ఏకత్రమై ఉన్నప్పటికీ వివిధ మతాల సాంస్కృతిక, భాషాపరమైన సమూహాలను కలుపుకుపోయే అంతర్గత విలువలు అంటూ అక్కడ ఏమీలేవు. ఉదాహరణకు ఫెర్నీవాల్ బహుళ సమాజానికి ఇచ్చిన నిర్వచనమేమిటో చూడండి.

"A society comprising two or more elements are social orders which leave side-by-side at without mingling in one political unit"

అంటే ఒక సమాజంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ సామాజిక వ్యవస్థలు ఉన్నప్పటికీ ఒక రాజకీయ ఏకాంకంగా ఏర్పడలేని సమాజాలే బహుళ సమాజాలు.

ఫెర్నీవాల్ ప్రకారం అటువంటి సమాజాలలో పరస్పర విరుద్ధమైన విలువలు ఉంటాయి. వాటిమధ్య ఏకాభిప్రాయానికి ఎటువంటి ఆధారం ఉండదు. తత్కారణంగానే ఆ సమాజాలలో ఎల్లప్పుడూ హింసాత్మక వాతావరణం, సంఘర్షణా ప్రమాదం పొంచి ఉంటుంది. అక్కడ శాంతిభద్రతల కోసం బయటి శక్తులు అంటే వలసవాదం ఉండటం అవసరం అనేది ఫెర్నీవాల్ అభిప్రాయం.

ఫెర్నీవాల్ తర్వాత పాశ్చాత్య రచయితల వద్ద కూడా ఈ తరహా సమాజాల విషయంలో శాంతియుత సహజీవనం కోసం ఎటువంటి ప్రణాళిక ఏర్పడలేదు. స్మిత్ ఇలాంటి సమాజాలలో ఒకే సాంస్కృతిక సముదాయపు ఆధిపత్యం అవసరం అని భావిస్తాడు.

ఇరవయ్యో శతాబ్ది మధ్యలో వలసవాద ఆధిపత్యం ముగిసిన తరువాత బయటి శక్తులకు అతీతంగా ఆసియా ఖండంలోని బహుళ సమాజాలు శాంతియుతంగా ముందుకు సాగుతున్నవేళ ఆ దృక్పథంలో కొద్దిపాటి మార్పులు చోటు చేసుకోవడం శుభపరిణామం. సరిగ్గా అదే సమయంలో పెద్దమొత్తంలో వలసల పరంపర ప్రారంభమైంది ప్రధానంగా అమెరికాలో ప్రపంచ దేశాల నుండి వలస వచ్చిన ఓ పెద్ద సమూహం స్థిరపడింది.

ఆధునిక సామాజిక శాస్త్రంలో బహుళ సమాజాల గురించి రెండు విధాల దృక్పథాలు ఉన్నాయి. ఒకటి మెల్టింగ్పాట్ (Melting pot theory) సిద్ధాంతంగా పేరుగాంచింది. అందులో సమాజాన్ని ధాతువులను కరిగించే పాత్రతో పోల్చడం జరుగుతుంది. ఇందులో వివిధ వస్తువులు కరిగి ఏకమై పోతాయి. వాటిలో ఉండే ప్రతీ వస్తువు రంగూ రుచులు కనుమరుగై వాటన్నిటి కలయికతో సరికొత్త రంగు రుచులు ఏర్పడతాయి. ఏ వస్తువు పరిమాణం అధిక మొత్తంలో ఉంటే అదే రంగు రుచి వెలువడుతుంది. చిన్నపాటి వస్తు పరిమాణాలు తమ సహజ స్వభావాన్ని ప్రభావితం చేసినప్పటికీ వాటి ప్రత్యేకతల ఆనవాళ్లు కానరావు.

ఐరోపాలోని అనేక దేశాలు ముఖ్యంగా ఫ్రాన్సులో ఇదే అభిప్రాయం ప్రాచుర్యంలో ఉంది. ఫ్రెంచి విద్వాంసులు తరచూ తమ దేశంలో ఇతర సాంస్కృతిక శక్తులను స్వాగతించేందుకు సిద్ధమయినప్పటికీ ఇతరులు తమ వ్యక్తిత్వ గుర్తింపును కాక, ఫ్రాన్స్ సాంస్కృతిక గుర్తింపును అంగీకరించాలనే ఆకాంక్ష కలిగి ఉంటారు. ఫ్రెంచ్ ప్రజాస్వామిక త్రిసూత్రాలు (ఫ్రెంచ్ ప్రజల ఐక్యత, సెక్యులర్ భావజాలం, ఫ్రాన్స్ జాతీయవాదం) కూడా ఈ సాంస్కృతిక ఐక్యతనే ప్రదర్శిస్తాయి.

అమెరికాలో స్థానికతా (Nativism) ఉద్యమం అత్యంత ప్రాచీనమైనది. అమెరికాలో ఇంగ్లీషుకు ధీటుగా ఇతర భాషలు మనగలగడానికి అవకాశమివ్వ లేదు ఈ ఉద్యమం. ప్రపంచవ్యాప్తంగా తన ప్రబల ప్రభావాలను వేయడంలో కృతకృత్యం అయ్యింది.

భారతదేశంలో పునర్జన్మ ప్రాతిపదక గల హైందవ ఉద్యమం కూడా ఈ తరహా అభిప్రాయానికే మద్దతిస్తుంది. వారి ప్రకారం అల్ప సంఖ్యాకులు తమ సాంస్కృతిక గుర్తింపును వదిలి, ప్రధాన జాతీయ స్రవంతిలో కలిసిపోయి దాన్నే అంగీకరించాలి

ఇక రెండవ ఆలోచనా విధానం Salad Bowlగా పేరుగాంచింది. అందులో సమాజాన్ని సలాడ్‌తో కూడిన ప్లేటుతో పోల్చడం జరుగుతుంది. ఆ ఆలోచనా విధానం ప్రకారం విభిన్న వస్తువులు కలగలిసి ఉన్నప్పటికీ ప్రతిదాని రంగు రుచి ప్రత్యేకంగా ఉంటాయి. అవి సలాడులో భాగమైనప్పటికీ దేని గుర్తింపు అంతమవదు. సలాడ్ చూసి అందులో ఉండే క్యారెట్, దోసకాయలను ఇట్టే కనిపెట్టవచ్చు. ప్రతీ వస్తువు తన ప్రత్యేక గుర్తింపుతో ఒక విస్తృతమైన సమూహంలో భాగమై ఉంటుంది.

ఈ రంగురంగుల కలయికలను ఆధునిక యుగ విశిష్టతగా వర్ణించడమేగాక ఆదరించడం కూడా జరుగుతుంది. ఆధునిక విశ్లేషకులు మాత్రం జాతీయ గుర్తింపును అట్టిపెట్టుకోవడాన్ని, అదే సమంజసమయిందిగా భావించడాన్ని తప్పు పడతారు. సమాజంలో సమ్మిళితమైన రకరకాల ఆలోచనా విధానాలు పద్ధతులు ప్రాధాన్యతలు సంస్కృతులను వారు ఆదరిస్తారు అభిలషిస్తారు కూడాను.

## ఇస్లాం దృక్పథం

బహుళత్వం విషయంలో ఇస్లాం ధార్మిక ఆదేశాలు మౌలిక నియమాలను మినహాయించి నైతిక నియమాల పరిధిలో జీవనశైలి కట్టుబాట్లలో ఉన్న వైవిధ్యాన్ని అభిలషిస్తూ Salad Bowl Pluralismను అంగీకరిస్తుంది, ఆదరిస్తుంది కూడాను. సామాజిక భిన్నత్వం వైవిధ్యం ఉండాలనీ, అందులోనే మానవ శ్రేయస్సు దాగి ఉందని అది అల్లాహ్ సూచనలలో ఒకటని భావిస్తుంది.

ఆయన సూచనలలో ఆకాశాలను భూమిని సృష్టించడం, మీ భాషల మీ రంగుల వైవిధ్యాలూ ఉన్నాయి. నిశ్చయంగా విజ్ఞులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి. (రూమ్:22)

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు

మిమ్మల్ని జాతులుగానూ తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు గలవారే అల్లాహ్ దృష్టిలో అత్యంత గౌరవపాత్రులు. (హుజురాత్: 13).

ఈ దివ్య వచనంలో జాతులు తెగల ఉద్దేశం పరస్పర పరిచయం గుర్తింపు కొరకు మాత్రమేనని విశదీకరించబడింది. అంటే ఈ విధమైన గుర్తింపు ఇస్లాం దృష్టిలో అయిష్టకరమైనది ఎంతమాత్రం కాదు. అది కేవలం నాగరికతా ప్రధానమైన ఆవశ్యకత మాత్రమేనని అర్థమవుతుంది. మహాప్రవక్త(స) అరబ్బు తెగల గుర్తింపును అంతం చేయలేదు. కేవలం ఆ గుర్తింపుల ప్రాతిపదికన పెల్లుబికిన పరస్పర వివక్ష, ఆధిపత్య భావజాలాలను మాత్రమే కూకటివేళ్లతో పెకలించారు.

ధర్మ వ్యవహారాలలో ఇస్లాం మొదటి దృక్పథాన్ని (Melting Pot) ససేమిరా అంగీకరించదు. ఇస్లాం తన అనుయాయులు ఇతర సంస్కృతులలో మిళితమై తమ సాంస్కృతిక మూలాలను విస్మరించడాన్నీ ఎంతమాత్రం ఒప్పుకోదు. చూడబోతే తన సాంస్కృతిక స్రవంతిలో సయితం ఎటువంటి హెచ్చుతగ్గులను సమ్మతించదు. ఇస్లాం తన అనుయాయుల నుండి నిష్కర్షకమైన నిఖార్సైన విధేయతను కోరుకుంటుంది. అంతేకాక ప్రతి మతావలంబీకునికీ స్వేచ్ఛాయుత వాతావరణం కలుగజేస్తుంది.

ధర్మం విషయంలో నిర్బంధం కానీ బలాత్కారం కానీలేవు సత్యవాక్కు అసత్య వాక్కు నుండి ప్రస్ఫుటం చేయబడింది. (అల్ బఖరా: 256)

ఓ ప్రవక్తా! స్పష్టంగా ఇలా ప్రకటించు: "ఇది సత్యం. మీ ప్రభువు వద్ద నుండి వచ్చింది. ఇష్టమైన వారు దానిని స్వీకరించనూ వచ్చు ఇష్టంలేని వారు దానిని తిరస్కరించనూ వచ్చు." (అల్ కహఫ్: 29)

ఈ విధంగా ఇస్లాం మత వ్యవహారాలలో ప్రతి మతావలంబీకుడు తన ధార్మిక వ్యక్తిత్వాన్ని కొనసాగించుకునే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రకటిస్తుంది. ముస్లిమేతరులు సయితం తమ వివాహ వ్యవహారాలు, సాక్ష్యాల శాసనాలు, వారసత్వ పంపకాలు ఇతరత్రా విషయాలలో స్వతంత్రులు.

హజ్రత్ ఉమర్ (రజి) అరబ్బేతర ముస్లిమేతరుల విషయంలో ఏ వస్త్రాలనయితే వారు ధరిస్తారో వాటినే ధరించవచ్చునన్న వెసులుబాటును కల్పించారు.

హజ్రత్ షిబ్లీ నోమానీ ముస్లిమేతర ప్రజలతో హజరత్ ఉమర్ (రజి) చేసిన కొన్ని ఒడంబడికల వచనాలను కాపీ చేశారు.

హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (రజి) రాతపూర్వకంగా రాసిన కొన్ని విషయాలు ఈ విధంగా ఉన్నాయి:

ముస్లిమేతరుల మత మార్పిడిగానీ, వారి మత శాసనాలలో జోక్యం చేసుకోవడంగానీ జరగదు.

మరో సందర్భంలో ముస్లిమేతరులతో జరిగిన ఒప్పంద పత్రాలపై లిఖించబడిన వాక్కులు....

"వారి ధనమాన ప్రాణాలకు పూర్తి పరిరక్షణ లభిస్తుంది శాసనాంగాల విషయంలోనూ మార్పులకు తావులేదు".

సత్య తిరస్కారులకు సయితం లభించిన ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కేవలం ధార్మిక నిబంధనలు మాత్రమే కావు, ఇస్లాం మౌలిక దృక్పథాలకు దృక్కోణాలు అని కూడా చెప్పవచ్చు. ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు దైవాభిలాషలోని ఓ భాగమే. ఈ విధమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ద్వారానే దైవం మనిషిని పలు పరీక్షలకు గురి చేస్తాడు.

నీ ప్రభువు సంకల్పిస్తే సర్వమానవులను నిస్సందేహంగా ఒక వర్గంగా చేయగలిగేవాడే; కానీ ఇప్పుడు వారు విభిన్న మార్గాలలో నడుస్తారు, కేవలం నీ ప్రభువు కరుణకు నోచుకున్నవారే అపమార్గాలకు లోను కాకుండా ఉంటారు. ఆయన వారిని దీనికొరకే (ఎంపిక, ఆచరణల స్వాతంత్ర్యాన్ని ఇచ్చి పరీక్షించే నిమిత్తమే) సృష్టించాడు. (హూద్:119)

ఇస్లాం ధర్మం విషయంలో ఎలాంటి బలాత్కారాన్ని సహించదు.

నీ ప్రభువు అభీష్టం గనక ఇదే అయితే (అంటే భూమిపై ఉండేవారంతా విశ్వాసులు విధేయులు అవ్వాలనేది) సమస్త భూవాసులు విశ్వసించి ఉండేవారే. అలాంటప్పుడు నీవు ప్రజలను విశ్వాసులుగా మారండని బలవంతం చేస్తావా? (యూనుస్: 99)

అయితే, ధర్మ వ్యవహారాలలో ఇస్లాం ఇతర మతాల భిన్నత్వాన్ని స్వీకరిస్తుందని, వాటిని అభిలషిస్తుందని దీని అర్థం ఎంతమాత్రం కాదు. ఇస్లాం విభిన్న మతస్థులకు మతస్వేచ్ఛ ఇస్తుంది, అయితే సామాజిక వైవిధ్యం

కొనసాగాలనే ఉద్దేశం కోసం ఎంతమాత్రం కాదు. ఇది సత్యధర్మం, ధర్మాన్ని అంగీకరించే తిరస్కరించే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంది. కానీ సత్యధర్మ మాధుర్యాన్ని ప్రతిఒక్కరూ ఆస్వాదించాలనేది ఇస్లాం ధర్మ ఆకాంక్ష.

ధర్మం విషయంలో నిర్బంధం కానీ బలాత్కారంకానీ లేవు సత్యవాక్కు అసత్యం నుండి ప్రస్ఫుటం చేయబడింది. ఇక నుండి తాగూత్‌ను తిరస్కరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు సుస్థిరమైన ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే. అతడు ఆశ్రయించిన అల్లాహ్ సమస్తము తెలిసినవాడు సర్వమూ వినేవాడు. అల్లాహ్ విశ్వాసులకు సంరక్షకుడు సహాయకుడూను. ఆయన వారిని కటిక చీకట్ల నుండి వెలికితీసి వెలుగు చూపిస్తాడు. (అల్ బఖర:256)

ఇస్లాం ఇతర మతావలంబీకులతో శాంతియుత సంభాషణల పరంపర కొనసాగాలని కాంక్షిస్తుంది. సత్యాన్వేషణకై ప్రజలను పురిగొల్పి, వారిలో సత్యధర్మ అవగాహనను కల్పించి, ఎటువంటి నిర్బంధం లేకుండా వారు తమ ఇష్టపూర్వకంగా సర్వత్రా సుముఖతతో సత్యధర్మం వైపు తలొగ్గాలి.

ఆ ప్రయత్నంలో ఎటువంటి బలాత్కారానికి తావు లేకుండా, సంభాషణలు గౌరవ మర్యాదల పరిధులను దాటకుండా, ముస్లిమేతరుల దైవాలను అగౌరవపరచకుండా మరీ జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది.

గ్రంథప్రజలతో వాదించకు ఉత్తమమైన రీతిలో తప్ప (అన్ కబూత్:46)

ముస్లింలారా! వారు అల్లాహ్‌ను కాదని వేడుకొనే ఇతరులను దూషించకండి ఎందుకంటే వారు షిర్క్ కంటే ఇంకా ముందుకు పోయి అజ్ఞానం చేత అల్లాహ్‌ను దూషిస్తారేమో (అల్ అన్‌ఆమ్:108).

ఈ కారణంచేతనే ఇస్లామీయ చరిత్రలో ముస్లింల మరియు ముస్లిమేతరుల పరస్పర శాంతియుత సంబంధాలు ఆరోగ్యవంతమైన చర్చల ప్రాతిపదికనే కొనసాగాయి. పైగా ముస్లిములు ముస్లిమేతరుల సద్గుణాంశాలను ఎటువంటి ఆశ్రిత పక్షపాతాలకు లోనుకాకుండా అంగీకరించారు. వారి మతాలను అధ్యయనం చేసి గ్రహించి మరీ పరస్పర చర్చలు సంభాషణల సంబంధాలను కొనసాగించారు.

గ్రీకు రోమన్ కన్ఫ్యూషియస్ హైందవ నాగరికతల నుండి వివిధ శాస్త్రాలను స్వీకరించి, వాటిని అభివృద్ధిపరిచే దిశగా తమ ప్రయత్నాలను మరింత

ముమ్మరం చేశారు. ప్రముఖ పరిశోధకుడు అబూరైహాన్ అల్బైరూనీ, తన శాస్త్రీయ పరిశోధన ద్వారా రచించిన ప్రసిద్ధ గ్రంథం కితాబుల్హింద్ నేటికీ ఒక ప్రామాణిక గ్రంథంగా చలామణిలో ఉంది.

## ఇస్లాం కాంక్షించే బహుళ సమాజ విశిష్టతలు

1. ఇస్లాం అనుయాయులకు ఇస్లాం ధర్మాన్ని ఆచరించే ఇస్లామీయ వ్యక్తిత్వాన్ని కొనసాగించే పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలి.

2. ఇతర మతావలంబీకులు కూడా తమ ధార్మిక వ్యక్తిత్వాన్ని కొనసాగించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండాలి.

3. వివిధ మతావలంబీకుల మధ్య ఆరోగ్యవంతమైన చర్చలు, సంభాషణలు, ఆంతరంగిక అంగీకారానికై సత్యధర్మ స్వీకారానికి స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలి.

## ముస్లిం సమాజ బృహత్తర బాధ్యత

బహుళ సమాజంలో ఇస్లాం ముస్లింలను తన ప్రతినిధులుగా చేసి సమాజాన్ని ప్రభావితపరిచే పవిత్ర బాధ్యతను వారిపై మోపుతోంది. ప్రజలు తమ అభీష్టానికనుగుణంగా ధర్మాన్ని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛాధికారాలు ఉన్నప్పటికీ ముస్లింలు నిత్యం పరస్పర చర్చలు సంభాషణల ద్వారా మరింత విపులంగా చెప్పాలంటే తమ ఆలోచనా విధానం ద్వారా సత్యధర్మ సాక్షులుగా నిలిచి ప్రజాభిప్రాయాన్ని మలిచే ప్రయత్నం చేయాలి. తద్వారా ప్రజలు ఇష్టపూర్వకంగా సత్యధర్మ మాధుర్యాన్ని ఆస్వాదించే అభిమానధనులుగా మారిపోవాలి. ఇదే ముస్లింలపై ఉన్న మహోత్కృష్ట బాధ్యత. దీన్నే మనం ఇఖామతె దీన్, షహాదతే హఖ్ లాంటి పేర్లతో ప్రస్తావిస్తుంటాము.

సత్యధర్మ సంస్థాపనలో రెండు ప్రధాన కార్య రంగాలున్నాయి. సత్యధర్మ పరిరక్షణ, సత్యధర్మానికి తోడ్పాటు.

బహుళ సమాజాలలో ధర్మానికి సంబంధించిన వివిధ విభాగాల పరిరక్షణ కూడా ప్రధానమైనదే. ముస్లింల ప్రార్థనా స్థలాలను పరిరక్షించడం, ముఖ్యంగా ముస్లిం పర్సనల్ లాను పరిరక్షించడం కూడా ధర్మపరిరక్షణ కిందికే వస్తుంది. ధర్మాన్ని అనుసరించే, ధర్మప్రచారం చేసే, ధర్మాన్ని స్వీకరించే

స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలి. ముస్లింల రక్షణ, వారి విద్యాభివృద్ధి, ధార్మిక స్వరూపాలు, ఉన్నత ఆశయాలు నైతిక విలువల పరిరక్షణలాంటి వాటన్నిటినీ మనం సందేశ రంగం నుండి వేరు చేసి చూడలేము. బహుళ సమాజంలో ఆయా విభాగాలలో జరుగుతున్న కృషిని ధార్మిక పరిరక్షణా ప్రయత్నంగానే భావించాలి. మన వద్ద సురక్షితంగా ఉన్న వనరులను విస్మరించి, లేనివాటిని ఆశించడం అవివేకం తప్ప మరొకటి కాజాలదు. పరస్పర జాతి వైషమ్యాలకు తావులేకుండా న్యాయబద్ధమైన విధంగా ఈ పని జరగాలి. సంఘర్షణా శక్తులకు భయపడి ఆదిలోనే తడబడితే అది వివేచన ఎంతమాత్రం అనిపించుకోదు.

రెండవ రంగం ధర్మసహాయానికి సంబంధించింది. ముస్లిమేతరులలో ఇస్లాం సందేశ ప్రచారం చేయడం, సామూహిక జీవితంలో ఇస్లామీయ జీవన విధానాన్ని నెలకొల్పేందుకు అంకితభావంతో కృషి చేయడం.

ఈ విధమైన లక్ష్యసాధనకై బహుళ సమాజంలో మూడు రంగాల్లో పని చేయడం అత్యంతావశ్యకం..

1. ఇస్లాం సందేశం, ధర్మానికి అనుకూలంగా పరస్పర సంభాషణా చర్చలు..

2. ఇస్లాంకు క్రియాత్మక సాక్ష్యం

3. ముస్లింల సంస్కరణా బాధ్యతను చేపట్టి, వారిని బలోపేతం చేసే దిశగా అడుగులు వేయడం.

బహుళ సమాజాలలో సందేశ ప్రచార కార్యమనేది ధార్మిక విధుల్లో ఓ భాగం. ముస్లింలు సందేశ దాతలు. సైద్ధాంతిక సమాజానికి చెందినవారు. అందునా ఇస్లాం ధర్మం నిర్లక్ష్యానికి గురైన దేశంలో ముస్లింలు సందేశ కార్యం నుండి ఏ కోశానా తప్పించుకోలేరనేది కాదనలేని వాస్తవం. మౌలానా తఖీ ఉస్మానీ, ఖుర్రం మురాద్, అల్లామా ఇబ్నెబాజ్ తదితర ధార్మిక విద్వాంసుల ప్రకారమయితే బహుళ సమాజాలలో ముస్లింలు తమ బృహత్తర బాధ్యతయిన ధర్మసందేశ కార్యాన్ని నిర్వహించినప్పుడే ఆ దేశంలో నివాసం ఉండడం వారికి ధర్మసమ్మతమవుతుంది.

క్రియాత్మక సాక్ష్యం అంటే ముస్లింల సామూహిక ఆచరణ, వారి వ్యక్తిగత విధానాల ద్వారా ఇస్లాం సత్యసంధత, దానిద్వారా మానవాళికి జరిగే మేళ్ళు

ప్రస్ఫుటం అవ్వాలి. ఈ విషయాన్ని దివ్య ఖుర్ఆన్ తనదైన శైలిలో దైవ సాక్షులుగా, న్యాయ ధ్వజవాహకులుగా నిలబడమని ప్రబోధిస్తుంది. సత్యధర్మ సాక్ష్యమివ్వడం న్యాయానికై కృషి సలపడంలో ఒక సరళమైన సంబంధం ఉంది. ఆ న్యాయబద్ధమైన కృషి ద్వారానే ఇస్లాం ఆలోచనా విధానం దాని ఆశయ సాధనాలు ప్రజల ముందు ప్రస్ఫుటమవుతాయి.

ఈ లక్ష్యసాధనకై జీవితపు సకల రంగాలలో ముస్లిం సమాజ క్రియాశీలత కార్యదక్షత కొట్టొచ్చినట్లు కనపడాల్సిన అవసరముంది. సామాజిక జీవితంతో తెగతెంపులు చేసుకుని, ముస్లింలు తమను తాము బందీలుగా చేసుకొని ఉండడం సముచితమైన విధానం కాదు. వ్యక్తిగత స్థాయిలో సామూహిక స్థాయిలోనూ ముస్లింలు సమాజానికి సేవ చేసే కార్యకర్తలుగా మారాలి. ముస్లిం సమాజ సహకారం, సామాజిక రంగంలో వారి కార్యశుద్ధి ఇస్లాం సహజ స్వరూపాలు, ఇస్లాం ఆదర్శాలు ఉట్టిపడాలి.

మూడవ విషయం ముస్లిం సమాజ సంస్కరణ ద్వారా వారిని సైద్ధాంతికంగా బలోపేతం చేసే ప్రయత్నం జరగాలి. బహుళ సమాజాలలో ముస్లింలు ఇస్లాం ధర్మానికి ప్రతిబింబాలు. వారిలో ఎన్నో బలహీనతలు లోపాలు పొడసూపినప్పటికీ ఇస్లాం శక్తియుక్తులు ముస్లింలలోనే నిగూఢమై ఉన్నాయనే వాస్తవాన్ని మర్చిపోకూడదు. తత్కారణంగా ముస్లింల సామాజిక బలహీనత ఇస్లాం ధర్మాన్ని బలహీనపరుస్తుంది. సమాజంలో ఇస్లాం ధర్మానికి ప్రాబల్యం చేకూరాలంటే ముస్లింల సంస్కరణోద్యమం మౌలిక విషయమే అయినప్పటికీ దాంతోపాటు వారి శక్తియుక్తులను బలోపేతం చేయడం కూడా అత్యంతావశ్యకం.

## ఆధార గ్రంథాలు

1) ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా

2) అల్ ఫారూఖ్ : షిబ్లీ నోమానీ

3) ఫిఖ్హీ మఖాలాత్ : ముఫ్తీ తఖీ ఉస్మానీ (మొదటి భాగం)

4) ఫతావా దారుల్ ఇఫ్తా సౌదీ అరేబియా (రెండవ భాగం)

# సెక్యులరిజం - ఇస్లామీయ ఉద్యమం

నేడు లౌకికవాదం ఇస్లామీయ ఉద్యమ శిబిరాలలో తరచూ చర్చ నీయాంశం అవుతోంది. ఇస్లామీయ ఉద్యమాల ఆరంభ కాలంలో తీవ్ర విమర్శ లకు గురైన వాదాలలో లౌకికవాదం కూడా ఒకటి. జీవన రంగాలన్నిటినీ దైవిక మార్గనిర్దేశనాలకనుగుణంగా తీర్చిదిద్దడమే ఇస్లామీయ ఉద్యమ మౌలిక దృక్పథం కనుక దైవిక మూలాలను పరిమితపరిచే ఏ ఆలోచనా వ్యవస్థనయినా దాన్ని తన సైద్ధాంతిక ప్రత్యర్థిగానే భావిస్తుంది ఇస్లాం.

నేడు ప్రపంచవ్యాప్తంగా ఇస్లామీయ ఉద్యమాలు లౌకికవాదంతో చేతులు కలుపుతూ అక్కడక్కడా లౌకికవాదానికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ కనబడుతున్నాయి. టర్కీలాంటి దేశాలలో ఇస్లామీయ ఉద్యమాలు లౌకిక వాదంపై నిషేధం ప్రకటించినప్పటికీ స్వతహాగా అర్బకాన్ స్థాపించిన పార్టీలు సెక్యులర్ పార్టీలే. భారతదేశంలో బలపడుతున్న ఇస్లామీయ ఉద్యమం కూడా ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా లౌకికవాద శక్తులకే ప్రాధాన్యతనిస్తుంది. అంతేకాక అవి బలమైన శక్తులుగా రూపుదిద్దుకోవాలని కూడా కాంక్షిస్తుంది. ఇటీవల జమాఅత్ ఓ రాజకీయ పార్టీ ఏర్పాటులో కూడా కీలకపాత్ర పోషించింది. తన ప్రముఖ సభ్యులను దాని నాయకత్వ బాధ్యతను అంగీకరించే అనుమతిని కూడా ఇచ్చింది. తన అనుబంధ సంస్థలకు పార్టీకి మద్దతివ్వాలని మరీ ఆదేశించింది కూడా. జమాఅత్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కొందరు ఆలోచనా వైరుధ్యంగా, సైద్ధాంతిక తప్పిదంగా భావిస్తున్నారు. ఈ భావన వల్లనే ఉద్యమ వర్గాలలో ఒకవిధమైన వ్యాకులత కనిపిస్తోంది. ఉద్యమ వ్యతిరేకులు, కార్యకర్తలు ఇవి ద్వంద్వ ప్రమాణాలని ఆరోపిస్తున్నారు.

కొన్ని కీలకమైన విషయాలను సరైన విధంగా అవగాహన చేసుకోని

కారణంగానే ఇలాంటి దురభిప్రాయాలు ఏర్పడతాయని విస్తృతమైన విశ్లేషణలు తెలియజేస్తున్నాయి.

ప్రధాన విషయం ఏమంటే నేటి రాజకీయాలలో లౌకికవాద భావం మారిపోయింది. ఈ పదాన్ని కనిపెట్టిన ఫ్రాన్స్ విప్లవకారులు ఏ అర్థంలో దీన్ని ఉపయోగించారో, ఏ అర్థం కారణంగా మన పూర్వీకులైన ఇస్లామీయ ఉద్యమ సైద్ధాంతికవాదులు దాన్ని విమర్శించారో ఇప్పుడు ఆ భావజాలం కనుమరు గైపోయింది. సామాజిక శాస్త్రాలలో పారిభాషిక పదాల అర్థాలు తరచూ ఒకేలా ఉండవు. కాలానికనుగుణంగా దృక్పథాలు సిద్ధాంతాలు మారుతుంటాయి. పదాలు కూడా సరికొత్త అర్థాలను సంతరించుకుంటాయి. నేటి ప్రపంచంలో లౌకికవాద పదం ఎన్నో అర్థాలలో వాడబడుతుంది. ఆ అర్థాలలో ప్రతీ అర్థం ఇస్లామీయ ఆలోచనాధారలతో విభేదించేదై ఉండాల్సిన అవసరం లేదు.

రెండవ విషయం ఇస్లామీయ ఉద్యమాలు కాంక్షించే విప్లవం ఓ సుదీర్ఘకాల ప్రక్రియ. ఈ లక్ష్యసాధనకై దశలవారీగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మనం చేరుకోవాల్సిన గమ్యం గురించేకాక ఆ మార్గంలో ఎదురయ్యే దశాదిశల అవగాహన కూడా తప్పనిసరి. ఈ వ్యాసం ఆ రెండు విషయాల సారాంశమే...

## లౌకికవాద ప్రాథమిక అర్థం

సెక్యులరిజం అనే పదం కేవలం రాజకీయ పారిభాషిక పదం కాదు. ఈ పదాన్ని మొట్టమొదట George Jacob Holyoake 19వ శతాబ్ది మధ్యలో ఉపయోగించాడు. అతను సెక్యులరిజాన్ని ఈ విధంగా నిర్వచించాడు.

"A form of opinion which concerns itself only with questions, the issues of which can be tested by the experience of this life"

లౌకికవాదం అంటే ఈ జీవిత అనుభవాల ద్వారా పరిశీలించడం సాధ్యమయ్యే ప్రశ్నలకు మాత్రమే పరిమితం చేసే ఆలోచనా విధానం.

ఐరోపా సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో ఆవిర్భవించిన సెక్యులరిజం ప్రధాన దృక్పథం ఏమిటంటే దైవం, దైవగ్రంథం, దైవిక మార్గదర్శకాలు, మరణానంతర జీవితం, పరలోకం బుద్ధిజ్ఞానాలు అనుభవాల ఆధారంగా పరికించజాలని ఇత్యాది వ్యవహారాలన్నీ ఉపేక్షించదగినవి. ఈ విషయాలను

ఎవరైనా తమ వ్యక్తిగత ఆధ్యాత్మిక జీవితంలో పాటిస్తే తప్పులేదు కానీ సామూహిక వ్యవహారాలలో మాత్రం అవి చర్చనీయాంశం కాకూడదు. ఆర్థిక వ్యవస్థ, సామాజిక రాజకీయ నీతి, విద్యాజ్ఞానాలు, విజ్ఞాన శాస్త్రాలు, సైన్స్ సాంకేతిక రంగాలు, సభ్యతా సంస్కృతులన్నీ ప్రస్తుత అనుభవాల ఆధారంగా మానవ మేధస్సు నిరూపించిన విషయాలపైనే నిర్మితం అవ్వాలి.

ఈ విధంగా లౌకికవాదం ప్రాథమిక దశలో మత ప్రసక్తి లేని భావన ఆధారంగా ఏర్పడింది. ఆధునిక విద్యా వైజ్ఞానిక రంగాలపై కళలపై ఈ భావజాల ప్రబల ప్రభావాలు పడ్డాయి. అనుభవం లేదా బుద్ధి అనే గీటురాయిపై నిరూపించగలిగేదే యధార్థమనే కాల్పనిక వాదన ఆధారంగా సామాజిక, భౌతిక శాస్త్రాలు ఉనికిలోకి వచ్చాయి. మత భావనను ఏ శాస్త్రానికీ పునాదిగా ఏర్పడనివ్వలేదు. అయితే ఈ భావన కొత్తదేం కాదు. గ్రీకు తత్వశాస్త్ర భావన కూడా ఇదే. ఇస్లామీయ చరిత్రలో ఇబ్నేరుష్ద్ ఈ తరహా మార్గవిహీనమైన ఆలోచనా ధోరణినే ప్రచారం చేసేందుకు ప్రయత్నించాడు. ఇమామ్ గజాలీ, ఆ తరువాత ఇమామ్ ఇబ్నెతైమియా ఆ ప్రయత్నాలను తిప్పికొట్టారు. కానీ మధ్యప్రాచ్య ఐరోపాలో చర్చి మతానికి వ్యతిరేకంగా ఉనికిలోకి వచ్చిన ఆధిపత్య శక్తులు ఈ ఆలోచనా ధోరణిని విపరీతంగా అభివృద్ధి పరిచాయి. సెక్యులరిజం ముసుగులో మొదలైన మత రహిత దృక్పథం విద్యావైజ్ఞానిక శాస్త్రాలలో మరింతగా దూసుకుపోయి తన భావజాలాన్ని బలపరచడంలో విజయవంతం అయింది. నేడు అన్నిటికన్నా ఎక్కువగా వైజ్ఞానిక రంగంలోనే ఈ తత్వానికి ధీటుగా పోరాడాల్సిన అవసరం ఉంది. తత్వశాస్త్రం సామాజిక శాస్త్రం ఆర్థిక శాస్త్రాల నుండి భౌతిక, రసాయనిక, జీవశాస్త్రాలు సాంకేతిక శాస్త్రాల వరకు అన్ని శాస్త్రాలు దైవాన్ని, విశ్వవాస్తవికతను విస్మరించి రూపుదిద్దుకున్నాయి. అవి ఎంతగా అభివృద్ధి చెందాయంటే నేడు మతపరమైన సమాజాలు కూడా అవే విద్యలను అభ్యసించాల్సిన, బోధించాల్సిన దుర్భర పరిస్థితి దాపురించింది.

ఈ తాత్విక ఆలోచనా విధానం ఆధారంగా నిర్మితమయ్యే సమాజమే లౌకికవాద సమాజం అనబడుతుంది. లౌకికవాదం పురుడు పోసుకున్న ఆరంభదశలో ప్రభుత్వాలు మత భావనలకు మత ప్రసక్తికి అతీతంగా ఉండే సమాజాన్ని నిర్మించే కలలుగన్నాయి. సామాజిక వ్యవహారాలలో మతపరమైన జోక్యానికి ఎలాంటి తావు ఉండకూడదనీ, మతం కేవలం మనిషి వ్యక్తిగత

వ్యవహారమనీ, వ్యక్తులు సమూహాల మధ్య మతం చర్చనీయాంశం కాకూడదనీ, సభ్యతా సంస్కృతులు, సామాజిక సంప్రదాయాలు, జీవన విధానాలు, కట్టుబాట్లు సామాజిక సంస్థలన్నీ మతభావనలతో కలుషితం కాకూడదనే భావనను నెలకొల్పాయి. ఈ తరహా లౌకికవాద భావజాలాన్ని ఫ్రాన్స్ మరికొన్ని ఐరోపా దేశాలు, కమ్యూనిస్టు దేశాల్లో అభివృద్ధిపరిచే ప్రయత్నాలు జరిగాయి. కానీ గత రెండు దశాబ్దాల అనుభవాల తరువాత ప్రస్తుత ప్రపంచంలో ఉన్న లౌకికవాద భావనలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతమున్న భావజాలంలో మత నిరాకరణ ఊసే లేదు.

లౌకికవాదంలో ఉన్న ఈ భావజాలం వల్లే రాజకీయ సెక్యులరిజం లేక సెక్యులర్ స్టేట్ భావన ఉనికిలోకి వచ్చింది. మొదట్లో లౌకిక వాదుల్లో లౌకిక రాజ్యభావజాలం తీవ్రంగా ఉండేది. లౌకికవాదులు మతాన్ని ఆధునిక సైన్స్ సాంకేతికాభివృద్ధి మార్గంలో అవరోధంగా భావించేవారు. మతం మనిషి మూఢనమ్మకాల ఫలితమని విద్యాబుద్ధులు మానసిక వికాసాలకు గొడ్డలిపెట్టు అనే దృక్పథంతో మనుషులను మతభావనల నుండి వేరుపరిచే రాజ్యాల కలలుగనేవారు. తద్వారా మతప్రసక్తి లేని రాజ్యాలు నెలకొనాలనీ, పౌరుల జీవితాల్లో కూడా మతం అభిలషణీయం కాకూడదనేది వారి ఆకాంక్ష. సామాజిక జీవితపు రంగాలన్నిటినీ మత విశ్వాసాలు మతపరమైన చిహ్నాలతో పరిశుద్ధపరిచి మరీ మనుగడ సాగించాలనే ఆసక్తిని చూపేవారు.

19వ శతాబ్ది ద్వితీయార్థంలో, 20వ శతాబ్ది ప్రథమార్థంలో ఈ భావనపై వాడి వేడిగా చర్చలు జరిగాయి. యూరప్ సామాజిక రాజకీయ మేధావులు ఈ భావనలోనే ప్రపంచ సంక్షేమం దాగుందని నిరూపించేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. ఈ భావజాలం ప్రాతిపదికపైనే రష్యా తదితర కమ్యూనిస్టు దేశాల్లో తీవ్రమైన మత వ్యతిరేక ధోరణులు మొదలయ్యాయి. ముస్తఫా కమాల్ అతాతుర్క్ ముస్లిం జగతిలోని అత్యంత కీలక రాజ్యమైన టర్కీలో ఈ దృక్పథాన్నే బలవంతంగా రుద్దాడు. ముస్లిం ప్రపంచమంతటా విద్యాధికులు ఆధునిక భావజాలాలు కలిగిన వర్గీయులను సమర్థించే నాయకుడుగా అతాతుర్క్ తయారయ్యాడు. ముస్లిం దేశాలలో ముస్తఫా కమాల్‌ను అనుసరించే అనేక మంది విద్యాధికులు మేధావులు నాయకులు తయారయ్యారు. వారంతా ముస్లిం దేశాలలో సెక్యులర్ భావజాలాలే ఉండాలని, మానవ సంక్షేమానికి అవే

మూలాలని భావించేవారు. ఆ పరిస్థితుల్లో ఇస్లామీయ ఉద్యమాలు స్వతహాగా సెక్యులరిజాన్ని తమ మొదటి శత్రువుగా భావించి దానికి వ్యతిరేకంగా పోరాడటమే తమ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నాయి.

## సెక్యులరిజం వివిధ రూపాలు

ప్రపంచంలోని ఏ సిద్ధాంతమైనా అతివాద సిద్ధాంతం (Extreme idealism) గానే మొదలవుతుంది. కానీ పుస్తకాల ప్రపంచం నుండి బయలుదేరిన ఆ సిద్ధాంతం సామాజిక వాస్తవాలను ఎదుర్కొన్నప్పుడు క్రమక్రమంగా అందులో రాజీపడే గుణం (flexibility) జనిస్తుంది. అది రూపాంతరం చెందడంతో పాటు దాని అర్థాలు కూడా మారుతుంటాయి. కనుకనే ఏదైనా ఆచరణాత్మక సిద్ధాంతాన్ని అర్థం చేసుకునేందుకు ఆ సిద్ధాంతవాదుల గ్రంథాలు డిక్షనరీలు పాఠ్యపుస్తకాల అధ్యయనమే సరిపోదు, నేటి ప్రస్తుత ప్రపంచంలో ఆ సిద్ధాంతం అసలు అర్థం ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉంటుంది. రాజకీయ సామాజిక న్యాయ విద్వాంసుల్లో, ముసాయిదా చట్టాలు రాజ్యాంగ వ్యాఖ్యాతల వద్ద, ప్రజలు ప్రజా పరిపాలకుల్లో దాని ఏ అర్థం వాడుకలో ఉందో అవగతం చేసుకోవాలి. ప్రస్తుత సమాజంలో ఆ సిద్ధాంతాల అర్థాలు ప్రాచీన గ్రంథాల అర్థాలకు అతీతంగా కాలానికి అనుగుణంగా ప్రజా బాహుళ్యంలో ప్రసిద్ధి చెందిన అర్థాలే ఉంటాయి. దీనికి ఆధారాలు కూడా ఉన్నాయి. ఇది భాషా శాస్త్రానికి సంబంధించిన ప్రతి విద్యార్థికి విదితమైన విషయమే.

సూత్రప్రాయంగా నేటి ఆధునిక చరిత్రలో సెక్యులరిజం అర్థాన్ని అన్వేషిస్తే మూడు విధాల అర్థాలు మన ముందుకు వస్తాయి.

1. ప్రాచీన సిద్ధాంతకర్తలు ప్రస్తావించిన సెక్యులరిజం... మతాన్ని అవాంఛనీయ విషయంగా పరిగణించడం, మత నిర్మూలన రాజ్యం యొక్క బాధ్యతగా భావించడం. దీన్ని ఆధునిక పొలిటికల్ సైన్సులో హార్డ్ సెక్యులరిజం (Hard secularism) లేక నాస్తికవాద సెక్యులరిజం (Atheist secularism) అంటారు. ఈ భావజాలం ప్రాతిపదికనే మతం సైన్స్ విద్యాభివృద్ధిలో అవరోధమనీ, అభివృద్ధి మార్గాలను అన్వేషించడం రాజ్యం యొక్క బాధ్యత కనుక మత మౌఢ్యం, మతవిశ్వాసాల నిర్మూలనకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాలనీ, ప్రజలకు మత చైతన్యం నుండి విముక్తి కల్పించి అభివృద్ధి బాటలో

నడపాలనేది వారి భావన. తద్వారా రాజ్యాలు మత ప్రత్యర్థులుగా అవతరించి తమ అధికార దుర్వినియోగం ద్వారా మత మూలాలను అంతం చేసేందుకు ప్రయత్నించాయి. యుగోస్లావియా, బెల్గారియా, సోవియట్ యూనియన్ లాంటి దేశాల్లో మత భావనలను సాధ్యమైనంత మేరకు అణగదొక్కేందుకు అవసరమైన ప్రయత్నాలన్నీ జరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఈ భావజాలం కేవలం కమ్యూనిస్టు కూటమికే పరిమితమైనప్పటికీ కొంత మంది క్రూర నియంత పరిపాలకులు తమ నియంతృత్వాన్ని సమర్థించుకునేందుకు కూడానూ దీన్ని ఉపయోగించుకున్నారు. మిగతా ప్రపంచమంతా ఈ భావజాలాన్ని అభిలషణీయంగా భావించిన దాఖలా లేదు. కమ్యూనిజం తుత్తునియలవడంతో పాటు సెక్యులరిజం అతివాద భావజాలం కూడా అంతమైపోయింది. నేటి అత్యాధునిక ప్రపంచంలో ఈ భావజాలానికి ఎలాంటి స్థానం లేదు.

సెక్యులరిజం రెండవ భావజాలాన్ని ఫ్రెంచ్ పారిభాషిక పదంలో లైసైట్ (Laicite) అంటారు. ఈ భావజాలంలో జీవితపు రంగాలన్నిటినీ మతం, మత రహిత కోణాలలో విభజించడం జరిగింది. ఇక్కడ మతాన్ని ఆధ్యాత్మిక అభివృద్ధిని మనిషి వ్యక్తిగత జీవితం వరకే పరిమితం చేశారు. పౌరులకు మతాన్ని అనుసరించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నప్పటికీ దేశ సమాజ వ్యవహారాలలో మతపరమైన జోక్యం వీల్లేదంటూ, సామాజిక జీవితంలో మతచిహ్నాలు అవాంఛనీయంగా పరిగణింపబడతాయనీ, రాజ్యానికి ఏ మతముతోనూ సంబంధం ఉండకూడదనీ, ఏ మతమూ మత సంస్థకు రాజ్యాలు ఏవిధమైన సహాయం చేయకూడదని, వ్యక్తిగత జీవితంలో లభించే మతస్వేచ్ఛ కూడా చట్టాలకు అతీతం కాదనేది వారి భావజాలం. దీన్ని మోడరేట్ హార్డ్ సెక్యులరిజం అంటారు.

సెక్యులరిజం యొక్క ఈ భావజాలం నేడు కూడా అమల్లో ఉంది. యూరప్ లోని అనేక దేశాల్లో ఈ భావజాలమే కొనసాగుతోంది. గతంలో టర్కీలో కూడా ఈ ఆలోచనా విధానమే ఉండేది కనుకనే టర్కీలో ఏళ్ల తరబడి హిజాబ్‌పై నిషేధం ఉండింది. ఫ్రాన్స్ కూడా ఈ భావజాలనికనుగుణంగానే హిజాబ్ మత చిహ్నమనీ, బహిరంగ స్థలాలలో మత చిహ్నాల వ్యక్తీకరణ సెక్యులరిజానికి వ్యతిరేకమంటూ హిజాబ్‌ని నిషేధించింది. స్విట్జర్లాండ్‌లో మీనార్లను నిషేధించడం వెనుక కూడా ఈ తత్వమే బోధపడుతోంది. గత కొన్ని

దశాబ్దాల నుండి యూరప్‌లో ఉన్న అక్కడి ప్రజానీకం ఈ భావజాలాన్ని వ్యతిరేకిస్తున్నారు.

అమెరికా ఇంగ్లాండ్ మేధావులు కూడా యూరప్ భావజాలాన్ని వ్యతిరేకిస్తున్నారు. స్విట్జర్లాండ్‌లో మీనార్ల నిషేధంపై, ఫ్రాన్స్‌లో హిజాబ్ నిషేధంపై జరిగిన చర్చల ద్వారా యూరోపియన్ సెక్యులరిజం ఇంగ్లాండ్ సెక్యులరిజం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇంగ్లాండ్ మేధావులు యూరోపియన్ల భావజాలం సరైంది కాదంటారు. మతం మానవ సమాజంలోని ప్రధాన భాగమనీ ఏ సమాజమూ మతాన్ని విస్మరించి పరిపూర్ణం కాజాలదనేది వారి అభిప్రాయం. ఇప్పుడు విద్యారంగంలో కూడా ఇంగ్లాండ్ సెక్యులరిజం, ఫ్యాన్స్ సెక్యులరిజంలో గల వ్యత్యాసాన్ని చూపేందుకు ఫ్రాన్స్ సెక్యులరిజాన్ని సెక్యులరిజానికి బదులుగా లైసిజమ్ (Laicism) అని పిలవడం జరుగుతోంది. యూరోపియన్లు ఫ్రాన్స్ ప్రజలే స్వయానా ఈ భావజాలంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ ప్రస్తుతం ఫ్రాన్స్ వ్యవహరిస్తున్న ధోరణిని Negative Laicite అని పేర్కొంటూ positive Laiciteల అవసరం ఉందని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. తద్వారా ఫ్రాన్స్ సమాజంలో మతం పాత్ర ఉండాలని ఫ్రాన్స్ సామాజిక జీవితంలో అతి పెద్ద మతాలయిన క్రైస్తవం, ఇస్లాం, యూదు మత అమూల్య సేవలను అంగీక రించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు.

## అమెరికా బ్రిటన్‌ల సెక్యులరిజం

సెక్యులరిజం మూడవ రకం అమెరికన్ సెక్యులరిజం. ఈ విధానంలో సెక్యులరిజం అంటే ప్రభుత్వం మతావలంబీకులతో మత ప్రాతిపదికన ఎటువంటి వివక్ష పక్షపాత వైఖరిని అవలంబించకూడదు. అన్ని మతాలకు సమాన స్వేచ్ఛను ఇవ్వాలి. మతం విషయంలో ఎవరిపై ఎటువంటి బలవంతం లేదు. దీన్ని సాఫ్ట్ సెక్యులరిజం లేక సెక్యులర్ లిబరలిజం/రిలీజియస్ లిబరలిజం అంటారు. అమెరికన్ రాజ్యాంగంలో సెక్యులరిజం వివరణ గల విభాగాన్ని Establishment clause, Free Exercise clause అంటారు. ఈ విభాగంలో మతంపై ఎటువంటి నిషేధం లేదు. అందులో ఏ మతం లేదా మతపరమైన ఆచారంలోనైనా ప్రభుత్వం సహకరించడాన్ని నిషేధించబడలేదు.

దీన్ని అకామడేషనిజం అని అంటారు. యూరోపియన్ సెక్యులరిజం (Saving State from Religion) ప్రభుత్వాన్ని మతం నుండి పరిరక్షించడమయితే అమెరికన్ సెక్యులరిజంలో (Saving Religion from State) మతాన్ని రాజ్యం నుండి పరిరక్షించే అర్థాలు ఉన్నాయి. అమెరికా రాజ్యాంగ నిపుణులు దీనిద్వారా మూడు సూత్రాలను అన్వయిస్తారు.

1. మతం విషయంలో ఎవరిపై ఎటువంటి బలాత్కారం ఉండకూడదు.

2. ఎవరినీ వారి అభీష్టానికి వ్యతిరేకంగా ఏదైనా మతాచారం పాటించేందుకు లేక మత సహకారానికై బలవంతపెట్టకూడదు.

3. అన్ని మతాలకూ సమ స్వేచ్ఛా గౌరవ మర్యాదలు లభిస్తాయి. ఈ విషయం కొంతమందికి ఆశ్చర్యం కలిగించవచ్చు.

అందుకనే దాని వివరణ కొరకు బ్రిటన్ అమెరికా రాజ్యాంగ నియమాల కొన్ని ఉదాహరణలు ఇస్తాను.

బ్రిటన్‌లో సార్వభౌమాధికారం వివరణ కొరకు ఉపయోగించే సాంకేతిక పదం ఈ విధంగా ఉంటుంది. Queen in Parliament under God (పార్ల మెంటులో దేవునికి లోబడి రాణి) అంటే సార్వభౌమాధికారాలు దైవానివే అని అంగీకరించడం జరిగిందిక్కడ.

బ్రిటన్ కిరీటం ధరించడానికి ప్రొటెస్టెంట్ క్రైస్తవుడై ఉండటం అవశ్యమని రాజ్యాంగపరంగా ఖరారై ఉంది.

ఇంగ్లాండ్ రాజ్యాంగంలో రాయబడిన విషయం.

"...It had been found by experience that it is consistent with the safety and welfare of the protestant kingdom to be governed by a papist prince"

ఈ ప్రొటెస్టెంట్ రాజ్యాన్ని క్యాథలిక్ రాజు పరిపాలించడం రాజ్య సంక్షేమానికి రాజ్యశ్రేయస్సుకు విరుద్ధమనే విషయం అనుభవాల ద్వారా నిరూపితమైంది.

4 నెలల క్రితం వరకు బ్రిటన్ యువరాజు యువరాణి ఎవరైనా సరే ప్రొటెస్టెంట్ కావాలనేది తప్పనిసరిగా ఉండేది.

రాజు లేక రాణిని ఆర్చ్‌బిషప్ ఆఫ్ కేంట్‌బరీ అయిన ఇంగ్లాండ్ చర్చి అధికారులే ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ సందర్భంగా వారు అడిగే ప్రశ్నలు ఇలా ఉంటాయి.

దేవుని చట్టాలు పవిత్ర సువార్త బోధనలను స్థాపించడానికి మీరు మీ వంతు కృషి చేస్తారా? చట్టం ద్వారా సాధ్యమైనంత మేర ప్రొటెస్టెంట్ క్రైస్తవాన్ని స్థాపించే కృషి చేస్తారా?

దానికి జవాబుగా రాణి లేక రాజు బైబిల్ పై చెయ్యిపెట్టి అవునని సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రమాణ స్వీకారం చేసే ఈ విధానం, పదజాలం బ్రిటిష్ రాణికి సంబంధించిన వెబ్‌సైట్‌లో వివరంగా పొందుపరచబడి ఉంది.

బ్రిటన్ పార్లమెంట్‌లో రెండు సభలున్నాయనేది మనందరికీ తెలిసిన విషయమే. House of Lords -House of Commons.

House of commonsలో మన లోక్‌సభ మాదిరిగా ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులుంటారు. బ్రిటన్ పార్లమెంటు ఎగువసభ House of lords మాత్రం మన రాజ్యసభకు భిన్నంగా ఉంటుంది. మన దేశంలో రెండు సభలు సమానమే. కాని బ్రిటన్‌లో హౌస్ ఆఫ్ లార్డ్సది పైచేయి. House of commons పర్యవేక్షణ దాని బాధ్యత. House of commons లో రెండు రకాల సభ్యులు ఉన్నారు. Lords temporal సాధారణ సభ్యులు కాగా lords spiritual చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన 44 మంది బిషప్పుల్లో 26 మంది సభ్యులుగా ఉంటారు. ఆ బిషప్పుల్లో వారి హోదా ప్రాతిపదికన ఎటువంటి ఎన్నిక లేకుండానే House of lords సభ్యులుగా నామినేట్ అవుతారు. వారు చట్టంపై చర్చి దృక్పథాన్ని ప్రభావిత పరుస్తారు.

మరో విషయమేమంటే అమెరికా రాజ్యాంగంలో దైవప్రస్తావన ఉంది. రాజ్యాంగంలోని 7వ అధికరణలో "We sign in the year of our lord" అనే ప్రస్తావన ఉంది.

మేము మా ప్రభువు సంవత్సరంలో సంతకం చేస్తున్నాము.

అమెరికాలోని 50 రాష్ట్రాలలో ఉన్న అన్ని రాజ్యాంగాలలోనూ దైవ ప్రస్తావన దైవ మార్గదర్శకాల ప్రస్తావన ఉంది. హువాయి రాష్ట్ర రాజ్యాంగ పీఠికలో అక్కడి ప్రజలు దైవమార్గదర్శకత్వానికి కృతజ్ఞులై ఉన్నారనే విషయం ఉంది.

అలబామా రాజ్యాంగ పీఠికలో ఈ విధంగా రాయబడింది.

“మేము అలబామా ప్రజలం న్యాయ సంస్థాపన, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, సంక్షేమం శ్రేయస్సు లాంటి అమూల్యమైన వరప్రసాదితాలపై కృతజ్ఞులై ఉంటూ సర్వశక్తిమంతుడైన దేవుని దయాదాక్షిణ్యాలు ఆయన మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకొని, ఈ రాజ్యాంగాన్ని ఈ పరిపాలనా విధానాన్ని అలబామా రాష్ట్రంలో స్థాపించగోరాము”.

మెసాచూసెట్స్ రాజ్యాంగ పీఠికలో ఈ విధంగా ఉంది.

“శాంతియుత విధానం ద్వారా దైవం ఓ కొత్త రాజ్యాంగాన్ని రూపొందించే అవకాశం కల్పించినందుకు, ఆ విషయంలో మమ్మల్ని మార్గనిర్దేశనం చేసినందుకు పూర్తి కృతజ్ఞతా భావంతో విశ్వప్రభువు కీర్తిని చాటుతున్నాము”.

ఆ రాజ్యాంగంలోని రెండవ నిబంధనలో ఈ విధంగా ఉంది.

సందర్భానుసారం సామాజిక స్థాయిలో సర్వసృష్టికర్త అయిన దైవాన్ని ఆరాధించడం ఈ సమాజంలోని ప్రతి వ్యక్తి హక్కు బాధ్యత కూడాను.

అర్కన్సాస్ రాజ్యాంగంలోని 19వ అధికరణలో ఈ విధంగా ఉంది:

“దైవాన్ని తిరస్కరించే ఏ వ్యక్తి కూడా ఈ రాష్ట్ర సివిల్ డిపార్ట్మెంట్లో ఎలాంటి హోదాను పొందలేడు, ఏ న్యాయస్థానంలోనూ సాక్ష్యమిచ్చే అర్హత కూడా పొందలేడు”.

ఉత్తర కరోలినా రాజ్యాంగం సార్వభౌముడైన దైవాన్ని అంగీకరించే విధంగా మొదలవుతుంది.

‘మేము ఉత్తర కరోలినా ప్రజలం ప్రపంచ దేశాలపై సార్వభౌమాధికారం కలిగిన సర్వసృష్టికర్తకు కృతజ్ఞులై ఉన్నాము. ఆయన అమెరికన్ యూనియన్ని పరిరక్షించాడు. మాకు పౌరస్వేచ్ఛను, రాజకీయ స్వేచ్ఛను, మతస్వేచ్ఛలను సైతం ప్రసాదించాడు. ఆ దైవ వరప్రసాదితాలపై మేము దైవానికి రుణపడి ఉన్నాం, మా శక్తి సామర్థ్యాల మేరకు ఆయన ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పూర్తి పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం, రాష్ట్రంలో సుపరిపాలన కొరకు ఈ రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ దీన్ని అమలు పరుస్తామని ప్రమాణం చేస్తున్నాము.

దైవాన్ని తిరస్కరించే వ్యక్తులు ఈ ప్రభుత్వంలో ఎటువంటి హోదాను పొందలేరు.

ఇవి ఒకప్పటి విషయాలు. ఇప్పుడు వాటికి కాలం చెల్లిందనుకుంటే పొరబడినట్లే. అమెరికా ప్రజలు సుప్రీంకోర్టులో సైతం ఈ విషయాలను సవాల్ చేశారు. వాటిపై చర్చలు జరిగాయి. రాజ్యాంగంలోని ఈ అంశాలు సెక్యులర్ భావజాలానికి విరుద్ధంగా ఉన్నాయనే చర్చలను లేవనెత్తారు. సుదీర్ఘ చర్చల తరువాత కూడా వాటిని లౌకిక వాదానికి విరుద్ధంగా భావించలేదు. ఈ విధంగా అమెరికన్ సెక్యులరిజంలో సెక్యులరిజం విధివిధానాలు దేశ రాజ్యాంగంలోనూ దైవప్రస్తావనలోనూ ఎలాంటి  అవరోధంగా మారలేదు. ప్రభుత్వాధినేత ఏ మతావలంబీకుడయినప్పటికీ, దైవ విధేయతకు లోబడి పరిపాలించడంలోనూ, ప్రమాణ స్వీకారం చేయడంలోనూ, ప్రభుత్వాధినేతలు మత బోధనల అమలుకై కృషి చేయడంలోనూ ఎటువంటి అడ్డంకిగా మారలేదు.

మరి అలాంటప్పుడు సెక్యులరిజం అంటే ఏమిటీ? వారి దృష్టిలో సెక్యులరిజమంటే మతప్రాతిపదికన ఎటువంటి వివక్షా వ్యత్యాసాలు ఆశ్రిత పక్షపాత వైఖరులు లేకుండా ఉండటమే. ఎవరినీ ఏ మతావలంబన కొరకూ బలవంతపెట్టకుండా ఉండడమే.

## సెక్యులరిజం: భారతదేశం

ఇక మన భారతదేశ విషయానికొస్తే భారతదేశం విభిన్న మతాలు జాతులు భాషలు సంస్కృతుల నిలయం కాబట్టి యూరోప్‌తో పోల్చుకుంటే అమెరికన్ సెక్యులరిజం ఇండియన్ సెక్యులరిజంలో భావసారూప్యత కనపడుతుంది. ఈ దేశం దాదాపు రెండు శతాబ్దాల పాటు బ్రిటిష్ వారి పాలనలో ఉన్నందు వల్ల సహజంగానే అక్కడి సాంస్కృతిక రాజకీయ సంప్రదాయాల ప్రభావం విపరీతంగా పడింది. అంతేకాక ఈ దేశ చారిత్రక సామాజిక సాంస్కృతిక విశిష్టత నేపథ్యం కారణంగా ఇక్కడ సెక్యులరిజం భావజాలం బ్రిటిష్ భావజాలానికి చాలా దగ్గరగా ఉంది.

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ క్రోడీకరణ సమయంలో ఈ సమస్యపై చాలా లోతైన చర్చలు జరిగాయి. రాజ్యాంగ నిర్మాణసభలో  ఐరోపా దృక్పథానికి అనుగుణంగా రాజ్యాంగ సవరణ చేయాలని ప్రొఫెసర్ కే.టీ.షా ప్రతిపాదించారు. భారత రాజ్యం ఏ మతానికి ఎటువంటి సహకారం అందించకూడదని, ఈ విషయానికి భారత రాజ్యం కట్టుబడి ఉండాలనేది ఆయన

ప్రతిపాదన. ఈ ప్రతిపాదనపై జరిగిన చర్చలను రాజ్యాంగ సభలో జరిగిన చర్చలలో చూడవచ్చు. హిందూ ముస్లిం వర్గాలకు చెందిన సభ్యులందరూ దీన్ని వ్యతిరేకించారు. చివరికి ఈ ప్రతిపాదన ఆమోదింపబడలేదు. యూరోపియన్ సెక్యులరిజానికి ఇండియన్ సెక్యులరిజానికి చాలా వ్యత్యాస ముందని ఇక్కడి సెక్యులరిజం భావజాలంలో కేవలం నిష్పక్షపాత వైఖరి మాత్రమే గోచరిస్తుందని డాక్టర్ రాధాకృష్ణన్ స్పష్టంగా వివరించారు.

"భారతదేశాన్ని సెక్యులర్ దేశమంటున్నామంటే దానర్థం దైవాన్ని నమ్మకపోవడం, మానవ జీవితంలో మత ప్రాధాన్యతను అంగీకరించకపోవడం, నాస్తికతకు పట్టం కట్టడం ఎంతమాత్రం కాదు. సెక్యులరిజమంటే మతం పోషించే పాత్ర విషయంలో సానుకూలంగా స్పందిస్తూ, దైవిక అధికారాలకు మడుగులొత్తాలని కూడా ఎంతమాత్రం కాదు. ప్రభుత్వం ఏ మతానికి కూడా ప్రాధాన్యత ఇవ్వకూడదనేదే అసలు ఉద్దేశ్యం".

భారత రాజ్యాంగంలోని మూడు నిబంధనలు సెక్యులరిజం నిర్వచనాన్ని సూచిస్తున్నాయి. సుప్రీంకోర్టు కూడా ఆ నిబంధనల ప్రాతిపదికనే లౌకికవాదాన్ని వివరించింది. 51వ నిబంధన ప్రకారం జాతి కుల మతాలు జన్మస్థలం లింగభేదం ప్రాతిపదికన వ్యత్యాసం నిషేధం. 52వ నిబంధన, భావప్రకటనా స్వేచ్ఛ మతాన్ని అవలంబించే, దాన్ని ఆచరించే, ప్రచారం చేసే స్వేచ్ఛ. 62వ నిబంధన మతపర మైన వ్యవహారాల నిర్వహణా స్వేచ్ఛ.

మొత్తానికి ఈ మూడు నిబంధనలలోను భారత రాజ్యాంగంలోనూ ఎక్కడ కూడా మత వ్యతిరేకత కనపడదు. యూరప్‌లో ఉన్న సాంప్రదాయిక సెక్యులరిజం సూచనలు అసలే ఉండవు.

సుప్రీంకోర్టు అనేక కేసుల్లో దీన్ని వివరించే ప్రయత్నం చేసింది.

ఉదాహరణకు ఎస్.ఆర్.బొమ్మై భారత ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో వేసిన కేసులో సెక్యులరిజం అర్థాన్ని వివరిస్తూ ఈ విధంగా అన్నారు.

"మత సహిష్ణుతా భావం, అన్ని మతవర్గాల పట్ల సమ భావన, వారి ధన మాన ప్రాణాలు ప్రార్ధనా స్థలాల పరిరక్షణ మన రాజ్యాంగంలో పొందు పరచబడిన లౌకికవాద ప్రధాన కర్తవ్యాలు. ఈ దేశ పౌరులకు తమకు ఇష్టమైన మతాన్ని, విశ్వాసాలను స్వీకరించే, వాటిని ఆచరించే తద్వారా వాటి వ్యాప్తికి

కృషి చేసే స్వేచ్ఛ ఉంది. ప్రభుత్వానికి ఏ పౌరుని మత విశ్వాసాలతో ఎటువంటి పని లేదు. పౌరులందరూ సమానులే. అందరికీ సమాన హక్కులు లభిస్తాయి”.

అదేకాక మరెన్నో సందర్భాల్లో సుప్రీంకోర్టు సెక్యులరిజం అర్థాన్ని వివరించింది. ఆయా కేసుల తీర్పులలో కొన్ని విషయాలలో వైరుధ్యాలున్నప్పటికీ తీర్పులన్నిటిలో సూచించిన విషయం సెక్యులరిజమంటే మతాన్ని సమాజంతో వేరుచేయడం కాదు పరమత సహనం, సహిష్ణుతా భావమే.

చర్చ సారాంశం ఏమంటే నేటి ఆధునిక ప్రపంచంలో సెక్యులరిజం విభిన్న అర్థాలలో చెప్పబడుతుంది. ఐరోపా సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో ఆవిర్భవించిన భావజాలానికి కాలం చెల్లింది. ఇంగ్లీషు మాట్లాడే ప్రపంచంలో సెక్యులరిజం అంటే మతపరమైన అనుబంధాన్ని అంగీకరించడమేకాక ప్రభుత్వం ఏదైనా మతాన్ని అధికారిక మతంగా అంగీకరించే విధంగా వెసులుబాటు ఉంది. అన్ని మతావలంబీకులతో సమంగా వ్యవహరించాలని, పూర్తి మత స్వేచ్ఛ లభించాలనేదే ఇండియన్ సెక్యులరిజంలో దాగి ఉన్న అర్థం.

## లౌకిక రాజ్యంతో ఇస్లామీయ ఉద్యమ సంబంధం

అయితే మరి ఇస్లామీయ ఉద్యమం లౌకికవాదాన్ని సమర్థించవచ్చా లేదా అనేదే ఇక్కడ ఉత్పన్నమయ్యే అసలు ప్రశ్న. జమాఅతే ఇస్లామీ హింద్ ఓ తీర్మానంలో సెక్యులరిజం గురించి తన వైఖరిని చాలా స్పష్టంగా వివరించింది.

“భారతదేశ సెక్యులర్ రాజ్యాంగం ప్రకారం ప్రతి వ్యక్తికి తన అభీష్టానికి అనుగుణంగా ఏ మతాన్నయినా అంగీకరించే, దాన్ని ఆచరించే తమ మతాన్ని ప్రచారం చేసే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయి. భారత రాజ్యాంగ విశిష్టతలే భారతదేశంలో ఇస్లాం సందేశానికి మార్గాలు సుగమం చేస్తున్నాయి. సృష్టికర్తను విస్మరించి, తమ సృష్టికర్త పంపిన మార్గదర్శకత్వాన్ని గ్రహించలేని అధిక జనాభా గల దేశంలోఈ విశిష్టతా విధానాలే సరైనవి సమంజసమైనవి. ఈ కారణంగానే ప్రస్తుత పరిస్థితుల్లో జమాఅతె ఇస్లామీ హింద్ నిరంకుశ ఫాసిస్టు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లౌకికవాద ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కొనసాగాలని కాంక్షిస్తుంది. దేశపౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధం కల్పించే, తమ ఇష్టపూర్వక మతాన్ని ఆచరించే, దానికనుగుణంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పులకు కృషి చేసే విషయంలో భావప్రకటనా స్వేచ్ఛను హరించి వేసే ప్రస్తుత ప్రభుత్వ విధానాలను జమాఅత్ తీవ్రంగా ఖండిస్తుంది”.

భారతదేశంలో అమలులో ఉన్న సెక్యులరిజం భావజాలంలో పరిమిత మైన ప్రతికూలమైన భావన ఉందనే విషయాన్ని స్పష్టం చేయడం కూడా ఇక్కడ అత్యంతావశ్యకం. ఇది మతాన్ని సామూహిక జీవనం నుండి వేరు చేయడమే కాక విద్యావ్యవస్థ ఇతర ప్రసార ప్రచార మార్గాల ద్వారా ప్రభావితపరుస్తూ తమ అభిప్రాయాలు ఆచరణాత్మక వ్యవహారాలో పౌరులకు మతబోధనల నుండి దూరంగా ఉండేటట్లు చేయాలని కోరుకుంటుంది. మరింత ముందుకు వెళితే రష్యా ఇతర కమ్యూనిస్టు దేశాల్లో సెక్యులరిజం తీవ్రవాద భావజాలాన్ని ఉపయోగించి, నాస్తికత్వ అర్థాలను తొడిగి మతానికి వ్యతిరేకంగా ప్రాపగాండా చేసి మానవ జీవితం నుండి మతభావాలను ఏరివేయడమే ప్రభుత్వ పాలసీల ప్రధాన కర్తవ్యంగా మారింది. మనిషి వ్యక్తిగత సామూహిక జీవితంలో దైవ మార్గదర్శకత్వాలను విస్మరించడం ఇస్లాం స్ఫూర్తికి విరుద్ధమేకాక దేశవాసుల ఆధ్యాత్మిక నైతిక విలువలకు కూడా విరుద్ధమైన విషయమే. కనుక భారతదేశ ఆధ్యాత్మిక భావాలు నైతిక విలువలకు తూట్లు పొడిచే విధంగా ప్రభుత్వ విధానాలపై ప్రభావం వేసే సెక్యులర్ విధానాలను జమాఅతే ఇస్లామీ హింద్ ఖండిస్తోంది.

ఇక జమాఅత్ ధ్యేయం లక్ష్యాల విషయానికొస్తే ఇస్లామీయ ఉద్యమ లక్ష్యం ఇఖామతే దీన్- ధర్మసంస్థాపన. రాజకీయ రంగంతోపాటు జీవితపు రంగాలన్నిటిలో దైవమార్గదర్శకాలను దైవధర్మాన్ని స్థాపించడం కూడా ఇందులో ఇమిడి ఉంది. కనుక భారతదేశంలో ఈ లక్ష్యం దశల వారీగా ఇక్కడి ప్రజాభిప్రాయాన్ని మలచిన తర్వాతనే సాధ్యమవుతుంది. దాని కొరకు క్రమక్రమంగా ముందుకు సాగుతూ దశలవారీగానే మనం పురోగతిని సాధించగలం.

మౌలానా మౌదూది చాలా స్పష్టంగా రాశారు:

‘‘మేము మా ఉద్యమాన్ని ఊహాజగతిలో కాదు వాస్తవ జగతిలో నడుపుతున్నాము. మా లక్ష్యం కేవలం సత్యప్రకటన మాత్రమే అయితే సత్యధర్మ స్పష్టీకరణతోనే సరిపోయేది. కానీ మనం ఇక్కడ సత్యధర్మాన్ని స్థాపించే ప్రయత్నాలు చేయాల్సి ఉంది. ఆ సత్య ధర్మస్థాపనకు ఈ వాస్తవ ప్రపంచంలో నుండే మార్గాలను సుగమం చేసుకోవాల్సిన అవసరం ఉంది. కనుక మన ఆలోచనా విధానం- కార్యాచరణల మధ్య సమతుల్యతను కొనసాగిస్తూ

నడవాల్సిన అవసరం ఉంది. మన చిరకాల గమ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటూనే ప్రపంచ ప్రజలను దానివైపునకు పిలుస్తూ ఆకర్షితపరుస్తూనే, మన ఆచరణాత్మక వ్యూహాల ద్వారా లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలి. వాస్తవ ప్రపంచంలో మనకు ఎదురయ్యే పరిస్థితులను లక్ష్యసాధనలో ఉపయుక్త మయ్యే విధంగా అవరోధాలను అధిగమించే విధంగా ఉపయోగించుకోవాలి. దీనికొరకు మనం మన చిరకాల గమ్యంలో కొన్ని సాపేక్షిక తాత్కాలిక లక్ష్యాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఒక్కొక్కటిని సాధిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది".

ఈ విధంగా ఇస్లాం ఆశయ సాధనలో క్రమక్రమంగా పురోగతి సాధించడమే ఉద్యమ ఆచరణాత్మక వ్యూహం అయి ఉండాలి. ఇస్లామీయ లక్ష్యాలకు సమీపింపజేసే ప్రతి ఉప లక్ష్యం ఇస్లామీయ లక్ష్యంగానే పేర్కొన బడుతుంది.

అల్లామా ఇబ్నె ఖయ్యిం ఇదే విషయాన్ని ఇస్లామీయ రాజకీయ లక్ష్యంగా వర్ణిస్తూ ఇస్లామీయ రాజకీయ నిర్వచనాన్ని ఈ విధంగా తెలిపారు–

ఏ విధానాల ద్వారా అయితే ప్రజలు చెడునుండి దూరంగా వుంటూ, మంచికి దగ్గరవుతారో అదే ఇస్లామీయ రాజకీయం.

ఇస్లాం ప్రతి విషయంలో మార్గదర్శనం చేసే ఒక ఆచరణాత్మక ధర్మం. ఇస్లామీయ విశ్వాసాలను విశ్వసించని అత్యధిక జనాభా గల భారతదేశంలో ఇస్లామీయ రాజకీయ ప్రాధాన్యతలు ఏమై ఉంటాయనేది సహజంగానే ఉత్ప న్నమయ్యే ప్రశ్న.

ధర్మ సంస్థాపనా మార్గాన్ని ఆయుధాలు నిర్బంధాలు రహస్య కదలికలు గూఢచార ఉద్యమాల ద్వారా చేరుకోలేం. ఇక్కడి ప్రజాభిప్రాయాన్ని మలచడం ద్వారానే ఈ లక్ష్యం సాధ్యమవుతుందనే విషయాన్ని ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు అందరూ తెలుసుకోవాలి. అంటే నిర్బంధాలు బలవంతాలకు అతీతంగా వారు తమ అభీష్టానికనుగుణంగానే ఇస్లామీయ జీవన విధానాన్ని అవలంబించే విధంగా ఇక్కడి ప్రజా బాహుళ్యం వరకు ఇస్లాం ధర్మసత్యసంధతను చేరవేయాల్సిన అవసరం ఉంది.

ఇది సుదీర్ఘకాల లక్ష్యమనే విషయంలో ఎటువంటి సందేహంలేదు. మరి అది సాధ్యం అయ్యేంతవరకు ఏం చేయాలి?

మౌలానా మౌదూది గారి ప్రకారం తాత్కాలిక లక్ష్యం ఏమై ఉండాలి?

కాల గమనంలో ప్రభుత్వాలు ఇస్లామ్, ముస్లింల పట్ల వివక్ష చూపకుండా ఇస్లామీయ బోధనలను ప్రచారం చేసే వాటిని వ్యాపింపజేసే పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలని కాంక్షించడం తప్ప మరొక లక్ష్యం ఏముంటుంది?

ఇస్లామీయ పండితుల భాషలో దారుల్ ఇస్లామ్ లేకపోయినా కనీసం దారుల్ అమన్ అయినా ఉండాలని కాంక్షించడం తప్ప మరో మార్గం ఏముంటుంది.

సెక్యులరిజానికి సంబంధించిన ఈ భావజాలానికే ఇస్లామీయ ఉద్యమాలు నిరంకుశ వ్యవస్థలపై ప్రాధాన్యతనిస్తుంటాయి. సెక్యులరిజానికి ప్రాధాన్యతనివ్వడమంటే లౌకికవాదాన్ని సమర్థిస్తున్నామని కాదు. ప్రభుత్వం ఏ మతం పట్ల వివక్ష చూపదనే, ఏ మతావలంబీకుల భావప్రకటనా స్వేచ్ఛను హరించదనే విశ్వాసాన్ని వ్యక్తీకరిస్తున్నామని మాత్రమే అర్థం.

ఇది సెక్యులరిజం రాజకీయ దృక్కోణం మాత్రమే. వాస్తవానికి సెక్యులరిజం రాజకీయ రంగంకన్నా విద్యా సామాజిక సాంకేతిక సాంస్కృతిక రంగాలలో ప్రభావవంతంగా సఫలీకృతమైంది. ఫలితంగా నేటి ఆధునిక మానవునిలో మతం పట్ల ఏవగింపు భావనలు నెలకొన్నాయి దైవబోధనల ఆవశ్యకత ఎంత మాత్రం కానరావడం లేదు. లౌకికవాదం మనిషిలో దైవాన్ని తిరస్కరించే తత్వాన్ని ఏర్పరచడమేకాక అగోచర వాస్తవాలకు అతీతంగా సామాజిక సమస్యలపై స్పందించే తీరును అలవర్చింది. ఇది ఇస్లామీయ ఉద్యమాల ముందున్న అతి పెద్ద సవాలు. దైవిక మార్గదర్శకత్వాల ఆధారంగా ఒక శక్తివంతమైన వాదనను లేవనెత్తి తద్వారా దైవాన్ని విస్మరించడం మాని ఆధునిక మనిషిలో జీవితపు రంగాలన్నిటిలో దైవిక ఆదేశాలను పాటించే స్పృహ మేల్కొనేవిధంగా చైతన్యపరచాల్సిన అవసరం కూడా మనపైనే ఉంది.

*(ఫిబ్రవరి 2012లో తమిళనాడు జమాఅత్ సభ్యుల సమావేశంలో చేసిన ప్రసంగం)*

## ఆధార గ్రంథాలు


1) Secularism A Confession of Belief : జార్జ్ హాలియోక్
2) The Oxford Hand book of Secularism
3) కేంద్ర సలహామండలి తీర్మానాలు (1961– 1997)
4) రసాయల్ వ మసాయల్ (నాల్గవ భాగం)

# నేషనలిజం- ఇస్లాం- ఇస్లామీయ ఉద్యమం

జాతీయతా భావన ప్రపంచవ్యాప్తంగా మరోసారి చర్చనీయాంశం అయింది. యూరప్ అమెరికాలలో మితవాద పార్టీలు జాతివాద ధోరణులను ఉసిగొల్పడంతో మనదేశంలో కూడా నిరంకుశ రాజకీయ పార్టీలు జాతివాద నినాదాలను మరోసారి లేవనెత్తాయి. ఈ తరుణంలో జాతివాదం, జాతీయ రాజ్య భావనలపై ఇస్లాం ముస్లిం మేధావుల దృక్పథం ఏమిటనే ప్రశ్నలు ప్రతీచోట చర్చనీయాంశమవుతున్నాయి.

## జాతివాద భావనల చారిత్రక నేపథ్యం

జాతీయత లేక జాతివాద భావజాలం ఇతర ఆధునిక భావజాలాల మాదిరిగానే యూరప్ సాంస్కృతిక పునరుజ్జీవనం ఫలితంగా ఆవిర్భవించిన ఆలోచనా ధోరణి. యూరప్‌లో పారిశ్రామిక విప్లవం వెల్లువలా విస్తరించిన నేపథ్యంలో చర్చి, సైన్స్ ఆధునిక తాత్విక విధానాల మధ్య తలెత్తిన సంఘర్షణల కారణంగా ఆధునికీకరణ భావజాలాలు పురుడు పోసుకున్నాయి. పారిశ్రామిక విప్లవం ప్రాచీన సముదాయాలు, తెగల అనుబంధాలను బలహీన పరిచింది. గ్రామీణ వ్యవసాయానికి బదులుగా సరికొత్త పారిశ్రామిక సమాజాలు నెలకొనడంతో జాతులు తెగల మధ్య సాంప్రదాయిక అనుబంధాలకు చోటులేకుండా పోయింది. ఆ సమయంలో నెపోలియన్ బోనాపార్టే జర్మనీపై దాడి చేసి జర్మన్‌లను తీవ్రంగా అవమానపరిచాడు. ఓ వైపు లౌకిక హేతువాద భావజాలాలు పురోగతి చెందడం, చర్చి మత సంస్థ బలహీనపడడం, క్రైస్తవ మతం ఏకీకృత శక్తిగా మారలేకపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో

ఆధునిక మనిషిని సమాజంతో అనుసంధానం చేసేందుకు బలమైన సాధనాల అవసరం ఏర్పడింది. ఆ పరిస్థితులే ఆధునిక జాతివాద భావనలను జన్మనిచ్చాయి.

మనం జాతి లేదా జాతీయత పదాలు చెప్పినప్పుడు దానికి మూడు వేర్వేరు అర్థాలు వస్తాయి. 1. ఏదేని రాజ్యం లేక రాజ్యసభ్యుడిగా ఉండటం, ఉదాహరణకు అమెరికా జాతి 2. ఏదేని భాష తెగ లేక సాంస్కృతిక సంపదకు వారసులుగా ఉండడం. పలు దేశాల్లో వ్యాపించి ఉన్న కుర్దు జాతీయుల మాదిరిగా 3. జాతీయవాదం, అంటే జాతిని అధికంగా భావించడం.

ఆధునిక జాతీయతా భావజాలం ఈ మూడు అర్థాలను ఒకేచోట సమీకరించే ప్రయత్నం చేసింది. కనుక జాతీయతా భావజాలం ఆధునిక రాజ్యం, సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్యం, లౌకికవాద భావనలతో ముడిపడి ఉంది. ఈ భావజాలాలన్నీ కలగలిసి ఆధునిక రాజకీయ భావజాలాలుగా రూపాంతరం చెందాయి. ఈ ఆలోచనాసరళిని క్రింద పేర్కొనబడిన కొన్ని విషయాల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

◆ ప్రకృతిపరంగా వ్యక్తులను సామూహికంగా సంఘటితపరిచేది వారి దేశం లేక జాతి మాత్రమే. ప్రతి జాతికి చెందిన వ్యక్తులు పరస్పరం దగ్గరగా వుంటారు. కనుక వారందరూ కలిసి ఒక రాజ్యాన్ని స్థాపించాలి. ప్రతీ దేశానికి ఒక స్వతంత్ర రాజకీయ ఉనికి ఉంటుంది. తన సామూహిక వ్యవహారాలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించే హక్కు కూడా దానికి ఉంటుంది. అంటే ఆ దేశ ప్రజలు స్వతంత్రులు, వారి వ్యవహారాలలో ఇతరులకు జోక్యం చేసుకునే ఎలాంటి హక్కూ లేదు.

◆ ప్రతి దేశం తన వ్యవహారాల నిర్వహణకై స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పు తుంది. ఆ దేశ ప్రజల అభిప్రాయాల ద్వారానే ప్రజాస్వామ్య ప్రాతిపదికన ఆ ప్రభుత్వం నడవాల్సి ఉంటుంది.

◆ జాతివాదంపై రాసే ఓ ప్రముఖ రచయిత అలెగ్జాండర్ మోటెల్ ఒక ఆధునిక దేశ రూపకల్పన కోసం కొన్ని మౌలికమైన విషయాలు తప్పనిసరి అని పేర్కొన్నాడు.

1. అక్కడ స్వయం సమృద్ధి గల పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థ కావాలి

ఎందుకంటే దేశం తన అవసరాల కోసం ఇతరులపై ఆధారపడితే తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకోజాలదు. కనుక దేశ ప్రధాన వనరుల విషయంలో బాహ్యాశక్తులపై ఆధారపడకుండా ఉండటం అత్యవసరం.

2. శక్తివంతమైన కేంద్ర అధికారంతోపాటు సంఘటితత్వం.

3. ఒక ఉమ్మడి భాష అవసరం.

కనుక ఈ పునాదులపైనే యూరప్‌లోని వివిధ దేశాలు ఉనికిలో కొచ్చాయి. వారు స్వయం సమృద్ధికై ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, మూడవ ప్రపంచ పేద దేశాలను బానిసలుగా చేసి వారి సంపదను స్వాహా చేసే పని ప్రారంభించారు. తదనంతరం వారి పరస్పర ప్రయోజనాలలో సంఘర్షణలు తలెత్తిన కారణంగా జాతివాద భావజాలాలు తీవ్రరూపం దాల్చాయి. అవి సంపూర్ణ జాతివాదం (Integral Nationalism) ఫాసిజం పేరుతో ప్రసిద్ధి చెందాయి.

**పరిపూర్ణ జాతివాద లక్షణాలు**

క్రింద పేర్కొనబడిన సైద్ధాంతిక తాత్విక లక్షణాల ద్వారా పరిపూర్ణ జాతివాదాన్ని అర్థం చేసుకోవచ్చు.

1. అందులో వ్యక్తి కంటే దేశానికి మితిమీరిన ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. జాతి భద్రతా ప్రయోజనాలు జాత్యాహంకారం మొదలైన అంశాలు జాతీయతకు అత్యంత ప్రియప్రదమైనవి. తరచూ జాతి ప్రయోజనాల కోసం వ్యక్తిగత ప్రయోజనాలను (వ్యక్తిగత స్వేచ్ఛ, మానవ హక్కులు) ఫణంగాపెట్టడం జరుగుతుంది. అందుకనే ఈ తరహా దేశభక్తి, జాతీయతా భావనలు (Anti Indualistic) వ్యక్తిస్వేచ్ఛకు శత్రువుగా పరిగణించబడ్డాయి.

2. ప్రభుత్వాన్ని జాతి ప్రయోజనాల పరిరక్షణా మార్గంగా భావిస్తారు. కనుక ప్రభుత్వానికి అసాధారణ ప్రాధాన్యతాధికారాలు లభిస్తాయి. ఫలితంగా ప్రజాస్వామ్యస్వేచ్ఛను పరిహసించే నిరంకుశ వ్యవస్థ ఏర్పడుతుంది.

3. ఈ నిరంకుశ వ్యవస్థ మనుగడ కోసం, జాతీయ ప్రయోజనాల ప్రాధాన్యతను ప్రోత్సహించేందుకై మితిమీరిన ఆధిపత్య భావజాలాన్ని సృష్టించడం జరుగుతుంది. తమ దేశం ప్రపంచంలోనే అత్యున్నత దేశమనీ, దానికి మొత్తం ప్రపంచాన్ని ఏలే హక్కులున్నాయని నమ్మించే నటనలు జరుగుతాయి.

4. జాతివాదానికి ఎల్లప్పుడూ ఒక శత్రువు అవసరం. అందువల్ల దేశాన్ని ఏకం చేసేందుకు అంతర్గత శక్తులను, బాహ్యశక్తులను వెతికి పట్టుకొని వారిపై తీవ్రమైన విద్వేషాన్ని పెంచి పోషిస్తారు.

5. జాతివాదానికి ముఖ్యమైన ఆయుధం చరిత్ర. ఆ చరిత్రకు సంబంధించి ఏకపక్ష వివరణలతో చరిత్ర వక్రీకరణకు పాల్పడతారు.

6. వాస్తవ చరిత్రతోనో లేక స్వీయ నిర్మిత సువర్ణకాలంతోనో భావోద్వే గానుబంధం కొరకు ప్రాచీన సంప్రదాయాలను పునరుజ్జీవింప జేసేస్తారు. వాటికి చారిత్రక చిహ్నాలతో అనుబంధాన్ని ఏర్పరిచేందుకు ప్రయత్నాలు జరుగుతాయి.

7. జాతీయ చిహ్నాల పవిత్రతా భావాన్ని జనింపజేసి ఒక కొత్త జాతీయ మతాన్ని రూపకల్పన చేయడం జరుగుతుంది. జాతీయ చిహ్నాలకు మత చిహ్నాలకు సమానంగా పవిత్రత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

8. సభ్యతా సంస్కృతులు, భావోద్వేగాల పేరిట ప్రజలలో ఆధిపత్య భావజాలాలను ప్రేరేపించి తద్వారా సామూహిక ఉన్మాదానికీ (Mass Hysteria) దారి తీయడం జరుగుతుంది.

ఆ ప్రాతిపదికనే ఇటలీలో ఫాసిస్టు ఉద్యమం జర్మనీలో నాజీ ఉద్యమం ఆవిర్భవించాయి. ఆ తరువాత యూరప్ దేశాలన్నింటా ఇటువంటి అతివాద జాతీయ ఉద్యమాలు ఆవిర్భవించాయి. ఆ ఆలోచనా స్ఫూర్తితోనే మన దేశంలో ప్రస్తుతం మితవాదుల జాతీయతా ఆలోచనా విధానాలు ఆరంభమయ్యాయి. యూరప్‌లో మొదలైన ఈ ఉద్యమాలు పెద్ద విధ్వంసాన్నే సృష్టించాయి. జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముస్సోలిని నాయకత్వంలో పురుడుపోసుకున్న తీవ్రవాద ఉద్యమాలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించాయి. మొదటి ప్రపంచ యుద్ధం రెండవ ప్రపంచ యుద్ధాలకు కారణమయ్యాయి. ఆయుధాల కారణంగా జరిగిన విధ్వంసాలు ప్రపంచ ప్రజలను తీవ్ర విస్మయానికి గురి చేశాయి. జాతివాదం ప్రపంచానికి వినాశకరమనే భావన ప్రపంచమంతా బలపడింది. అందుకనే ఫాసిస్టువాదం జాతివాదాలు ఇప్పుడు ఓ రకమైన బూతులుగా మారిపోయి ప్రపంచమంతా వాటిని అసహ్యించుకునేవిధంగా తయారయ్యాయి.

## జాతివాద అనంతర ఆధునిక భావనలు

ఫాసిజం సృష్టించిన వినాశనంతో జాతివాద భావజాలం పట్ల ప్రపంచ

మంతటా వ్యతిరేకత ఏర్పడింది. జాతివాదభావనలలో వేగంగా మార్పులు సంభవించాయి. అదే సమయంలో యూరప్‌లో ప్రముఖ బ్రిటన్ చరిత్రకారుడు ప్రొఫెసర్ ఆర్నెల్డ్ టోయిన్‌బీ జాతివాదానికి వ్యతిరేకంగా తన స్వరాన్ని లేవనెత్తాడు. ఆయన తన సుప్రసిద్ధ గ్రంథం A Study of Historyలోని 12 సంపుటాల్లో మానవ చరిత్రలో సంస్కృతుల ఉత్థాన పతనాలను కూలంకషంగా విశ్లేషిస్తూ జాతివాదాన్ని ఓ ఘోరమైన దుర్మార్గంగా పేర్కొన్నాడు. అది సంస్కృతులు పతనమవ్వడానికి ప్రధాన మూలమని ప్రకటించాడు. టోయిన్‌బీ దృక్పథాన్ని ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా ఈ విధంగా వివరించింది:

నాయకులు సమస్యలపై సృజనాత్మకతతో స్పందించకపోతే సంస్కృతులలో అలజడులు రేగుతాయి. ఆ తర్వాత జాతివాదులైన నిరంకుశ సైన్యాలు, అలాగే అల్ప సంఖ్యాక ఉన్మాదుల దుర్మార్గాల కారణంగా సాంస్కృతిక నావలు మునిగిపోతాయి. ప్రొఫెసర్ టోయిన్‌బీ తన ప్రసంగంలో ఐరోపా జాతీయులపై వారి జాతివాదంపై తీవ్రమైన విమర్శలు గుప్పించాడు. జాతివాద పోకడలపై The Dwarfing of Europe అంటూ తీవ్రమైన పదజాలాన్ని ప్రయోగించాడు. ఆ పదం తర్వాత చాలా ప్రాచుర్యం పొందింది. ప్రపంచమంతా ఐరోపా నాగరికతను సద్వినియోగపరచుకుంటుంది. మరోవైపు రష్యా లాంటి దేశాలు పాశ్చాత్య విలువలను స్వీకరించి అంతర్జాతీయ శక్తిగా ఎదుగుతున్నాయి. పారిశ్రామి కాభివృద్ధి, ప్రజాస్వామ్య ప్రక్రియలు బలపడుతుంటే ఐరోపా మాత్రం తన నీచమైన నికృష్టమైన దుర్మార్గాల కింద నలిగి పోతుందంటూ యూరప్ సంకుచిత స్వభావంపై మండిపడ్డాడు.

ప్రొఫెసర్ టోయిన్‌బీ తదితర మేధావుల ఆలోచనాధారలు పాశ్చాత్య వాదుల ఆలోచనలపై ప్రబల ప్రభావాన్ని చూపాయి. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్ అతి ప్రధాన పారిశ్రామిక దేశంగా ఎదిగింది. పెరుగుతున్న పారిశ్రామికాభివృద్ధితో మానవ వనరుల అవసరం ఏర్పడింది. ప్రపంచ దేశాల నుండి అమెరికాకు వేగంగా వలసలు ప్రారంభమయ్యాయి. ఫలితంగా అమెరికాలో బహుళ సంస్కృతుల సమాజాలు ఏర్పడ్డాయి. ఆ అభివృద్ధి రేసులో యూరోపియన్ దేశాలు కూడా చురుగ్గా పాల్గొనడం మొదలెట్టాయి. మొట్ట మొదట బ్రిటన్‌లో ఆ తరువాత ఇతర యూరోపియన్ దేశాలలో పెద్ద సంఖ్యలో ఆఫ్రికా దేశాలకు చెందిన నిపుణులు మేధావులు రావడం మొదలెట్టారు.

ఈ విధంగా 20వ శతాబ్దిలో అభివృద్ధి చెందిన దేశాలలో బహుళ జాతులు బహుళ సాంస్కృతిక సమాజాలు ఏర్పడడంతో జాతివాద భావజాలానికి కొత్త ఆర్థిక రంగానికి చేయూతనిచ్చే శక్తిసామర్థ్యాలు లేకపోయాయి. ప్రపంచీకరణ ప్రాధాన్యతలు జాతివాద భావజాలాన్ని ఆచరణ సాధ్యంకాని విధంగా మార్చేశాయి. జాతివాదానికి సంబంధించి అలెగ్జాండర్ మోటెల్ ప్రస్తావించిన మూడు లక్షణాలు అతి తక్కువ దేశాల్లో మిగిలిపోయాయి. ప్రతి దేశంలోని ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యింది. ఏ ఆర్థిక వ్యవస్థలోనూ స్వతహాగా స్వయం సమృద్ధి జరగలేదు. ఒకే జాతి ఒకే భాషలాంటి సంస్కృతులు కూడా కనుమరుగయ్యాయి. అనేక విషయాల్లో ఆర్థిక వ్యవస్థ డిమాండ్లు ప్రపంచీకరణ చెందాయి. ఆ డిమాండ్లను నెరవేర్చేందుకు రాజకీయ శక్తులపై ఒత్తిడి ఏర్పడింది ఈ విధంగా ఆధునిక సమాజంలో జాతివాదం తన ప్రాభవాన్ని కోల్పోయింది.

## పౌర జాతీయతా భావన

ఆధునికత అనంతరం ఏర్పడిన అవసరాలు పౌర జాతీయతా (Civic Nationalism) భావనను నెలకొల్పాయి. ఈ భావన జాన్ స్టువర్ట్‌మిల్, జోసెఫ్ రైనాన్ లాంటి ఆధునిక తత్వవేత్తలు సృష్టించిన భావన. జర్మనీకి చెందిన ఆధునిక సామాజిక శాస్త్రవేత్త జర్గన్ హాబర్మాస్ (జననం 1929) ఈ భావనను స్పష్టంగా వివరించాడు. ఈ సిద్ధాంత ధ్వజవాహకులు జాతీయ గుర్తింపు అవసరాన్ని అంగీకరిస్తారు కానీ అందుకొరకు భాష నాగరికత జాతి లాంటి ఐక్యత అవసరం లేదంటారు. పౌర జాతీయతలో ఒక ప్రజాస్వామ్య దేశ పౌరసత్వాన్ని పంచుకోవడం వ్యక్తులను పరస్పరం కలుపుతోంది. ఈ పౌరసత్వం భాషాభావాలు నాగరికతా సంస్కృతులపై ఆధారపడి ఉండదు. దేశ రాజ్యాంగంలోని కొన్ని నియమాల ద్వారా నిర్ణయించబడుతుంది. అందులో వ్యక్తులకు పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయి. అన్ని సంస్కృతులు భాషలు సంప్రదాయాలు అభివృద్ధి చెందే సమాన అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ కార్యపరిధి, ప్రభుత్వాధికారాలు పరిమితంగా ఉంటాయి. ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారానే ప్రభుత్వం నడుస్తుంది. ఏ జాతికి చెందిన, ఏ దేశానికి చెందిన, ఏ భాషకి చెందిన వ్యక్తులయినా ఆ దేశ పౌరులుగా మారవచ్చు. ఈ విధంగా ఈ పౌరసత్వం దేశాలు భాషలు

జాతులు సంస్కృతులకతీతంగా కొన్ని ఒప్పందాల ద్వారా వ్యక్తులను కలుపుతోంది. దేశ రాజ్యాంగం ఒక ఒప్పంద హోదాను కలిగి ఉంటుంది. ఆ ఒప్పందంలో పాల్గొన్న వ్యక్తులు ఆ జాతిలో భాగమవుతారు.

## భారతదేశంలో జాతీయతా భావన

అనాది నుండి ఎన్నో జాతులు తెగలు భాషల మేళవింపు మన దేశం. భిన్నత్వంలో ఏకత్వం మన దేశ విశిష్ట లక్షణం. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా యూరప్‌లో ఏర్పడిన సాంస్కృతిక వైవిధ్యం మన దేశంలో శతాబ్దుల తరబడి కొనసాగుతోంది. కనుక జాతీయతా వాదం దాని నైతిక సైద్ధాంతిక లోపభూయిష్టమైన కోణాలను మినహాయించి ఆచరణాత్మకంగా ఈ భావజాలం ఈ దేశంలో ఎప్పుడూ అంగీకార యోగ్యం కాలేదు. అలెగ్జాండర్ మోటెల్ వివరించిన షరతులలో ఏ ఒక్క షరతు కూడా ఇక్కడ కానరాదు. ఈ దేశం ఎన్నో జాతులు భాషలు మతాలు తెగలు సంస్కృతులకు ఆలవాలం.

యూరప్ జాతివాద భావజాలంతో ప్రభావితులై ఇక్కడ కూడా కొంతమంది భారతీయ దేశభక్తి కృత్రిమ భావజాలాన్ని సృష్టించే ప్రయత్నాలు చేశారు. ఇంకా సంస్కృతిని ఒక సాధారణ జాతీయ అంశంగా పేర్కొన్నారు. వాస్తవానికి ఈ దేశంలో వివిధ సామాజిక వర్గాల సంస్కృతులలోనూ చారిత్రక వారసత్వంలోనూ గొప్ప వైవిధ్యం ఉంటుంది. కనుక నాగరికతా సంస్కృతుల జాతియతా భావన భారతదేశంలో ఎప్పుడూ అపరిచిత భావనగానే మనగలిగింది తప్ప దేశ సామాజిక వాస్తవాలతో దానికి ఎటువంటి సంబంధం లేదు. నేడు ఆవిర్భవించిన ఆధునిక సమాజంలో కూడా దానికి ఎలాంటి అర్థంలేదు. స్వాతంత్ర్య పోరాట సమయంలో మన దేశంలో నెలకొన్న జాతీయతా భావజాలం కూడా దాదాపు నేడు పేర్కొనబడుతున్న పౌర జాతీయతా భావనకు పోలి ఉంటుంది. గాంధీజీ ఎన్నడూ భాష జాతి నాగరికత సంస్కృతుల ఐక్యతను భారత జాతీయతకు ప్రాతిపదికగా ప్రకటించలేదు. భారతదేశ అసాధారణ విలువలనే ఆయన జాతీయతకు ప్రాతిపదికగా పేర్కొన్నారు. ఇంకా గ్రామీణ భారతాన్ని దేశ జాతీయతకు సంకేతంగా అభివర్ణించేవారు. సాధారణ జీవనశైలి, ఆధ్యాత్మికత, ప్రకృతి పట్ల అనుకూలత, నైతిక విలువలు, స్వరాజ్యం, స్వదేశం, సత్యాగ్రహం మూడు ప్రసిద్ధ సూత్రాలను భారత జాతీయతకు ప్రాతిపదికగా

ప్రకటించేవారు. మానవ ఐక్యత మానవ సమానత్వ భావజాలాలకు విరుద్ధంగా ఉన్న జాతీయతా భావాలను ఎల్లప్పుడూ విమర్శించేవారు. ఆయన సుప్రసిద్ధ సూక్తి ఈ విధంగా ఉంటుంది–

"ఒక వ్యక్తి తన కుటుంబానికై, కుటుంబం తన గ్రామానికై, గ్రామం తన జిల్లాకై, జిల్లా తన ప్రాంతానికై, ప్రాంతం దేశానికై త్యాగం చేయాలని దేశభక్తులు ఏవిధంగా హితవులు చేస్తారో అదే విధంగా అవసరమైతే ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ప్రయోజనాలకై స్వయంగా తనను తాను త్యాగం చేసే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఈ దేశానికి లభించాలి. మానవ జాతి మనుగడకై అవసరమైతే దేశమంతా తన స్వయాన్ని త్యాగం చేసే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఈ దేశానికి లభించాలి. నా జాతీయతా భావంలో వైషమ్యానికి చోటులేదు. ఇదే నా జాతీయతా భావజాలం".

అదేవిధంగా రవీంద్రనాథ్ ఠాగూర్ తాను జాతివాదంపై చేసిన ప్రసంగంలో తన మనోభావాలను ఈ విధంగా వెల్లడించారు:

"భారతదేశంలో ఎప్పుడూ జాతివాదం కానీ దేశభక్తి భావజాలం కానీ ఉత్పన్నమవలేదు. దైవానికి ఇచ్చే భక్తి భావనలకన్నా, మానవత్వానికిచ్చే గౌరవ మర్యాదలకన్నా నీ జాతి భక్తి ఉన్నతమైనదని నాకు చిన్నప్పుడు నేర్పించబడిన పాఠం. అయితే అవన్నీ లోపభూయిష్టమైన బోధనలనీ నాకు ఇప్పుడు తెలిసి వచ్చింది. నా దేశ సోదరులు మానవత్వానికన్నా దేశభక్తి గొప్పదని బోధించే విద్యలతో పోరాడినప్పుడే నిజమైన భారతదేశాన్ని పొందగలరు. నా దేశసేవకై నేను ఎల్లప్పుడూ సిద్ధమే. కానీ ఆరాధన విషయానికొస్తే ఇది నా దేశంకన్నా గొప్పదైనది ఉన్నతమైనది. దేశభక్తిని దైవభక్తి మాదిరిగా మార్చడం వాస్తవానికి దేశాన్ని ముప్పుల్లో పడేయడమే".

## ఇస్లాం - జాతీయతా దృక్పథం

ఇస్లాం మానవుల మధ్య తెగలు జాతులు రంగులు భాషలు దేశాల ప్రాతిపదికన వివక్ష చూపే భావజాలాన్ని పూర్తిగా ఖండిస్తుంది. మానవులందరూ ఒక్కటేనని, మానవులంతా ఒకే స్త్రీ పురుష సంతానమనీ, పరస్పర సహోదరులనేది ఇస్లాం సందేశం.

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి ఒకే స్త్రీ నుండి

సృష్టించాము. తర్వాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ తెగలుగానూ చేశాము వాస్తవానికి అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు".

(అల్ హుజురాత్: 13)

ఈ వచనంలో మానవ ఐక్యతకు సంబంధించిన ఇస్లామీయ నియమం వివరించబడింది. దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు:

ఒక అరబ్బునికి అరబ్బేతరునిపైగానీ, అరబ్బేతరునికి అరబ్బుపైగానీ, నల్లవానికి తెల్లవానిపైగానీ తెల్లవానికి నల్లవానిపైగాని ఎటువంటి ఆధిక్యతా లేదు– కేవలం భయభక్తుల ప్రాతిపదికన తప్ప. (ముస్నద్ అహ్మద్)

ఇస్లాం వ్యక్తి స్వేచ్ఛను విశ్వసిస్తుంది. కాని వ్యక్తి స్వేచ్ఛపై రాజకీయ నిరంకుశ నియంత్రణ ఇస్లాం స్ఫూర్తికి విరుద్ధమని భావిస్తోంది. అందుకనే ఇస్లామ్ పరిపూర్ణ జాతీయవాదాన్ని ఫాసిస్టు భావజాలాలను పూర్తిగా ఖండిస్తుంది.

పైన పేర్కొన్న హుజురాత్ సూరాలోని వచనంలో మానవ సమానత్వ ప్రకటనతోపాటు జాతులు తెగల ఉనికి వారి అవసరాన్ని కూడా అంగీకరించడం జరిగింది. దైవప్రవక్త(స) జాతుల విద్వేష భావజాలాన్ని అంతం చేశారే తప్ప జాతుల ఉనికిని అంతమొందించలేదు. ఇస్లాం ఆగమనం తరువాత తెగలూ జాతులూ ఉన్నాయి. తెగలు జాతుల ఆధారంగానే ప్రజలు గుర్తించబడేవారు అంటే దానర్థం ఏమిటంటే ఏ ప్రాతిపదికన కూడా మానవ విభజనను ఇస్లాం ససేమిరా సహించదు.

కానీ మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మానవుల సామూహిక అవసరాల పరిపూర్తికై ఒకచోట నివసించడం, అందరూ కలిసి సమిష్టి రూపాన్ని అవలంబించడం, దాంతో తమ గుర్తింపును అనుసంధానించడం ఇస్లాం దృష్టిలో ఆక్షేపణీయం ఎంతమాత్రం కాదు.

దేశభక్తి సహజ స్ఫూర్తిని ఇస్లాం ఆదరిస్తోంది. ప్రజలను వారి దేశాన్నుండి బహిష్కరించడానికి ఖుర్ఆన్ దుర్మార్గానికి ప్రతిరూపంగా భావిస్తుంది. వారు అన్యాయంగా తమ ఇళ్లనుండి తరిమివేయబడ్డారు (అల్ హజ్జ్: 40)

హజరత్ అనస్ ఉల్లేఖించారు. దైవప్రవక్త మదీనా సమీపానికి చేరుకున్నప్పుడు ప్రేమపూర్వకంగా తన వాహన వేగాన్ని పెంచేవారు. "ఓ దేవా! మేము

మక్కాను ఎలాగైతే ప్రియప్రదంగా భావిస్తామో, మాకు మదీనాను అంతకన్నా ప్రియప్రదమయినదిగా చేయి" అని దైవాన్ని వేడుకునేవారు. (సహీహ్ బుఖారి)

వాస్తవమేమంటే మనిషి సంఘజీవి. తన అవసరాల కోసం సమాజంపై ఆధారపడాల్సిన పరిస్థితి. ప్రతి సామూహిక రూపం విధేయతను కోరుకుంటుంది. మనిషి సామూహిక వ్యవస్థను ఆశ్రయించినప్పుడు ఒప్పందం ఒడంబడికల ప్రకారం తన అనుబంధాన్ని విధేయతా స్ఫూర్తిని చాటుతాడు. అటువంటి పరిస్థితిలో సహజంగానే అతని హృదయంలో దానిపై ప్రేమాభిమానాలు జనిస్తాయి. మనిషి తన పట్టణంలో తన మొహల్లా, కాలనీ ద్వారా గుర్తింపబడతాడు. ఆ అనుబంధంతోనే క్రమక్రమంగా ప్రేమపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. కాలనీలోని సాధారణ సమస్యలపై కాలనీ వాసులంతా కలిసి స్పందిస్తారు. అదే విధంగా జిల్లా ప్రాంతం రాష్ట్రాలతో కూడా వ్యక్తుల అనుబంధాలు ఏర్పడతాయి. ఏదైనా సంస్థలో ఉద్యోగం చేస్తుంటే ఆ సంస్థకు అతను విధేయుడై ఉంటాడు. క్రికెట్, ఫుట్‌బాల్ టీముల్లో చేరి ఆడుతుంటే అక్కడ కూడా విధేయుడై ఉంటాడు, దాన్ని గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తాడు. సామాజిక సంస్థలు మత సంస్థలు రాజకీయ పార్టీలు కూడా తమ శ్రేణుల విధేయతను కాంక్షిస్తాయి. అదేవిధంగా ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తులందరూ కలిసి ఒక సాధారణ రాజకీయ వ్యవస్థను రూపొందించి ఒక రాజ్యాంగాన్ని ఏర్పరిస్తే దాని ఆధారంగా ఒక దేశం ఉనికిలోకి వచ్చినట్లయితే చట్టబద్ధమైన విషయాలలో ఆ దేశానికి మద్దతివ్వడం దాని పట్ల విధేయత చూపటం కూడా ఇస్లాం స్ఫూర్తికి సమంజసమైన విషయమే.

ఈ ప్రేమానుబంధాలు విధేయతా భావాలు రెండు విషయాల్లో నేరంగా పరిగణించబడుతాయి. దాని వివరణ కూడా దివ్యఖుర్ఆన్ హదీసుల ద్వారా మనకు లభిస్తుంది.

1. ఎప్పుడైతే ఈ సహజ సిద్ధమైన ప్రేమానుబంధాలు ఆధిపత్య భావజాలాన్ని సృష్టిస్తాయో, మనిషి ఇతర జాతులను తనకన్నా అల్పంగా భావిస్తాడో అప్పుడు.

2. దుర్మార్గం దౌర్జన్యాలలో మద్దతివ్వడం.

ఒక హదీసులో దైవప్రవక్త(స) అనుచరులు ఈ విధంగా ప్రశ్నించారు.

'ప్రవక్తా! మనిషి తన జాతి వ్యక్తిని ప్రేమించడం జాతి దురభిమానం అవుతుందా?' దానికి జవాబుగా దైవప్రవక్త "లేదు, దౌర్జన్యం దుర్మార్గాల విషయంలో నీ జాతి వ్యక్తిని సమర్థించడం దురభిమానం అవుతుంది" అని అన్నారు. (ఇబ్నెమాజా)

ఈ పరిస్థితుల ప్రకారం సాధారణ ఒడంబడికల ప్రాతిపదికన రాష్ట్రాలను ఏర్పాటు చేసుకోవడం, వాటిలో సభ్యులుగా ఉండడం లాంటి ఉదాహరణలు స్వయంగా దైవప్రవక్త (స) జీవిత చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది. దైవప్రవక్త (స) మదీనా నగరంలో ఏర్పాటు చేసిన ఇస్లామీయ రాజ్యంలో యూదులకు కూడా సంపూర్ణ హక్కులు లభించేవి (ఇబ్నె కసీర్). కనుక ఒక ఒడంబడికలో ఆ హక్కులను ప్రస్తావించారు. ఆ తర్వాత నజరాన్‌కి చెందిన క్రైస్తవులతో కూడా అదేవిధమైన ఒప్పందం జరిగింది.

అయితే పౌర జాతీయతకు, ముస్లింల సాముదాయిక ఉనికికి మధ్య ఉన్న సంబంధం ఏమిటనేది ఇక్కడ ఉత్పన్నమయ్యే ప్రధాన ప్రశ్న.

స్వాతంత్ర్యానికి ముందు కూడా ఈ విషయం ముస్లింలలో తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. ముస్లిం సముదాయం ఒక జాతినా? లేక భారత జాతిలోని ఒక భాగమా? అన్న విషయంపై కొందరు ద్విజాతి సిద్ధాంతాన్ని సృష్టించి ముస్లింలను ఒక ప్రత్యేక జాతిగా ప్రకటించారు....ఆధునిక రాజకీయ భావజాలాలు ఐరోపా సృష్టించిన జాతివాద భావజాలాల ఫలితంగానే ఈ పరిస్థితులు తలెత్తాయి. ఆధునిక జాతివాద భావజాలం మానవ ఐక్యత కొరకు జాతినే ప్రధాన మూలంగా పరిగణించేది. దాని ఆధారంగానే రాజ్యాలు ఏర్పడేవి. సంస్కృతీ సంప్రదాయాలు చారిత్రక వారసత్వ సంపదలు అన్నీ ఒకటైతేనే అది జాతిగా భావించబడేది. ఆ విధంగా సాధారణ అర్థాలకు అతీతంగా జాతి పారిభాషిక పదాలు ఉనికిలోకి వచ్చాయి. వీటి ఆధారంగా ముస్లింలను ఒక జాతిగా పేర్కొంటే ముస్లింలు మతపరమైన సాంస్కృతిక పరమైన గుర్తింపును వదిలి భారతీయులంతా ఒకే సంస్కృతి ఒకే జాతి వారసత్వాన్ని అంగీకరించేటువంటి అర్థాలు వస్తాయి. నేడు మితవాద పార్టీల భావజాలం కూడా ఇదే. కనుక ముస్లిం మేధావులు ఈ భావజాలాన్ని తీవ్రంగా విమర్శించారు.

మౌలానా మౌదూది (రహ్మాలై) స్పష్టంగా వివరించారు. దివ్య ఖుర్ఆన్ ఎక్కడా ముస్లింల కొరకు జాతి అనే పదాన్ని ఉపయోగించలేదు. జాతి అనే పదం దివ్యఖుర్ఆన్‌లో సాధారణ అర్థంలో ఉపయోగించబడింది. అంటే ఒకే భాష, ఒకే రంగు, ఒకే దేశంలో ఉండే సమూహం అనే అర్థంలో. దైవప్రవక్తలు కూడా అవిశ్వాసులు, దైవ తిరస్కారులైన తమ సంబోధితులను సైతం ఓ నా జాతి ప్రజలారా! అని సంబోధించేవారు. దానికి వ్యతిరేకంగా ముస్లింల కొరకు దివ్యఖురాన్‌లో జాతి అనే పదాలు కాకుండా మిల్లత్, ఉమ్మత్, హిజ్బ్ అంటే పార్టీలాంటి పదాలు ప్రయోగించబడ్డాయి.

దురహంకారులయిన అతని (షుఐబ్) జాతి సర్దారులు అతనితో ఇలా అన్నారు: షుఐబ్, మేము నిన్నూ, నీతో పాటు విశ్వసించిన వారిని మా నగరం నుండి బహిష్కరిస్తాము. లేదా మీరు మా సంఘంలో తిరిగి చేరవలసి ఉంటుంది. షుఐబ్ ఇలా సమాధానం పలికాడు: "ఏమిటి? మాకు ఇష్టం లేకపోయినా మమ్మల్ని బలవంతంగా మళ్ళిస్తారా? అల్లాహ్ మాకు మీ సంఘం నుండి విముక్తి కలిగించిన తరువాత ఒకవేళ మళ్ళీ మేము దానిలో చేరితే మేము అల్లాహ్‌కు అబద్ధం ఆపాదించినవాళ్ళం అవుతాము. (అల్ ఆరాఫ్:88)

ఈ ఆయతులో ఒకే సమయంలో జాతి, సముదాయం అనే పదాలు ఉపయోగించబడ్డాయి. అంటే సంబోధితులు, వక్త అంతా ఒకే జాతి ప్రజలు అయినప్పటికీ వారి సముదాయాలు మాత్రం వేరువేరుగా ఉండేవి.

మిల్లత్ అంటే ఏమిటి? దివ్యఖుర్ఆన్‌లోని మరో ఆయత్‌లో దీని వివరణ ఈ విధంగా ఉంది.

అల్లాహ్ మార్గంలో సాధన (జిహాద్) చెయ్యండి, సాధన చెయ్యవలసిన విధంగా. ఆయన మిమ్మల్ని తన సేవకై ఎన్నుకున్నాడు. ధర్మంలో మీకు ఏ ఇబ్బందినీ ఉంచలేదు. మీ తండ్రి ఇబ్రాహీం ధర్మంపై స్థిరంగా ఉండండి. పూర్వం కూడా అల్లాహ్ మీకు "ముస్లిం" అనే పేరునే పెట్టాడు. ఇందులో (ఖురాన్)లో కూడా (మీ పేరు ఇదే). దైవప్రవక్త మీ విషయంలో సాక్షిగా ఉండటానికీ, మీరు ప్రజల విషయంలో సాక్షులుగా ఉండటానికీ. (అల్ హజ్జ్:78)

దీనిద్వారా జాతి సముదాయాల మధ్య ఉన్న వ్యత్యాసమేమిటో ఇట్టే అర్థమవుతుంది. జాతి అంటే ఒక వర్గం లేక తెగ ఒకే భౌగోళిక ప్రాంతంలో నివసించే వ్యక్తుల సమూహమని అర్థం. (లేక నేటి ప్రపంచంలో ఏదైనా రాష్ట్ర

పౌరుల సమూహమని అర్థం). మనిషి తాను ఏ జాతిలో పుట్టాలో ఎన్నుకోవడం జరగదు. అది సహజంగానే ప్రకృతిపరంగా నిర్ధారితమౌతుంది. కానీ దానికి భిన్నంగా ఒక పార్టీ లేక సమూహమున్నప్పుడు అది ఓ ప్రత్యేక ఆశయం కోసం నెలకొల్పబడిన వర్గమనీ, దాని సభ్యత్వం స్వచ్ఛందమనీ, అది దాని ఉద్దేశ్య లక్ష్యాలపై ఆధారపడి ఉందని అర్థమవుతుంది. పార్టీకి సమిష్టి ఉనికి ఉన్నప్పటికీ జాతి నుండి దాన్ని మనం వేరు చెయ్యలేము. ఆ జాతిలోనే అది తన లక్ష్యసాధనకై ప్రయత్నిస్తుంటుంది. పార్టీ లేక సముదాయం మాదిరిగానే మిల్లత్ కూడా ఒక సైద్ధాంతిక వర్గం పేరు. కొన్ని విశ్వాసాలు నియమాలను ఆచరించే వ్యక్తుల సమూహం పేరు. ఈ వచనంలో సత్యధర్మ సాక్ష్యం ఇవ్వడమనేది ముస్లిం సముదాయం ప్రధాన లక్ష్యంగా పేర్కొనడం జరిగింది.

దివ్య ఖురాన్ ముస్లిం సముదాయం కొరకు ఇతర పారిభాషిక పదాలను కూడా ఉపయోగించింది. దివ్య ఖురాన్‌లోని సుప్రసిద్ధ వచనంలో ముస్లింల లక్ష్యాన్ని, ఆశయాన్ని వివరించేందుకు అక్కడ ఉమ్మత్ అనే పదం వాడడం జరిగింది.

ఈ విధంగా మేము మిమ్మల్ని ఒక "మధ్యస్థ సమాజం"గా చేసాము. ఇకపై మీరు సమస్త మానవ జాతికి సాక్షులుగా ఉంటారు. ప్రవక్త మీకు సాక్షిగా ఉంటాడు. (అల్ బఖర: 144)

ఇక నుండి ప్రపంచంలో మానవులకు మార్గం చూపటానికీ, వారి సంస్కరణకు రంగంలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే. మీరు మంచిని చెయ్యండి అని అజ్ఞాపిస్తారు. చెడు నుండి ఆపుతారు.

(ఆలి ఇమ్రాన్: 110)

అల్ ముజాదలహ్ సూరా చివరి ఆయత్‌లలో "హిజ్బుల్లాహ్" (అంటే అల్లాహ్ పార్టీ) అనే పదం ప్రయోగించబడింది. అల్లాహ్ యొక్క ఈ పార్టీలో గల సభ్యత్వాన్ని విశ్వాసం (ఈమాన్)తో, సద్గుణాలతో జోడించటం జరిగింది. ఇవి వాస్తవానికి విశ్వాసుల గుణగణాలు.

దీని ద్వారా ముస్లింలు ఒక మిషన్ అనీ, ఒక ఆశయం కోసం పాటుపడే వర్గమని అర్థమవుతుంది.

ముస్లింలను ఒక జాతిగా పేర్కొంటే, వారితోపాటు నివసించే ఇతర

వ్యక్తులు వారికి పరులు అవుతారు. వారితో అన్యసంబంధం ఏర్పడుతుంది. వారంతా ఒక ప్రత్యేక ఘెట్టోలో బందీలవుతారు. ఫలితంగా వారిలో "ఓ నా జాతి ప్రజలారా!" అనేటటువంటి ప్రవక్తల ప్రేమైక భావజాలం పెంపొందదు. వాస్తవానికి ఈ దేశంలో ముస్లింలు ముస్లిమేతరుల మధ్య అంతరాలకు కారణం ముస్లింలు తమనుతాము ఒక ప్రత్యేక జాతిగా భావించే మనస్తత్వాన్ని కలిగి ఉండటమే. ముస్లిములు ఒక సందేశ ప్రధానమైన వర్గం. ఒక లక్ష్యసాధనకై పాటుపడే సముదాయం. వారు తమతోపాటు తమ భౌగోళిక ప్రాంతంలో నివసించే దేశ సోదరవాసులకు తమ సందేశాన్ని అందించే గురుతర బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉంది. విశ్వ సౌభ్రాతృత్వ మానవ సమాజం నెలకొల్పాలని, అక్కడ మానవులను విభజించే ఎలాంటి కృత్రిమ గోడలు ఉండకూడదనీ మొత్తం మానవజాతిపై ఒకే దైవశాసనం ఉండాలనేది ఇస్లాం పవిత్ర ఆశయం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మెజారిటీ దేశాలలో రాజ్యాంగ ఒడంబడికల ప్రాతిపదికన బహుళ సమాజాలు ఉన్న తరుణంలో ముస్లింలు తమను తాము దేశ పౌరులుగా భావిస్తూ, సందేశ ప్రధానమైన వర్గంగా తమ బృహత్తర బాధ్యతను గ్రహిస్తూ దేశంలో సందేశాత్మక పాత్రను పోషించాల్సిన అవసరం ఉంది.

*(ఏప్రిల్ 2017లో హైదరాబాద్‌లోని ఒక సమావేశంలో చేసిన ప్రసంగం).*

**ఆధార గ్రంథాలు :**


1) Encyclopedia of Nationalism : అలెగ్జాండర్ మోటెల్

2) Civilisation on Trail : Oxford University,Newyork

3) Jurgen Habermas : Struggles for Recognition in the democratic state.

4) Nationalism and Internationalism in selected works : M.K. Gandhi

5) Nationalism in India : Rabindranath Tagore

# వలసవిముక్తివాదం - ఇస్లాం స్వేచ్ఛాయుత భావన

## పెట్టుబడిదారీ వలసవాదం

మానవ సమాజంలోని అధిక భాగం నేటికీ సామ్రాజ్యవాద శక్తుల దురాక్రమణకు వ్యతిరేకంగా విముక్తి పొంది స్వేచ్ఛాయుత జీవనం కొనసాగించేందుకు పోరాడుతూనే ఉంది. ఆధునిక వలస వాదంగా మారిన సరికొత్త విధానమే నేటి సామ్రాజ్యవాదానికి క్రియాశీలక రూపం.

19, 20వ శతాబ్దిలో ఆసియా ఆఫ్రికా అమెరికాల అధిక భూభాగం ఐరోపా దక్షిణ అమెరికాకు చెందిన తెల్లజాతీయుల దురాక్రమణకు గురైంది. ఆ విస్తృత భూభాగాన్ని, ఆయా దేశాల వనరులను కొల్లగొట్టేందుకు దౌర్జన్యంగా ఆక్రమించుకొనే దురాక్రమణ చర్యనే వలసవాదం (Colonialism) అంటారు. గత అర్థశతాబ్దిలో ఆ దేశాలన్నీ సామ్రాజ్య శక్తులపై స్వాతంత్ర్యం సాధించినప్పటికీ దోపిడీ శక్తులు తమ వ్యూహాన్ని మార్చి వారి వనరులపై ఆధిపత్యాన్ని కొనసాగించే సరికొత్త పద్ధతులను అవలంబించాయి. ఇప్పుడు నేరుగా దోపిడీ చేయడం సాధ్యం కానందున ప్రపంచ వాణిజ్య వ్యవస్థ, ఆర్థిక ఒత్తిడి, సైనిక ఒప్పందాలు, సైనిక శక్తుల భయాందోళనలు కలిగించి, పేద దేశాలకు వడ్డీలపై అధిక రుణాలిచ్చి అప్పులపాలు జేయటం, పాలకులను తమ తోలుబొమ్మలుగా మార్చుకోవడం, మీడియా ద్వారా ప్రజాభిప్రాయాన్ని తప్పుదోవ పట్టించడం లాంటి పలురకాల మార్గాలను అవలంబించి తద్వారా నిరుపేద దేశాల సార్వభౌమాధికారాన్ని పరిమితంచేసి వారి వనరులను కొల్లగొట్టే పనికి పాల్పడుతున్నారు. ఈ విధానాన్నే పెట్టుబడిదారీ విధానం/ ఆధునిక వలసవాదం అని పేర్కొనడం జరిగింది.

పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదంలో జాత్యహంకార జాడ్యాలు వర్ణ వర్గాల ఆధిపత్య విషకోరలు కూడా విపరీతంగా పేరుకుపోయి ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థగా పేరుగాంచిన ఈ వ్యవస్థ ఆసియా ఆఫ్రికా దక్షిణ మధ్య అమెరికాలోని అనేక దేశాలను తన గుప్పెట్లో ఉంచుకుని వారిపై తన గుత్తాధి పత్యాన్ని కొనసాగిస్తోంది. గత కొన్ని దశాబ్దాల నుండి ప్రపంచ వ్యాప్తంగా వలస వాదానికి వ్యతిరేకంగా అనేక ప్రతిఘటనా ఉద్యమాలు కూడా పురుడు పోసుకున్నాయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఇస్లాం కూడా బలమైన గళమెత్తింది. ఈ నయావలసవాదం మరింత తీవ్రంగా మారి తన హద్దులను దాటుకుంటూ ప్రపంచంలోని పలు ప్రదేశాల్లో, ప్రధానంగా మధ్యప్రాచ్యంలో మానవ రక్తపాత సరికొత్త చరిత్రను సృష్టిస్తోంది. పెట్టుబడిదారీ విధానాల ఫలితంగా సంపద కేంద్రీకరణ విపరీతంగా పెరిగిపోయింది. ఆక్స్‌ఫామ్ సమర్పించిన నివేదిక ప్రకారం ప్రపంచంలో ఎనిమిది మంది కోటీశ్వరుల సంపదలు సగం ప్రపంచ సంపదలకన్నా ఎక్కువగానే ఉన్నాయి. పేద ధనిక వర్గాల మధ్య అసమానతలు వేగంగా పెరుగుతున్నాయి. గత సంవత్సరంలో ఉత్పత్తయిన సంపదలోని 84% కేవలం ఒక్క శాతం బడాబాబుల జేబుల్లోకే జొరబడిందంటే ప్రపంచ జనాభాలోని సగం మంది కన్నా ఎక్కువ జనాభాకు ఈ సంపదలోని ఒక్క పైసా కూడా అందలేదని అర్థం. కేవలం ఒక్క సంవత్సరంలో కోటీశ్వరుల ఆదాయంలో అమాంతం పెరుగుతున్న ధనంతో ప్రపంచ పేదరికాన్ని ఏడుసార్లు నిర్మూలించవచ్చు. అంటే ప్రపంచంలో సంపదకు కొదవలేదు. సంపద సమృద్ధిగా ఉన్నప్పటికీ ఆర్థిక అసమానతల కారణంగా మానవ సమాజం కడుపేదరికంలో కూరుకుపోతోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో ధరణిపై మనుగడ సాగిస్తున్న కోట్లాదిమంది మానవులు తీవ్రమైన భౌతిక మానసిక సమస్యలతో బాధపడుతున్నారు.

మనదేశంలో జాత్యహంకార శక్తులు తమకంటూ ఓ సాంస్కృతిక జాతీయతా రూపాన్ని సంతరించుకున్నాయి. అధికార నిరంకుశత్వంతో భారత రాజ్యాంగ విలువలకు తిలోదకాలిస్తూ దేశ ప్రజాస్వామిక పునాదులకు పెనుప్రమాదంగా మారుతున్నాయి. భారతదేశంలో జాత్యహంకారానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. బ్రిటిష్ వారి వలస పాలనకు వ్యతిరేకంగా న్యాయం సమానత్వాల ప్రాతిపదికన దేశ స్వాతంత్ర్య యుద్ధం జరిగింది. స్వాతంత్ర్యానంతరం దేశ

రాజ్యాంగ ప్రమాణాలుగా మారిన విలువలు ప్రస్తుతం తీవ్ర ప్రమాదపుటంచుల్లో ఉన్నాయి.

పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా తమ శాస్త్రీయ శోధనలతో ప్రసిద్ధిగాంచిన ప్రముఖులు ప్రపంచ నలుమూలల నుండి ఇక్కడికి విచ్చేసిన నేపథ్యంలో ఈ సమావేశం నిజంగా ఆనందించదగ్గది.

వలసరాజ్య ధోరణులపై ఇస్లామీయ వైఖరిని నిర్ధారించడం ఈ సమావేశ ఉద్దేశం. ప్రపంచంలో జాత్యహంకారం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దోపిడీ దౌర్జన్యాలు తారాస్థాయికి చేరిన తరుణంలో మధ్యప్రాచ్యం రక్తపాతంలో మునిగిన వేళలో సామ్రాజ్యవాదం తన తీవ్రరూపాన్ని ప్రదర్శిస్తున్న పరిణామంలో మానవ హక్కులు అడుగంటుకు పోతున్న ఆధునిక సమాజంలో ఈ సమావేశానికి ఇంతకంటే మంచి సమయం మరొకటి ఉండదేమో. అందులోనూ ప్రపంచ వ్యాప్తంగా ప్రవక్త మహనీయుల (స) జయంతి వేడుకలు జరుగుతున్న దినాన ఈ సమావేశం జరగటం శుభపరిణామం. ప్రవక్త మహనీయులు (స) మానవ చరిత్రలో మానవ జాతి విముక్తికై పోరాడిన అనుపమాన వ్యక్తిత్వమని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, మానవ మర్యాదలు, సర్వమానవాళి సమానత్వం కోసం ఉద్యమించిన ఉన్నత వ్యక్తిత్వం ఏదైనా ఉంటే అది మహాప్రవక్త (స) మహోన్నత వ్యక్తిత్వం మాత్రమే. నేటి సభ్యసమాజంలో ఈ భావనలు శోభాయమానంగా భాసిల్లుతున్నాయంటే దాని వెనుక ప్రవక్తమహనీయుల విశేష కృషి దాగుందనేది నిర్వివాదాంశం. నేటి ప్రపంచం సంపూర్ణ శాంతియుత వ్యవస్థగా మారాలంటే అది కేవలం ప్రవక్త బోధనల ద్వారానే సాధ్యమవుతుంది.

ప్రపంచంలో ఎక్కడైనా ఏ రూపంలోనైనా న్యాయభావనలు విరాజిల్లుతున్నాయంటే దాని కీర్తిప్రతిష్టలు ప్రవక్త (స)కే చెందుతాయి. దుర్మార్గాలు దౌర్జన్యాల నిర్మూలనకై కూడా ప్రవక్త బోధనలను పాటించాల్సిన అవసరం ఉంది.

ముఖద్దమా కాన్ఫరెన్సు అని ఈ సమావేశానికి సరయిన పేరు పెట్టారు నిర్వాహకులు. ముఖద్దమా అంటే పీఠిక లేదా భూమిక అనే అర్థాలున్నాయి. నిర్వాహకుల ఆశయాలకు అనుగుణంగా దైవచిత్తమైతే ఈ సమావేశం సామాజిక శాస్త్రాల్లో సరికొత్త గళాలకు నాంది పలుకుతుందని భావిస్తున్నాను.

ముఖద్దమా అనేది చరిత్రకు సంబంధించిన ఒక ప్రధాన పుస్తకం పేరు కూడాను. క్రీ.శ. 14వ శతాబ్దికి చెందిన ప్రసిద్ధ విద్వాంసులు, అబ్దుర్రహమాన్ బిన్ ముహమ్మద్ ఇబ్నె ఖుల్దూన్ చరిత్రకు సంబంధించి రాసిన పుస్తకం ముఖద్దమా (పీఠిక). ఇది ఆధునిక సామాజిక శాస్త్రాలకు ఆధారాలందించిన ప్రధాన గ్రంథంగా భావించబడుతుంది. ఇబ్నె ఖుల్దూన్ తన చరిత్రలో సంస్కృతులు సమసి పోవడానికి ప్రధాన కారణం దుర్మార్గాలు దౌర్జన్యాలేననే విషయాన్ని గుర్తు చేశారు. సంస్కృతులు సమసిపోవు, అవి దుర్మార్గాలకు ఒడిగట్టి తమ ఉనికిని కోల్పోతాయనీ కనుకనే దౌర్జన్యాలు దురాగతాలు మానవ సంస్కృతికే కాక మానవ సమాజానికీ ప్రధాన శత్రువులేనని పేర్కొన్నారు.

## వలస విముక్తివాదం

నేటి సమావేశ ఉద్దేశం వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడడం. గత శతాబ్ది చివరలో వలసవాదులు ప్రపంచ దేశాలను వీడివెళ్లిపోయాక అందరూ ఇక వలసవాదం ముగిసిందని ఊపిరి పీల్చుకున్నారు. కానీ చాపకిందనీరులా అది తన ప్రాభవాన్ని ఎంతగా విస్తృతపరుచుకుందంటే నేడు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యశక్తుల ప్రాభవమే రాజ్యమేలుతోందటే అతిశయోక్తి కాదు. వలసరాజ్యాలు స్వతంత్ర శక్తులుగా మనగలిగినప్పటికీ సామ్రాజ్యశక్తుల స్వార్థ ప్రయోజనాలకు బలవుతూనే వున్నాయి. సామ్రాజ్యవాద శక్తులకు వాటి ప్రయోజనాలకు ప్రాబల్యం చేకూర్చే సామాజిక వ్యవస్థలు ఏర్పడ్డాయి. విద్యా వైజ్ఞానిక శాస్త్రాలపై ఎంత పట్టు సాధించాయంటే నాగరికతా వ్యవహారాలు సైతం వారి కనుసన్నల్లోనే నడుస్తాయి. ఆర్థిక పారిశ్రామిక రంగాలు కూడా వారి స్వప్రయోజనాలకే సై అంటున్నాయి. అభిప్రాయ మార్పిడి రంగంలో మీడియా వారి కోడైకూస్తోంది. ఈ విధంగా వలస రాజ్యాలలోనేకాక ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద ధోరణి విపరీతంగా పెరిగిపోయింది. వలసవాదాన్ని అంతం చేసి ఆయా దేశాలను సామ్రాజ్యశక్తుల గుత్తాధిపత్యం నుండి విముక్తి పొందేందుకు పోరాడే ఉద్యమం పేరే వలసవిముక్తివాదం.

ఈ ఉద్యమ రథసారథులు క్రింద పేర్కొనబడిన పోకడలను వలసవాదాన్ని బలపరిచే ప్రధానాంశాలుగా పేర్కొంటారు.

**1. తెల్లజాతీయుల ఆధిపత్య భావన**

జాత్యహంకారాన్ని బహిరంగంగా ఎవరూ సమర్థించకపోయినా నేటికీ అమెరికాలో తెల్లజాతీయుల ఆధిపత్యభావన కొనసాగుతూనే ఉంది. ఇటీవల 2016లో జరిగిన అమెరికా ఎన్నికల్లో ఈ భావజాలం మరింత స్పష్టంగా కనపడింది. యూరోపియన్ దేశాల్లో రైటిస్టుల్లోని అతివాదశక్తులకు లభిస్తున్న గణనీయమైన ఆదరణతో నేటికీ జాత్యహంకారం ఒక సజీవ సాక్ష్యమనే విషయం బోధపడుతోంది.

**2. యూరోప్ కేంద్రీయ భావన** (Eurocentrism)

దీనర్థం మొత్తం ప్రపంచాన్ని అమెరికా ఐరోపాల దృష్టితో చూడడం, ఐరోపా, అమెరికా వస్తువులను అత్యున్నతమైనవిగా భావించడం. నేటికీ అమెరికాను కనుగొన్నది కొలంబస్ అనే విషయం ప్రపంచవ్యాప్త పాఠశాలల్లో ప్రధానాంశంగా బోధించడం జరుగుతుంది. కొలంబస్‌కి ముందే శతాబ్దాల తరబడి అక్కడ సాంప్రదాయిక జాతులు నివసిస్తున్న అమెరికాను కనుగొనడం యూరోపియన్లకు అద్భుతమైన విషయం కావచ్చు. ప్రపంచమంతా ఆశ్చర్యపడే విషయం ఏమీ కాదది. ఇలాంటి అనేక ఉదాహరణలు శాస్త్రాలన్నిటిలో మనకు లభిస్తాయి.

**3. పెట్టుబడిదారీ వ్యవస్థ**

ప్రపంచ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుంది. అందులో అధికశాతం తెల్లజాతీయులైన పెట్టుబడిదారులే ఉంటారు. ఫోర్బ్స్ జాబితాలో 25 మంది ఐశ్వర్యవంతులైన అమెరికన్లలో అందరూ తెల్లజాతీయులే ఉండడం గమనార్హం.

**4. జ్ఞాన వినిమయం** (knowledge appropriation)

దీనిద్వారా విజ్ఞాన శాస్త్రాలను సైతం తమ గుప్పెట్లో పెట్టుకోవడం జరుగుతుంది. ప్రాచీన దేశీయ శాస్త్రాలను విస్మరించి, వాటిని ఆక్రమించుకోవడం, మళ్లీ పునర్వ్యవస్థీకరణ ద్వారా పేటెంట్ చట్టాలు ఉపయోగించుకుని వాటి హక్కులను పొందడంలో వీరిది అందె వేసిన చెయ్యి. నేటి ఆధునిక యుగంలో విజ్ఞానం ఒక శక్తివంతమైన ఆయుధంగా మారింది కాబట్టి సామ్రాజ్యవాద శక్తులకు ఇది కూడా దోపిడి ద్వారమే.

## 5. అభిప్రాయాల ఉత్పత్తి (consent manufacturing)

మీడియా మాయాజాలం ద్వారా సామ్రాజ్యవాద శక్తులు ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా తమ స్వప్రయోజనాలను సులభంగా పొందేందుకు గానూ అసాధారణమైన రీతిలో ప్రజాభిప్రాయాన్ని మలిచే ప్రయత్నాలు చేస్తాయి.

## ఆధునికీకరణ, ఆధునిక సైన్సు పూర్వాపరాలు, వలసవాద మనస్తత్వాలు

ఆధునిక సైన్సు సాంకేతిక శాస్త్రాల పూర్వాపరాలను గమనిస్తే 11, 12వ శతాబ్దాలలో ఉమవీ పరిపాలకుల కాలంలో ముస్లిం పాలకుల కేంద్రమైన స్పెయిన్ దేశం సైన్సు కళా రంగాలలో ప్రపంచ కేంద్రంగా పరిఢవిల్లింది. ఫలితంగా యూరోపియన్ క్రైస్తవ విద్యార్థులు విద్యనభ్యసించేందుకు స్పెయిన్ వైజ్ఞానిక కేంద్రాల వైపు మొగ్గు చూపారు. సిస్లీ, స్పెయిన్ టోలిడో లాంటి ప్రాంతాలు క్రైస్తవ విద్యార్థుల నిలయాలుగా మారాయి. అక్కడ వారు అరబ్బుల నుండి తత్వశాస్త్రం, సైన్స్, గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం జామెట్రీలాంటి శాస్త్రాల నభ్యసించి యూరప్‌కు తిరిగి వచ్చారు. అనంతరం చర్చి మతాధిపత్యమున్న ఐరోపా సమాజంలో కొత్త కొత్త ఆలోచనలు సృజనాత్మకతా పవనాలు వీచడం మొదలెట్టాయి. తత్ఫలితంగా ఆధునిక విజ్ఞాన శాస్త్రాలు చర్చి మతం మధ్య సంఘర్షణా వాతావరణం ఏర్పడింది. ఆధునిక సైన్సు సాంకేతిక శాస్త్రాల విధి విధానాలను రూపొందించడంలో ఈ వివాదం ప్రధాన భూమికను పోషించింది.

క్రీ.శ. 1492లో జరిగిన సుదీర్ఘమైన క్రూసేడ్ యుద్ధాల తర్వాత స్పెయిన్లో ముస్లింలు పరాజయం పాలవడంతో స్పెయిన్ క్రైస్తవుల పరమయింది. క్రూసేడు యుద్ధాల వెనుక జాత్యహంకారం మతాధిక్య భావనల ఫలితంగా ప్రపంచంలో నిరంకుశ రాజకీయాలు పుట్టుకొచ్చాయి. స్పెయిన్లో విజయం సాధించాక అక్కడి కొత్త పరిపాలకులు క్రిస్టోఫర్ కొలంబస్‌కు సరికొత్త వాణిజ్య మార్గాలను అన్వేషించేందుకై అనుమతినిచ్చి ప్రపంచవ్యాప్తంగా అపఖ్యాతి పాలయ్యారు. క్రిస్టోఫర్ కొలంబస్ మధ్య అమెరికాలో గవానా హామి (బహామాస్) ప్రాంతానికి చేరి అక్కడి స్థానికులను కలిసాడు. వారు క్రైస్తవులూ కాదు మరే మతానికి చెందినవారూ కాకపోవడంతో మానవుల్లో ఆత్మ అనేది ఉంటుందా? అసలు వీరు మానవులేనా లేక ఏవైనా జంతుజాతులా? అనే విచిత్రమైన ప్రశ్నలు తలెత్తాయి. ఈ విషయమై స్పెయిన్లో సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఆ చర్చల

ఫలితాలు ఏవేమైనప్పటికీ ఐరోపా దొరలు మాత్రం ఆ అమాయక ప్రజలను జంతువుల్లాగా భావించి వారి పట్ల జంతువుల మాదిరిగానే ప్రవర్తించారు.

ఐరోపా వలసవాదులు అమెరికా లాటిన్ అమెరికాలో పాల్పడిన దుర్మార్గాలకు అనేక సాక్ష్యాలు లభించాయి. తరువాత అమెరికా ప్రభుత్వం వాటిపై బహిరంగ క్షమాపణ కూడా కోరుకుంది. కొలంబస్ 'కనుగొన్న' తర్వాత అక్కడి ప్రజలను ఒక్కొక్కరిని పట్టుకుని బానిసలను చేసి, అక్రమంగా ఐరోపాకు తీసుకెళ్ళి అమ్మివేశారు. వారిని జంతువుల మాదిరిగా ఓడలలో కుక్కి ఎంత దారుణమైన విధంగా తీసుకెళ్లారంటే అనేక మంది సముద్రయానంలోనే ఊపిరాడక తమ ప్రాణాలను కోల్పోయారు. అక్కడి స్థానికులకు బంగారు గనుల అన్వేషణా పనిని ముట్టజెప్పి, ఆ గనులలో వారి చేత క్రూరమైన పద్ధతిలో పనులు చేయించారు. ప్రతిఘటించిన వారి పట్ల అత్యంత కిరాతకంగా ప్రవర్తించి, వారి ఊచకోతకు పాల్పడ్డారు. మశూచి తదితర ప్రాణాంతక హానికర వ్యాధులు వ్యాపింపజేసి కేవలం కొన్నేళ్లలోనే ఆ ప్రాంతవాసులను వారి ప్రాంతాల నుండి వెళ్ళగొట్టారు.

ఐరోపా రాజకీయ సామాజిక పరిణామాలు ఆధునిక సైన్సునూ ప్రభావిత పరిచాయి. కనుక సామ్రాజ్యవాదంపై ఉద్యమించే మేధావులు ఆధునిక విజ్ఞాన శాస్త్రాల మూలాలు యూరోపియన్ల సామాజిక సాంస్కృతిక మానసిక అనుభవాలపై ఆధారపడి ఉన్నాయనీ, క్యాపిటలిజం భావజాలాలు ఆ మూలాల లోనే దాగి ఉన్నాయనీ, ఆధునికతకూ వలసవాదానికీ అవినాభావ సంబంధం ఉందనీ, వలసవాద విధానం, ఆధునిక భావజాలాలూ ఆ సిద్ధాంతాల ప్రతీకలేననీ ప్రగాఢంగా నమ్ముతారు. అంటే ఆధునిక సామ్రాజ్య వాదం కేవలం తాత్కాలిక ప్రయోజనాల కోసమో లేక హటాత్పరిణామాలతోనో ఉనికిలోకి వచ్చింది కాదు. దాని వెనుక లోతైన తాత్విక, మానసిక మూలాలు దాగి ఉన్నాయి. సామ్రాజ్య వాద దుర్మార్గాలన్నీ ఆధునిక మానవ అస్తిత్వశాస్త్రం, (Ontology) తత్వశాస్త్రాల (Epistemology) ఫలితమే. ఒకవిధంగా చెప్పాలంటే ఆధునిక భావజాలం విశ్వ మానవాళి, ఇతర మానవ సృష్టితాల గురించీ, శాస్త్రీయ ఆవిష్కరణలు, విజ్ఞాన మూలాలు, విషయ పరిజ్ఞానాల పట్ల ఏర్పరచిన దృక్పథం, దృక్కోణాల ఫలితమే ఈ సామ్రాజ్యవాద దౌర్జన్యాలు.

ఈ విషయంలో పాలస్తీనా ప్రఖ్యాత మేధావి ఎడ్వర్డ్ సయీద్ తన గ్రంథం Orientalismలో ఆధునిక పాశ్చాత్య సమాజం ప్రాచ్య సమాజాన్ని చూసే ఓ

ప్రత్యేక శాస్త్రీయ శైలిని సృష్టించిందనే విషయాన్ని బలమైన ఆధారాల ద్వారా నిరూపించారు. అది ప్రాచ్య సమాజాన్ని ఒక ప్రత్యేక దృష్టితో చూస్తోందని, ప్రాచ్యసమాజం అజ్ఞానం అంధకారాల ఆలవాలమనే అపవాదును మోపి తన ప్రత్యేక పాశ్చాత్య గుర్తింపును ఏర్పరచుకుంది. వికాసం విజ్ఞానం విజయాల కొరకు కావలసిన లక్షణాలు ప్రాచ్యసమాజంలో లేవనీ, ఆ విశిష్టతలు పాశ్చాత్యం లోనే దాగి ఉన్నాయనే నమ్మకాన్ని ఉభయ సమాజాల ఉన్నత వర్గాల్లో కల్పించడం జరిగింది. ఈ భావనల ఫలితంగా అన్ని పాశ్చాత్య ఆధిపత్య ఆక్రమణా విధానాలు సమర్ధించబడ్డాయి. ఎందుకంటే అనాగరిక ప్రాచ్యాన్ని అధునాతన ప్రాచ్యంగా మార్చడమే తమ లక్ష్యంగా చిత్రించారు.

## సామ్రాజ్యవాద దౌర్జన్యాల తాత్విక మానసిక పునాదులు

### (అ) దైవత్వంలో భాగస్వాములమని వాదించడం

దేవునిపై నమ్మకం లేని మనిషికి అధికారం లభిస్తే అతను తనకు దైవత్వాన్ని ఆపాదించుకుంటాడు. తన అధికారాన్ని ఉపయోగించుకుని ఇతర మానవులను బానిసలుగా చేస్తాడు. దౌర్జన్యం దుర్మార్గాల వెనుక తరచూ ఈ తరహా మనస్తత్వమే దాగి ఉంటుంది. అందుకనే దైవత్వంలో భాగస్వామ్యం కల్పించడం అతిపెద్ద దుర్మార్గం.

నిజం ఏమిటంటే ఇతరులను దేవునికి భాగస్వాములుగా చేర్చడం పరమ దుర్మార్గం (లుఖ్మాన్:13)

దివ్య ఖుర్ఆన్ ఇచ్చిన దుర్మార్గుల ఉదాహరణలలో అనేకులు దైవత్వంలో భాగస్వామ్యాన్ని ప్రకటించుకున్నవారే.

దివ్య ఖుర్ఆన్ ఫిరౌన్ గురించి ఈ విధంగా అంటుంది: అతడు తిరస్కరించాడు, అంగీకరించలేదు. ఆ పైన పన్నాగాలు పన్నటానికి వెళ్ళి పోయాడు. ప్రజలను సమావేశపరచి, అతడు "మీకు నేను అందరికంటే గొప్ప ప్రభువును" అని ఎలుగెత్తి చాటాడు. చివరకు అల్లాహ్ అతడిని ప్రపంచంలోనూ పరలోకంలోను శిక్షించడానికి పట్టుకున్నాడు. (నాజిఆత్: 21-25)

అదే విధంగా నమ్రూద్ గురించి కూడా....

ఇబ్రాహీము ప్రభువు ఎవరు అనే విషయంపై అతనితో వివాదపడిన వ్యక్తి విషయాన్ని గురించి నీవు ఆలోచించలేదా? అల్లాహ్ ఆ వ్యక్తికి రాజ్యాధికారం

ఇవ్వడం వల్ల ఈ వివాదం తలెత్తింది. “జీవన్మరణాలు ఎవరి అధీనంలో ఉన్నాయో ఆయనే నా ప్రభువు అని ఇబ్రాహీము అన్నప్పుడు అతడు ఇలా జవాబు పలికాడు. చావుబ్రతుకులు రెండూ నా అధీనంలోనే ఉన్నాయి”.

(అల్ బఖర: 258)

ఖుర్ఆన్ ప్రకారం దుర్మార్గ వ్యక్తులే కాక, దుర్మార్గ జాతులు కూడా సామూహికంగా ఈ భావజాలాన్నే కలిగి ఉండేవి.

ఆద్ జాతి పరిస్థితి ఇలా ఉండేది: వారు ఏ హక్కూ అర్హతలూ లేకుండానే భూమిపై పెద్దవారయి పోయారు. “మాకంటే ఎక్కువ బలవంతుడెవడున్నాడు?” అని అనసాగారు. వారిని సృష్టించిన దేవుడు వారికంటే ఎక్కువ బలవంతుడనే విషయం వారికి స్ఫురించలేదా? వారు మా వాక్యాలను తిరస్కరిస్తూనే ఉండేవారు. (హామీమ్ అస్ సజ్దహ్ : 15)

తాను స్వతహాగా దైవమని చెప్పుకోకపోయినప్పటికీ తన జ్ఞాన సామర్థ్యాలు శక్తిసంపదలపై ఎవరైనా అహంకారాన్ని ప్రదర్శిస్తే ఆ అహంభావం కూడా ఓ విధమైన దైవభావనే అవుతుంది. దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించారు:

గౌరవం అల్లాహ్ ఇజారు, పెద్దరికం ఆయన శాలువా. ఎవరైతే దాన్ని లాక్కునేందుకు ప్రయత్నించాడో అల్లాహ్ అతన్ని పరాభవం పాలు చేస్తాడు.

(సహీహ్ ముస్లిం)

మొత్తానికి దుర్మార్గ వ్యక్తులూ జాతులూ ఏదో ఒకస్థాయిలో తమను తాము దైవిక భాగస్వాములుగానో దైవనిర్ణయాలలో భాగస్వాములనో భావిస్తుంటారు. భారతదేశంలో అగ్రవర్ణాలు కూడా తమను బ్రహ్మతో ముడిపెట్టి బ్రాహ్మణ జాతిలో దైవిక గుణగణాలున్నాయనీ, వారు భూమిపై ధర్మ అవతారాలనీ, ప్రతీదానిపై వారికి హక్కుందని వాదిస్తుంటారు. యూదులు కూడా తమను దైవం ఎన్నుకున్నాడనీ, తాము దైవానికి ప్రీతిపాత్రులమని మరీ ప్రకటించుకున్నారు. మధ్యయుగంలో ఐరోపా మారాజులు కూడా తాము దేవునిచే నియమితులమయ్యామని, దేవుడు ఆధ్యాత్మిక అధికారాలు పోపుకు ప్రసాదించాడనీ, ప్రాపంచిక అధికారాలన్నీ రాజపరిపాలకులకు ఇవ్వబడ్డాయనీ ప్రకటించుకున్నారు. అదేవిధంగా అనేక బహుదైవారాధక సమాజాలలో రాజులకు దైవత్వాన్ని ఆపాదించడమో లేక వారిని దైవిక అధికారాలలో భాగస్వాములుగా చేయడమో జరిగింది.

ఆధునిక సామ్రాజ్యవాద నాస్తిక వ్యవస్థ, దైవాన్ని విస్మరించి ఓవిధంగా తామే దేవుళ్ళమనే భ్రమలో ఉంది. ఆపై ఆధునిక సైన్సు కూడా సాంకేతిక ఆవిష్కరణల ఫలితంగా విశ్వజనీన వాస్తవాలన్నీ తమ అధీనంలోనే ఉన్నాయనీ, ప్రకృతిని సులభంగా వశపరుచుకోవచ్చనే భావనలో ఉంది.

ఆధునిక శాస్త్రీయ భావనలు యూరోపియన్లను అప్రకటితంగానే దైవమంత స్థాయికి చేర్చాయనీ ఆధునిక అమెరికా మేధావి రోమన్ గోస్ఫోగల్ చక్కటి వాస్తవాన్ని వెల్లడించాడు. వారి వద్ద ఉన్న జ్ఞానమే నిర్దిష్టమైన జ్ఞానమనీ, వారి వివేచనా విజ్ఞతలు వైజ్ఞానిక విధానాలే ప్రామాణికమైనవనీ, మిగతావన్నీ సరైనవి కావనీ, అసలు వాటి శాస్త్రీయతకు ఎలాంటి ప్రమాణాలులేవనీ, వారు రూపొందించిన విధివిధానాలే వాస్తవమైనవనే ధోరణిని నెలకొల్పారు.

ఈ విధంగా అభివృద్ధి చెందిన ఐరోపా జాతులకు అందుబాటులో ఉన్న పద్ధతుల ద్వారానే విజ్ఞానాన్ని పరిమితం చెయ్యడం జరిగింది. గోస్ఫోగల్ ప్రకారం ఆ విజ్ఞాన శాస్త్రాలనూ వాటి కేంద్రాలనూ తమ అధీనంలో ఉంచుకునేందుకు యూరోపియన్లు నాలుగు పర్యాయాలు విజ్ఞాన శాస్త్రాల హననానికి పాల్పడ్డారు. మొదట స్పెయిన్ ముస్లింలు అభివృద్ధి పరిచిన శాస్త్రీయ విజ్ఞాన హననానికి పాల్పడ్డారు. ఆ తరువాత ప్రణాళికాబద్ధంగా విద్యా వైజ్ఞానిక ప్రపంచంలో వాటికి ఏమాత్రం ప్రామాణికత లేదంటూ వాటిని కొట్టి పారేశారు. ఆ తరువాత లాటిన్ అమెరికా, ఆఫ్రికా మరింత ముందుకుపోయి వలస రాజ్యాలలో ఉన్న దేశీయ విద్యలను సైతం పనికిమాలినవని ప్రకటించేశారు. ఎక్స్పెరిమెంటల్సైన్స్, పాజిటివిజంలో స్వీయనిర్మిత పరీక్షలను కనుగొనడంతో ఐరోపాయేతర శాస్త్రీయ విజ్ఞానాలన్నీ ఒకేసారి అశాస్త్రీయమైపోయాయి. యూరోపియన్లకు మినహా ఇతరులకు సాధ్యంకానీ, అందుబాటులో లేని మార్గాలన్నీ విద్యావసరులుగా ప్రకటించబడ్డాయి.

## (అ) మానవ విభజన

ప్రతి దౌర్జన్యపరుడు బహిరంగంగానో, గోప్యంగానో మానవ విభజనా భావజాలాన్ని పాదుకుంటాడు. మానవులను వారి భాషా జాతి వర్ణం వర్గాల ప్రాతిపదికన విభజించి తరతమ భేదాలను సృష్టింపజేస్తాడు. తమ వారి పట్ల మానవత్వంతో ప్రేమామృత భావనలతో ప్రవర్తిస్తూ ఇతరుల పట్ల

అమానవీయంగా పశువుల మాదిరిగా వ్యవహరిస్తుంటాడు. వారిపై జరిగే ఆకృత్యాలు అఘాయిత్యాలపై ఎటువంటి మనోవేదన కలగదు. ఒకవేళ బాధ కలిగినా అది అంతగా పట్టించుకోవాల్సిన విషయం కాదని భావిస్తాడు. ఇక్కడ అల్జీరియా తత్వవేత్త ఫ్రాన్ట్స్ ఫానన్ (Frants fanon) సూక్తిని ఉటంకించడం సమంజసమేమో. అతని అభిప్రాయం ప్రకారం జాత్యహంకారం అత్యంత బలోపేతమైన స్వరూపం. అది మానవులను రెండు వేర్వేరు వర్గాల్లో విభజిస్తుంది. Zone of being)స్థాయిగలవారు zone of non being ఏ స్థాయికి చెందనివారు. దీన్ని అగ్ర అల్ప వర్ణాలుగా చెప్పవచ్చు. అల్పవర్గీయులను సంపూర్ణ వ్యక్తులుగా అంగీకరించడం జరగదు. అగ్రవర్ణాలలో అన్యాయాలకు గురైనవారూ ఉండవచ్చు. అయితే అగ్రవర్ణం కారణంగా వారికి లభించే సౌలభ్యాలు వారికి వారధిగా నిలుస్తాయి . అల్పవర్గాలకు అలాంటి సౌలభ్యాలేమీ వర్తించవు. ఇది ఒకవిధంగా తరతమ విభజనే అవుతుంది. అగ్రవర్ణాలు తమ వారి పట్ల హింస జరిగితే ఆగ్రహావేశాలతో ఊగిపోతారు. అదే హింసా దౌర్జన్యాలు ఇతరులపై జరిగితే కనీసం చీమైనా కుట్టినట్టు ఉండదు. తెల్ల జాతీయుడి హత్య జరిగితే పాశ్చాత్య ప్రపంచమంతా కోపతాపాలతో తల్లడిల్లిపోతుంది. ఇజ్రాయిల్ సైనికుడి మృతి ప్రళయ వేదనను సృష్టిస్తుంది. కానీ సిరియా పాలస్తీనా ఇరాక్ ఆఫ్ఘనిస్తాన్ లాంటి ప్రదేశాలలో జనాభాకు జనాభా ఊచకోతకు గురైనా కనీసం మొసలి కన్నీరు కార్చేవారు ఉండరు. పట్టణ ప్రాంతాల సంపన్న వర్గానికి చెందిన విద్యాధిక యువతి పట్ల హింసా దౌర్జన్యాలు జరిగితే కలిగే వేదనాభరితమైన స్పందన గ్రామీణ దళిత యువతులపై జరిగే దుర్మార్గాలపై దానిలోని పదో వంతు కూడా ఉండదు.

అణచివేత మనస్తత్వాన్ని దివ్యఖురాన్ ఈ విధంగా చూపుతుంది.

అసలు విషయం ఏమిటంటే ఫిరౌను భూమి మీద తిరుగుబాటు వైఖరిని అవలంబించాడు. దాని ప్రజలను వర్గాలుగా విభజించాడు. వారిలోని ఒక వర్గాన్ని అతడు నీచపరచేవాడు. వారి బాలురను హతమార్చేవాడు. వారి బాలికలను మాత్రం బతుకనిచ్చేవాడు. నిశ్చయంగా అతడు దుష్టులలోని వాడు. భూమిలో అణచివేయబడిన వారిని కనిరించాలనీ, వారిని నాయకులుగా చేయాలనీ, వారినే వారసులుగా చేయాలనీ, భూమిలో వారికి అధికారాన్ని ప్రసాదించాలనీ, వారి ద్వారా ఫిరౌను, హామానులకు వారి సైన్యాలకు తాము భయపడుతూ వచ్చిన దానినే చూపాలనీ మేము కోరాము. (అల్ ఖసస్: 4-6)

వలసవాదులు స్పెయిన్‌ను పతనం చేసి అమెరికాను ఆక్రమించుకున్నాక అక్కడి స్థానిక వాసులను పశువులకన్నా హీనంగా భావించారు. ఆయా దేశాలలో వారు ఒకే గుర్తింపు ఒకే మతం ఒకే రాజ్యంలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. ఫలితంగా బానిసత్వానికి చట్టబద్ధత లభించింది. స్థానికులపై దౌర్జన్యం సమర్థనీయంగా మారింది. ఎందుకంటే వారి ఉద్దేశం ప్రకారం ఆ దౌర్జన్యాలకు దురాగతాలకు గురయ్యేది మనసున్న మనుషులు కాదు కేవలం ఆత్మలేని శరీరాలు మాత్రమే.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి వున్న ఇస్లాం శ్వేత జాత్యహంకారానికి అతిపెద్ద అవరోధంగా మారింది. ఈ భావనే ఇస్లామోఫోబియాను సృష్టించింది. ఇస్లామోఫోబియా శాస్త్రీయ ఉద్దేశాన్ని గాస్ఫోకల్ చాలా చక్కగా వివరించాడు:

"Epistemic racism allows the west to not have to listen to the critical thinking produced by Islamic thinkers on western global / imperial designs"

పాశ్చాత్య సామ్రాజ్యవాద విధానాలపై ఇస్లామీయ మేధావులు చేసే విమర్శలను పట్టించుకోకుండా ఉండేందుకు జాత్యహంకార భావజాలం బాగా తోడ్పడుతుంది.

ఇస్లామోఫోబియా యూరప్‌లో జాత్యహంకారం లాంటి జాడ్యమేననే నిర్ధారణకు వచ్చాడు గాస్ఫోకల్. నిమ్నోన్నతల ప్రాతిపదికన ఒక భావజాలం రూపొందించి దాని ప్రకారం ముస్లింలను ఉగ్రవాదులని ప్రకటించి వారిని అల్ప వర్గాలలో చేర్చడం జరిగింది. ఆ ప్రకారం వారు మానవులుగా భావింపబడరు. జాత్యహంకార జాడ్యం కేవలం జాతులలోనే కాక మతాలు సంస్కృతుల ప్రాతిపదికన కూడా కొనసాగుతుందనడానికి ఇదొక ఉదాహరణ.

## ఇస్లామ్ వలసవాదానికి వ్యతిరేకం

ఇస్లాం చరిత్రాత్మకంగా అత్యంత విజయవంతమైన ధర్మం. మానవాళికి ముక్తిమార్గం చూపే మహోన్నత ఉద్యమం. ఇస్లామీయ ఉద్యమంలో ఉన్న ఈ ముక్తిదాయక ప్రత్యేకతే వలసవాద వ్యతిరేక మేధావులను ఆకట్టుకుంది. ఇస్లాం దోపిడీ దౌర్జన్యాలను కేవలం రాజకీయ సామాజిక స్థాయిలోనే

ప్రతిఘటించటం గాక విశ్వాస పరంగానూ విజ్ఞాన పరంగానూ సైద్ధాంతిక స్థాయిలోనూ దుర్మార్గం దౌర్జన్యాల మూలాలను మట్టుబెట్టుతుంది. ఇస్లాం మానవజాతిపై జరిగే దౌర్జన్యాలను అంతమొందించడమేకాక దుర్మార్గాలకు ఊతమిచ్చే దౌర్బల్యపు మనస్తత్వాన్ని సైతం అణచి వేస్తుంది.

అధర్మం అన్యాయం అణచివేతలను వ్యతిరేకించే ఇస్లామీయ భావనల విశిష్టత ఏమంటే వాటి మూలాలు ఇస్లాం మౌలిక సిద్ధాంతాలు, దాని నియమాలలోనే నిబిడీకృతమై ఉన్నాయి. ఆ సిద్ధాంతాలు దైవదత్తమైనవి కనుక వాటిని విశ్వసించడం ముస్లింల మౌలిక విధి. పైగా ఆయా సూత్రాలలో ఎటువంటి సవరణలు మార్పులు చేర్పులకు ఎటువంటి ఆస్కారం లేదు.

ఆ మహిమాన్విత సిద్ధాంతమే నేటి ఆధునిక ప్రపంచానికి అనేక శతాబ్దాల క్రితం బానిసత్వాన్ని రూపుమాపడంలో సఫలమైంది. మహిళలకు సమాన హక్కులు కల్పించి వర్ణ వర్గ అసమానతలను కూకటివేళ్లతో పెకలించి వేసింది. మానవ జాతిపై ఆధిపత్యాన్ని కొనసాగించే శక్తులకు వ్యతిరేకంగా మానవులను మానవ దాస్యశృంఖలాల నుండి విముక్తి కల్పించే విశిష్టమైన బాధ్యత ధర్మ ప్రచారకులైన దైవప్రవక్త అనుయాయులపై ఉంది. కనుక ఏకేశ్వరోపాసన (ఒకే దైవానికి దాస్యం చేయడం) సిద్ధాంతమే అన్నివిధాలా నిరంకుశ శక్తుల నడ్డివిరిచే మంత్రం లాంటిది. అణచివేత శక్తులు, దైవ తిరస్కారులు, తాగూత్లుగా పరిగణించబడ్డారు. వారికి వ్యతిరేకంగా బలమైన గళమెత్తడం ఇస్లామీయ సిద్ధాంతంలో భాగంగా పరిగణించడం జరిగేది. రబయీ బిన్ ఆమిర్ రుస్తుం దర్బారులో ఇచ్చిన వాంగ్మూలం ఆ సిద్ధాంతానికి దర్పణం పడుతుంది. ఆయన దైవప్రవక్త(స) చేపట్టిన బృహత్తర బాధ్యతను, ఇస్లామీయ ఉద్యమ దార్శనికతనూ ఎంతో వైభవంగా వెల్లడించారు.

“దైవం మమ్మల్ని దైవదాసులను మానవ దాస్యం నుండి విముక్తి కల్పించి దైవదాస్యం వైపునకు ఆహ్వానించేందుకు, ప్రాపంచిక సంకుచిత్వాల నుండి వెలికితీసి పరలోక విశాలత వైపునకు మరలింపచేసేందుకు, మతాల దౌర్జన్యాల నుండి విముక్తి కల్పించి, ఇస్లాం చూపే న్యాయ సమ్మతమయిన జీవన విధానం వైపునకు ఆహ్వానించేందుకు పంపించాడు”. (ఇబ్నె కసీర్)

ఇస్లాం మౌలిక సిద్ధాంతమైన ఏకేశ్వర సిద్ధాంతం అఖండ బ్రహ్మాండ సృష్టికి సృష్టికర్త ఒక్కడేననీ, ఆయనే ప్రభువు, పరిపాలకుడు, పోషకుడు, శాసనకర్త అనే నమ్మకాన్ని కల్పిస్తుంది. సృష్టికర్త ముందు ప్రతి జీవి నిమిత్త మాత్రుడేననే విశ్వాసాన్ని జనింపచేస్తుంది. ఇస్లామీయ సిద్ధాంతంలో ఏకైక దేవుని ఉనికితో పాటు ఆయన గుణగణాలను విశ్వసించడం కూడా తప్పనిసరి. ఈ గుణగణాలు ఎంతో విపులంగా వివరించబడ్డాయి. దైవ గుణగణాలను ఇతరులకు ఆపాదించడాన్ని ఇస్లాం ససేమిరా సహించదు. ఏకేశ్వర సిద్ధాంతం శాసనాధికారాలను కూడా దైవానికే కట్టబెడుతుంది. అది నిర్దిష్టమైనదనీ తిరుగులేనిదని కూడా దృఢంగా నమ్ముతోంది. ఫలితంగా దుర్మార్గాలకు ఊతమిచ్చే శాసనమేదీ సమర్థనీయం కాజాలదు.

అదేవిధంగా జ్ఞానానికి మూలం దైవమేనని, దైవజ్ఞానం ప్రపంచమంతా పరివేష్టించి ఉందనీ, దైవం తరపున వహీ ద్వారా లభించిన జ్ఞానం నిర్దిష్టమైన జ్ఞానమనీ, మేధోపరమైన జ్ఞానశాస్త్రాలన్నీ దానికి లోబడే ఉండాలనేది ఏకేశ్వర సిద్ధాంత ప్రతిపాదన. ఈ ప్రాతిపదికన వెలువడే తత్వజ్ఞానం వినాశకరమైన జ్ఞానాలకు సమర్థించే అవకాశమే లేదు. దైవం, దైవప్రవక్త సూక్తులు సురక్షితమైనవి. ఏ సూత్రాలూ తత్వశాస్త్రాలు ఏర్పడినా ఆయా సూక్తుల పరిధిలో ఉండాల్సిందే.

తెలిసో తెలియకో ఉద్దేశపూర్వకంగానో ఉద్దేశ రహితంగానో అధర్మం అన్యాయాలు జాత్యహంకారం దోపిడీవాదానికి కారణం కొందరు మరి కొందరిపై ఆధిపత్య భావజాలాన్ని కలిగి ఉండటమనేది స్పష్టమైంది కనుక ఈ భావజాలాన్ని ఇస్లాం ఆరంభ దశలోనే అత్యంత చాకచక్యంగా అంతం చేసేసింది. మానవ సమానత్వ భావన ఇస్లామీయ సిద్ధాంతంలో అతి ప్రధానమైనది.

దివ్య ఖురాన్ ఇలా అంటోంది :

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి ఒకే స్త్రీనుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ తెగలుగానూ చేసాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు గలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు.

నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞాని, సకల విషయాలు ఎరిగిన వాడూనూ (అల్ హుజురాత్:13)

దైవప్రవక్త (సం)ఉపదేశించారు:

ఒక అరబ్బునికి అరబ్బేతరునిపై గానీ, అరబ్బేతరునికి అరబ్బుపైగానీ, తెల్లవానికి నల్లవానిపైగానీ, నల్లవానికి తెల్లవానిపైగానీ ఎటువంటి ఆధిక్యతా లేదు– దైవంపై భయభక్తుల విషయంలో తప్ప.

వర్ణ వర్గాలకు అతీతంగా సమస్త మానవాళికి గౌరవోన్నతులు ప్రసాదించ బడ్డాయనే విషయాన్ని కూడా దివ్యఖురాన్ చాలా విపులంగా వివరించింది.

మేము ఆదం సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. (అల్ఇస్రా:70)

ఏ ఒక్క ప్రాణిని అన్యాయంగా హతమార్చినా మొత్తం మానవాళిని హతమార్చడంతో సమానమని కూడా ప్రకటించింది.

ఒక మానవుని హత్యకు బదులుగా లేక నేలపై కల్లోలాన్ని రేకెత్తించి నందుకుగాక మరే కారణం వల్లనైనా ఒక మానవుని చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడిన వాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే. (అల్ మాయిదా:32)

మానవులందరి పట్ల న్యాయంగా వ్యవహరించడమే ఇస్లాం ఉద్దేశం. న్యాయం విషయంలో ఎటువంటి వివక్షను ఇస్లాం సమర్ధించదు.

విశ్వసించిన ప్రజలారా! న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం మీ సాక్ష్యం మీకూ, మీ తల్లి దండ్రులకూ, మీ బంధువులకూ, ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులైనా, నిరుపేదలైనా, అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొల గకండి. మీరు గనక సాక్షాన్ని వక్రీకరిస్తూ , న్యాయాన్ని దాటవేస్తే బాగా తెలుసుకోండి మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని. (అన్ నిసా: 135)

సైద్ధాంతికంగా మానవ సమానత్వ సూత్రాలను బోధించడంతోపాటు, ఆయా సూత్రాలను నిత్య జీవితంలో మననం చేసుకునేందుకూ, వాటిని ఆచరించేందుకూ పటిష్టమైన సంస్థలు నెలకొల్పబడ్డాయి. ఐదుపూటలా ఆచరించే నమాజు దైవ విధేయతకు దృఢమైన ప్రతీక కాగా, మానవ సమానత్వ

భావనకు మహిమాన్వితమైన మూల మార్గం. భిన్నజాతులు తెగలు సామాజిక నేపథ్యానికి చెందిన ప్రజానీకమంతా భుజానికి భుజంకలిపి పాదాలకు పాదాలు కలిపి అందరూ ఒకేవరుసలో నిలబడి దైవసమక్షంలో సాష్టాంగపడతారు. మసీదులో చేసే ఈ విధమైన ప్రార్థనా విధానంతో మనుషుల్లో ఉన్న నిమ్నోన్నతా భావాలు వివక్షా వ్యత్యాసాలన్నీ మటుమాయమై పోతాయి.

పేద ధనిక పాలకులు పాలితులందరూ ఏకమయ్యారు,
నీ సమక్షంలో హాజరై అందరూ సమానులయ్యారు,
మహమూద్ అయాజ్లిద్దరూ ఒకే వరుసలో నిలబడ్డారు
వారిలో దాసుడు, దాసుని కటాక్షించేవాడన్న వ్యత్యాసమే లేదు

(అల్లామా ఇక్బాల్)

రమజాన్ మాసపు ఉపవాసాలు మనిషిలో దైవం పట్ల నిర్మలమైన ప్రేమ త్యాగమయ భావాలను జనింపజేయడమే కాక సామాజికంగా కూడా ఉపవాసిలో పేదల పట్ల జాలి, దయా గుణాలను జనింపజేస్తాయి. ఉపవాసాలు పాటించే క్రమంలో పేద ధనిక యావత్ ప్రపంచం ఒకేసారి ఉషోదయాన మేల్కొనడం, ఒకే సమయంలో సహరీ ఇఫ్తార్‌లను ఆచరించడం మానవ సమానత్వ సందేశాన్ని చాటుతాయి. హజ్ ఇస్లామీయ సమానత్వ సిద్ధాంతానికి సహజ ప్రతీక. విభిన్న జాతులు తెగలు సమాజాలకు చెందిన ముస్లింలు ఒకేవిధమైన నిరాడంబరమైన దుస్తుల్లో, ఒకే విధమైన గుడారాలలో సాత్వికుల మాదిరిగా ఆరు దినాలు గడుపుతారు. మానవులంతా ఒకే దైవానికి దాసులనీ, దైవం ముందు అందరూ దీనులేననీ, దేవుని దృష్టిలో మానవుల సామాజిక హోదాలకు ఎటువంటి ప్రాధాన్యతా లేదనీ మానవులంతా ఒక్కటేనని చాటి చెబుతారు.

జకాత్ ఇస్లాం ధర్మ న్యాయ సూత్రం, ఆర్థిక మూల మంత్రం. సంపన్న పరుల మూల సంపదపై రెండున్నర శాతం పైకం కేవలం పేదల అభ్యున్నతి ఇతర సంక్షేమ కార్యాలకై వసూలు చేయబడుతుంది. ఆదాయానికి బదులుగా ఆస్తుల ప్రాతిపదికన జకాత్ వసూలు చేయడం ఆర్థిక సమానత్వానికి ఆలంబనగా నిలుస్తుంది. మొదటి ఉపయోగం ఏమిటంటే జకాత్ కారణంగా ఓ పెద్ద మొత్తం సంక్షేమ కార్యాలకు లభిస్తుంది. నేడు ప్రపంచ కోటీశ్వరుల

ఆస్తులపై జకాతు గనుక వసూలు చేస్తే ప్రపంచ పేదరిక నిర్మూలనా అంచనాలకు మించి సంపద పోగవుతుంది. రెండవది జకాత్ వసూలు చేయడంవల్ల నిరుత్పాదకమైన ఆస్తులను నిరుపయోగమైన ఆస్తులను మార్కెట్ పరంచేసి, వాటిని ఉత్పాదకమైనవిగా మార్చి వాటి ద్వారా ఉపాధిని కల్పించి తద్వారా పేదరిక నిర్మూలనా మార్గాన్ని సుగమం చేసేందుకు దోహదపడుతుంది.

సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవ్వకుండా ఇస్లాం వడ్డీని నిషేధించింది. సంపద వికేంద్రీకరణకై వారసత్వ పంపకాల్లాంటి అత్యద్భుతమైన సూత్రాలను అందించింది.

ఈ సూత్రాలతోపాటు ఇస్లాం తన అనుయాయులను నిరుపేదలు బలహీనుల హక్కులకై, వారి న్యాయపరమైన సమస్యలపై గళమెత్తాలని పదేపదే ప్రోత్సహించింది. దివ్యఖుర్ఆన్ ప్రకారం దోపిడీశక్తులన్నీ దైవ శత్రువులు, తాగూతులనీ ఖురాన్ అనుయాయులు తాగూతుకు వ్యతిరేకంగా తిరగబడాలని సాధ్యమైనంత మేర ప్రతిఘటించాలని పేర్కొంది. ఆధునిక వ్యాఖ్యానకర్తలు వ్యక్తులూ, అధికార శక్తులనే కాక దైవ శాసనంపై తిరుగుబాటు చేసి మానవ జాతిపై క్రూరమైన దుర్మార్గాలకు దోహదపడే వ్యవస్థను కూడా తాగూత్‌గా ప్రకటించారు.

విశ్వాస మార్గాన్ని ఎన్నుకున్న వారు అల్లాహ్ మార్గంలో పోరాడతారు. అవిశ్వాస మార్గాన్ని ఎన్నుకున్న వారు తాగూత్ మార్గంలో పోరాడుతారు. కనుక షైతాన్ సహచరులతో పోరాడండి. వాస్తవంగా షైతాన్ జిత్తులు ఎంతో బలహీనమైనవని నమ్మండి. (అన్ నిసా: 76)

మూసా ఫిరౌన్ల సంఘర్షణాత్మక సంఘటనలు కూడా దివ్యఖుర్ఆన్ చాలా విపులంగా వివరించింది. ఫిరౌన్ లాంటి జాత్య దురహంకారి దుర్మార్గ పరిపాలకుడి దౌర్జన్యాలకు దురాగతాలకు బానిసలైన బనీఇస్రాయీల్ జాతిలోనే మూసా (అలై) ప్రవక్తగా ప్రభవించారు.

అసలు విషయం ఏమిటంటే ఫిరౌను భూమి మీద తిరుగుబాటు వైఖరిని అవలంబించాడు. దాని ప్రజలను వర్గాలుగా విభజించాడు. వారిలో ఒక వర్గాన్ని అతడు నీచపరిచేవాడు. వారి బాలికలను మాత్రం బతుకనిచ్చేవాడు. నిశ్చయంగా అతడు దుష్టులలోని వాడు. భూమిలో అణచివేయబడిన వారిని కనికరించాలనీ,

వారిని నాయకులుగా చేయాలనీ, వారినే వారసులుగా చేయాలనీ, భూమిలో వారికి అధికారాన్ని ప్రసాదించాలనీ, వారి ద్వారా ఫిరౌను హామానులకూ, తాము భయపడుతూ వచ్చిన దానినే చూపాలని మేము కోరాము.(అల్ ఖసస్:4-6)

దివ్యఖుర్ఆన్ కల్లోల జనులకు వ్యతిరేకంగా బలహీనులకు బాసటగా నిలిచి వారి విముక్తికై పోరాడేందుకు ప్రజాబాహుళ్యం ముందుకు రావాలని మరీ ఆజ్ఞాపించింది.

అసలు మీరు, నిస్సహాయులైన ఆ పురుషులు స్త్రీలు పిల్లలకొరకు అల్లాహ్ మార్గంలో పోరాడక పోవడానికి కారణం ఏమిటీ? బలహీనులవటంచేత అణచబడి, వారు, "మా ప్రభూ! దుర్మార్గులైన నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. మా కొరకు ఒక సహాయకుణ్ణి పంపించు" అని ఫిర్యాదు చేస్తున్నారే! (అన్ నిసా:75)

దైవ వ్యతిరేక దుర్మార్గ శక్తులకు ధీటుగా పోరాడడాన్ని, అవనిలో వ్యాపించిన అల్లకల్లోలాన్ని రూపుమాపేందుకు గైకొనే ప్రయత్నాన్ని దివ్యఖుర్ఆన్ జిహాద్‌గా పరిగణిస్తుంది. ఆపై అది విశ్వాసుల ప్రధాన బాధ్యత అని కూడా పేర్కొంటుంది. అయితే జిహాద్‌కు విభిన్న రూపాలు విధానాలున్నాయనే విషయం కూడా ఇస్లామీయ ఆదేశాలలో వివరించబడింది. శాంతియుతమైన ప్రతిఘటన కూడా జిహాదే. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో షరీయత్ షరతులకు అనుగుణంగా సాయుధ యుద్ధం జరపడం కూడా జిహాదే. పరిస్థితులకను గుణంగా జిహాద్ రూపాలు మారుతుంటాయి కానీ దోపిడీదౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిరంతర కృషి సలపడం విశ్వాసులపై ఉన్న నిత్యబాధ్యత.

ఈ విధంగా ఇస్లాం వలసవాదానికి వ్యతిరేకంగా సుస్థిరమైన శాశ్వతమైన పునాదులను ఏర్పరచింది. ఆ పునాదులపైనే సైద్ధాంతిక స్థాయిలో సామ్రాజ్యవాద భావజాలాన్ని దోపిడీ దుర్మార్గాల విభిన్న రూపాలను వాటి మూలాలతోనే తుదముట్టిస్తుంది. దైవం ముందు జవాబుదారీ భావనతోపాటు మానవ సమానత్వాల స్ఫూర్తిని జనింపచేస్తుంది. ఈ చైతన్య స్ఫూర్తిని నిత్యం సజీవంగా ఉంచేందుకు ఇస్లామీయ ఆరాధనలు తమ వంతు పాత్రను పోషిస్తాయి. వాటి ప్రధాన ఉద్దేశం దైవంతో దాసుని సంబంధాన్ని పటిష్టపరచడమే గాక ఇతర దైవదాసుల పట్ల సరైన రీతిలో సంబంధాలు ఏర్పరుచుకునేవిధంగా

శిక్షణనిస్తాయి. ఆర్థిక న్యాయం, సంపద న్యాయపరమైన విభజన కోసం సుస్థిరమైన సంస్థాగతా వ్యవస్థను ఇస్లాం నెలకొల్పింది. అధర్మం అన్యాయానికి వ్యతిరేకంగా న్యాయ సంస్థాపనకై కృషి సలపాలని సైతం తన అనుయాయులను ఆజ్ఞాపించింది. ఈ విధంగా ప్రతి కాలంలో ఒక క్రియాశీలక వర్గం అన్నివిధాల అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పతాకాన్ని ఎగురవేయాలనే విషయాన్ని బలపరుస్తోంది.

నేడు సత్యధర్మవాదులు అధర్మం అన్యాయం అసమానత్వం, అంటరాని తనం జాత్యహంకార ఆధిపత్య భావజాలం, సామ్రాజ్యవాద వలసవాద శక్తులకు బలమైన ప్రతిఘటనా శక్తులుగా నిలబడాల్సిన అవసరం ఉంది. న్యాయస్థాపన ధర్మసంస్థాపన లాంటి ఇస్లామీయ సిద్ధాంతాలను ప్రపంచం ముందు ప్రత్యామ్నాయంగా ఉంచాల్సిన అవసరం ఉంది. ఆచరణాత్మకంగా కూడా అభాగ్యులు బలహీనులకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉంది.

*(డిసెంబర్ 2015 తేదీన కేరళలోని కన్నూరులో జరిగిన వలసవాదం అంశంపై జరిగిన కాన్ఫరెన్స్‌లో చేసిన ప్రారంభోత్సవ ప్రసంగం).*

**ఆధార గ్రంథాలు**

1) అబ్దుర్రహ్మాన్ బిన్ ముహమ్మద్ బిన్ ఖుల్దూన్

2) ఓరియంటలిజం : Advard Sayeed

3) The Multiple faces of Islamophobia

4) The Un covered Story of Indian enslavement in America

# భారతీయ సమాజంలో ఇస్లాం ప్రాతినిధ్యం

భారతదేశంలో  ఇస్లాం ప్రాతినిధ్యం గురించి మాట్లాడే ముందు ఇస్లాం సందేశ స్వభావాన్ని అర్థం చేసుకోవడం అత్యంతావశ్యకం. దురదృష్టవశాత్తు కొన్ని చారిత్రక కారణాలో లేక ఇతరుల ప్రభావాల వల్లనో అనేకమంది ముస్లింలు ఇస్లామ్ సందేశాన్ని కేవలం 'నోటిప్రచారం' preaching గానే భావిస్తున్నారు.  నిజానికి ఇస్లామ్ సందేశం ఒక సర్వతోముఖమైన ప్రక్రియ. అది జీవిత రంగాలన్నిటిపై పరివేష్ఠించి ఉంది. తమ మాటల ద్వారా చేతలద్వారా సత్యధర్మ సాక్ష్యమివ్వటమే ఇస్లాం సందేశం అనే విషయాన్ని  ఇస్లామీయ ఉద్యమం తన ఆరంభ దశ నుండే ప్రజలకు అవగతపరిచే ప్రయత్నం చేసింది. ప్రచార ప్రసార మాధ్యమాలు పరిశోధనలు రచనా రంగాల్లాంటి సాధ్యమైన మార్గాలన్నిటినీ ఉపయోగిస్తూ మౌఖిక సందేశంతోపాటు, సందేశదాతలు వ్యక్తిగతంగా సామూహికంగా ఇస్లాం జీవన విధానానికి ఆదర్శ రూపాలుగా కనపడుతూ, వారి ఆచరణలు, వ్యవహారాల ద్వారా ఇస్లాం ఏమిటో అర్థమయ్యే టట్టు  ఉండడమే సత్య ధర్మసాక్ష్యమివ్వడం అనే విషయాన్ని మౌలానా మౌదూదీ (రహ్మాలై) 'అమలీ షహాదత్' అనే పారిభాషిక పదం ద్వారా వివరించారు. దివ్యఖురాన్ సత్యధర్మసాక్షులు, న్యాయధ్వజ వాహకులు లాంటి పదాలనూ ఉపయోగించింది.

న్యాయానికై గళమెత్తడం, దైవానికై సాక్ష్యమివ్వడంలో ఒక సంబంధం ఉంది. అదేమంటే న్యాయ ధ్వజవాహకులుగా నిలబడి కృషి సల్పుతున్నప్పుడు ఇస్లాం ఆశయాలు లక్ష్యాలు ప్రజలముందు వాటంతట అవే బహిర్గతమవుతాయి.

ప్రముఖ విద్వాంసులు ధర్మవేత్త దాయీ మర్హూమ్ ఇస్మాయిల్ రాజీ అల్ఫారూఖీ 'జీవన విధానం ద్వారా సందేశం' (Life Style Evangelism) అనే పదాన్ని ఉపయోగించేవారు. దానర్థం ఏమిటంటే మీరు రేయింబవళ్ళు సమాజంలో ఉంటూ, ప్రజలతో మమేకమవ్వాలి. మీ జీవన విధానం ద్వారా ప్రజలకు ఇస్లాం అంటే ఏమిటో తెలియజేయాలి. ఈ విధంగా మీ జీవన విధానం ఇస్లాం ప్రచార సాధనంగా మారాలి. Evangelism through Social Engagement (సామాజిక సంబంధాల ద్వారా సందేశం) అనే మరో పదం కూడా ఉంది. మీరు సమాజంలో ఒక క్రియాశీలక జీవనం కొనసాగించాలి. సామాజిక సమస్యల్లో చురుగ్గా పాల్గొనాలి. ఆ సందర్భంగా మీరు మీ ప్రభావాలను ప్రజలపై వెయ్యగలగాలనేది దాని సారాంశం.

ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మన దేశంలో ఆగ్నేయాసియాలోనూ ఇస్లామ్ పురోగమనంలో (Lifestyle Evangelism, Evangelism through Social Engagement) జీవన విధానం, సామాజిక సంబంధాల ద్వారా సందేశం, ఈ రెండు విధానాల ప్రధానపాత్ర ఉందనే విషయం ఇస్లాం సందేశ చరిత్ర అధ్యయనం ద్వారా తెలుస్తుంది. దైవప్రవక్త (సం) అనుయాయుల జీవనశైలి, ముస్లిం పరిపాలకుల న్యాయశీలత సమానత్వాలు, సూఫీల మానవతా ప్రేమ, పేదల పట్ల వారి దాతృత్వ భావన సముద్ర మార్గాల ద్వారా ఈ దేశానికి వచ్చిన ముస్లిం వర్తకుల వర్తక నీతినిజాయితీలు ఇస్లాంవ్యాప్తిలో ప్రధాన పాత్ర పోషించాయని చెప్పవచ్చు. ఈ విషయాలన్నీ జీవనశైలి, సామాజిక స్ఫూర్తితోనే ముడిపడి ఉన్నాయి. ధర్మప్రచారాన్ని పూర్తిగా మానేయమని చెప్పటం దీని ఉద్దేశం కాదు. మౌఖిక ప్రచారానికి తనకంటూ ఒక ప్రాధాన్యత ప్రాముఖ్యత ఉంది. కానీ సందేశం పేరు వినగానే ఏ పుస్తకాలో ఫోల్డర్లో సింపోజియం సెమినార్‌లో అనే భావజాలం సరైనది కాదు. మన జీవన రంగాలన్నిటిలో సందేశం ఉట్టిపడాలి. అన్ని విధానాలను మనం సమతుల్యంగా ఉపయోగించు కోగలగాలి. ఈ విషయ పరిజ్ఞానం లేకపోతే సందేశ అవకాశాలు సన్నగిల్లుతాయి.

సందేశ ప్రసారంలో దృష్టిలో ఉంచుకోవాల్సిన మరో విషయం 'ఈ దేశంలో మారుతున్న పరిస్థితులు'

ఈ విషయంలో–

రెండు అతి పెద్ద మార్పులు ప్రధానంగా పరిగణించదగినవి.

1. మన దేశం చాలా వేగంగా గ్లోబల్ విలేజ్‌లో భాగమైపోతుంది. ఈ పరిస్థితి దేశమంతటా మధ్యతరగతి వర్గాలలో ప్రధానంగా పట్టణ వర్గాలలో సుదూర మార్పులకు దారి తీస్తోంది. సంపద సమృద్ధి, వ్యాపార వాణిజ్య పారిశ్రామిక అవకాశాలు పుష్టిగా ఉన్నాయి. కట్టుబాట్లు, జీవన విధానాలలో మౌలికమైన మార్పులు సంభవిస్తున్నాయి. నైతిక భావనలు మారిపోతున్నాయి. సమాచార మార్పిడి, వేగవంతమైన ప్రయాణాలు ప్రపంచ దేశాల పరస్పర సంబంధాలను పెంచుతున్నాయి. సైబర్ ప్రపంచంలో ఒక భిన్నమైన సమాజం సంస్కృతులు పురుడు పోసుకున్నాయి.

సమాజంలో పెనుమార్పులు పలు రకాల సంఘర్షణలకు దారి తీస్తాయనడంలో సందేహం లేదు. గ్లోబలైజేషన్‌లో ఈ విప్లవాత్మక ప్రక్రియ ప్రపంచవ్యాప్తంగా పలు రకాల సంఘర్షణలను సృష్టించింది.

మన దేశంలో కూడా ప్రస్తుతం ఈ తరహా సంఘర్షణలు చాలా స్పష్టంగా కనబడుతున్నాయి. వృద్ధులు యువకుల్లో ఎడబాటు, పేద ఉన్నత వర్గాల మధ్య ఎడబాటు, ఉదారవాదులు సంప్రదాయ వాదుల మధ్య ఎడబాటు లాంటివి ప్రతిస్థాయిలో కనపడుతున్నాయి. మహారాష్ట్ర బెంగాల్లాంటి రాష్ట్రాలలో వర్గపోరు చాలా తీవ్రంగా ఉంది. అక్కడ అణగారిన వర్గాల హింసాత్మక ఘటనలు సరికొత్త సవాళ్ళను లేవనెత్తాయి. ఆధునిక సాంప్రదాయిక వర్గాల మధ్య సంఘర్షణ ప్రతీ ప్రధాన నగరంలో మనకు స్పష్టంగా కానవస్తుంది. టీవీల్లో వార్తాపత్రికల్లో జీవనశైలికి సంబంధించి చర్చకు వచ్చే పలు సమస్యలు దీనికి సంకేతాలుగా చెప్పుకోవచ్చు.

ఒక ప్రజాస్వామిక దేశంలో సమాజంలోని సమస్త వర్గాలను సముద్ధరించడం రాజకీయ వ్యవస్థ కనీస కర్తవ్యం. అందుకే ఎంత గ్లోబలైజేషన్ కాలంలో ఉన్నప్పటికీ మన దేశంలో ఇతర దేశాల మాదిరిగా అమెరికాను గుడ్డిగా అనుకరించడం సాధ్యపడదు. ఓ వైపు గ్లోబలైజేషన్ ద్వారా ఏర్పడిన ఆర్థిక అవసరాలు, మరోవైపు పేద ప్రజలు, సాంప్రదాయిక వర్గాల సమస్యలు, వారి చిరకాల స్వప్నాలు ఒక ప్రత్యేక రాజకీయ వాతావరణాన్ని ఏర్పరుస్తున్నాయి. ఈ రెండు పరస్పర విరుద్ధమైన వాతావరణాల మధ్య సమతుల్యతను సాధించే క్రమంలో సరికొత్త ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. ఆ విధమైన ఆలోచనా

ధారలతో అసాధారణమైన అవకాశాలు కూడా ముందుకొస్తున్నాయి. ప్రస్తుతం మనదేశంలో ప్రధానంగా కేరళ ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో నిత్యనూతన అనుభవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇంటర్నెట్ గ్లోబలైజేషన్ అని క్లిక్ చేస్తే అన్నిటికన్నా ఎక్కువ లింకులు భారతదేశానికి చెందినవో లేక ఇక్కడి సమస్యలకు సంబంధించినవో ఉంటాయి.

సమాజంలో కొత్త చర్చలు తెరపైకి వచ్చినప్పుడు కొత్తకొత్త ఆలోచనలకు అవకాశం లభిస్తుంది. ఒక సైద్ధాంతిక ఉద్యమానికయితే ఈ పరిణామం ఒక సువర్ణావకాశం లాంటిది. అల్లకల్లోల వాతావరణంలోనే కొత్తకొత్త ఆలోచనలు మొగ్గ తొడుగుతాయి. వాటికి తగిన ప్రాధాన్యత కూడా లభిస్తుంది.

ప్రపంచీకరణ ప్రక్రియలో సాంప్రదాయిక దురభిమానాలను అంతమొందించే నైపుణ్యం ఉన్నప్పటికీ దురదృష్టవశాత్తు దానితోపాటు మరో పెద్దమార్పు కూడా ఈ దేశంలో సంభవించింది. అదే ఉగ్రవాద ప్రభంజనం.

మనదేశంలో ఉగ్రవాదం హిందూ ముస్లింల మధ్య సుదీర్ఘమైన దూరాన్ని పెంచింది. ఆలోచనా వైరుధ్యాలు ముందు నుండీ ఉన్నప్పటికీ, మారుతున్న కొత్త పరిస్థితులు రెండువర్గాలలో రెండు వేర్వేరు ఆలోచనా ధోరణులను సృష్టించాయి. సోషల్ సైకాలజీ పరిభాషలో దాన్ని Attitude Polarization అని అంటారు. ఉభయ వర్గాలు పరస్పర విరుద్ధమైన ఆలోచనల్లో ఎంతవరకు వెళ్తారంటే ప్రతీ వర్గం జరిగిన ప్రతి సంఘటనను తన ఆలోచనలకు అనుగుణంగా అర్థాలను ఆపాదిస్తుంది. దృఢమైన సాక్ష్యాలను కూడా ఎవరికివారు తమ తమ కోణంలోనే వివరిస్తుంటారు. ఉభయ వర్గాల మధ్య అర్థవంతమైన సంభాషణ అసాధ్యమనిపిస్తోంది. కాబట్టి తీవ్రవాదానికి సంబంధించి పరిస్థితి ఎలా ఉంటుందంటే ఒకవైపు అత్యధిక మంది ముస్లిమేతరులు ప్రతి ముస్లిం తీవ్రవాది కాదు కానీ ప్రతి తీవ్రవాది ముస్లిమేననీ నమ్ముతారు. Every Muslim is not a terrorist: but every terrorist is a Muslim. మరోవైపు ఏ ముస్లిం దోషి కాదనీ, జరిగే సంఘటనలన్నీ కుట్రలేననీ, ప్రభుత్వం కేవలం అబద్ధ ప్రచారం చేస్తుందనేది అత్యధిక మంది ముస్లింల అభిప్రాయం. Attitude polarization లో ఉన్న ఈ దృక్కోణం కారణంగా ప్రతివైపు తీవ్రవాదం మరొక వైపు తీవ్రవాదాన్ని బలపరుస్తుంది. ఈ సంఘర్షణలో వాస్తవాలు ఎవరికీ తెలియకుండానే కనుమరుగవుతాయి. మన దేశంలో జరుగుతుంది కూడా ఇదే.

ఈ పరిస్థితి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మనం అనుభవిస్తున్న మేథోపరమైన సంకుచితత్వాన్ని (Intellectual Ghettoization) మరింత బలపరిచింది. ఫలితంగా మన ఆలోచనాపరులు ముస్లిం మేధావులు చాలామంది సమస్యలను తరతమ భేదాలతో విభజించి చూసేందుకు అలవాటుపడ్డారు. ప్రధానంగా ముస్లిం సంస్థలు, నాయకులు ఎక్కువగా ముస్లిం సమస్యలకే పరిమితమయ్యే అప్రకటిత విధానాన్ని అవలంబించారు. దేశ సాధారణ సమస్యలపై కొద్దోగొప్పో తప్ప ఎక్కువ దృష్టిని సారించలేకపోయారు.

ముస్లిమేతరులతో దైనందిన సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ వివాదాస్పద సమస్యలపై ఒక ముస్లిమేతరుని మనసును నిష్పాక్షికంగా అర్థం చేసుకునే కనీస ప్రయత్నాలు జరగలేదు. ఆ ప్రభావం ముస్లింల మనస్తత్వాలపై కూడా స్పష్టంగా కనపడుతుంది. మౌలానా మౌదూది (రహ్మలై) ఇటువంటి మనస్తత్వాన్ని (Ghetto mentality) ఛేదించేందుకు తీవ్రమైన కృషి చేశారు. మద్రాసు ప్రసంగాలు ఆ ప్రయత్నానికి ప్రతీకలే. ముస్లింలు ఎదుర్కొంటున్న ప్రస్తుత రాజకీయ సంఘర్షణలో మౌలానా ఈ చర్చను పదేపదే వివిధ అంశాలలో లేవనెత్తారు. కానీ స్వాతంత్ర్యానంతరం విభిన్న కారణాలవల్ల ఈ తరహా మనస్తత్వం బలపడుతూనే పోయింది. ప్రధానంగా ముస్లింలు విద్యాజ్ఞానాలు కళావైభవాలు ఆర్థిక రాజకీయ రంగాలలో దేశానికి తమ అమూల్యమైన సేవలను అందించినప్పటికీ, అందులో మెజారిటీ ముస్లింలు సెక్యులర్ భావాలు గలవారు ఇస్లాం విమర్శకులై ఉండటం మూలాన దేశ ప్రధాన స్రవంతిలో ముస్లింల పాత్ర చెప్పుకోదగ్గ స్థాయిలో లేదనే చెప్పాలి. ఫలితంగా ఇస్లాంలో ఉన్న మత ఛాందస వాదం మనిషిని సంకుచిత స్వభావుడిగా మార్చివేస్తుందనీ, ఒక ముస్లిం వ్యక్తి ఉనికితో ముస్లిమేతరులకు ఎటువంటి ప్రయోజనం ఉండదనీ, ఇస్లాం ధర్మం కూడా నాజీయిజంలాంటి దృక్పథమేనని, అది కేవలం ముస్లింల సంక్షేమానికే ప్రాధాన్యతనిస్తుందనే భావాలకు మరింత బలం చేకూరింది. ఈ భావన సత్యధర్మసాక్ష్య స్ఫూర్తికి విరుద్ధమైనది. కేవలం ఇస్లామీయ బోధనలపై ప్రసంగాలు దంచడంతో ఈ అవరోధాలను మనం అధిగమించ లేము. దాని కొరకు మన ఆచరణాత్మక వ్యవహారాలలో మౌలికమైన మార్పులు తీసుకు రావడం అవసరం.

ఈ నేపథ్యంలో మనం ఇస్లాంను ప్రత్యామ్నాయ ధర్మంగా ఎలా చూపాలనే

విషయంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో మన కార్యాచరణకు సంబంధించిన క్రింది అంశాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

1. ముందుగా చెప్పుకున్న విధంగా ప్రస్తుతం దేశమంతటా కొత్తకొత్త చర్చలు పుట్టుకు వస్తున్నాయి. సరికొత్త ఆలోచనలు తెరపైకి వస్తున్నాయి ఈ చర్చల్లో మనం మొక్కవోని ధైర్యంతో మరింత ఆత్మవిశ్వాసంతో భాగ స్వాములు అవ్వాల్సిన అవసరం ఉంది. ఇస్లాం శాంతి కపోతం. మధ్యేమార్గాన్ని అవలంబించడం దాని ప్రత్యేకత. అది సమాజంలోని అన్నివర్గాల పట్ల సమతుల్యతా భావాన్ని చూపుతుంది. ఇస్లాం ధర్మంలో ఉన్న స్ఫూర్తి స్వభావాలు, వాటి ఆశయాలను దృష్టిలో ఉంచుకొని సృజనాత్మక కార్యాలపై దృష్టిసారిస్తే మనం మంచి ఆలోచనలను అందించవచ్చు. అభివృద్ధి విధానం, ఆర్థిక క్రమశిక్షణ, పర్యావరణం, విద్యా వ్యవస్థ, కుటుంబం జీవనశైలికి సంబంధించిన అనేక ఆలోచనా విధానాలను ఇస్లామీయ ఆలోచనాపరులు ప్రవేశపెట్టవచ్చు. ఈ ఐడియాలు ఇస్లాం పేరిట, దాని ఆధారాల పేరిట కూడా ప్రవేశపెట్టవచ్చు అవసరమనుకుంటే ఇస్లాం పేరును ప్రస్తావించకుండా కూడా పెట్టవచ్చు. దానికోసం క్రియాశీలక మేధోసంపత్తి, వారి ద్వారా అత్యున్నత పరిశోధనల ప్రచురణలు, శాస్త్రీయ సమావేశాలు, సెమినార్లు, పాలసీ చర్చలు, ప్రభుత్వ సలహా సంప్రదింపుల సమావేశాలు, టీవీలలో చర్చాగోష్టులు, దినపత్రికలు వార్తాపత్రికల ఎడిటోరియల్ళ్ళలో భాగస్వామ్యులవడం తప్పనిసరి. దాని కోసం విజ్ఞులైన సామాజిక రాజకీయ శాస్త్రజ్ఞులను తయారు చేసేందుకు కృషిచేయాలి. సమాజంలో ఉన్నటువంటి ఈ తరహా సాధుస్వభావ వ్యక్తులను వర్గ దురభిమానాలకతీతంగా పనిచేసేందుకు పురిగొల్పాలి.

2. ఇస్లాం సత్యధర్మ సాక్ష్యానికై మన స్వరూపంలో మౌలికమైన మార్పులను చేసుకోగలగాలి. అందులో భాగంగా మొట్టమొదట తరతమ బేధాలను విడిచిపెట్టాలి. మన వ్యక్తులలో సంఘాలలో సంస్థల్లో ఇక్కడి ప్రజా బాహుళ్యంతో కలిసిపోయే సహజ స్వభావాలు అలవడాలి. తాము ఈ దేశ ప్రజల శ్రేయోభిలాషులమనీ, వారి సమస్యలపై స్పందించేందుకు నిత్యం సంసిద్ధులుగా ఉన్నామనే నమ్మకాన్ని ప్రజలలో కలుగజేయాల్సిన అవసరం ఉంది. సాధారణ ముస్లిం సమాజమేకాక ఇస్లామీయ ఆలోచనాపరులు కూడా

సమాజంతో మమేకం కావాలి. కేవలం సాంప్రదాయిక పరంగానే కాకుండా అత్యంత అంకితభావంతో చురుకుదనంతో ముస్లిం సమాజ సమస్యలపై ఎలా స్పందిస్తామో, సగటు దేశ సమస్యలపై కూడా అదే వైఖరిని అవలంబించాలి. ముస్లిం సమాజ సమస్యల సాకుతో కాకుండా దేశ సమస్యలపై మనస్ఫూర్తిగా స్పందించే తత్వాన్ని అలవర్చుకోవాలి.

3. ఈ ఆశయ సాధనకై జీవితపు ప్రతీ రంగంలో మన వ్యవహారశైలి క్రియాశీలకంగా, కార్యదక్షత ఉట్టిపడే విధంగా ఉండాలి. మనం శ్రేష్ట సమాజానికి చెందినవారం కనుక వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ ప్రపంచానికి పంచిపెట్టే సాధనాలుగా మారాలి. మన వ్యవహారశైలి, నిర్మాణాత్మక భాగస్వామ్యం ద్వారా ఇస్లాం బోధనలు వాటి సహజ స్వభావాలు ప్రజల్లో చేరగలగాలి. విప్రో (wipro) స్థాయి కల ఒకటి అరా పెద్ద వాణిజ్య సంస్థలు ఇస్లాం వ్యాపార విధానాన్ని అందించగలిగితే వాణిజ్య పత్రికలు వార్తాపత్రికల్లో బిజినెస్ పేజీలపై కొనసాగే చర్చలు వేలాది పుస్తకాలు సమావేశాలపై బరువవుతాయి. నిరుపేదలు ఆదివాసీలు అభాగ్యులు మహిళలు తదితరుల సంక్షేమానికై ఎన్జీవోలను స్థాపించి నడిపగలిగితే, ఇస్లాం ఆధ్యాత్మికతా స్ఫూర్తి, షరియా బోధనల ప్రత్యేకత కారణంగా మన కార్యరూపం సెక్యులర్ రూపానికి భిన్నంగా ఉంటుంది. దానిద్వారా ఇస్లాం విశిష్టత మరింత హైలెట్ అవుతుంది. ఇస్లాం స్ఫూర్తి స్వభావాలను సరళీకరించే బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ మైక్రోఫైనాన్స్ లాంటి ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థలు, శాస్త్రీయ, పరిశోధనా సంస్థలు, సంక్షేమ సంస్థలు, ఆస్పత్రులు ఆరోగ్యసంస్థలు, ఎం.పీ.జే. లాంటి ఉద్యమాలు, యువజన సంఘాలు విద్యార్థి సంఘాలు మొదలైనవన్నీ సత్యధర్మ సాక్ష్యానికి ప్రతిరూపాలుగా ఉండాలి. రాజకీయ వ్యవహారాలలో కూడా ఇస్లామీయ రాజకీయాలు కేవలం ముస్లింల వరకే పరిమితంకావనీ, ఇస్లామీయ ఉద్యమాలు రాజకీయం లాంటి సున్నితమైన రంగంలో కూడా ప్రజలందరి న్యాయపరమైన అవసరాలను తీర్చుతాయని తెలిసినప్పుడే ప్రజలు 'హాకిమియతె ఇలాహియ' అంటే దైవ సార్వభౌమాధికార వ్యవస్థ పట్ల నిష్పాక్షికంగా ఆలోచించడానికి సిద్ధమవుతారు.

ప్రస్తుతం ఈ పనులన్నీ మనం చేస్తున్నవేనని ఎవరైనా అనొచ్చు. వాస్తవానికి సామాజిక సేవా స్ఫూర్తితో చేస్తున్న ఈ పనులన్నీ మనం ఏ సత్యధర్మ శ్రేయోభిలాషులమో ఆ సత్యధర్మ సాక్ష్యానికి ప్రతీకలుగా ఉండాలనే విషయాన్ని

మరువకూడదు. ఈ కార్యాచరణ ఇస్లాం స్వభావాన్ని మెరుగుపరిచే విధంగా ఇస్లాంను వాస్తవమైన రీతిలో పరిచయం చేసే విధంగా ఆపై ప్రజలను ఇస్లాంవైపు ఆకట్టుకునే విధంగానూ అత్యున్నతమైన రీతిలో చేయగలగాలి. నా ఉద్దేశ్యం సందేశ కార్య ప్రాధాన్యతను తక్కువ చేసి చూపడం కాదు. సందేశ కార్య రంగంలో ఇవన్నీ నిబిడీకృతమై ఉన్నాయని చెప్పడం అసలు ఉద్దేశం. సందేశ ప్రచారంతోపాటు సత్యధర్మ సాక్ష్యం కూడా తప్పనిసరి. ఆయా విషయాలన్నీ కలగలసినప్పుడే సందేశ కార్యం పరిపూర్ణమవుతుంది.

4. ఇస్లాం అభివృద్ధి మార్గంలో మరో పెద్ద అవరోధం మన గుర్తింపునకు సంబంధించిన సమస్య. దాన్ని సామాజిక నిపుణులు Identity Conflictగా పేర్కొంటారు. మన దేశంలో ముస్లింల గుర్తింపు సైద్ధాంతికంగా కాకుండా సాంస్కృతిక పరమైన జాతిపరమైన గుర్తింపుగానే మిగిలిపోయింది. ఒక వ్యక్తికి ఓ కొత్త సిద్ధాంతాన్ని దృక్పథాన్ని అలవర్చుకోవడం ఎంత కష్టమో తన గుర్తింపును త్యజించడం అంతకన్నా కష్టమైన విషయం. ఒక ముస్లింకు ఒకేవిధమైన Single Identity గుర్తింపు అవసరమా? లేక Multiple Identities బహుళ గుర్తింపుల వ్యవస్థను కూడా పెట్టవచ్చా? అనే ప్రశ్నను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. దివ్యఖుర్ఆన్ బహుళ గుర్తింపులను అంగీకరించింది.

దివ్య ఖుర్ఆన్‌లోని అరబ్బీ ఆయతులో ఉన్న 'ఉర్ఫ్' (గుర్తింపు) అనే పదం ఆధునిక పరిభాషలోని ఐడెంటిటీకి భిన్నమైన పదమా?

ప్రవక్త మహనీయుల కాలంలో ఇస్లాం స్వీకరించిన తరువాత కూడా అవ్‌సీ, ఖజ్రజీ, దౌసీ, ఖురైషీలాంటి పేర్లతో గుర్తించబడేవారు. తెగల పరస్పర అనుబంధాలపై ఇస్లాం ధర్మానికి ప్రాబల్యం ఉన్నప్పటికీ తెగల గుర్తింపు పూర్తిగా కనుమరుగయ్యేది కాదు. ఇస్లాం వేగంగా వ్యాపించిన కాలాలలో కూడా ప్రతి చోటా ఈ విధానం కొనసాగింది. నవ ముస్లింలు తమ మతాన్ని విశ్వాసాలను మార్చుకున్నప్పటికీ ధర్మసమ్మతమైన పరిధులలో తమ సభ్యతా సంస్కృతులు, నాగరికతా విధానాలు, పేర్లు, భాషలు, పారిభాషిక పదాలు జాతి గుర్తింపులను కొనసాగించేవారు. మతపరమైన విషయాలలో కూడా దైవం, దైవప్రవక్త, నమాజ్, రోజా లాంటి అరబ్బేతర పారిభాషిక పదాలు ముస్లింలలో సర్వసాధారణ మయ్యాయి. దానికి విరుద్ధంగా నేడు నవముస్లింతో తన గుర్తింపును పూర్తిగా

మార్చుకోవాలనే ఒత్తిడి కనబడుతోంది. ఈ దేశంలోని అధిక శాతం జనాభా సైద్ధాంతికంగా విశ్వాసపరంగా బలహీనమైనప్పటికీ వారి ఇక్కడి సాంస్కృతిక జాతిపరమైన పునాదులు పటిష్టంగానే ఉన్నాయి. కనుక మన సిద్ధాంతాలు, విశ్వాస చిహ్నాలు, జాతిపరమైన సంస్కృతి పరమైన గుర్తింపుతో వేరు కాగలిగితే ఇస్లాం అభివృద్ధి మార్గంలో అవరోధంగా మారిన చారిత్రక సంఘర్షణ బలహీనపడే అవకాశం ఉందనేది నా అభిప్రాయం. ఇక్కడ సంస్కృతి అంటే జీవన శైలి, ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు అని అర్థం. సాధారణంగా వాటి విషయంలో ఇస్లాం తటస్థం (న్యూట్రల్)గా ఉంటుంది. కానీ ఈ విషయం చెప్పుకున్నంత సులభం ఏమీ కాదు. దానికై మన వైఖరిలో మౌలికమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

5. అదేవిధంగా మరో విషయం, మన వైఖరిలో ఎటువంటి అస్పష్టత ఉండకూడదు. ఎలాంటి సంకోచం లేకుండా పూర్తి విశ్వాసం నమ్మకంతో మన చేతలద్వారా మాటలద్వారా సత్యధర్మ సాక్ష్యమిచ్చే విషయంలో మన శైలి హాస్యాస్పదంగా ఉండకూడదనే విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. ఆత్మవిశ్వాసం లేకపోవడం మూలాన తరచూ జాతులలో తమ గుర్తింపు పట్ల మంకుపట్టు ఏర్పడుతుంది. సైద్ధాంతిక జాతిపరమైన మన చిహ్నాలు కలగలసి పోయిన సమాజంలో ప్రతి విషయానికి మనం ఇస్లాం పేరును జత చేసి ప్రవేశపెడితే మన ఈ వైఖరి కేవలం ముస్లిం సమాజంతోనేకాక ఇస్లామీయ సిద్ధాంతాల నుండి సైతం అది ప్రజలను దూరం చేయవచ్చు. మనం ఇస్లామీయ స్కూల్‌ను స్థాపిస్తే అది ఒక సగటు భారతీయుడి దృష్టిలో కొన్ని ప్రత్యేక నియమాలపై నడపబడే స్కూల్‌కాక ముస్లిం సంఘానికి చెందిన స్కూల్ అవుతుంది. అలాంటప్పుడు ఇతరులు దానిపై దృష్టిసారించే అవకాశం ఉండదు. ఈ విధంగా ఇస్లాం అనే పేరు మొదటి దశలోనే ఇది మనది కాదు అనే అపరిచిత భావనకు దారి తీస్తుంది. కులమతాలకు అతీతంగా వాస్తవ పరిధిలో ఆలోచించే వారు చాలా తక్కువ మంది ఉంటారు. మనం చేసే ఎన్నో మంచి మంచి ప్రయత్నాలు కేవలం ముస్లింల వరకే పరిమితం అవడానికి ఓ కారణం టైటిల్‌పై, గుర్తింపు (Identity)పై మంకుపట్టు కలిగి ఉండడమే.

6. సైద్ధాంతికంగా కూడా ఇస్లాం అభివృద్ధి మార్గంలో రెండు పెద్ద అవరోధాలున్నాయి. మొదటి అవరోధం విషయానికి వస్తే, మౌలానా మౌదూదీ

(రహ్మ) సెక్యులర్ లాజిక్ లేక సెక్యులర్ ఆలోచనాశైలిగా దీన్ని ప్రస్తావించారు. ఒక సగటు భారతీయ విశ్లేషకుడు మతాన్ని, మతపరమైన బోధనలను సామూహిక స్థాయి స్థానమిచ్చేందుకు ఓ పట్టాన అంగీకరించడు. సామూహిక జీవితంలో మతపరమైన జోక్యాన్ని అశాంతి అస్థిరతకు మూలకారణమని భావిస్తాడు. ఈ తర్కాన్ని విడనాడడం కూడా మన ముందున్న అతి పెద్ద సవాలు. కానీ సెక్యులర్ భావాలను విస్మరించే క్రమంలో ప్రారంభ దశలోనే ఏకంగా 'హుకూమతే ఇలాహియ' భావజాలాన్ని ప్రవేశపెట్టడం సరైన పద్ధతి కాదు. అది తిరిగి మనకే నష్టదాయకం అవుతుంది. మొదటి దశలో ఉదాహరణకు చందర్ ముజఫర్ మలేషియాలో లేవనెత్తిన చర్చను మనం కూడా లేవనెత్తవచ్చు. సామూహిక జీవితంలో మత ప్రాధాన్యత దాని ఆవశ్యకత, మతాన్ని విస్మరిస్తే కలిగే నష్టాలను చర్చనీయాంశంగా చేసుకోవచ్చు.

సామూహిక జీవితంలో మతం పేరిట అలజడులు అల్లకల్లోలాలు ఏర్పడడానికి ప్రధాన కారణం మతాన్ని దుర్వినియోగపరుస్తూ మతం పేరిట మూఢత్వాన్ని ఆపాదించడమేననీ, మతం మతబోధనలను సరైన రీతిలో సద్వినియోగం చేసుకుంటే దాని ద్వారా ఎన్నో సంక్లిష్టమైన సమస్యలు పరిష్కృత మవుతాయనే విషయాన్ని శాస్త్రీయంగా వారి ముందు ఉంచాల్సిన అవసరం ఉంది.

రెండవ అవరోధం సర్వధర్మ సంభావనా సిద్ధాంతం. వేదాంత చర్చల్లో దాని మూలాలు మొదటి నుండి ఉండనే ఉన్నాయి. నవీన లౌకికవాద ఉద్యమాలు దీన్ని మరింత బలపరిచాయి. ఒకవిధంగా చెప్పాలంటే ఇది మనదేశంలో నేటి ప్రభుత్వ అధికారిక సిద్ధాంతంగా మారుతోంది. ఈ భావజాలం కూడా అవరోధమే. విభిన్న వాదాలలో నేటి శాస్త్రీయ ప్రపంచం అవలంబించే విధానమే, మతం విషయంలో కూడా శాస్త్రీయ విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో వివరించాల్సిన అవసరం ఉంది. ఫిజిక్స్, బయాలజీ, మెడికల్ సైన్స్, సైకాలజీ, హిస్టరీ, సోషియాలజీ లాంటి శాస్త్రీయ రంగాలలో ఉన్నటువంటి అనేక సమస్యలపై శాస్త్రవేత్తలలో భిన్నాభిప్రాయాలున్నాయి. భిన్న అభిప్రాయాలు కలిగిన విద్యావంతులు శాస్త్రవేత్తలు కూడా తమ తమ సిద్ధాంతాలపై స్థిరంగా ఉంటూ, శాస్త్రీయ పరిశో ధనలు చేస్తూ, ఒకే విజ్ఞానశాస్త్ర విభాగంలో శాస్త్రవేత్తలుగా ఉంటారు. మరి

అలాంటప్పుడు వివిధ సిద్ధాంతాలను ప్రతిపాదించేవారు భిన్నాభిప్రాయాలు కలిగి ఉండే విధంగానే మతపరమైన వ్యక్తులు కూడా భిన్నాభిప్రాయాలను కలిగి ఉంటారనీ, ప్రతి దానిని సమర్థించరనీ ఎందుకు అంగీకరించడం లేదు.

ఈ అంశంపై ఆలోచించేందుకు చర్చించేందుకు ఈ కొన్ని విషయాలను ఇక్కడ లేవనెత్తడం జరిగింది. అందరూ దీన్ని ఏకీభవిస్తారని నేననుకోవడం లేదు. కానీ మనం ఎదుర్కొనే సామాజిక వాస్తవాలు కూడా అరుదైనవే. దీని ఉదాహరణలు ఉపమానాలు ముస్లింల చరిత్రలో కూడా బహు అరుదుగా లభిస్తాయి. కనుక వాటిపై ఆలోచించడం సరికొత్త మార్గాలను అన్వేషించడం మన బాధ్యత. ఆలోచనా విధానంలో తప్పులు జరిగే అవకాశం ఉంది. భిన్నాభిప్రాయాలకు ఆస్కారముంది. కానీ అసలు విషయం మనం విశాలమైన దృక్పథంతో ఆలోచించాలి. మౌలికమైన విషయాలు తప్ప వేటినీ ఖచ్చితమైనవిగా భావించకూడదు. విశాలమైన వాతావరణంలో మేధోమధనం చేసే అలవాటును అలవర్చుకోవాలి.

దైవం ఈ పరంపరను మరింత ముందుకు సాగించాలని కోరుకుంటున్నాను.

(ఈ ప్రసంగం ఎస్. ఐ. ఓ ఆఫ్ ఇండియా 25 అక్టోబర్ 2009న ఎస్.ఐ.ఓ హెడ్క్వార్టర్ న్యూఢిల్లీలో నిర్వహించిన సెమినార్‌లో చెయ్యడం జరిగింది.)

# భారతదేశంలో ఇస్లామీయ ఉద్యమ వికాసం - వర్తమాన కార్యాచరణ

ఇస్లామ్‌లో సుస్థిరమైన ప్రమాణాలు నిత్యనూతనంగా అలరారే ప్రమాణాలూ రెండూ ఉంటాయి. ఇస్లామీయ ఆలోచనా విధానంలో ఉన్న ఈ ప్రత్యేకత మానవ నైజానికి సరితూగినదే. మానవ నైజం శాశ్వత, తాత్కాలిక ప్రమాణాలపై ఆధారపడి ఉంది. మానవ నైజంలోని ఎన్నో విషయాలు విశ్వజనీనమైనవి. నేటికి వెయ్యేళ్లకు ముందు కూడా మనిషి ఆకలిదప్పికలు లైంగిక భావనలు కలిగి ఉండేవాడు. కాంతాకనకాలపై విపరీతమైన వ్యామోహం ఉండేది. మంచీ చెడుల సంఘర్షణ అప్పుడూ ఉండేది. నేడూ ఉంది. మరో 1000 ఏళ్ళ తర్వాత కూడా ఉంటుంది. ప్రకృతి సహజమైన ఈ విషయాలలో అమెరికా ఆఫ్రికాకు చెందిన మనుషులలో సైతం ఎటువంటి వ్యత్యాసం కానరాదు. ఇవి మానవ నైజంలోని ఒక ప్రధానమైన భాగం. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకోవడం అనేది విశ్వజనీనమైన ధర్మంలోనే ఉంటుంది. కనుక ఇస్లాం ధర్మంలోని అనేక మౌలిక నియమాలు విశ్వజనీనమైనవనడంలో ఎటువంటి సందేహం లేదు. కాల ప్రాంతాలకతీతంగా ఆయా నియమ నిబంధనల మూలాధారాలు దివ్య ఖుర్‌ఆన్ హదీసులతో ముడిపడి ఉన్నాయి. విశ్వజనీనమైన ఇస్లామీయ ఆలోచనా విధానమే మానవ జీవితానికి స్థిరత్వాన్ని ప్రసాదిస్తుంది.

మానవ నైజంలోని కొన్ని విషయాలు మాత్రం తరచూ మారుతుంటాయి. సమయానుగుణంగా కాల ప్రాంతాలకనుగుణంగానూ. ఒక పట్టణ సంస్కృతి గ్రామీణ సంస్కృతికి చెందిన మనుషుల్లో కూడా బహు వ్యత్యాసం ఉంటుంది. అదేవిధంగా నేటికి వెయ్యేళ్ళకు ముందున్న నాగరికతా సంస్కృతుల్లో

నేటి ఆధునిక సంస్కృతిలో అనూహ్యమైన వైవిధ్యం ఉంది. మార్పుకు అతీతమైన సిద్ధాంతం ఇటువంటి వైవిధ్యాలకు ఏవిధంగానూ సరితూగదు. ఇస్లామీయ ఆలోచనా విధానంలో, ఇటువంటి మార్పు చెందే విషయాల్లో దివ్యఖురాన్ బోధనలు ఖచ్చితమైన విధివిధానాలను ప్రతిపాదించవు. అటువంటి వ్యవహారా లలో సూత్రప్రాయక మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి. ఆ సూత్రాల వెలుగులో వాటిని అన్వయించుకోవడం ఇస్లామీయ విద్వాంసుడి వివేకంపై ఆధారపడి ఉంటుంది. ఇస్లాం మానవ జీవితంలో ఎదురయ్యే మార్పులకు అనుగుణంగా సరైన సమంజసమైన మార్గనిర్దేశనం చేసేందుకు ఇజ్తిహాద్ లాంటి ఆయుధాన్ని అందించింది. ఇస్లామీయ విద్వాంసులు ఆలోచనాపరులు తమ తమ కాలపరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను అవగతం చేసుకుని వాటికనుగుణంగా ఇజ్తిహాద్ స్ఫూర్తితో ఇస్లాంను వివరించారు.

ప్రతి ఇస్లామీయతత్వవేత్త, విద్వాంసుడు తన సమాజ పరిస్థితుల పట్ల ప్రభావితమై ఉంటాడు. అతను ఆ సమాజంలో చలామణిలో ఉన్న సాంస్కృతిక సంప్రదాయాలు ఆలోచనా విధానాలనే ఇస్లామీయ స్ఫూర్తితో సమాలోచన చేస్తాడు. కనుక ఏ ఇస్లామీయ తత్వవేత్త ఆలోచనాసరళిని అర్థం చేసుకోవాలన్నా అతనికి ఎదురైన సమకాలీన సమస్యలు సైద్ధాంతిక సవాళ్లను ముందు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. నేపథ్యాన్ని అర్థం చేసుకోకుండా ఎవరి దృక్పథాన్నీ సరైన విధంగా అర్థం చేసుకోవడం సాధ్యపడదు.

అదేవిధంగా ఇస్లామీయ తత్వవేత్తల తాత్విక దృక్పథాలు ఇస్లాంను, సర్వశ్రేష్టుడైన సృష్టికర్త ఉద్దేశాన్ని అర్థం చేసుకునే మానవ సహజ ప్రయత్నమేనని అంగీకరించాల్సిన అవసరం ఉంది. ఇజ్తిహాద్ నూటికి నూరుపాళ్లు సరైనదై ఉంటుందని కూడా చెప్పలేం. అందులో తప్పిదాలకు ఆస్కారం కూడా లేకపోలేదు. ఇస్లామీయ విద్వాంసుల ఆలోచనాసరళి సూత్రప్రాయంగా ఖురాన్ సున్నతుల వెలుగులోనే ఉన్నప్పటికీ, వారి ఆలోచనా విధానాలను స్వచ్ఛమైన ఖురాన్ సున్నతుల ప్రతిబింబాలనీ ప్రకటించలేము. ఆయా విద్వాంసుల ఆలోచనా విధానాలన్నీ పొరపాట్లు తప్పిదాలకు అతీతమైనవనీ చెప్పలేము. అది కేవలం ప్రవక్తలకే పరిమితం. ప్రవక్తల బోధనలు దైవం, దైవాదేశాలక నుగుణంగా స్వచ్ఛమైన అనువాద వ్యాఖ్యానాలని అంగీకరించవచ్చు. అంతే తప్ప ఏ తాత్వికుడినీ ప్రవక్తకు సరిసమానంగా పోల్చలేము.

ఇప్పుడు మనం మౌలానా మౌదూది (రహ్మాలై) గారి కొన్ని విచార ధారలను మౌలానా గారి కాలపరిస్థితుల నేపథ్యంలో విశ్లేషిద్దాం. గత 70 సంవత్సరాల కాలంలో ఇస్లామీయ ఉద్యమంలో జరిగిన క్రమవికాసం వాటి నేపథ్యాలను కనుగొనేందుకు ప్రయత్నిద్దాం. ఇస్లామీయ ఉద్యమ పూర్వీకుల రచనలు, వారి ఆలోచనా విధానాలు, ప్రపంచవ్యాప్త ప్రయత్నాల ద్వారా కూడా ఇస్లామీయ ఉద్యమంలో జరిగిన క్రమవికాసం ఏమిటో అర్థమవుతుంది. పాలసీలు ప్రోగ్రాములు తీర్మానాల రూపంలో జరిగే సామూహిక నిర్ణయాల ద్వారా కూడా ఉద్యమ పురోగమనమేమిటో బోధపడుతుంది.

## మౌలానా మౌదూది (రహ్మాలై) ఆలోచనా ధారల చారిత్రక నేపథ్యం

మౌలానా మౌదూది (రహ్మాలై) తన కార్యరంగాన్ని ప్రారంభించి, ఇస్లామీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే విధంగా సైద్ధాంతిక విప్లవాన్ని సృష్టించిన పరిస్థితులు, ఆ పరిస్థితుల ప్రత్యేకతలు ఈ విధంగా ఉన్నాయి.

1. యూరప్ నుండి బయలుదేరిన ఆధునీకరణ అనతికాలంలోనే ప్రపంచమంతటా చుట్టేసింది. చర్చి మతంతో సంఘర్షణాత్మక వాతావరణంలో పురుడు పోసుకున్న ఆధునిక భావజాలాలు వలసవాదుల రాజకీయ సైనిక శక్తియుక్తులతో ప్రపంచమంతటా వ్యాపించాయి. యూరప్ సాంస్కృతిక పునరుజ్జీవనం కాలంలో పురుడు పోసుకున్న భావజాలాలు ఆధునికీకరణకు అంకురార్పణ చేశాయనటంలో అతిశయోక్తి లేదు. ఆ భావజాలాల తాత్విక పునాదులను ప్రతిపాదించడంలో ఫ్రాన్సిస్ బేకన్, రైన్డెకార్ట్, థామస్ హొబస్ లాంటి తత్వవేత్తలు ప్రధాన భూమికను పోషించారు. వారి ఆలోచనల సారాంశం ఏమిటంటే మానవ మేధస్సు విశ్వవ్యాపిత వాస్తవాలను శోధించే బలమైన శక్తియుక్తులు కలిగి ఉంది కనుక అగోచర వాస్తవాలను కనుగొనేందుకు మనిషికి ఎటువంటి విశ్వాసమూ మతపరమైన జ్ఞానమూ అవసరంలేదు. ఆలస్యంగానైనా సైన్స్ అన్ని విషయాల మూలాలను అత్యద్భుతంగా కనుగొనే శక్తి కలదని వారి నమ్మకం. దాని ఫలితంగానే శాస్త్రీయ విజ్ఞాన రంగంలో దీర్ఘకాలం వరకు పాజిటివిటి అనే సూత్రప్రాయక మార్గదర్శకత్వమే మూలం అయ్యింది. ఏ విషయం అయితే సైన్స్, మానవ మేధోశక్తి అనుభవాత్మక పద్ధతుల ద్వారా నిరూపితం అవ్వదో అది శాస్త్రీయంగా ఆమోదయోగ్యం కాజాలదనేది

దాని సారాంశం. తత్ఫలితంగా ఈ విధమైన ఆలోచనా ధోరణి ప్రపంచమంతటా నాస్తికత్వానికి నాంది వేసింది. ఆ ప్రాతిపదికలపైనే ఆధునిక విజ్ఞాన శాస్త్రాలు దరిమిలా ఆధునిక విద్యావ్యవస్థ కూడా ఆ పునాదులపైనే నెలకొల్పబడింది.

ఆధునికీకరణ ఉద్యమం చర్చితో సంఘర్షించి ఉనికిలోకి వచ్చింది కనుక చర్చి మతం వైజ్ఞానికాభివృద్ధిలో ప్రధాన అవరోధంగా మారింది. తత్ఫలితంగా మతం మనిషి వ్యక్తిగత వ్యవహారమని సామూహిక జీవితంలో మతపరమైన జోక్యం మానవ సమస్యలకు మూల కారణమనే భావన కూడా ఉత్పన్న మయింది. కనుక రాజకీయపరంగా లౌకికవాద భావజాలం ప్రాధాన్యతను సంతరించుకుంది.

మతాధిక్య భావన బలహీనపడిన తరువాత పారిశ్రామిక సమాజంలో సాంప్రదాయిక తెగల అనుబంధాలు తెగిపోయిన తరుణంలో జాతిని సంఘటిత పరిచేందుకు మరో కొత్త భావన అవసరం ఏర్పడింది. ఫలితంగా జాతీయతా భావన తెరపైకొచ్చి యూరప్ సమాజాన్ని జాత్యాహంకార విషకోరల్లో నలిపివేసింది. ఫాసిజంగా పేరుగాంచిన ఈ ఫాసిస్టు భావజాలాలు మౌలానా మౌదూది (రహ్మాలై) గారి కాలంలో తారస్థాయికి చేరాయి.

ఇక రాజకీయ రంగంలో అధికారిక వ్యవస్థ విషయమై ప్రధాన ప్రశ్న ఉత్పన్నం కావడంతో ప్రజలచే ప్రజల కొరకు ప్రజల ద్వారా ఎన్నుకునే ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థ పురుడు పోసుకుంది. పారిశ్రామిక ప్రాంతాలలో ఫెమినిజం (స్త్రీవాదం) పుట్టుకు రావడానికి గల ప్రధాన కారణం కూడా ఆధునీకరణే. పురుషులకు దీటుగా స్త్రీలకూ సమాన హక్కులుండాలనీ, మహిళలను పురుషులకు ధీటుగా సమానస్థాయికి చేర్చాలనేదే ఈ ఫెమినిజం లక్ష్యం.

2. ఈ సిద్ధాంతాలు యూరప్‌లోని ఆధునిక మనిషికి సరికొత్త ఆవిష్కరణల అనుభవాలుగా మారాయి. మానవ అభివృద్ధి మూలాలు ఆధునికీకరణలోనే దాగున్నాయనీ, పాశ్చాత్య దేశాలలో బయలుదేరిన ఆధునిక భావజాలాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని, తృతీయ ప్రపంచ దేశాలను వారి అనాగరిక సంప్రదాయాల నుండి ఆధునీకరణల వెలుగులతో అలరింపజేయాలని, ఆ దేశాలలో అభివృద్ధే ప్రధాన అజెండాగా చేర్చాలనేది వారి లక్ష్యంగా మారింది. తృతీయ ప్రపంచ దేశాలయిన పేద దేశాలను

బానిసలుగా మార్చే కార్యాన్ని కూడా అభివృద్ధి పేరిట భ్రమింపజేయడం జరిగింది. ఆ వ్యవహారాన్ని ఇంగ్లీషు కవి రుడ్యార్డ్ కిప్లింగ్ ప్రముఖ కవిత, 'వైట్ మ్యాన్స్ బర్డెన్' (white man's burden) ద్వారా అర్థం చేసుకోవచ్చు.

యూరోపియన్లు ముస్లిం దేశాలతో సహా ఆసియా ఆఫ్రికాలోని అనేక దేశాలను తమ బానిసలుగా చేసుకున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తమ భావజాల పరివ్యాప్తికి పరిపూర్ణ ప్రయత్నాలు మొదలెట్టారు. వాటి ఆధారంగానే చట్టబద్ధ సంస్కరణలూ జరిగాయి. విద్యావ్యవస్థ రూప కల్పనకు శ్రీకారం చుట్టారు. మత సంస్కరణోద్యమాలు కూడా ప్రభుత్వాధీనంలోనే జరగనారంభించాయి. దరిమిలా ముస్లిం ప్రపంచమంతా ఈ పరిస్థితులకు ప్రభావితమైంది.

3. మౌలానా మౌదూదీ (రహ్మలై) హయాం వరకు పరిపాలకుల ఈ ప్రయత్నాలు అనేక ఇస్లామీయ దేశాల్లోనూ చాలా వరకు సఫలమయ్యాయి. ప్రతిచోటా ఆధునికత భావజాలాలతో ప్రభావితమైన ఓ వర్గం ఏర్పడింది. సంపన్నులు పలుకుబడి గల వర్గాలలో అత్యధికులు యూరప్‌లో విద్యాభ్యాసాన్ని చేసినవారు, యూరప్ మహిళలను వివాహమాడినవారు, ఇంటా బయటా యూరప్ సంస్కృతిలో సమ్మిళితమై ఆధునిక భావజాలాలను అధికంగా నమ్మేవారే ఉన్నారు. సమాజంలో వారు అత్యంత ప్రభావశీల వ్యక్తులేకాక సమాజానికి దిశానిర్దేశన చేసే సత్తా గలవారై ఉండటం కూడా గమనార్హం. స్వాతంత్ర్య సంగ్రామం మొదలైన తొలిదశలో వీళ్లు యూరోపియన్‌ల తొత్తులుగా ఉన్నప్పటికీ తర్వాత జరిగిన పరిణామాలతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. తాము ఆంగ్లేయుల అధికారాన్ని వ్యతిరేకిస్తున్నప్పటికీ వారి భావజాలాలను ముఖ్యంగా ప్రజాస్వామ్య లౌకిక జీవన వ్యవస్థను మాత్రం సమర్థిస్తూనే వచ్చారు. అభివృద్ధికి మూల మార్గం అదేనని, ఆంగ్లేయులపై స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించాక తమ చేజేతులా స్వయానా ఆంగ్లేయుల భావజాలాన్ని వారి జీవన వ్యవస్థనే స్థాపించి తీరాలని కంకణం కట్టుకున్నారు.

4. స్వాతంత్ర్యోద్యమాన్ని మౌలికంగా మతవర్గాలు ప్రారంభించాయి. ఆంగ్లేయుల ఆగమనంతో ముస్లింల పరిపాలన అంతమవటమేకాక వారు ఇస్లామీయ చట్టాలను సైతం రద్దుచేశారు కనుక వారు ఇక్కడి నుండి వెళ్ళిపోతే షరియా చట్టం స్థాపించడం మళ్లీ సుసాధ్యమవుతుందనే అభిప్రాయాలు

ముస్లింలలో ఉండేవి. ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభం అయ్యే సమయానికి ఆంగ్లేయులు ఈ దేశాన్ని వదిలివెళ్లే సమయం ఆసన్నమయింది. బ్రిటీషు వారిపై వ్యతిరేకత జోరందుకుంది. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న తరుణంలో ఆంగ్లేయులు, వారి వ్యవస్థ ద్వారా ఎటువంటి సహాయం పొందడం కూడా నశించిపోతున్న వ్యవస్థను మళ్లీ పటిష్టపరచడమే అవుతుందనే అభిప్రాయంతో స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిషు అధికారాన్ని అణచివేసేందుకు తమ తుది ప్రయత్నాలలో తలమునకలై ఉన్నారు. అదే సమయంలో జలియన్ వాలాబాగ్ మారణహోమం తరువాత (ఆగస్టు 1920) దేశంలో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని చేపట్టారు. ఆంగ్లేయుల అసెంబ్లీలలో భాగస్వామ్యంగానీ, వారిసంస్థల్లోఉద్యోగం చెయ్యడం గానీ, వారి సైన్యంలో చేరడం వారి స్కూళ్లు కళాశాలలలో విద్యనభ్యసించడంగానీ నిషేధమని ప్రకటిస్తూ మౌలానా మహమూదుల్ హసన్ ఓ ఫత్వా జారీ చేశారు. ఆ ఫత్వాపై 500 మంది ఉలమాలు సంతకాలు చేశారు. మత విద్వాంసులందరూ ఏకమై బ్రిటిషర్ల అసెంబ్లీలలో భాగస్వాములు కాకూడదనీ వారికి ఓటు ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చారు.

5. ఇక ఆంగ్లేయులు వెళ్లిపోయిన తర్వాత భారతదేశంలో ఏ వ్యవస్థ ఉండాలనేది అందరి ముందు ఉన్న ప్రశ్న. దానిపై అనేక చర్చలు జరిగాయి. మొదటి ప్రపంచ యుద్ధం వరకు ఆంగ్లేయులు వెళ్ళిపోతే దేశంలో మళ్ళీ ఇస్లామీయ పరిపాలన వస్తుందని ముస్లింలు భావించేవారు. కానీ తర్వాత అధికార పగ్గాలు ఆధునిక విద్యాధిక వర్గాలు చేజిక్కించుకున్నారు. ఇక్కడ ఒక ఆధునిక లౌకిక రాజ్యం ఏర్పడుతుందనీ అది యూరోపియన్ దేశాల భావజాలాలకనుగుణంగానే ఉంటుందన్న విషయం వారి దృష్టిలో మొదటి నుండీ ఉన్న విషయమే. అదే సమయంలో కొందరు ముస్లింల కొరకు ఓ ప్రత్యేక దేశం కావాలనే ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చారు. ఈ ఉద్యమం కూడా దేశవ్యాప్తంగా వ్యాపించింది. ముస్లింలది ఒక ప్రత్యేక జాతి అంటూ వారి కోసం ఒక ప్రత్యేక దేశం కావాలని కోరుకునేవారు. అయితే ముస్లింల కోసం కోరుకుంటున్న ఆ ప్రత్యేక దేశ వ్యవస్థ కూడా ఆధునిక సూత్రాలపై నిర్మించదలుస్తున్నారనే విషయం కూడా స్పష్టమయింది...

ఈ తరహా ప్రత్యేకమైన పరిస్థితుల నేపథ్యంలో మౌలానా మౌదూది (రహ్మాలై) తన ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఆలోచనా విధానాన్ని విశ్లేషిస్తే ఒక ఇస్లామీయ ఉద్యమ రథసారథి అటువంటి పరిస్థితుల్లో మౌలానా మౌదూదీ (రహ్మాలై) దృక్పథాన్నే అనుసరిస్తాడు. మౌలానా పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, లోతుగా అర్థం చేసుకొని అత్యంత దూరదృష్టి దార్శనికతతో ఆ పరిస్థితులకు సరితూగే అసాధారణమైన ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టారు. కనుక మౌలానా మౌదూదీ (రహ్మాలై) ప్రవేశపెట్టిన ఆలోచనా విధానంలోని అసాధారణ అంశాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ఆధునిక పాశ్చాత్య సంస్కృతి ఆధునిక ఆలోచనా విధానాలను తీవ్రంగా నిరసిస్తూ, వాటి పునాదులు ఆలోచనా విధానాలు అత్యంత బలహీన మైనవనీ, వాస్తవానికి బహు దూరమైనవనీ బలమైన ఆధారాల ద్వారా నిరూపిస్తూ, మతం, మతభావాలకు వ్యతిరేకంగా ఉనికిలోకొచ్చిన ఆధునికతను పూర్తిగా ఖండిస్తూ సంపూర్ణ శక్తియుక్తులతో మతాన్ని మతభావాలను సమర్థించారు. ముస్లింలు అత్యంత వేగంగా ఆధునిక భావజాలాలకు దాసోహమవుతున్న తరుణంలో మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఆ భావజాలాలకు కళ్లెం వేసి ముస్లింల ఇస్లామీయ విశ్వాసాలను బలోపేతం చేసే కార్యానికి పూనుకున్నారు. అయితే ప్రస్తుత ఆధునిక విధానంలో ఆ తరహా నిరంకుశత్వ స్వభావం లేదు. అందులో పెనుమార్పులు వచ్చాయి. సెక్యులరిజం, నేషనలిజం, పాజిటివిజం లాంటి భావాలలో ఎన్నో సంస్కరణలు జరిగాయి. కనుకనే కొంతమందికి మౌలానా మౌదూదీ (రహ్మాలై) విమర్శలు లోపభూయిష్టమైనవిగా అత్యంత కఠినమైనవనిగా కనపడతాయి. కానీ 19వ శతాబ్దం 20వ శతాబ్ది ప్రారంభ దశలో ఉన్న పాశ్చాత్య ఆలోచనా విధానం అవగతమైన వారికి అప్పటి ఆధునికతా విధానం మతం మత విశ్వాసాలకు శత్రువుగానే ఉనికిలోకొచ్చిందనే విషయం బాగా తెలుసు. ఆ దశలో సెక్యులరిజం అర్థమే మత వ్యతిరేకమైన ఆలోచనా విధానం. నేషనలిజం అంటే దేశభక్తి అని అర్థం. సైన్స్ ఆలోచనా విధానం అంటే శాస్త్రీయంగా నిరూపించబడని ప్రతి విషయాన్ని అశాస్త్రీయమని భావించడమే. కానీ ప్రస్తుతం ఈ ఆలోచనలలో పెనుమార్పులు జరిగాయి. ఇస్లామీయ తత్వవేత్తలు ఈ మార్పులను గ్రహించాల్సిన అవసరం ఉంది. మౌలానా

మౌదూది(రహ్మాలై) వారి హయాంలో ఉన్న ఆలోచనా విధానాలు అతివాదాలుగా ఉన్నాయి కాబట్టే మౌలానా వాటిపై తీవ్రమైన విమర్శలు చేశారు. పాశ్చాత్య దేశాల్లో ఉన్న అతివాదాలను మార్చడంలోనూ మౌలానా మౌదూదీ (రహ్మాలై) లాంటి ఇస్లామీయ తత్వవేత్తల పాత్ర ప్రధానంగా ఉందన్న విషయాన్ని కూడా విస్మరించ కూడదు. కనుక అతివాదం పాశ్చాత్య దేశాల ఆలోచనావిధానాల్లో ఉంది తప్ప మౌలానా చేసిన విమర్శలలో ఎంతమాత్రం కాదు.

2. ఇస్లాంకు అనుకూలంగా ఓ కొత్త తాత్విక విధానాన్ని ప్రవేశపెట్టి ఇస్లాం ఒక సంపూర్ణమైన సమగ్రమైన జీవన వ్యవస్థ అనీ, అది ప్రస్తుత ప్రపంచంలో ఆచరణా సాధ్యమేకాక నేటి ప్రపంచంలో ఎదురయ్యే సంక్లిష్ట సమస్యలకు సైతం పరిష్కారం చూపగల శక్తి సామర్థ్యాలు కేవలం ఇస్లాంలోనే ఉన్నాయనీ, నేటి సమాజానికి ఏకైక ఆచరణీయ విధానం ఇస్లాం మాత్రమేనన్న విషయాన్ని అత్యద్భుతమైన హేతుబద్ధమైన ఆధారాలతో ఆధునికవాదులకు నిరూపించారు. ముస్లిం మత పండితులు సైతం ఇస్లామీయ ఆచరణా విధానాలు అసాధ్యమనుకుంటున్న తరుణంలో ఆధునిక వాదులు సామూహిక జీవితంలో ఇస్లామీయ బోధనలను విస్మరిస్తున్న వేళ మౌలానా మౌదూదీ (రహ్మాలై) చేసిన కృషి అనితర సాధ్యమైన కృషి అని చెప్పవచ్చు.

3. ఆ పరిస్థితులలో మౌలానా మౌదూదీ (రహ్మాలై) స్వతంత్ర భారతంలో ఇస్లామీయ వ్యవస్థ స్థాపనకై ఉద్యమించడం ముస్లింల ప్రధాన కర్తవ్యమని ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యవస్థ ఏమై ఉండాలనే ప్రధాన ప్రశ్న ఉత్పన్న మయిన సమయంలో ఈ సందేశమే సహజసిద్ధమైన ప్రాధాన్యపూర్వకమైన సందేశం కాగలదు. చరిత్రలోని అత్యంత కీలకమైన దశలో ముస్లింలు అసంబద్ధ మైన చర్చల్లో తలమునకలై ఉండడం, కొంతమంది నాయకులు ఓ ప్రత్యేక దేశం కోరుకుంటున్నప్పటికీ అక్కడ ఏ వ్యవస్థ ఉండాలనే విషయంపై స్పష్టత లేకపోవడం కారణంగా అక్కడ నెలకొన్న పరిస్థితుల రీత్యా ఆ ప్రత్యేక దేశంలో కూడా ఆంగ్ల వ్యవస్థే ఉంటుందని భావించిన తరుణంలో ఇస్లామీయ వ్యవస్థను స్థాపించడం ఆ వ్యవస్థకై ముస్లింలను ప్రోత్సహించడం ముస్లింల అత్యంత ప్రధాన కర్తవ్యమై ఉండింది కనుక మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఆ గళాన్నే వినిపించారు.

4. ఇస్లామీయ వ్యవస్థను స్థాపించడం ముస్లింల తక్షణ కర్తవ్యం కావడం వల్ల ఆంగ్లేయుల నాయకత్వంలో నశించిపోతున్న వ్యవస్థను విస్మరించడం, దానితో తెగతెంపులు చేసుకోవడం తప్పనిసరి అయింది. తెల్లోళ్ళను సాగనంపిన తరువాత నల్లజాతీయులు మళ్లీ అదే దుర్భరమైన వ్యవస్థను నెలకొల్పాలని కలలుగంటున్న తరుణంలో ఆ వ్యవస్థకు సహకరించడం మళ్ళీ దాన్ని సజీవ పరచడంతో సమానమే అవుతుంది కనుక బ్రిటిషు వ్యవస్థ నుండి పూర్తిగా వైదొలగాలని పిలుపునిచ్చిన వారిలో కేవలం మౌలానా మౌదూదీ(రహ్మాలై)యే కాదు, ఇతర ముస్లిం ఉలమాలు, స్వాతంత్ర్య సమరయోధులు కూడా ఉన్నారు. హిందూ ముస్లింలందరూ ప్రభుత్వ ఉద్యోగాలను వీడటం మొదలెట్టారు. సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతోంది. ముస్లిం విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థల నుండి వైదొలుగుతున్నారు. జామియా మిల్లియా లాంటి స్వతంత్ర జాతీయ సంస్థలు ఏర్పాటవుతున్నాయి. కనుక మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఎన్నికల్లో పాల్గొనడం, ప్రభుత్వ ఉద్యోగాలు చెయ్యడం, ఆంగ్లేయుల విద్యా వ్యవస్థను వినియోగించుకోవడం, బ్రిటీషు వ్యవస్థకు సహాయ సహకారాలు అందించేటటువంటి పనులను పూర్తిగా ఖండించడమేగాక ఆ వ్యవస్థ నుండి సంపూర్ణంగా వైదొలగాలంటూ పిలుపునిచ్చారు. వ్యవస్థను మార్చే నిర్ణయాత్మక దశలో ఈ ఆలోచనా విధానం హేతుబద్ధమైనదే.

ప్రజాస్వామ్య వ్యవస్థతో తెగతెంపులు చేసుకోవడం ఇస్లామీయ వ్యవస్థ ప్రధానంగా ఇస్లామీయ రాజకీయ వ్యవస్థను స్థాపించేందుకై కృషి చేయడం మొదటి ప్రాధాన్యంగా ప్రకటించడం అప్పటి ప్రత్యేక పరిస్థితులరీత్యా మౌలానా తీసుకున్న నిర్ణయం. మౌలానా మౌదూది (రహ్మాలై) తర్వాతి దశలో భారత ముస్లింలను, ఇతర దేశాల ముస్లిం సమాజాలనుద్దేశించి ఇచ్చిన సూచనలు సలహాల ద్వారా కూడా ఈ విషయం తెలుస్తోంది.

సమైక్య భారత దేశంలో పరిస్థితులు మారుతున్న క్రమంలో ఆంగ్లేయులు వెళ్ళాక ఈ దేశంలో తక్షణమే ఇస్లామీయ వ్యవస్థను నెలకొల్పడం సాధ్యపడదని గ్రహించిన వెంటనే ముస్లింలు 'దారుల్ ఇస్లాం' (ముస్లింలకు అన్ని విధాలా సాంస్కృతిక స్వయం ప్రతిపత్తి లభించే దేశం)ను స్థాపించే ప్రయత్నాలపై దృష్టి సారించాలని మౌలానా సూచించారు.

స్వతంత్ర భారతంలో సాధ్యమయ్యే మూడు ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు.

'అందరికీ ఆమోద యోగ్యమైన దేశ వ్యవస్థ' ఉండాలని ప్రతిపాదించారు.

ఇటువంటి పరిస్థితిలో ప్రతిఘటించడం కన్నా ఆ ప్రాతిపదిక పైనే సయోధ్యకు ప్రయత్నించాలని, ఆ ప్రయత్నాల ఫలితంగా ఇండియన్ యూనియన్ ద్వారా బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఏర్పడితే అందులో భాగంగా ముస్లింలకు సంపూర్ణ ప్రయోజనాలు కలగకపోయినా కొద్దోగొప్పో నష్టం వాటిల్లినప్పటికి కనీసం ముస్లింలకు తమ ఆశయ సాధన కోసం కృషి చేసే అవకాశాలైనా లభిస్తాయనే విషయాన్ని హైదరాబాదు దక్కన్ ప్రాంతానికి చెందిన ముస్లింల ముందు ఉంచారు. ఆ తరువాత సయోధ్య కోసం ఐదు అంశాల ప్రతిపాదనను ఉంచారు.

దక్షిణాఫ్రికాకు చెందిన ముస్లింలు ప్రభుత్వ జాత్యాహంకార పాలసీలను అంతమొందించేందుకు వారే స్వయంగా ఎన్నికల్లో పాల్గొనాలని ప్రతిపాదించారు.

ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ముస్లిమేతరులకు మద్దతివ్వాలని సూచించారు.

దేశ స్వాతంత్ర్యం, విభజనకు ముందు భారత ముస్లింల సమక్షంలో నాలుగు అంశాల ప్రతిపాదనను ఉంచారు.

భారత స్వాతంత్ర్యం తర్వాత పరిస్థితులు మారిపోయాయి. దేశ విభజన జరిగింది ఇక దేశంలో కేవలం 12 శాతం ముస్లింలే ఉండిపోయారు. భారత దేశంలో లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటయింది. దేశవాసులు కూడా ఈ వ్యవస్థ పట్ల సంతృప్తికరంగా ఉన్నారు. దేశ వ్యవస్థ ఎలా ఉండాలనే ప్రశ్న ఇక మిగల్లేదు. దేశంలో ఓ ప్రత్యేక రాజకీయ వాతావరణం నెలకొంది.

ఈ పరిస్థితులలో ఇస్లామీయ ఉద్యమం మరో కొత్త ఆలోచనా విధానం ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పుడు తక్షణమే వ్యవస్థ మార్పు సాధ్యపడదు కనుక అందులో భాగంగా ఒక సుదీర్ఘ పోరాటం చేయాల్సిన అవసరం ఉంది కాబట్టి నవభారతంలో ధర్మసంస్థాపన కృషికి కావలసిన కొత్త కార్యాచరణ ఏమిటనేది ప్రధాన ప్రశ్నగా మారింది. దరిమిలా సైద్ధాంతిక క్రమవికాసానికి వచ్చిన సమాధానాలే క్రింద పేర్కొనబడిన విషయాలు.

1. ధర్మసందేశ కార్యక్రమం దేశంలో చేయాల్సిన మొట్టమొదటి ప్రధాన కార్యం. ఈ దేశవాసులు ఇస్లాం అంటే ఏమిటో తెలుసుకోవాలి, అవగాహన చేసుకోవాలి. ఇస్లామీయ సిద్ధాంతాలు ఇస్లామీయ జీవన వ్యవస్థ హేతు బద్ధమైనదనే విషయాన్ని అవగతం చేసుకోవాలి. ప్రజాభిప్రాయాలను మలిచే ప్రయత్నం చెయ్యాలి. ఇదీ చేయాల్సిన మొట్టమొదటి పని. ఈ పని సమర్థ వంతంగా జరగనంతవరకు ధర్మసంస్థాపన జరగడం అసాధ్యం. ఈ పని సంస్థలూ చేయాలి, సాధారణ ప్రజానీకం కూడా చేపట్టాలి. ధర్మసంస్థాపనా మార్గాన్ని చేరేందుకు అవసరమైన మొట్టమొదటి లక్ష్యం ఈ దేశవాసుల ముందు ఇస్లాం సందేశాన్ని చేరవేయడమే.

మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ ఇలా అంటారు.

అత్యధిక సంఖ్యలో ముస్లిమేతరులున్న ఈ దేశంలో రెండు విషయాలు ప్రాధాన్యపూర్వకమైనవి. ఒకటి, అత్యంత బాధ్యతాయుతంగా సందేశ ప్రచారాన్ని చేరవేయడం. రెండవది, వారి అపోహలను దూరం చేయడం. వారు అపార్థాలకు లోనుకాకుండా చూడడం.

అత్యంత బాధ్యతాయుతంగా సందేశం చేరవేయడమంటే ఈ బాధ్యతను నిర్వర్తించడం తక్షణ కర్తవ్యమని భావించడమేకాక ఒక ఉద్యమం యొక్క అత్యవసర కర్తవ్యం అనే అవగాహన కూడా ఉద్యమ కార్యకర్తలలో రావాలి.

ఈ పని ఉద్యమ కార్యకర్తలు తప్పనిసరి బాధ్యతగా భావించాలంటే, ఇది వాస్తవమైన ఉద్యమంగా మారాలంటే, దాని సాఫల్య సంకేతాలను చూడ గలగాలి. అది ఇక్కడి అత్యధిక ముస్లిమేతరుల సహాయ సహకారాలు లేనిదే సాధ్యపడదు. అత్యధిక మెజారిటీ అంటే మామూలు విషయం కాదు. 88 శాతం జనాభా గల అత్యధిక మెజారిటీ, ఆపై అనేక విధాలుగా అధికార శక్తియుక్తులు కూడా వారి హస్తగతమయి ఉన్న సమాజంలో ముస్లిమేతరుల సహాయ సహకారాలు ఉద్యమానికి తప్పనిసరి.

ముస్లిమేతరుల మనసుల్లో అపోహలు అపార్థాలకు గురిచేసే ఎటువంటి విధానాన్ని అవలంబించకూడదనే విషయాన్ని కూడా మౌలానా గట్టిగా హెచ్చరించారు. సందేశస్ఫూర్తికి అనుగుణంగా సమకాలీన పరిస్థితుల దృష్ట్యా

స్వతహాగా ఒక పని సమంజసమయినప్పటికీ, అది ముస్లిమేతరులకు ఉద్యమంపై దురభిప్రాయం కలిగే విధమైనటువంటిదైతే అలాంటి కార్యకలాపాలకు పూనుకోకూడదన్న విషయాన్ని కూడా వివరించారు.

ధర్మసంస్థాపనా మార్గంలో మరో ప్రధాన కార్యరంగం ముస్లింల సంస్కరణోద్యమం. ముస్లిం సమాజం ఇస్లాం రూపురేఖలకు ఆదర్శంగా ఉండాలి. సత్యధర్మ సాక్ష్యానికి ప్రతీకగా నిలవాలి. మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ ముస్లింలు ఈ ఉద్యమానికి మొదటి సంబోధితులంటూ మూడు విషయాలను ఉటంకించారు.

1. ఒక వ్యక్తి తనను తాను ముస్లింగా ప్రకటించుకుంటున్నాడంటే అతను సత్య ధర్మస్థాపనకు కృషి చేస్తానని ప్రమాణం చేస్తున్నాడన్నమాట.

2. శ్రేయోభిలాష పరస్పర ముస్లింల బాధ్యత.

3. ముస్లిం సమాజంలో ముస్లిములు ఇస్లాం ఆదేశాలకు అనుగుణంగా జీవించినప్పుడే వారి జీవితాలు ఇస్లాం స్ఫూర్తికి ప్రతీకలుగా ఉంటాయి. వారి ద్వారా ఇతరులు ఉద్యమానికి దగ్గరయ్యే అవకాశం ఉంటుంది.

మూడవ ప్రధాన విషయం ముస్లింల సామాజిక శక్తియుక్తులు బలోపేతం కావాలి. వారి సమస్యలు పరిష్కృతమవ్వాలి. వారిలో ప్రభావశీలురైన వ్యక్తులు, నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించే నైపుణ్యాలు జనించాలి. ముస్లిం సమాజ ధార్మిక నైతిక బలహీనత సామాజిక అధోగతులు ముస్లిమేతరులు ఇస్లాంకు దగ్గరయ్యే మార్గంలో అవరోధాలుగా ఏర్పడుతున్నాయి. కనుక ధర్మసంస్థాపనా మార్గంలో చేయాల్సిన ప్రధాన కర్తవ్యం ముస్లిం సమాజ స్థితిగతులను సముద్ధరించడం. వారి ధార్మిక, నైతిక సంస్కరణేకాక ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా వారిని బలోపేతం చేయాల్సిన ప్రధాన కర్తవ్యం కూడా మనపై ఉంది.

ముస్లింలలో పెరుగుతున్న నేరప్రవృత్తి, నైతిక అధోగతి, దైనందిన సంబంధాలలో వైరుధ్య వైఖరి, మహిళలపై అన్యాయం దౌర్జన్యాలు వారి హక్కులను నిర్వర్తించకపోవడం, వర్తక వ్యవహారాలలో అనైతికత లాంటి ఎన్నో విషయాలు ఇతరులను ముస్లిం సమాజం నుండి దూరం చేయడమేకాక వారి విద్యాలేమి పరిశుభ్రతా లేమి క్రమశిక్షణా రాహిత్యం ఇతర సామాజిక జాఢ్యాలు

మరింత విసుగును కల్పిస్తున్నాయి. దరిమిలా ముస్లింల పేదరికం, మీడియాలో వారి గొంతుక లేకపోవడం, అధికార కేంద్రాలలో వారి ప్రాతినిధ్యం అధ్వాన్నంగా ఉండడం, ప్రతిరంగంలో వారి అసమర్థత కారణంగా వారు సమాజ ప్రయోజకులు కాక సమాజానికి భారం కావడం లాంటి శోచనీయమైన స్థితిగతులు ముస్లింల పాలిట శాపంగా మారుతున్నాయి. ఇవన్నీ చూసి ప్రజలు ఇస్లాంకు దగ్గరయ్యే బదులు సాధ్యమైనంతగా దూరంగా జరుగుతున్నారు. అంతేగాక ఈ స్థితిగతులు ముస్లింలను బలహీనపరచడమేకాక వారి స్వీయరక్షణను సైతం ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ముస్లిం సమాజంలో చోటుచేసుకున్న ఈ బలహీనతలు ఉద్యమాన్ని కూడా బలహీనపరుస్తాయి కనుక ఉద్యమాన్ని ప్రభావవంతంగా మార్చాలంటే ముస్లింల బలహీనతలను అధిగమించాల్సిన అవసరం అత్యంతావశ్యకం.

డాక్టర్ నజాతుల్లా సిద్ధీఖీ రాస్తున్నారు....

ముస్లిం సమాజ భవిష్యత్తు ఇస్లామీయ ఉద్యమాలతోనే ముడిపడి ఉన్నప్పటికీ ముస్లిముల్లోని సందేశప్రచార కార్యకర్తల సామాజిక రాజకీయ శక్తియుక్తులన్నీ చాలా వరకు ముస్లింల సామాజిక రాజకీయ స్థితిగతులపైనే ఆధారపడి ఉన్నాయి. ముస్లింల విద్యా ఆర్థిక వ్యవస్థ అధ్వాన్నస్థితిలో ఉండి వారి అనైక్యత కారణంగా రాజకీయంగా బలహీనమైపోతే ఆ సమాజంలో సందేశ బాధ్యతను నిర్వర్తించే నిపుణులలోనూ రాజకీయ సామాజిక శక్తియుక్తులు సన్నగిల్లుతాయి. ముస్లింల విద్యాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ మెరుగుపడి వారి ఐక్యత కారణంగా రాజకీయ దూరదృష్టి ఏర్పడితే ఆ సమాజంలో ఉన్న సందేశవర్గాలకు కూడా మరింత బలం చేకూరుతుంది.

ఈ విధంగా మనం కీలక వ్యవహారాలలో క్రియాశీలంగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పావులు కదుపుతూ సత్యధర్మ సాక్ష్యాన్ని ఆచరణాత్మకంగా ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉంది. ఈ కార్యాచరణలన్నీ ప్రస్తుత పరిస్థితులలో ధర్మసంస్థాపన ఆవశ్యకతగా మారిపోయాయి. (ఈ విషయాలపై ఇతర వ్యాసాలలో కూడా వివరణాత్మకంగా చర్చించడం జరిగింది)

2. ఉద్యమ ఉద్దేశం, ఆశయాలు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉండాల్సిన అవసరం ఉంది. ధర్మ సందేశ ప్రచారంలో భాగంగా

ఇస్లాం సామూహిక వ్యవస్థతోపాటు మౌలిక సిద్ధాంతాలపైన కూడా పూర్తిస్థాయిలో చర్చ జరగాలి. పాశ్చాత్య విధానాలను విమర్శించే క్రమంలో మారిన సైద్ధాంతిక స్వరూపాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని అందులో భాగంగా భారతీయ మతాలు వారి విశ్వాసాలు వారి తాత్విక విధానాలపై కూడా చర్చను లేవనెత్తాలి. వీటిలో కొన్నింటిపై పని జరిగింది ఇంకొన్నిటిపై పని జరగాల్సిన అవసరం ఉంది. (ఈ పుస్తకంలోని ఇతర వ్యాసాలలో దీనిపై వివరణాత్మకంగా చర్చ జరిగింది)

3. ప్రస్తుత వ్యవస్థతో మన సంబంధ బాంధవ్యాలు, రాజకీయ వైఖరి ఎలా ఉండాలనే విషయం ప్రధానాంశం. ఈ విషయంపై ఆలోచించేటప్పుడు ఒక అత్యధిక మెజారిటీ గల ముస్లిమేతర సమాజంలో ఉద్యమ లక్ష్యాన్ని తక్షణమే సాధించడం అసాధ్యమనే విషయాన్ని మరువకూడదు. తన లక్ష్యసాధనకై ఉద్యమం ఒక సుదీర్ఘమైన ప్రయాణం చేస్తూ ఆ దశలో నిరంతరం కృషి సలుపుతూ పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. గమ్యాన్ని చేరుకునే క్రమంలో కొనసాగే సుదీర్ఘ ప్రయాణంలో మన ప్రయత్నాలను పోరాటాలను కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయాణంలో ఒకే సమయంలో అనుకూల ప్రతికూల పరిస్థితులు సైతం ఎదురవుతాయి. మొత్తానికి సుదీర్ఘ ప్రయాణ పరంపరలో ఈ ఉద్యమం వివిధ దశల నుండి కొనసాగుతూ క్రమక్రమంగానే తన లక్ష్యం వైపునకు పయనించగలదు.

ఈ విభిన్న దశలలో ఇస్లామీయ ఉద్యమం అన్నివిధాలా పనులు చేయాల్సి ఉంటుంది. ప్రతి రంగంలో తన చేతల ద్వారా ఆచరణాత్మకంగా సత్యధర్మాన్ని స్థాపించే బృహత్తర బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇస్లాంలో ఉన్న కొన్ని విభాగాలను పరిరక్షించాల్సి ఉంటుంది. ఏ ఏ విభాగాలను స్థాపించడం సాధ్యమవుతుందో ఆయా విభాగాలను ఒకదాని తరువాత మరొకటి క్రమేణా స్థాపించేందుకు కూడా కృషి చేయాల్సి ఉంటుంది. ఇస్లామీయ ధర్మవేత్తల నిర్వచనం ప్రకారం ఆధునిక సెక్యులర్ సమాజాలను దారుల్ అమన్‌గా పరిగణించవచ్చు. ఒక ముస్లిం దారుల్ హరబ్ కన్నా దారుల్ అమన్‌ను సాధించేందుకు ప్రయత్నించాలి. శాంతియుత సమాజాన్ని సాయుధ సమాజం కాకుండా చూసుకోవాలి. ఆయా ఆదేశాలు ప్రాధాన్య పూర్వకమైన విషయాలు ఫిఖాకు చెందిన ప్రాచీన గ్రంథాలలో వివరణాత్మకంగా ఉన్నాయి. ఆ గ్రంథాల

వెలుగులో షరీయత్ స్థాపన తక్షణమే సాధ్యంకాని చోట సమన్యాయం శాంతియుత విధానాల ద్వారా దారుల్ అమన్ స్థాపనా కృషి జరగాలి.

ప్రస్తుత వ్యవస్థతో సంపూర్ణ తెగతెంపులు చేసుకుని ఈ పనిని మనం సాధించలేం. తొలిరోజు నుండీ ఉద్యమ ఆలోచనాపరుల అభిప్రాయం ఇదే. జమాఅత్ పాలసీ ప్రోగ్రాములు జమాఅత్ బాధ్యుల కథనాలపై దృష్టిసారిస్తే ఆది నుండి జమాఅత్ అభిప్రాయం ఇదేవిధంగా ఉందనే విషయం అర్థమవుతుంది. 1964లోని పాలసీ ప్రోగ్రాంలో ఉన్న 12 అంశాలలో మొదటి మూడు అంశాలు దీనికి సంబంధించి ఉన్నాయి. ఎనిమిదవ అంశంలో వ్యక్తిగత స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, మానవ హక్కులు, వివిధ వర్గాలతో పరస్పర సోదర సంబంధాలు, నైతిక విలువలు, శాంతియుత సమాజం, దేశవాసుల శ్రేయో సంక్షేమాల ప్రస్తావన ఉంది. తొమ్మిదవ అంశంలో మంచిని స్థాపించి చెడులను రూపుమాపడం. పదవ అంశంలో మానవతా విలువలను మానవ సంబంధాలను బలోపేతం చేసే ప్రస్తావన ఉంది. ఆ తర్వాత పాలసీ ప్రోగ్రాములలో కూడా ఈ విషయాలను వివరణాత్మకంగా రాయడం జరిగింది. అంటే ఇస్లాం సందేశంతోపాటు దేశంలో శాంతి సమన్యాయాన్ని స్థాపించడం లాంటి విషయాలు ధర్మసంస్థాపనా ప్రయాణంలో మొదటి నుండీ భాగంగానే ఉన్నాయనే విషయం అర్థమవుతుంది.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన మీదట కేంద్ర సలహామండలి తమ తీర్మానాలలో ముస్లింలకు అపీలు చేసిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి.

"భారత ముస్లింలు శ్రేష్టసమాజంగా దేశంలో సత్సమాజ స్థాపనకై నిర్మాణాత్మక పాత్రను పోషించాలని, సమాజానికి దోహదపడే విలువలను పునరుద్ధరించాలని కేంద్ర సలహా మండలి గుర్తుచేస్తుంది. మరోవైపు మన ముందున్న ప్రస్తుత దేశ సమస్యలను ఇస్లాం వెలుగులో పరిష్కరించేందుకు తమదైన పాత్రను పోషించాలనీ, సమ న్యాయస్థాపనకై సంపూర్ణ కృషి సలపాలని సూచిస్తుంది."

ఈ ఆలోచనా విధానమే ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థను అధర్మం అసత్యమని భావిస్తూనే ఇస్లాం, ముస్లింల ప్రయోజనార్థం ఎన్నికల్లో పాలుపంచుకోవడం సమంజసమేననే ప్రతిపాదించిన ప్రముఖ తీర్మానానికి దోహదపడింది.

మరింత వివరణకై కేంద్ర సలహామండలి ప్రతిపాదించిన మరో ప్రధాన తీర్మానాన్ని చూడవచ్చు.

"ప్రస్తుత దేశ వ్యవస్థలోని మౌలిక ఆలోచనలు దైవిక మార్గనిర్దేశనాలకు అతీతంగా ఉన్నాయి. కనుక దేశవాసులను ఈ ఆలోచనా విధానంలోని లోటుపాట్లపై అవగాహన కల్పించేందుకు కృషిచేయాల్సిన అవసరం ఉంది. దైవిక మార్గదర్శకాలను అనుసరించాల్సిన అవసరాన్ని వారికి స్పష్టం చేయాలి. సైద్ధాంతిక లోపాలున్నప్పటికీ ప్రస్తుత వ్యవస్థ అనేక మానవ హక్కులు, ఆరోగ్య వంతమైన విలువలను అంగీకరిస్తుంది. ప్రజలను ప్రభుత్వంలో భాగస్వాములను చేసే అవకాశాలను సైతం కల్పిస్తుంది. కనుక ప్రస్తుత వ్యవస్థలో సంస్కరణాత్మక మైన మార్పుల ద్వారా సత్య ధర్మవ్యవస్థగా మార్చే ప్రయత్నాలను కొనసాగించాలి. ఆ క్రమంలో మంచి విషయాలలో సహాయ సహకారాలు చెడు విషయాలలో సహాయ నిరాకరణ నియమాలను ఆచరిస్తూ తద్వారా వ్యవస్థను ప్రభావితపరిచే కృషిజరగాల్సిన అవసరం ఉంది".

## ఇస్లామీయ ఉద్యమం - క్రియాత్మక రాజకీయం

దైవిక ప్రభుత్వ వ్యవస్థ ద్వారా సంపూర్ణ సత్య ధర్మస్థాపన మన రాజకీయ నిర్దిష్ట లక్ష్యం. కానీ ఈ నిర్దిష్ట లక్ష్యసాధనకై ప్రస్తుత పరిస్థితులలో మన ముందు ఉండాల్సిన తక్షణ రాజకీయ కర్తవ్యం ఏమిటి? అన్న ప్రశ్నపై మేధోమధనం చేసుకుంటే కొన్ని విషయాలు మన ముందుకు వస్తాయి.

1. ఈ దేశంలో అనేక ఇస్లామీయ నియమ నిబంధనలు విలువలకు చోటులేదన్న విషయం వాస్తవమయినప్పటికీ కొన్ని నియమ నిబంధనలు విలువలు ఉన్నాయన్న విషయాన్ని విస్మరించకూడదు. ఇక్కడ మనకు పర్సనల్ లా ఉంది. వ్యక్తిగత జీవితంలో ఇస్లాంను ఆచరించే వ్యక్తిగత స్వేచ్ఛ కూడా ఉంది. ఇస్లామీయ బోధనల ప్రచార ప్రసార స్వేచ్ఛ సైతం ఉంది. సత్యధర్మాన్ని స్వీకరించే హక్కు కూడా ఉంది. అఘాయిత్యాలు, దోపిడి దురాగతాలు, విద్రోహక చర్యలకు వ్యతిరేకంగా కట్టుదిట్టమైన చట్టాలు ఉన్నాయి. అర్ధనగ్న అశ్లీలత, స్వలింగ సంపర్కానికి చోటులేదు. ఇస్లాం ధర్మసంస్థాపనా ప్రయోజ నాలకనుగుణంగా ఇస్లాం ధర్మంలో భాగమైన ఈ సద్గుణాంశాల పరిరక్షణ జరగాలి. ఇటువంటి ప్రత్యేకమైన విలువల కారణంగానే ఈ దేశం ముస్లింలకు

దారుల్ అమన్ అంటే శాంతిధామం లాంటిది. కనుక దాని రక్షణ కొరకు రాజకీయ పోరాటంతోపాటు ప్రతిరంగంలో నిరంతరం కృషి సలపడం శ్రేష్ట సమాజానికి చెందిన ముస్లింల బాధ్యత. ఈ భాగాలన్నింటినీ సురక్షితంగా ఉంచడమే మన రాజకీయ లక్ష్యం కావాలి. ఈ అంశాలను తొలగించేందుకు ప్రయత్నం చేసే రాజకీయ శక్తులకు ధీటుగా పోరాడాలి, ప్రతిఘటించాలి. వాటి పరిరక్షణకు దోహదపడే శక్తులను సమర్థించాలి.

2. ముందుగా చెప్పుకున్న విధంగా ఇస్లామేతర సమాజాలలో లౌకిక ప్రజాస్వామ్య సమాజం ఇస్లాం ధర్మానికి, ముస్లింలకు అనుకూలమైన సమాజం. మిగిలిన వాటన్నింటికన్నా మెరుగైన సమాజం. ఎందుకంటే ఈ సమాజానికి దారుల్ అమన్ హోదా ఉంది. ఇటువంటి సమాజంలో ఇస్లాంను ఆచరించే, ఇస్లాం సందేశమిచ్చేందుకు, దాన్ని స్వీకరించేందుకు ఇస్లామీయ వ్యవస్థకై కృషి చేసేందుకు అన్నివిధాలా అవకాశాలు లభిస్తాయి. తక్షణమే ఇస్లాంను స్థాపించడం సాధ్యంకాని చోట ఇస్లాం ప్రత్యామ్నాయ లక్ష్యం దారుల్ అమన్ స్థాపన కనుక ఈ పరివర్తనా కాలంలో లౌకిక ప్రజాస్వామ్య సమాజాలను సుస్థిరపరచడం వాటిని పరిరక్షించుకోవడం మన రాజకీయ లక్ష్యం కావాలి. చట్టబద్ధంగా ఆచరణాత్మకంగా అమల్లో ఉన్న ప్రజాస్వామిక విలువల పరిరక్షణ జరగాలి. చట్టబద్ధ హోదా ఉన్నప్పటికీ ఆచరణాత్మకంగా అమలుకాని విలువల విషయంలో వాటిని సంపూర్ణంగా ఆచరించే మార్గాలను సుగమం చేయడం, ఇంకా ఏ విలువలయితే రాజ్యాంగంలో పొందుపరచబడిలేవో వాటికి చట్టబద్ధత లభించలేదో ఆయా విలువలకు సముచిత స్థానం కల్పించే కృషి కూడా ఈ లక్ష్యంలో భాగమై ఉండాలి.

3. ఇస్లాంలో ఉన్న కొన్ని విలువలు చట్టబద్ధంగా ఆచరణాత్మకంగా ఈ దేశంలో స్థాపితం అయిలేవు. ఇస్లాం పేరును ప్రస్తావించకుండానే అలాంటి వాటికై ఏకాభిప్రాయాన్ని ఏర్పరచవచ్చు. వాటి స్థాపనకై కృషి చేయవచ్చు. ఇది సాధ్యమే. ఉదాహరణకు ఇస్లాం పేరును ప్రస్తావించకుండా ఇస్లాం కాంక్షించే సంక్షేమ రాజ్యానికి సంబంధించిన కొన్ని అంశాలను అమలు పరచవచ్చు. వడ్డీ, వ్యభిచారం, జూదం, మద్యం లాంటి రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేయవచ్చు. సాంస్కృతిక స్వయం ప్రతిపత్తికై ప్రయత్నాలు చేయవచ్చు. తద్వారా షరియాలోని మరిన్ని విషయాలను కూడా ముస్లింలకు వర్తింపచేయవచ్చు.

ఇటువంటి సంభావ్య విలువలను అమలు చేయడం పరివర్తన దశలో ఇస్లామీయ రాజకీయ ప్రధాన లక్ష్యం అయి ఉండాలి. సమాజం ఇస్లామీయ సంస్కృతి నాగరికతా విలువలకు అనుగుణంగా ఉండేవిధంగా సందర్భానుసారం వాటిని అమలు చేయాలి.

4. సమన్యాయ స్థాపన కేవలం ఇస్లాం మౌలికాంశమేకాక ఇస్లాం ప్రధానోద్దేశ్యం కూడానూ. ముస్లింలు న్యాయం కోసం పాటుపడాలనే ఆజ్ఞ కూడా ఉంది. మన ఇస్లామీయ విద్వాంసులు "న్యాయశీలుడైన ముస్లిమేతర పరిపాలకుడిని సహకరించడం కూడా తప్పనిసరి" అని పేర్కొన్నారు. న్యాయసమ్మతమైన విలువలు బహుదైవారాధక వ్యవస్థ ద్వారానైనా ఆచరణ సాధ్యమైతే ముస్లింలు వాటిని అమలు చేసేందుకు తమ సహాయ సహకారాలను అందించడమేకాక ఆ వ్యవస్థలో భాగస్వాములుగా కూడా ఉండవచ్చనే విషయం "హిల్ఫుల్ ఫుజూల్" ఒడంబడిక ద్వారా అవగతమవుతోంది. వాస్తవ న్యాయమయితే కేవలం సంపూర్ణ ఇస్లాం వ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుంది కానీ ఈ పరివర్తన కాలంలో సమన్యాయం కోసం సాధ్యమయ్యే అన్ని మార్గాలను సుగమం చేయడం వాటి పరిపూర్ణత కోసం కృషి సలపడం ఇస్లామీయ రాజకీయ లక్ష్యంగా ఉండాలి.

5. ఇక్కడ ప్రస్తావించబడిన మూడు నాలుగు ఐదు అంశాలు సత్యధర్మ సాక్ష్యానికి ఆచరణాత్మక విధానాలు కనుక వాటి ప్రాధాన్యత కాదనలేనిది. ముస్లింలు ఈ దేశంలో నిర్మాణాత్మక పాత్రను పోషించకపోతే సత్యసందేశ దాతలుగా మనగలగలేరు. ప్రపంచంలోని అత్యధిక ప్రాంతాల్లో జరిగిన ఇస్లాం అభివృద్ధి ముస్లింల నిస్వార్థసేవల ద్వారానే సాధ్యమైందని చెప్పవచ్చు. ఆయా సేవల స్ఫూర్తి ద్వారానే ప్రజలు ఇస్లాంను అర్థం చేసుకున్నారు. స్వతహాగా దక్షిణ భారతదేశం మాల్దీవుల ప్రాంతాలలో ఇస్లాం మార్గాలను సుగమం చేయడంలో అరబ్బు వర్తకులు తమ ఆచరణాత్మక విధానాలు వారి నీతి నిజాయితీలు నైతిక ప్రవర్తనల ద్వారానే ఇస్లాం సందేశం మూడుపువ్వులు ఆరుకాయలుగా అలరారింది. మనం ఈ దేశానికి సమాజానికి శ్రేయోభిలాషులుగా మారినప్పుడే మన సందేశాత్మక పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించగలం. తద్వారా మన స్థానాన్ని పదిలపరచుకోగలం. మారుతున్న ప్రపంచ స్వరూపంలో ఇస్లామీయ ఉద్యమాలను విధ్వంసక కార్యాలకు కేంద్రంగా చూడడం చూపించడం

జరుగుతున్న తరుణంలో ఈ సత్యధర్మ సాక్ష్యం ఇచ్చే అవసరం మరింత రెట్టింపవుతుంది.

6. ఈ దేశంలో ముస్లింలు ఇస్లామీయ ఉద్యమాల ధ్వజవాహకులు కనుక ముస్లింల పరిరక్షణను ఇస్లాం పరిరక్షణతో వేరుచేసి చూడలేము. ముస్లింల అభివృద్ధి, వారి ధన మాన ప్రాణ పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారంతో ఇస్లామీయ ప్రయోజనాలకు అవినాభావ సంబంధం ఉంది. మన ధార్మిక పండితులు కూడా ముస్లింల ధన మాన ప్రాణ రక్షణ వారి ప్రయోజనాల పరిరక్షణ ధార్మిక కృషిలో ఓ భాగమని పేర్కొన్నారు. కనుక జాతివాద శక్తుల మతతత్వ సంఘర్షణలకు దూరంగా మసలుకుంటూ సమన్యాయ స్థాపన కోసం కృషి చేస్తూ ముస్లిం సమాజ సమస్యలను పరిష్కరించడం కూడా మన తక్షణ రాజకీయ లక్ష్యంలో భాగం కావాలి.

*(ఆగస్టు 2016లో ఎస్.ఐ.ఓ. ఆఫ్ ఇండియా క్యాంపులో చేసిన ప్రసంగం)*

**ఆధార గ్రంథాలు**

1) ఖుతూతె మౌదూది
2) మద్రాసు ప్రసంగాలు
3) తహరీకె ఇస్లామీ హింద్ (సద్రుద్దీన్ ఇస్లాహీ)
4) కేంద్ర సలహామండలి తీర్మానాలు (2004, 2017, 1966)
5) తహ్రీక్ దావత్ వ జిహాద్ (ఉబైదుల్లాహ్ ఫహద్)

# ఇస్లామీయ ఉద్యమం : సైద్ధాంతిక సవాళ్లు

ఇస్లామీయ ఉద్యమం ఒక సైద్ధాంతిక ఉద్యమం. సైద్ధాంతిక సంపద మన కార్యరంగానికి గుండెకాయ లాంటిది. ముస్లిం సమాజం సైద్ధాంతిక సమాజం కనుక ఈ దేశంలో సుదీర్ఘకాలం వరకు మనం సైద్ధాంతిక రంగంలో సుదీర్ఘమైన పోరాటం కొనసాగించాల్సి ఉంది. మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఆరంభ దశలోనే ఈ విషయాన్ని స్పష్టంగా వివరించారు.

నేటి ప్రపంచానికి ఇస్లాం మార్గదర్శకంగా నిలవాలంటే ఏకైక మార్గం ముస్లింలలో అత్యంత దూరదృష్టి, దార్శనికత గల మేధావులు జనించాలి. తమ మేధోసంపత్తి సైద్ధాంతిక దృక్పథం ద్వారా పాశ్చాత్యుల సాంస్కృతిక పునాదులను కూకటివేళ్ళతో పెకలించగలిగే సత్తా కలిగి ఉండాలి. ఖురాన్ బోధనల వెలుగులో కళాఖండాల పరిశీలన, వాస్తవ విషయాల అన్వేషణకై ఇస్లామీయ దృక్పథానికి దర్పణంగా నిలిచే ఓ కొత్త తాత్విక వ్యవస్థ రూపుదిద్దుకోవాలి.

ఈ విధంగా అన్వేషణా ఆవిష్కరణల కృషికి తనదైన ప్రాధాన్యత ఉంది. అందునా సైద్ధాంతిక రంగం మన ప్రధాన రంగం కూడాను. ఒకవిధంగా చెప్పాలంటే మన ఉనికి, అభివృద్ధి జీవన్మరణాలన్నీ దానిపైనే ఆధారపడి ఉన్నాయి.

సైద్ధాంతిక ఉద్యమాలు, సైద్ధాంతిక సమాజాలు పతనమవ్వటానికి కారణం వనరులలేమి, ప్రత్యర్థి శక్తుల దాడులు ప్రధాన కారణాలు కాదు. ఉద్యమంలో స్తబ్ధత ఏర్పడడం, ఉద్యమం క్రమబద్ధంగా వికసించక పోవడం లాంటి కారణాల వల్లనే ఉద్యమాలు తమ మనుగడను కోల్పోతాయి. కనుక

సైద్ధాంతిక మేధోమథనం ఉద్యమానికి జీవనాడి లాంటిదని చెప్పవచ్చు. సంస్థను వ్యవస్థీకరించేందుకు, విస్తృత పరిచేందుకు ఇతర సంస్థాగత, ఉద్యమ అవసరాలపై ఆలోచించేందుకు సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ఎంత ప్రాధాన్యతనిస్తామో, సైద్ధాంతిక వాస్తవ పరిస్థితిని సమీక్షించడంపై ప్రధాన దృష్టిని సారించడం అంతకన్నా ఎక్కువ అవసరం. సైద్ధాంతిక అవసరాలపై పదేపదే సమావేశాలు నిర్వహించడం, తద్వారా సైద్ధాంతిక మేధోమథనం జరుతుండటం అవసరం.

ప్రస్తుతం ప్రపంచ స్వరూపమంతా మారిపోయింది. నేడు ప్రపంచ మంతటా ఇస్లాం ధర్మం ఒక శాస్త్రీయ రాజకీయ ప్రాధాన్యతను సంతరించు కుంది. మానవ సమస్యలన్నిటికీ ఏకైక పరిష్కారం ఇస్లామేనన్న ఇస్లామీయ విద్వాంసుల వాదానికి ఓ బలమైన అర్థం ఏర్పడింది. ఏదో పిచ్చి మారాజుల పిచ్చాపాటివాదం అంటూ దీన్ని విస్మరించడం సులభమైన విషయంగా లేదు. ఇప్పుడిది విశ్వవిద్యాలయాల నుండి ప్రపంచ పరిశోధనల వరకు, అసెంబ్లీల నుండి అంతర్జాతీయ దౌత్యకార్యాలయాల వరకు ప్రతిచోటా చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు ముస్లిం విద్వాంసులను చూసి వారితో సన్నిహిత సంబంధాలు గరిపేవారు, సనాతనవాదులు సాధుస్వభావులే ఇస్లాంఛాయలోకి వచ్చేవారు. ఇస్లాంపై విమర్శనాస్త్రాలు సంధించేవారిలో ముస్లిం మత విద్వాంసులే ఉండేవారు. ప్రపంచం మాత్రం ముస్లింలను ఒక ఉగ్రవాద మూకగా చూస్తూ కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యేది. శాస్త్రీయ ప్రపంచాన్ని సంబోధించేందుకు, దాన్ని సూటిగా సవాలు చేసేందుకు మనం మాత్రం సాహసం చేసిందెక్కడ? పాశ్చాత్య విధివిధానాలు, ఇస్లాం వ్యతిరేక దృక్పథాలను మాత్రం ధీటుగా విమర్శించినప్పటికీ ఆయా విమర్శలు కేవలం ముస్లిం సమాజాల వరకే పరిమితం అయ్యేవి. ముస్లిం సమాజ సిద్ధాంతాలను పరిరక్షించి, ఆపై వారిలో అచంచలమైన విశ్వాసాన్ని పెంపొందించడమే దాని ఉద్దేశ్యమై ఉండేది.

కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ప్రస్తుతం మనం అవునన్నా కాదన్నా మొత్తం ప్రపంచాన్ని సంబోధించవలసి ఉంది. ప్రపంచం తన స్వీయ శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం పరిశీలించి తదనుగుణంగా విమర్శించే వ్యాఖ్యానించే నైపుణ్యాన్ని కూడగట్టుకుంది. ఇప్పుడు అంతర్జాతీయ సంస్థల్లో

ఇస్లామీయ ఉద్యమాల ప్రభావాలు, ముస్లిం సమాజంలో వాటి స్థానం, జాతీయ భద్రతకు సంబంధించి వారి వైఖరి తదితర విషయాలపై విశ్లేషణలు పరిశోధనలు జరగడమేకాక ఆయా ఇస్లామీయ ఉద్యమాల విధివిధానాలు, సామాజిక సమస్యలపై వారు ప్రతిపాదిస్తున్న పరిష్కారాలు ఇస్లామీయ ఉద్యమాల దార్శనికతపై సైతం చర్చలు జరుగుతున్నాయి.

ఈ పరిస్థితి శుభపరిణామమే అయినప్పటికి ఓ బాధ్యతాయుతమైన స్థానంలో అత్యంత సంక్లిష్టమైన స్థితిలో మనల్ని నిలబెడుతుంది. గత మూడొందల ఏళ్లుగా చరిత్ర సెమినార్ హాలులో మన వంతుకై మనం ఎదురు చూస్తుంటే కన్వీనర్ ఇప్పుడు మన పేరును ప్రకటించాడు. మనల్ని మాట్లాడేందుకు మరీ ఆహ్వానించాడు. ఇప్పుడు మనం మాట్లాడి మన వైఖరిని ప్రపంచం ముందు పెట్టి ఒప్పించాల్సి ఉంది. అయితే మనం మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నామా అనేదే అసలు ప్రశ్న? ఫ్రాన్స్ ఫోకోయామా, నోమ్ చామ్‌స్కీ లాంటి వాళ్ళు తమ వాదనను వినిపిం చేందుకు వేచి ఉన్నటువంటి హాలులో మన గళాన్ని వినిపించేంత సత్తా సామ ర్థ్యాలు మనకున్నాయా? వాదనలో మనం నెగ్గగలమా అనేటటువంటి ప్రశ్నలకు సమాధానాలను కనుగొనడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

ఓసారి నన్ను గతంలోకి వెళ్లనివ్వండి. ఈ సెమినార్ జరుగుతున్న (హెూటల్ అన్మోల్, హైదరాబాద్) ప్రదేశానికి కూతవేటు దూరంలో ఒక చారిత్రక ప్రదేశం ఉంది. అక్కడ ఓ చిన్నపాటి మసీదు. ఆ మసీదు గదులలో ఒకప్పుడు తర్జుమానుల్ ఖుర్ఆన్ కార్యాలయం ఉండేది. 70 ఏళ్లక్రితం ఒక వ్యక్తి అక్కడ కూర్చుని అత్యంత ఆత్మవిశ్వాసంతో శాస్త్రీయ ప్రపంచమంతటికీ సవాలు చేశాడు. మౌలానా మౌదూదీ (రహ్మాలై) కాలంలో అబుల్ కలాం ఆజాద్, సయ్యిద్ సులైమాన్ నద్వీ, అష్రఫ్ అలీ థాన్వీ లాంటి పెద్దపెద్ద పండితులు ఉలమాలు మేధావులు ఉన్నారు. కానీ మౌలానా మౌదూదీ (రహ్మాలై) గారి విశిష్టత ఏమంటే ఆయన కేవలం ముస్లింలనే కాక తన సమకాలీన శాస్త్రీయ ప్రపంచమంతటినీ సంబోధించారు. దాని కోసం ఆయన ఎటువంటి సాంప్రదాయిక సంభాషణా శైలిని అవలంబించలేదు. సమకాలీన శాస్త్రీయ ప్రపంచభాషనే ఉపయోగించి మరీ ఆ శైలిలోనే మాట్లాడారు. ముస్లింల వివిధ పంథాలపై జరిగే ఫిఖా, తాత్విక

చర్చాగోష్టులకే పరిమితం కాకుండా సమకాలీన ప్రపంచం సంభాషించ గోరిన అంశాలను సైతం లేవనెత్తారు.

నేడు మనం ఆ ఉద్యమానికి వారసులం. చరిత్రలోని క్లిష్టమైన దశలో, ఇటువంటి మహత్తరమైన ఉద్యమ వారసత్వం మనకు లభించింది. కానీ ప్రపంచవ్యాప్తంగా ఉద్యమ చైతన్యంలో స్తబ్దత ఏర్పడింది. నేడు మన కార్యరంగం విస్తృతమౌతోంది. సామాజిక పలుకుబడి పెరుగుతోంది. వనరులు కూడా అభివృద్ధి చెందుతున్నాయి. సైద్ధాంతిక వికాసం మాత్రం జరగడంలేదు. స్వతహాగా మన ప్రయాణంలో మనం తీసుకున్న మలుపులు మనం చేసుకున్న వ్యూహరచనల వెనుక దృఢమైన ఆలోచనలు పటిష్టమైన సిద్ధాంతాలు లేకపోవడం వల్ల సైద్ధాంతిక సందిగ్ధత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

మన మేధోసంపత్తి, సైద్ధాంతిక భావధారల విషయానికొస్తే ప్రపంచానికిచ్చేందుకు మన వద్ద ఎటువంటి సరికొత్త ప్రణాళిక, ఆలోచన అంటూ లేదు. మన పూర్వీకులైన ఆదర్శవాదులిచ్చిన అద్భుతమైన భావనల ఆధారంగానే నేడు మనం సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగిస్తున్నాము. కానీ క్షణక్షణం మారుతున్న ఈ ప్రపంచంలో కొన్ని సంక్షిప్తమైన భావధారలు, ప్రాచీన మేధోసంపత్తి మాత్రమే సరిపోదు. ప్రపంచం మన మాటలు వినేందుకు సంసిద్ధంగా ఉంది. కానీ మనం మాత్రం ఏం చెప్పాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నాం. ఇది సామాన్యమైన విషయం కాదు. ఎన్నో సందిగ్ధతలు సంక్లిష్టమైన సమస్యలకు మూలకారణం. ఒక సైద్ధాంతిక ఉద్యమంగా మనగలగాలంటే ఈ సమస్యపై గంభీరంగా సమాలోచన చేయాల్సిన అవసరముంది. దాని పరిష్కారానికై మన శక్తియుక్తులు సామర్థ్యాలు అధికమొత్తంలో వెచ్చించాల్సి ఉంది.

మేధోసంపత్తి విషయం వచ్చినప్పుడల్లా కొన్ని అంశాలను ప్రతిపాదించి, ఏవో కొన్ని అనువాదాలు వ్యాఖ్యానాలు పాత్రికేయ కథనాలను ప్రచురించుకొని సరిపుచ్చుకుంటాము. ఈ పని ప్రపంచంలోని ప్రతీ సంస్థలోనూ ప్రతి మదర్సాలోనూ జరుగుతోంది. ఒక సైద్ధాంతిక ఉద్యమం కూడా సామాన్య పనులతో సంతృప్తి చెందితే ఇక దాని ప్రాముఖ్యతంటూ ఏమీ మిగలదు. ముస్లింల రాజకీయ సమస్యలు, ప్రస్తుత రాజకీయ సంఘర్షణాపరమైన చర్చలను ముందుకు ఎందుకు తీసుకెళ్లలేకపోయామో, స్వతంత్ర భారతంలో ముస్లింల రాజకీయ బలహీనతలను అధిగమించి, పరిస్థితులకు అనుగుణంగా దిశా

నిర్దేశన చేసే రాజకీయ తత్వశాస్త్రాన్ని ఎందుకు రూపొందించ లేకపోయామనే విషయాలపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

మౌలాన మౌదూదీ (రహ్మాలై) ఆధునిక యుగపు అతి ముఖ్యమైన సమస్య లను లేవనెత్తారు. ఆయన ప్రపంచ ముస్లిం దేశాలను పశ్చిమ దేశాల అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఖుర్ఆన్, సున్నత్ బోధనలకనుగుణమైన ఆలోచనల ప్రాతిపదికన ఆ సమస్యలపై ప్రత్యేకమైన సమీక్షా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన రచనలలో ఆయన లోతైన ఆలోచనలు, అపారమైన జ్ఞాన సంపద, ఖురాన్ హదీసుల విస్తృతమైన అవగాహనా అన్వయింపులు, పాశ్చాత్య ఆలోచనా విధానాలపై చారిత్రక విమర్శ ప్రతిబింబిస్తోంది. ఆయన గారి ఈ విశిష్టతలే జీవిత సమస్యల పట్ల ముస్లింల స్పందనకు ఓ కొత్తదనాన్ని అందించాయి. ఆయన సందేశంలో విస్తృతమైన ఆకర్షణను జనింపచేశాయి. సంస్థలు సరిహద్దులకతీతంగా వాటి ప్రభావం ఏర్పడింది. ఇస్లామీయ సైద్ధాంతిక ఆద్యుడిగా, ప్రఖ్యాత విధ్వాంసుడు రచయితగా, 20వ శతాబ్ది యుగ పురుషుడిగా, ముస్లింల మహానాయకుడిగా అపారమైన గుర్తింపు ఆయన సొంతమైంది. వారి తరువాత సమకాలీన ప్రపంచానికి సంబోధించే శక్తియుక్తులు ధైర్యసాహసాలు ఎవరికీ లేకపోయాయంటే అతిశయోక్తి కాదేమో? కారణమేమిటి? ప్రామాణిక తల విషయం పక్కన పెడితే మౌలానా మౌదూదీ (రహ్మాలై) లాంటి మహెూజ్వల మైన వ్యక్తిత్వాలు రోజురోజు జనించవు. కనీసం ఆధునిక శాస్త్రీయ ప్రపంచం అవగాహన చేసుకునే విధంగా ఆయన శాస్త్రీయ భాష, సంభాషణాశైలిని సైతం మనం అవలంబించలేక పోయాం. దానికి భిన్నంగా తరచూ మతపండితుల సాంప్రదాయిక సంభాషణాశైలిని ధార్మిక ముస్లింలు అవగాహన చేసుకునే పరిమిత ప్రయత్నాన్నే అవలంబించాము.

ఈ కారణం మూలానే ప్రపంచంలోని శాస్త్రీయ వర్గాలు మన పుస్తకాలపై శ్రద్ధ చూపడం మానేశాయి. ఉద్యమ వర్గాల్లో అర్థశాస్త్రంలో మాత్రం నజాతు ల్లాహ్ సిద్దీఖీ గారి రచనలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. పాకిస్తాన్‌లో కొంతమేర మర్హూమ్ ఖుర్రం మురాద్, ఖుర్షీద్ అహ్మద్ గారి మాటలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు కళాశాలలను ఆకర్షించాయి. మిగిలిన పుస్తకాలన్నీ కేవలం ముస్లింలు, ఉద్యమ వర్గాలకే పరిమితమవడానికి కారణమేమిటి? స్వీయరచన స్వీయపతనం, మనమే రాసుకోవడం మనమే

చదువుకోవడం ఒక ప్రత్యేక వర్గానికయితే ఉపయోగపడుతుంది కానీ సర్వతోముఖాభివృద్ధి కొరకు ఉనికిలోకొచ్చిన సజీవ సాక్ష్య ఉద్యమానికి ఎంతమాత్రం తగదు. ఒక విశ్వజనీనమైన సైద్ధాంతిక ఉద్యమంగా ఇమామ్ గజాలి, ఇబ్నె ఖుల్దూన్, ఇబ్నె తైమియా, షా వలియుల్లాహ్ లాంటి అత్యున్నత ప్రమాణాలు గల వ్యక్తిత్వాల స్థాయిలో మాట్లాడగలిగే విధంగా మన లక్ష్యం ఉండాల్సిన అవసరం ఉంది. కార్ల్ మార్క్స్, సిగ్మండ్ ఫ్రాయిడ్, మెషల్ఫోకో, జాక్వెస్దెరిడా స్థాయిలో మాట్లాడాల్సిన అవసరం ఉంది. ఆయా వ్యక్తిత్వాలు చెప్పిన మాటలు శాస్త్రీయ ప్రపంచమంతా ఎంతో సాదరంగా విన్నది. ఇటువంటి మాటలు మనం ఎందుకు చెప్పలేకపోతున్నాం?

నేడు ఇటువంటి అత్యద్భుతమైన మాటలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే సైద్ధాంతిక భావధారల అవసరం ఉంది. ప్రపంచంలో పెరుగుతున్న సైద్ధాంతిక సంక్షోభం కొత్తకొత్త ఆలోచనలు ఆవిష్కరణల అన్వేషణలో ఉంది. వారి వద్ద అద్భుతమైన ఆలోచనలకు దోహదపడే ప్రాపంచిక దృక్పథమంటూ ఏదీ లేదు. మన సమస్య ఏమిటంటే మన వద్ద ప్రపంచ దృక్పథం ఉంది కానీ ప్రణాళికలు ఆలోచనలు లేవు.

సబ్ అప్నే బనాయే హుయే జిందాన్మేహై మహ్బూస్
ఖావర్కె సవాబిత్ హోకే అఫ్లాక్కే సయ్యార్
పీరానె కలీసాహో కె షేఖానె హరమ్ హో
నయే జిద్దత్ గుఫ్తార్ హై నయ్జిద్దతే కిర్దార్
దునియాకుహై ఉస్మెహ్దీ బర్హక్కి జరూరత్
హోజిస్కి నిగహ్జల్జలయే ఆలమే అఫ్కార్....

ఏదో మనకున్న మిడిమిడి జ్ఞానం ద్వారా దేనినీ సాధించలేం. ప్రపంచ సిద్ధాంతాలలో ప్రకంపనలు పుట్టించే అత్యద్భుతమైన పనికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. బహుశా ఇది చాలా పెద్ద విషయం కావచ్చు. వాస్తవమేమంటే నేడు మన దగ్గర ఆ స్థాయికి చెందిన స్థితప్రజ్ఞతలుగానీ సామర్థ్యాలుగానీ లేవు. అయినప్పటికీ దాని కోసం కలలయినా కనగలం. ఆ కలలను మన భావి తరాలకు అందించగలం. మన కలలను సాకారం చేసుకునేందుకు ప్రణాళికల నైనా ఏర్పరచుకోగలం. తద్వారా ఈ పనిని సమర్థవంతంగా మనం చెయ్యలేక

పోయినా కనీసం మన భావితరాలయినా వారి తర్వాత వచ్చే తరాలయినా నిర్వర్తించగలరేమో. మన కలలను సాకారం చేసుకునేందుకు నవతరాన్ని తయారు చేసే కార్యంలో భాగంగా ఈ సెమినార్‌లు స్ఫూర్తిదాయకం కాగలవేమో.

ఈ మహోజ్వలమైన ఉద్యమాన్ని కేవలం రోజువారీ ప్రతిపాదనలకే పరిమితం చెయ్యకుండా అతి ప్రాధాన్యత గల చర్చనీయాంశమయ్యే విధంగా కృషి జరగాలి. కొత్తకొత్త పుస్తకాలపైకాక కొత్తకొత్త తాత్విక విధానాలపై ఆలోచనలు జరగాలి. సరికొత్త ఆదర్శ నమూనాలను ప్రవేశపెట్టే పద్ధతులను కనుగొనాలి. ప్రత్యేకమైన భావాలు, విశిష్టమైన ఆలోచనలకు నాంది వేసేటటువంటి అవసరాలను గుర్తించాలి. ఈ ఆలోచనలు ఎలా వస్తాయనే విషయమై మేధోమథనం జరగాలి.

మన ఉద్యమ సైద్ధాంతిక అవసరాల సాధనకై నిదానంగా ముందుకు సాగాల్సి ఉంది. అయితే ఇక్కడ ప్రస్తావించబడిన విషయాలను తక్షణం అమలు జరపడం సాధ్యపడదు. ఈ లక్ష్యాలను సుదీర్ఘమైన పోరాటం ద్వారానే సాధించగలం.

తక్షణ కర్తవ్యంగా మన ముందు ఉండాల్సిన కొన్ని ఉప లక్ష్యాలు ఇవి.

**మొదటి లక్ష్యం:** ఉద్యమంలో శాస్త్రీయ, సైద్ధాంతిక కార్యరంగం ప్రాధాన్యత పొందాలి. కొంతమంది ప్రధానంగా యువ మేధావులు అత్యంత ఏకాగ్రతతో ఈ పని పట్ల దృష్టి సారించాలి. వారికి నిరంతరం దిశానిర్దేశం ప్రోత్సాహం లభించాలి. వారి మేధోపరమైన ప్రయత్నాలు తెరపైకి వస్తూ ఉండాలి. ఈ లక్ష్యసాధనకై దేశవ్యాప్తంగా విద్వాంసులను పరిశోధనా రంగంతో జోడించాలి.

**రెండవ లక్ష్యం :** ఉద్యమ శాస్త్రీయ సైద్ధాంతిక అవసరాలకు సంబంధించి మనకు స్పష్టమైన అవగాహన ఉండాలి. ఈ అవసరాల గురించి అప్పుడప్పుడు చర్చలు జరుగుతూనే ఉన్నప్పటికీ నిర్దిష్టమైన విధానమంటూ ఏదీ మన ముందు లేదు. మన తక్షణ మరియు సుదీర్ఘకాలిక శాస్త్రీయ అవసరాలపై చర్చలు జరగాలి. వచ్చే 2 ఏళ్లలోపు ఈ అవసరాలపై స్పష్టత ఏర్పడితే ఒక స్పష్టమైన

స్వరూపం మన ముందుకొచ్చే అవకాశం ఉంది. తదనుగుణంగా మన మేధావుల ద్వారా ఆ పని సాధించవచ్చు. ఈ లక్ష్యసాధనకై సమగ్రమైన రూపు రేఖలతోపాటు మన అవసరాలకు సంబంధించిన ప్రాథమిక వివరాలు స్పష్టంగా ఉండగలగాలి.

**మూడవ లక్ష్యం :** ఉద్యమంలో సందేశ, రాజకీయ, సామాజిక చైతన్యంలో ఆచరణాత్మక అభివృద్ధి జరిగిన విధంగా శాస్త్రీయ, సైద్ధాంతిక వాతావరణం కూడా పెంపొందాలి. ఈ పనిపై శ్రద్ధతోపాటు అంతర్మధనం జరిగే వాతావరణం ఏర్పడాలి. అందులో భాగంగా ఇన్షాఅల్లాహ్ వివిధ అంశాలపై దేశ నలు మూలలా నిర్వహించబడే సెమినార్లు సహాయ పడతాయని ఆశిద్దాం.

ఈ మూడు విషయాల తక్షణ కర్తవ్య సాధనలో ఉద్యమ సహాయం సంపూర్ణంగా ఉండాలి. దానికొరకు మనం నిష్ణాతులైన స్కాలర్లను ఉద్యమంతో అనుసంధానం చేసి ఉద్యమంలో శాస్త్రీయదృక్పథాన్ని పెంపొందించాలి.

మన పెద్దలు వివిధ పనుల ఒత్తిడిలో ఉన్నారు. వారి దృష్టిని ఆకర్షించేందుకు ఇతర పనుల మాదిరిగానే ఈ పనిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉద్యమంలో ఈ వాతావరణం ఏర్పడితే ఒత్తిడి కూడా ఏర్పడగలదు.

తొలి అడుగులో భాగంగా ఈ కొన్ని ప్రశ్నలకు జవాబులు వెతకాల్సిన అవసరం ఉంది.

1. వివిధ విభాగాలలో ఉద్యమ సాహిత్యానికి సంబంధించిన ఏ విషయాల అవసరం ఉంది?
2. గత ఐదు దశాబ్దాలలో ఎటువంటి శాస్త్రీయ అభివృద్ధి జరిగింది? దానికనుగుణంగా ఉద్యమ సాహిత్యం సరిపోతుందా లేదా అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.
3. సామాజిక రాజకీయ ఇతర మార్పుల ఫలితంగా ప్రపంచంలో తలెత్తిన కొత్త కొత్త సమస్యలు సవాళ్లు ఏమిటి? ఆయా రంగాల్లో మనం ఎక్కడ నిలబడి ఉన్నాం?
4. ఏ ఏ విషయాలలో మన వైఖరిని పునఃపరిశీలించుకోవాల్సిన అవసర ముంది?

5. ఉద్యమ సాహిత్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చేందుకు మీరు ఏ సూచనలు ఇస్తారు. ఈ విషయమై ఆచరణాత్మక కార్యక్రమం ఏమై ఉండాలి?

*(జూలై 2012లో హైదరాబాదులో నిర్వహించబడిన సాహిత్య సమీక్షపై చేసిన ప్రారంభ ప్రసంగం, తరువాత తర్జుమానుల్ ఖుర్ఆన్ డిసెంబర్ 2015 సంచికలో ప్రచురితమైంది)*

# ఇస్లామీయ ఉద్యమ సాహిత్యం : దాని ముందున్న శాస్త్రీయ సవాళ్లు

భారతదేశంలో ఇస్లామీయ ఉద్యమం ఏ ఏ అంశాలలో విజ్ఞాన పరమైన కృషి చేయాల్సిన అవసరం ఉందో  ఈ వ్యాసం లో సూచించడం జరిగింది.

ఆర్థిక రాజకీయ  సాంస్కృతిక విద్యా రంగాలు, వ్యక్తిత్వ వికాసం, మతం, మతాల తులనాత్మక అధ్యయనాంశాలపై ఇస్లామీయ ఉద్యమం చేపట్టిన కృషి, ఇంకా ఏయే అంశాలపై శాస్త్రీయ కృషి జరగాల్సి ఉందనే విషయాలు ఈ వ్యాసంలో చర్చనీయాంశమయ్యాయి.

ఇస్లామీయ ఉద్యమం సమకాలీన సమస్యలను పరిగణనలోకి తీసుకొని అద్భుతమైన అమూల్యమైన సాహిత్యాన్ని సృష్టించింది. ఈ సాహిత్యం ఇస్లాం దృక్పథానికి దర్పణంగా నిలవడమే కాక  ముస్లింలు ఇస్లామీయ సంస్థలకు మార్గనిర్దేశనం చేస్తోంది. ఆధునికవాదాలుగా అలరారుతున్న సిద్ధాంతాలు ఇస్లామీయ దృక్పథాలపై ఎక్కుపెట్టిన విమర్శలను, ఇస్లాంపై  వేసిన  అభాండాలు అపార్థాల మబ్బులను  పటాపంచలు చేయడంలో ఇస్లామీయ సాహిత్య కృషి అమోఘమైనది. అంతేకాక ముస్లింలలో ఇస్లాం పట్ల అచంచల విశ్వాసాన్ని పెంపొందించడంలోనూ, ముస్లిమేతరులను ఇస్లాం వైపునకు ఆకర్షింప జేయడంలోను, అసంఖ్యాకమైన హృదయాల్లో విశ్వాస మాధుర్యాన్ని జనింప చేయడంలోనూ, ఎన్నో హృదయాలను సంశయాత్మక కాలుష్యాల నుండి పునీత పరచడంలోనూ తనదైన పాత్రను పోషించింది. ముస్లింలకు సరైన దిశానిర్దేశన చేసి వారిలో శ్రేష్ట సమాజ స్పృహను పాదుకొల్పుతూ తదనుగుణంగా కృషి సలిపే కార్యాచరణను అందించడంలో ఇస్లామీయ సాహిత్యం ఎంతో కృషి చేసింది. పిల్లల కోసం,పెద్దల కోసం, సామాన్య పాఠకుల  కొరకు అమూల్యమైన

సాహిత్యాన్ని సృజించింది. ఉద్యమ రంగంలో ఉన్న విద్వాంసులు ఆర్థిక రాజకీయ విద్యా రంగాలలో అపూర్వమైన సైద్ధాంతిక శాస్త్రీయ సేవలందించారు. ఈ విధంగా ఉద్యమంలో జరిగిన వైజ్ఞానిక సైద్ధాంతిక కృషి ఇస్లాం, ముస్లింల కొరకు అమూల్యమైన సంపద లాంటిది.

నేటి ఆధునిక ప్రపంచంలో, వైజ్ఞానిక విస్ఫోటనా యుగంలో ఈ శాస్త్రీయ సంపదలో మరింత కృషి జరగాల్సిన అవసరం ఉందనిపిస్తోంది. ఎన్నో ప్రశ్నలున్నాయి వాటికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ మధ్యకాలంలో సమకాలీన ప్రపంచంలో జరిగిన శాస్త్రీయ కృషిపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉంది. ఆధునిక అభివృద్ధి పుణ్యమా అంటూ ఏర్పడిన కొత్త కొత్త సమస్యలకు సరికొత్త పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరం ఉంది. శాస్త్రీయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

## శాస్త్రీయ సాహిత్యం

ఇస్లామీయ ఉద్యమ సాహిత్యంలోని అధికభాగం శాస్త్రీయ సాహిత్యమే. అంటే ఇస్లామీయ సూత్ర సిద్ధాంతాలకు సమర్థనగా హేతుబద్ధమైన ఆధారాల ద్వారా వివరించే సాహిత్యం అని అర్థం. చరిత్రలోని అత్యంత క్లిష్టమైన దశలో ముస్లిం సమాజానికి చెందిన ఆధునిక విద్యా, మేధావి వర్గాన్ని సైద్ధాంతిక భ్రష్టత్వం నుండి కాపాడి, వారి మనోమస్తిష్కాలలో ఇస్లాం పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ఆత్మస్థైర్యాన్ని పునరుద్ధరింప జేసి, దానికై పటిష్టమైన పునాదులను ఏర్పరచడంలో మౌలానా మౌదూదీ (రహ్మలై) చేసిన సేవలు అనితర సాధ్యమైనవనడంలో సందేహం లేదు.

ఇస్లామీయ విశ్వాసాలకు అనుకూలంగా మౌలానా మౌదూదీ (రహ్మలై) రచించిన గ్రంథాలలో రిసాలయే దీనియాత్, ఖుత్బాత్‌లకు విశేష స్పందన లభించింది. ఆయా పుస్తకాలలో మౌలానా (రహ్మ లై) సాధారణమైన సహజమైన శైలిలో ఇస్లాం మౌలిక విశ్వాసాలను హేతుబద్ధమైన వాదనల ద్వారా నిరూపించారు. అవే కాకుండా తౌహిద్ వ రిసాలత్ కా అఖ్లి సుబూత్, ఇస్లామీయ జీవన వ్యవస్థలోని మౌలిక భావనలు వంటి రచనలలోని కొన్ని వ్యాసాల్లో, తఫ్హీముల్ ఖురాన్‌లోని కొన్ని చర్చలలో ఈ విషయాలను అత్యంత వైజ్ఞానికంగా నిరూపించడం జరిగింది.

ఈ పరంపరను మరింత ముందుకు తీసుకెళ్లడం, ఇస్లామీయ శాస్త్రీయ సాహిత్యాన్ని అభివృద్ధి పరచడం, ఇస్లాం సిద్ధాంతాలను అత్యున్నతమైన తాత్విక విధానాల ద్వారా శాస్త్రీయంగా నిరూపించడం నేటి ఇస్లామీయ సందేశ ప్రచారానికి ఎంతో అవసరం.

ఇస్లామీయ సిద్ధాంతాలలో మౌలికమైన సిద్ధాంతం ఏకేశ్వర వాదం. దేవుని ఉనికి, ఏకేశ్వర వాదం, దైవ గుణగణాలకు సంబంధించిన సమస్య ప్రాచీన కాలం నుండీ ఆస్తిక నాస్తిక వర్గాల మధ్య వివాదాస్పదంగానే ఉంది. నేటి శాస్త్రీయ ప్రపంచంలో కూడా పాశ్చాత్య సెక్యులరిజం, ఇస్లాం మధ్య కొనసాగు తున్న తాత్విక వైరుధ్యం ఈ సమస్యపైనే కొనసాగుతుంది. దేవుని అస్తిత్వం ఆయన గుణగణాలు నిరూపితమైతే దైవ దౌత్యం పరలోకాలను రుజువు చేయడం సులభతరమే.

ఒక సామాన్య విద్యా వంతుడిని దేవుని అస్తిత్వాన్ని నిరూపించేందుకు మౌలానా మౌదూది (రహ్మాలై) రచనలు సరిపోతాయి. ఆయా పుస్తకాలలో మధ్యయుగ మేధావులు, ప్రధానంగా ఇమామ్ గజాలి (రహ్మాలై) గ్రీకు తత్వశాస్త్రానికి వ్యతిరేకంగా అవలంభించిన వాదనా విధానాన్ని ఉపయోగించడం జరిగింది. తరువాత వాటిని క్రైస్తవ మత ప్రచారకులు కూడా విస్తృతంగా ఉపయోగించారు. మౌలానా మౌదూదీ (రహ్మాలై) ప్రాచీన వాదనలను తన ప్రత్యేకమైన సంభాషణా శైలిలో ఆధునిక ఉపమానాల ద్వారా అత్యద్భుతమైన రీతిలో వివరించి ఆధునిక మేధస్సుకు ఆమోదయోగ్యంగా మలిచారు. మౌలానా మౌదూదీ (రహ్మాలై) గ్రంథాలు ఆధునిక యుగానికి చెందిన అత్యుత్తమ గ్రంథాలనడంలో అతిశయోక్తి లేదు. ఆయన తన చర్చలు వాదోపవాదాల ద్వారా అనేక మస్తిష్కాలలో ఉన్న మాలిన్యాలను కడిగి వేసి లక్షల కొద్దీ హృదయాలను సన్మార్గం వైపునకు నడిపించారు.

అయితే ఈ వాదనలు సామాన్య విద్యావంతులకయితే సరిపోతాయి కానీ పాశ్చాత్య తత్వశాస్త్రాలు లోతుగా అధ్యయనం చేసి, వాటికి ప్రభావితులైన వారికైతే సరిపడవు. 18, 19వ శతాబ్దంలో పాశ్చాత్య నాస్తిక వాదులు ఈ వాదనలను తీవ్రంగా విమర్శించారు. దేవుని అస్తిత్వానికి సంబంధించి మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఇచ్చిన గడియారపు ముల్లుల ఉదాహరణ మొట్టమొదట బ్రిటన్ క్రైస్తవ విద్వాంసుడు విలియం పాలీ ప్రస్తావించిన విషయం మనందరికీ

విదితమే. గత రెండు దశాబ్దాలుగా శాస్త్రీయ ప్రపంచమంతటా ఈ ఉదాహరణ ఇతోధికంగా చర్చనీయాంశం అయింది. డేవిడ్ హ్యూమ్ నుండి రిచర్డ్ డాకిన్స్ వరకు డజన్ల కొద్దీ తత్వవేత్తలు దీనిపై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు. రిచర్డ్ డాకిన్స్ దీనికి జవాబుగా నేరుగా ఒక పుస్తకాన్నే రచించాడు. బెర్ట్రాండ్ రస్సెల్ వాదనలయితే మంచి మంచి  విశ్వాసులను సైతం సందేహంలో పడవేస్తాయి. 20వ శతాబ్దంలో రిచర్డ్ డాకిన్స్, క్రిస్టోఫర్ హేఛన్స్, విక్టర్ స్టింగర్, లాంటి పదుల సంఖ్యలో  తత్వవేత్తలు నాస్తికత్వానికి అనుకూలంగా విస్తృతమైన వాదనలు వినిపించారు. ఈ వాదనలన్నీ శాస్త్రీయ ప్రపంచంలో మత వ్యతిరేకత, నాస్తికత్వం, అతివాద సెక్యులరిజానికి దారులను సుగమం చేశాయి. ఆయా సిద్ధాంతాలకు దీటుగా మన వద్ద ప్రస్తుతమున్న ఇస్లామీయ సైద్ధాంతిక శాస్త్రీయ సంపద ఏమాత్రం సరిపోదు. ఎంతోమంది ధార్మిక యువకులు కాంట్, రస్సెల్ సిద్ధాంతాలను అధ్యయనం చేసి ఏళ్ల తరబడి సందిగ్ధతకు లోనై గందరగోళానికి గురైన సందర్భాలు కోకొల్లలు. నాస్తికత్వ మూలాలను అత్యంత వివేకంగా హేతుబద్ధ స్థాయిలో తాత్త్విక స్థాయిలో తుదముట్టించడం, దేవుని అస్తిత్వాన్ని శాస్త్రీయంగా నిరూపించడం ఇస్లాం సందేశ ప్రదాతల ప్రధాన కర్తవ్యం. మధ్య యుగాలలో ఇమామ్ గజాలి (రహ్మాలై) ఈ విషయంలో అత్యద్భుతమైన కృషి జరిపి గ్రీకు తాత్విక పునాదులనే పెకలించగలిగారు.

క్రైస్తవ ప్రపంచంలో  కూడా ఈ రంగంలో మంచి కృషి జరిగింది. దాన్ని సద్వినియోగం చేసుకొని కొన్ని పుస్తకాలు రాయగలిగితే ఒక అమూల్యమైన పనికి అంకురార్పణ చేసినట్లే. ఇలాంటి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. టర్కీ మేధావి హారూన్ యహ్యా సైన్స్ ఆధారాల సహాయంతో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారు కానీ ఆ వాదనలు కూడా సామాన్య వ్యక్తుల కొరకే తప్ప నాస్తికత్వాన్ని తాత్విక స్థాయిలో పరిష్కరించే దిశగా లేవు. మౌలానా వహీదుద్దీన్  ఖాన్ గారు కూడా ఒకప్పుడు ఈ విషయంలో మంచి ప్రయత్నాలు ప్రారంభిం చారు. దాన్ని కొనసాగిస్తే బహుశా మంచి ఫలితాలుండేవి. ఆయన రచించిన సాహిత్యం కూడా సాధారణ స్థాయి  పాఠకులకు ఉపయోగ పడేదనడంలో సందేహం లేదు. ఆయా రచనల ద్వారా ముస్లింల విశ్వాసాలను పటిష్ట పరచవచ్చేమో గాని నాస్తికులను ఒప్పించడం మాత్రం సాధ్య పడదు. మౌలానా అబ్దుల్ బారీ నద్వీ గారి పుస్తకంలో ఈ అంశంపై అద్భుతమైన

చర్చలున్నాయి. ప్రధానంగా క్వాంటం మెకానిక్స్ ,బిగ్ బ్యాంగ్ థియరీ తరువాత ఉత్పన్నమైన తాత్విక పరిణామాలను పరిగణనలోకి తీసుకొని కొన్ని మంచి అంశాలు ఈ పుస్తకంలో రూపొందించారు. కానీ ఈ చర్చ కూడా సంక్షిప్తంగానే ఉంది అందులోనూ ఇప్పుడిది చాలా పురాతనమై పోయింది.

అమెరికాకు చెందిన క్రిస్టియన్ తత్వవేత్త విలియం క్రేగ్ ఇస్లాం శాస్త్రీయ సాహిత్యాన్నే క్రైస్తవ ధృక్పథంలో ఆధునిక సైన్సు ఆధారాల వెలుగులో అభివృద్ధి పరిచాడు. 30కి పైచిలుకు పుస్తకాలు రాసి దేవుని అస్తిత్వాన్ని ధ్రువీకరిస్తూ, నాస్తిక వాదుల వాదనలన్నిటికీ దీటుగా జవాబిస్తూ (The Kalam cosmological argument) అనే పుస్తకాన్ని రచించాడు. అలాగే బ్రిటన్ తత్వవేత్త ఆంటోనీ ఫ్లెవ్ జీవితాంతం నాస్తికుడిగానే ఉన్నాడు. నాస్తికత్వాన్ని సమర్థిస్తూ దైవ ఉనికిని వ్యతిరేకిస్తూ మూడు డజన్లకు పైపెచ్చు పుస్తకాలు రాసి ప్రపంచ ప్రసిద్ధ నాస్తికుడిగా పేరుగాంచాడు. మరణించడానికి రెండు మూడేళ్లకు ముందు తన మనసు మార్చుకుని చనిపోయే చివరి ఘడియలో There is a God అనే పుస్తకం రాసి 2010లో మరణించాడు. ఆయన రచించిన ఈ పుస్తకం లోతైన తాత్విక పుస్తకం. ఆ రచనలో కాంట్, హ్యూమ్‌ల నుండి నేటి ఆధునిక నాస్తిక వాదులందరిని నోరు మూయించే జవాబులున్నాయి. ఆధునిక ప్రపంచంలో అతిపెద్ద నాస్తికుడిగా పేరుగాంచిన రచయిత కనుక ఈ పుస్తకానికి అపారమైన ఆదరణ లభించింది. అయితే విలియం క్రేగ్, ఆంటోనీ ఫ్లెవ్‌ల దైవ భావజాలంలో, ఇస్లామీయ ఏకేశ్వర వాదనలో భూమ్యాకాశాలంత తేడా ఉంది. కనుక ఈ పుస్తకాల ద్వారా పరిమిత స్థాయిలోనే ప్రయోజనం చేకూరుతుంది.

ముందుగా తత్వ శాస్త్రానికి సంబంధించిన కొంత మంది మేధో స్థాయి గల విద్యార్థులు ఆయా క్రైస్తవ సిద్ధాంత వాదుల భావాలనూ సద్వినియోగం చేసుకుంటూ ఇస్లామీయ దైవత్వభావజాలాని కనుగుణంగా లోతైన పుస్తకాలను రచిస్తే, క్రమేణా ఆ ప్రయత్నాలే ఆధునిక ఇస్లామీయ తత్వశాస్త్ర నిరంతర కృషికి నాంది కావచ్చు.

2. మౌలానా మౌదూదీ (రహ్మాలై) గారి ప్రత్యేకత ఏమిటంటే ఆయన సైద్ధాంతిక స్థాయిలో కృషి చేశారు. ఇస్లాంలోని విభిన్నమైన ప్రబోధనలకు పరిమితం కాలేదు. ఇస్లామీయ భావజాల పునాదులపై సంపూర్ణమైన పటిష్టమైన సిద్ధాంతాన్ని రూపొందించారు. భావజాలాల పటిష్టమైన పునాదినే సిద్ధాంతం

అంటారు. ఒక మేధోశక్తి గల విద్వాంసుడు సంఘటనలను పరిస్థితులను పరిశీలనలోకి తీసుకున్నప్పుడు, వాటి వివరణల పటిష్టమైన రూపురేఖలు, విశ్వజనీనమైన ప్రణాళికలను పొందుపరుస్తాడు. ఆ ప్రాతిపదికన అసంఖ్యాక మైన సంఘటనలు పరిస్థితుల విశ్లేషణ చేయవచ్చు. దాని ద్వారా భవిష్యత్తు గురించి అంచనాలు వేయవచ్చు. భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు రాబోయే సిద్ధాంతాలు సమస్యలపై సరైన అభిప్రాయాలను ఏర్పరచవచ్చు. తరచూ సిద్ధాంతాలలో ఊహాజనిత భావాలు ప్రదర్శించబడతాయి. వాటిని ప్రత్యేక పారిభాషిక పదాల ద్వారా వివరించడం జరుగుతుంది. ఉదాహరణకు మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఖిలాఫతే రాషిదా పుస్తకం, అలాగే బనూ ఉమయ్యాల కాలంలో జరిగిన చారిత్రక ఘటనల ఆధారంగా 'ఖిలాఫత్ వ ములూకియత్' పుస్తకాన్ని రచించి ఒక పెద్ద సైద్ధాంతిక పునాదిని నెలకొల్పారు. ఆ సిద్ధాంతాన్ని ఖిలాఫత్, ములూకియత్ లాంటి పారిభాషిక పదాల ద్వారా వివరించారు. భారత స్వాతంత్ర్యోద్యమ సమరంలో జరిగిన సంఘటనలు స్థితిగతులను విశ్లేషిస్తూ ఇస్లామీయ రాజకీయ సిద్ధాంత నిర్మాణం చేశారు. ఇబ్నె ఖుల్దూన్ వర్గ ప్రీతి సిద్ధాంతాన్ని రచించారు. ఇమామ్ గజాలి (రహ్మాలై) నైతికతా సిద్ధాంతాన్ని నిర్మించి కామం, క్రోధం, జ్ఞానం, లాంటి పారిభాషిక పదాల ద్వారా నైతికతా దృక్పథాన్ని వివరించారు.

సిద్ధాంతాలను నిర్మించడం అత్యంత కష్టంతో కూడుకున్న పని. సిద్ధాంతం తయారయితే వివరించడం సమర్థించడం సులభతరం అవుతుంది. కారల్ మార్క్స్ రచించిన వరల్డ్ వ్యూ మనందరికీ తెలిసిందే. ఆ దృక్పథం ఆధారంగానే అతను చరిత్రలో గతి తార్కిక భౌతిక వాద సిద్ధాంతాన్ని (Dialectical Materialism) రూపొందించాడు. నేడు ప్రతి మార్క్సిస్టు మేధావి ఆ సిద్ధాంతం ప్రాతిపదికనే ప్రతీ చారిత్రక సంఘటనను విశ్లేషించి వివరించి తద్వారా భవిష్య ప్రణాళికలు చేయగలడు. అదేవిధంగా సామాజిక శాస్త్రంలో ఆర్థిక నియతివాదం (Economic Determinism) లాంటి ఆర్థిక బలవంతపు సిద్ధాంతాన్ని అతను రచించాడు. ఆధునిక మార్క్సిస్టు మేధావులు అందులో కొన్ని సవరణలు చేశారు. ఫ్రాన్స్ మేధావి లూయిస్ ఆల్థోస్ అతి నియతివాదం (over determinism), సాపేక్ష స్వయం ప్రతిపత్తి (relative autonomy) లాంటి కొత్త కొత్తసామాజిక సిద్ధాంతాలను రూపొందించాడు.

మౌలానా మౌదూదీ (రహ్మాలై) రాజకీయ సిద్ధాంతాన్ని సంపూర్ణ స్థాయిలో రూపకల్పన చేశారు. దైవిక శాసన సార్వభౌమాధికారం (హాకిమియ్యత్ వ షారిఇయ్యతే ఇలాహ్), ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం (ఖిలాఫతే జమ్హూర్), విశ్వ మానవ సౌభ్రాతృత్వం, దైవాజ్ఞాబద్ధ ప్రభుత్వం (హుకూమతే ఇలాహియ), ధర్మసంస్థాపన (ఇఖామతే దీన్) మొదలగునవి ఈ సిద్ధాంత ప్రధానాంశాలు. మౌలానా మౌదూదీ (రహ్మాలై) దృష్టిలో ఇతర రంగాలలోని సిద్ధాంతాల సంపూర్ణ రూపురేఖలూ బహుశా ఉండే ఉంటాయి. విద్యా, ఆర్థిక సాంస్కృతిక చారిత్రక రచనలలో సిద్ధాంతపరమైన స్పష్టమైన సంకేతాలు కనపడతాయి. ఇస్లామీయ సైద్ధాంతిక రంగంలో సిద్ధాంత నిర్మాణ పని మరింత ముందుకు తీసుకెళ్లడం మన ముందున్న ప్రధాన సవాలని నేననుకుంటున్నాను. ఆర్థిక రంగంలో ఈ పని జరిగింది. విద్యారంగంలో ఇస్మాయిల్ రాజీ అల్ ఫారూఖీ, ఇతర అనేక మంది మేధావులు, సంస్థల అమోఘమైన కృషి, నాఖిబుల్ ఉతాస్ లాంటి రచయితల అద్భుతమైన రచనలు జరిగినప్పటికీ, పటిష్టమైన సిద్ధాంత రూపకల్పన పని ఇంకా మిగిలే ఉందనేది మాత్రం వాస్తవం. వారి ప్రయత్నాలు కూడా విద్యా ఆవశ్యకతా వాదం(Educational Essentialism), Montessori method, waldrof method లకు దీటుగా విశేషమైన స్థాయిలో జరగలేదు. చారిత్రక సాంస్కృతిక రంగంలో కూడా ఈ పని అసంపూర్ణంగానే ఉంది. మనస్తత్వశాస్త్రంలో సిగ్మండ్ ఫ్రాయిడ్ మార్గభ్రష్ట సిద్ధాంతాలకు ఎటువంటి ప్రత్యామ్నాయాన్ని ప్రవేశ పెట్టలేకపోయాము.

అన్నిటికన్నా ప్రధాన విషయం ముస్లిం సమాజంలో ఒక విస్తృతమైన సిద్ధాంతమనేది రూపొందలేకపోయింది. ఇటీవల ఇరాన్‌కు చెందిన అమెరికన్ రచయిత సయ్యద్ హుస్సేన్ నసర్, టర్కీ రచయిత ఫత్హుల్లాహ్ గోలెన్, తారిఖ్ రమజాన్, ఈ మధ్యకాలంలో గురువులు ముర్తుజా మత్హరీ, డాక్టర్ అలీ షరియతీలు కొన్ని సిద్ధాంతాలు రూపొందించినప్పటికీ అవి ఇస్లామీయ ఉద్యమ దృక్పథానికి దర్పణంగా లేవు.

సాధారణంగా సిద్ధాంతాలను రచించడం అందునా మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఇబ్నె ఖుల్దూన్, ఇమామ్ గజాలి, కారల్ మార్క్స్ లాంటి గొప్ప సిద్ధాంతాలను రూపొందించడం మేధోపరమైన పని. మేధో పండితులు ఆలోచనాపరులు ప్రతి రోజూ పుట్టరు. కానీ అటువంటి గొప్ప మేధావులిచ్చిన

సూచనల ఆధారంగా సామూహిక ప్రయత్నాల ద్వారా వారు అసంపూర్ణంగా వదిలిన పనిని సులభంగా పూర్తి చేయవచ్చు. ప్రపంచంపై ప్రగాఢమైన ముద్ర వేసిన సిద్ధాంతాలైన న్యూమార్క్సిజంలో ఫ్రాంక్ఫర్ట్ స్కూల్, న్యూ లిబరలిజంలో చికాగో స్కూల్ లాంటివి వ్యక్తుల ప్రయత్నాలు కావు సామూహిక సంస్థల ప్రయత్నాలు. స్వయంగా ఆర్థిక రంగంలో మన ఉద్యమ వర్గాల్లో జరిగిన కృషి కూడా సామూహిక స్థాయిలో సంస్థాగతా ప్రయత్నాల ద్వారానే జరిగింది. కనుక కృషి చేస్తే ఇస్లామీయ ఆలోచనా రంగంలో కూడా ఈ పని జరగొచ్చు.

3. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే మనం మన కలల ప్రపంచం ఎలా ఉండబోతుందో ప్రపంచానికి బొత్తిగా చెప్పలేకపోయాము. ఎన్నో కలలు ఇప్పటికీ అస్పష్టంగానే అసంపూర్ణంగానే ఉన్నాయి. ఈ అస్పష్టత కారణంగానే మనం ప్రపంచాన్ని టైం మెషిన్‌లో కుదించి పద్నాలుగు వందల సంవత్సరాలకు పూర్వపు సంస్కృతిలోకి తీసుకెళ్లదలుస్తున్నామని ఒకరు భావిస్తే, మొత్తం ప్రపంచాన్ని ఉసామా బిన్ లాడెన్ తాలిబాన్‌ల అఫ్గానిస్థాన్ లా మార్చాలనీ కలలు కంటున్నామని మరొకరు భావిస్తున్నారు. ఇంకొంచెం ముందుకు పోయి ఎవరైనా మన గురించి విశాల దృక్పథంతో ఆలోచించే వారైతే మనం ఆయతుల్లాహ్ ఖుమైనీ లాంటి ఈరాన్ ప్రభుత్వాన్ని కాంక్షిస్తున్నామని అనుకుంటారు. సైద్ధాంతిక ఉద్యమాలు తాము సాకారం చేసుకోబోయే కలలను స్పష్టమైన రీతిలో ప్రపంచానికి చూపాల్సిన అవసరం కలిగి ఉంటాయి. మన స్వప్నాల ప్రపంచాన్ని సాకారం చేసుకునే ఈ కృషి అత్యంత విస్తృతమైన సర్వతోముఖమైన ప్రత్యేకతలతో కూడిన విధంగా జరగాలి. గత అర్ధ శతాబ్దికి ముందు మార్క్సిస్టులు ఈ పనిని ఎంతో అందంగా చేసి చూపించారు. సిద్ధాంతం నుండి సంగీతాలు థియేటర్లు నాటకాల వరకు అన్ని సాధనాలను ఉపయోగించుకున్నారు. చరిత్ర, తత్వ, సామాజిక రాజకీయ ఆర్థిక మనస్తత్వ శాస్త్రాలన్నిటిలో తమ పటిష్టమైన సిద్ధాంతాలను పొందుపరిచారు. సమస్యలు, విధానాలపై వారి వైఖరి సుస్పష్టంగా ఉంటుంది. సాహిత్యం, నవలలు, కవిత్వాలు, కథలు, చిత్ర కళలు లలిత కళల ద్వారా ఒక సాధారణ వ్యక్తికి తాము కోరుకున్న ప్రపంచం ఎలా ఉండబోతుందో సింహావలోకనం చేశారు.

ఉర్దూ కవిత్వాన్ని తీసుకుంటే ఫైజ్, మజాజ్, సాహిర్ లాంటి కవులు తమ

కవితా సౌందర్యంతో శ్రామికవర్గ పోరాటాన్ని చిత్రీకరించారు.

مجبور بڑھاپا جب سونی راہوں کی دھول نہ پھانکے گا
معصوم لڑکپن جب گندی گلیوں میں بھیک نہ مانگے گا
حق مانگنے والوں کو جس دن سولی نہ دکھائی جائے گی
وہ صبح کبھی تو آئے گی -----
سنسار کے سارے محنت کش کھیتوں سے ملوں سے نکلیں گے
بے گھر بے در بے بس انسان تاریک بلوں سے نکلیں گے
دنیا امن اور خوشحالی کے پھولوں سے سجائی جائے گی
وہ صبح ہمیں سے آئے گی ---

వృద్ధాప్య వ్యధాభరిత గాథలు లేని
వీధుల్లో అడుక్కునే అమాయక బాల్యం లేని
హక్కుల కోసం పోరాడే పౌరులకు ఉరికంబం లేని
ఆ ఉదయం ఎప్పటికైనా రానుంది...
ప్రపంచ కార్మిక కర్షక లోకం పరిశ్రమలు పొలాల నుండి
నిరుపేద నిరాశ్రయ జీవులు బతుకు చీకటి గుహ నుండి
బయటపడే ఉదయం
ప్రపంచం సుఖశాంతుల కుసుమాలతో వికసించే
శుభోదయం ఎప్పటికైనా రానుంది...
అది మనతోనే సాధ్యం కానుంది...

ఈ పని అత్యంత వేగంగా జరగాల్సిన అవసరం ఉందని అనుకుంటున్నాను. సిద్ధాంతాల నిర్మాణం జరగాలి. ఆ సిద్ధాంతాల వెలుగులో పాలసీలపై స్పందిస్తూ ప్రత్యామ్నాయ ఆలోచనలు అన్వేషణా ఆవిష్కరణల పని జరుగుతుండాలి. మన కలల ప్రపంచాన్ని ప్రజాబాహుళ్యాన్ని చూపించేందుకు ఉన్నత సాహిత్యాన్ని విస్తృతంగా ఉపయోగించాలి. అందులో భాగంగా ప్రజలు మన కలలను కలల ప్రపంచాన్ని అవగాహన చేసుకునేందుకు గాను లఘుచిత్రాలు, లలిత కళలను కళా సాహిత్యాన్ని ఉపయోగించాలి. ఈ పని సాధారణంగా

అంతర్జాతీయ స్థాయిలోనూ చేయాలి. ముఖ్యంగా మన భారత దేశ ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలోనూ జరగాలి. మన దేశంలో ఏపీజే అబ్దుల్ కలాం లాంటి ఎందరో గొప్ప వ్యక్తిత్వాలు సుందరమైన విజ్ఞాన సంపన్నమైన అగ్రరాజ్య భారత కలలను చూపిస్తున్నారు. ఏపీజే అబ్దుల్ కలాం పుస్తకం సుదీర్ఘ కాలం వరకు భారత దేశంలో అత్యధికంగా అధ్యయనం చేసే పుస్తకాల జాబితాలో ఉండి భారతదేశ భావి పౌరులకు ఆకర్షణీయంగా మారింది. కానీ ఈ దేశంలో నివసిస్తున్న నిరుపేద ప్రజానీకానికి ఈ కలలు అందని ద్రాక్ష వంటివే. ఓ భారత పౌరుడిగా మన స్వప్నాల స్వదేశం ఎలా ఉండబోతుందో దాని రూపురేఖలేమిటో నేటికీ స్పష్టత లేదు.

4. సమీప భవిష్యత్తులో మనకూ ప్రపంచానికి మధ్య జరగబోయే చర్చనీయాంశాలేమిటి? ఏవైై ఉండాలనే విషయమై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. జాతీయ స్థాయిలోనూ అంతర్జాతీయ స్థాయిలోనూ ఈ సమీక్ష జరగాలి. దేవుని అస్తిత్వ విషయమై చర్చ జరిగింది. ఆ తర్వాత నా అభిప్రాయంలో మరో వివాదాస్పద అంశం మతం, మతపరమైన పరిధుల అంశం. మనిషి సామూహిక జీవితంలో మతం యొక్క క్రియాశీలక పాత్ర మానవ జాతికి ప్రయోజనకరమా హానికరమా? అనేటటువంటి ప్రశ్న రాబోయే అనేక దశాబ్దాల వరకు ప్రపంచ మేధావుల చర్చకు కేంద్ర బిందువుగా మారబోతోంది. మధ్యప్రాచ్యంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు కూడా ఈ చర్చను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. పరిపూర్ణమైన వైజ్ఞానిక విధానాల ద్వారా, ప్రతిఘటించే వారి మనస్తత్వాలను, వారి పరిమిత పరిధులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మరీ ఈ చర్చలో క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. నేడు ప్రపంచ స్వరూపం చాలా మారిపోయింది. సెక్యులరిజం పట్ల గతంలో మాదిరిగా ఉత్సాహం లేదు. ఫ్రాన్స్‌లాంటి దేశంలో కూడా positive laicite ల చర్చ జరుగుతోంది. ఫ్రెంచి మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ లాంటి అతివాద సెక్యులరిస్టు కూడా మతం లేని నైతికత అస్థిరమైనదనీ, సమాజానికి ప్రమాదకరమని మరీ బహిరంగంగా చెబుతున్నాడు.

మరోవైపు మతాన్ని విస్మరించి కొనసాగిన 300 ఏళ్ల సామూహిక జీవనవిధానం సుదీర్ఘమైన అనుభవాలు వాటి మంచీ చెడూ పరిణామాలన్నీ ప్రపంచం ముందు ఉండనే ఉన్నాయి. ఈ మూడు నాలుగు శతాబ్దాలలో

సామూహిక జీవితంపై మతం ఏర్పరిచిన మంచీ చెడు పరిణామాలన్నీ ఉన్నాయి. ఆయా అనుభవాల ఆధారంగా అనేక లౌకికవాద మేధావులు మతం రాజ్యం మధ్య సరికొత్త అనుసంధానం అవసరమని భావిస్తున్నారు. కనుక ఉద్యమ మేధావులు ఓ కొత్త దృక్కోణంలో ఈ చర్చను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. అంతేగాక ఇరవయ్యో శతాబ్దపు ఆధునిక మనిషి యూరప్ సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో మతం పట్ల అవలంబించిన అతి జాగ్రత్తలు, ఆవహించిన భయాందోళనలకూ ఎటువంటి అర్థం లేదనీ, మతం మనిషి సంఘటిత జీవనంలో కూడా తన సకారాత్మకవిధానం నిర్మాణాత్మక పాత్ర ద్వారా మానవ సమస్యలను పరిష్కరించగలదని దాని ఆచరణాత్మక నమూనా ఆదర్శ విధానం ఇస్లాం మాత్రమేనని నిరూపించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ఆధునిక లౌకిక వాదులలో తలెత్తిన సందేహాలను అత్యంత వివరణాత్మకంగా స్పష్టమైన వాదనల ద్వారా నివృత్తి చేసేవిధంగా ఆయా సందేహాలకు సరైన పరిష్కార మార్గాన్ని సూచించాల్సిన అవసరం ఉంది.

5. అదేవిధంగా మరో విషయం ప్రధానంగా మన దేశంలో చర్చనీయాంశంగా మారింది. అది బహుళ సమాజాలలో విభిన్న మతాలతో సంబంధాలు ప్రవర్తనా వైరుధ్యాల విషయం. ఒక మతం సరాసరి సత్యమైనదనీ, వేరే మతాలు సత్యదూరమైనవనే విషయాన్ని ఇక్కడి సగటు భారతీయుడు ససేమిరా అంగీకరించడు. ఇక్కడ మత ఛాందసవాదం మాత్రమే సత్యంగా పరిగణించబడుతుంది. సర్వ ధర్మ సంభావనా సిద్ధాంత సాంప్రదాయిక పునాదులు అత్యంత లోతుగా ఉన్నాయిక్కడ. బహుళ సమాజ సిద్ధాంతం కూడా ప్రాచుర్యంలో ఉంది. ఈ సిద్ధాంతంలో సమాజాన్ని వివిధ రకాల పానీయాలు కలగలిసి తమ ప్రత్యేక రంగు రుచిని కోల్పోయి సరికొత్త రుచులతో స్వాదిష్ట పరిచే సిరప్ పూజతో పోల్చడం జరుగుతుంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ప్రధానంగా పోస్ట్ మాడ్రన్ ఫిలాసఫీల నేపథ్యంలో ప్రధానంగా ఈ తరహా భారతీయ మనస్తత్వమే ప్రపంచమంతటా బలపడుతోంది.

ప్రపంచం అవలంబిస్తున్న ఈ వైఖరి మతం తప్ప మరే శాస్త్రీయ రంగంలో లేదు. తత్వ, సైద్ధాంతిక, వివిధ సామాజిక శాస్త్రాలలో కూడా ప్రపంచవ్యాప్తంగా పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాల మధ్య జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

అందరికీ వారి వారి స్వంత అభిప్రాయా లున్నాయి. తమ సిద్ధాంతాలే సరైనవనీ వాదించి, వ్యతిరేక వైఖరులను తప్పుగా భావిస్తారు. ఆపై దాన్ని విమర్శ నాంశంగా చేసుకుంటారు. తప్పుడు అభిప్రాయాన్ని అవలంబించే తమ ప్రత్యర్థుల హక్కును కూడా అంగీకరిస్తారు. అటువంటి సందర్భంలో పరస్పర వాదోపవాదాల ద్వారానే సత్యమేదో అసత్యమేదో స్పష్టమౌతుంది. ఇతరులు తమ అభిప్రాయాలను సమర్థించుకునేందుకూ సహాయం లభిస్తుంది. మతం విషయంలో ఇస్లాం కూడా ఇటువంటి హేతుబద్ధమైన శాస్త్రీయ వైఖరినే సమర్థిస్తోంది. అది సత్యధర్మమనీ, విశ్వాసుల ద్వారా సత్య సంధ్యతను ప్రపంచమంతా చాటుకోవాలనీ మరీ కాంక్షిస్తోంది. ఈ సత్య ధర్మాన్ని కాదనే వారితో వాదోపవాదాలు జరపాలని కోరుకుంటుంది. అయినప్పటికీ ఎవరైనా విశ్వసించదలచకపోతే ఈ ప్రపంచంలో అతనికి వ్యతిరేకించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కూడా ప్రసాదిస్తుంది. మతంతో పాటు పరస్పర విరుద్ధమైన వ్యవహారాలన్నిటిలో ఇదే వైఖరి ఉదాత్తమైనదనీ నిజాయితీతో కూడిన వైఖరి అని స్పష్టమైన ఆధారాల ద్వారా ప్రపంచానికి వివరించాల్సిన అవసరం ఉంది. వ్యతిరేక అభిప్రాయాన్ని కూడా సమర్థించాలనే స్వభావం అత్యంత అసహజమైన నిర్హేతుకమైన స్వభావం. సర్వ ధర్మ సంభావనా సిద్ధాంతం, మతం విషయంలో చర్చలు వాదోపవాదాలను పక్కన పెట్టి, ఏకంగా అన్ని మతాలను సరైనవని సమర్థించే విధానాన్ని శాస్త్రీయ స్థాయిలో చర్చనీయాంశం, విమర్శనాంశం చేయాలి. డాక్టర్ అబ్దుల్ హఖ్ అన్సారీ, మౌలానా ఫారూక్ ఖాన్, మౌలానా సుల్తాన్ అహ్మద్ ఇస్లాహీ లాంటి మేధావులు ఈ భావజాలాన్ని విమర్శించారు. హైందవ సిద్ధాంతవేత్తల వాదనలను పరిగణనలోకి తీసుకుని మరింత వివరంగా లోతైన విధంగా ఈ సమస్యపై సమీక్ష జరగాలి.

6. సామాజిక నైతిక స్థాయిలో మరో ప్రధాన అంశం లైంగిక ధోరణులకు సంబంధించిన అంశం. ప్రకృతి పరంగా మనుషుల్లో అనేక రకాల లైంగిక ధోరణులుంటాయనీ, స్వలింగ సంపర్క స్త్రీపురుషుల ఉనికి సహజమైందేననీ, వారికి తమ ప్రత్యేకమైన లైంగిక ప్రవర్తనలతో జీవించే హక్కూ ఉందని, మతపరమైన భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు తమ ప్రత్యేక మతం ప్రత్యేక భాషలతో పాటు జీవించే వెసులుబాటు విధానం ఎలా ఉందో అలాగే వీరికీ ఉందనే అభిప్రాయం పాశ్చాత్య ప్రాచ్య సమాజాలలో స్థిరపడింది. అంతేకాక

లైంగిక మైనారిటీ (Sexual Minority)ల పారిభాషిక పదం ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచింది. ఎవరైనా ఈ ధోరణికి వ్యతిరేకంగా మాట్లాడితే దాన్ని మైనారిటీల పట్ల వివక్ష చులకన చూపుగా భావించడం జరుగుతుంది. అంతేకాకుండా క్వీర్ థియరీ(Queer theory)ని ప్రమోట్ చేసేందుకు ప్రణాళికాబద్ధమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆపై వైజ్ఞానిక వర్గాల్లో దానికి అపూర్వమైన ఆదరణ కూడా లభిస్తోంది. ఈ సిద్ధాంతాన్ని సమర్థించేందుకు సామాజిక శాస్త్రవేత్తలు, మనస్తత్వ శాస్త్ర నిపుణులు, జీవ శాస్త్రవేత్తలు, వైద్య శాస్త్ర నిపుణులు, న్యాయ నిపుణులు, నీతిశాస్త్ర నిపుణులు తత్వవేత్తల ఆధ్వర్యంలో ఓ పెద్ద వర్గం ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తోంది. ఈ విషయం ఇప్పుడు ప్రాచ్య సమాజంలో కూడా ప్రాచుర్యం పొందింది. భారతదేశంలో స్వలింగ సంపర్కానికి వ్యతిరేక చట్టం ఉన్నప్పటికీ న్యాయస్థానాలు ఈ పనిని నేరపూరిత మైనదని భావించక పోవడమే కాక, ఈ ప్రక్రియపై స్వల్ప వ్యతిరేకత వచ్చినా, చట్టపరమైన అమలు విషయంలో అవరోధాలు ఏర్పడినా దాన్ని ప్రకృతి విరుద్ధమైన విషయంగా భావిస్తున్నాయి. క్రైస్తవ చర్చి నాయకత్వం ఈ సమస్యపై దాదాపు చతికిల పడింది. ఇక పాశ్చాత్య ప్రపంచంలో గణనీయమైన సంఖ్యలో ఉన్న ముస్లింల విద్యాధిక వర్గం కూడా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది.

ఇటువంటి పరిస్థితుల్లో ఈ అంశం ఎంతో విస్తృతమైన సమగ్రమైనటు వంటి ప్రణాళికను కోరుతోంది. ధర్మ సమ్మతమైన సంబంధాల మధ్య నికాహ్ ద్వారా జరిగే స్త్రీ పురుషుల శారీరక సంబంధాలు కలయికలు తప్ప ఇతరత్రా లైంగిక ప్రవర్తనా ధోరణులన్నీ అసహజమైనవనీ, మానవ శరీరానికే కాక సమాజానికీ సంస్కృతికీ నష్టదాయకమని మెడికల్ సైన్స్, సైకాలజీ, మెడికల్ సైకాలజీ, సాంఘిక శాస్త్రాల సూత్రాల వెలుగులో స్వచ్ఛమైన శాస్త్రీయ విధానం ద్వారా దీన్ని నిరూపించగలగాలి.

7. ఇవే కాక ప్రపంచంలో ప్రాచుర్యంలో ఉన్న వివిధ సిద్ధాంతాలు, ప్రపంచ రాజకీయ ఆర్థిక సామాజిక రంగంలో ఉన్నటువంటి వివిధ దృక్పథాలపై కూడా చర్చ జరగాలి. అందులో కొన్ని సిద్ధాంతాలు స్వయానా ముస్లిం యువకులపై లోతైన ప్రభావాలను వేశాయి. అటువంటి పరిస్థితిలో ప్రపంచంలోని ఏ సైద్ధాంతిక ఉద్యమం కూడా సమకాలీన సిద్ధాంతాలపై మౌనం వహించడం సరికాదు. వాటిపై దృష్టి సారించడం, వారి సమస్యలను పరిష్కరిం

చడం మన సందేశ ప్రచార అవసరమే కాక ఉద్యమ అవసరం కూడాను. ఆర్థిక రాజకీయ రంగాల్లో అతి ప్రధాన శక్తివంతమైన సిద్ధాంతం సరికొత్త పెట్టుబడిదారీ వాదం. పెట్టుబడిదారీ వ్యవస్థ అన్యాయాలను ఎలా ఎదుర్కొనగలమనే విషయంలో మన విజన్ ఏమిటో నిర్ధారణ కావాల్సి ఉంది.

ఈ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఎన్నో సిద్ధాంతాలు ప్రపంచంలో వస్తున్నప్పటికీ అందులో ప్రధానమైన సిద్ధాంతం నియో మార్క్సిజం (Neo Marxism) సిద్ధాంతమే. మార్క్సిస్టు సిద్ధాంతాల వివిధ కోణాలను మనం విమర్శించినప్పటికీ అందులో అనేక కోణాలనుండి స్వయంగా మార్క్సిస్టు మేధావులే తప్పించుకున్నారు. ప్రస్తుతం మారిన స్వరూపంలో వారితో మన సంబంధాలు ఎలా ఉండాలి? వారిలో మనలో సంయుక్తమైన, విరుద్ధమైన విషయాలేమిటనే వాటిపై వివరణాత్మక విశ్లేషణ జరగాల్సి ఉంది.

అదే విధంగా మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రబలుతున్న మరో ప్రత్యామ్నాయ వాదం (Libertarianism) ఉదారవాదం. అనార్కిజం, న్యూ అనార్కిజం, మ్యూటలిజమ్ లాంటి వివిధ సైద్ధాంతిక భావ ధారలు దృక్పథాలు ఇస్లామీయ ప్రపంచంతో సహా ప్రపంచవ్యాప్త విద్యాధిక వర్గాలను పలు ప్రభావాలకు లోను చేశాయి. అంతర్జాతీయ స్థాయిలో నోమ్ చోమ్స్కీ లాంటి మేధావులు ఈ ఆలోచనా ధారలకు సమర్థకులు. మన దేశంలో అరుంధతీ రాయ్ లాంటి ప్రభావశీల ప్రసిద్ధ రచయిత్రులు కూడా ఈ ఆలోచనా ధోరణి గలవారే. ఆయా రాజకీయ సామాజిక సిద్ధాంతాలే కాక సామాజిక స్థాయిలో ఎకాలజీ మూమెంట్ (ఇది రాజకీయ సామాజిక సంస్థలనే కాక యూరప్‌లో లిబరేషన్ ఫ్రంట్ లాంటి ఉగ్రవాద సంస్థలు ఉనికిలోకి రావడానికి కారణం అయింది) జీవన రంగంలో ప్రొవిజన్ మూమెంట్ విద్యారంగంలో డీ-స్కూలింగ్ ఇన్ స్కూలింగ్ మూమెంట్, ఇస్లామీయ స్త్రీ వాద సిద్ధాంతంతో పాటు వివిధ స్త్రీవాద సిద్ధాంతాలున్నాయి. వాటిపై ఇంకా మనం దృష్టి సారించనేలేదు. అందులో అన్నింటిపై దృష్టి సారించాల్సిన అవసరం లేనప్పటికీ అవి మానవ సమాజంలోని గణనీయమైన సంఖ్యను ఏ విధంగా ప్రభావిత పరుస్తున్నాయో, ఆపై ముస్లిం సమాజ యువకులు ఏ సిద్ధాంతాలతో అత్యంత వేగంగా ప్రభావితులవుతున్నారో వాటిపై మౌనం వహించడం ఎంత మాత్రం మంచిది కాదు.

8. ఇవే కాకుండా మన నుండి ప్రపంచం ఆశిస్తున్న అంశాలేమిటో,

ఇతరుల కొరకు మనలో ఉన్న ఆకర్షణీయమైన విషయాలేమిటో వాటిని కూడా పరిశీలనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. గత కొన్నేళ్లుగా నేను తరచూ చెప్పుకొస్తున్నాను ప్రస్తుతం ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా కుటుంబ ప్రాధాన్యతా భావం అధికమవుతుంటే మరోవైపు అంతే వేగంగా ప్రపంచవ్యాప్తంగా కుటుంబ వ్యవస్థ కుదేలవుతున్న పరిణామాలను చూస్తుంటే ఇస్లాం మాత్రమే కుటుంబానికి చివరి కంచుకోట అని చెప్పక తప్పదు. పాశ్చాత్య ప్రపంచం తర్వాత ప్రాచ్య సమాజాలలో కూడా కుటుంబ వ్యవస్థ వేగంగా కనుమరుగవుతోంది. జపాన్, ఆగ్నేయాసియాలో ఈ పరిణామాలు చాలా ముందే జరిగినప్పటికీ ఇప్పుడు మరింత వేగంగా సాంప్రదాయిక దేశాలైన భారత్ చైనా లాంటి పట్టణ ప్రాంతాల్లో కూడా లైంగిక నైతికతా విలువలు పతనావస్థ దశకు చేరుకున్నాయి. వ్యక్తిగత కుటుంబాలు, తండ్రి లేని పిల్లలు, గే కుటుంబాలు, వివాహం లేని సహజీవనం లాంటివి ఇక్కడ కూడా సర్వ సాధారణమయ్యాయి. పాశ్చాత్య దేశాల్లోని మేధావులు పటిష్ట కుటుంబం లేనిదే పటిష్ఠ సమాజం సాధ్యం కాదనే విషయాన్ని బహిరంగంగా చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో పటిష్టమైన కుటుంబం, కుటుంబ ప్రశాంతత భవిష్యత్తులో ఇస్లాం కోసం అతిపెద్ద శక్తి, ఆకర్షణకు ఆలవాలంగా మారబోతుంది. కనుక మనం కుటుంబ సమర్థకులంగా అంతర్జాతీయ స్థాయిలో కుటుంబ వ్యవస్థను పరిరక్షించే ప్రత్యామ్నాయ శక్తులుగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. కుటుంబ ప్రాధాన్యతపై పుస్తకాలు రచింపబడాలి. కుటుంబం మానవ సమాజ అవసరమని, కుటుంబం అంటే ఒకే ఒక అర్థమనీ, అది స్త్రీ పురుషుల ప్రత్యేక లైంగిక సామాజిక పాత్రల ద్వారా అంగీకరింపబడి ఆ ప్రాతిపదికన చట్టబద్ధ విధానం ద్వారా ఏకమై దంపతులిరువురూ కలిసి తమ పిల్లల పెంపకం చేపట్టాలనే విషయాన్ని బలమైన శాస్త్రీయ వాదనల ద్వారా నిరూపించాలి. సంప్రదాయానికి వ్యతిరేకమైన విధానాల ద్వారా రూపుదిద్దుకునే కుటుంబ వ్యవస్థతో ఎటువంటి ప్రయోజనం ఒనగూడదు. కుటుంబాన్ని పరిరక్షించుకోవాలంటే ఇస్లామీయ నైతిక విలువలు మినహా మరో మార్గం లేదు.

9. మారిన పరిస్థితుల్లో ముస్లిం సమాజానికి ప్రధానంగా ముస్లిం యువకులకు ఎటువంటి మార్గ నిర్దేశన చేయాల్సిన అవసరం ఉందో ఆ

కోణంలో కూడా ఆలోచించాలి. దీనికి సంబంధించిన చాలా విషయాలు విద్య, నైతిక, ఆర్థిక, సాంస్కృతిక రంగానికి సంబంధించిన వ్యాసాలలో వచ్చాయి. అవే విషయాలు పునరావృతం కాకుండా వేరే విషయాలను చర్చిద్దాం.

(అ). ముస్లిం కుటుంబానికి చెందిన అంశం అత్యంత చర్చనీయాంశం. మారిన పరిస్థితుల్లో ఇస్లామీయ కుటుంబ రూపురేఖల నిర్ధారణపై ఇస్లామీ ఫిఖా, ఇస్లామీయ సోషియాలజీ రంగంలో ఇజ్తిహాద్ కృషి జరగాల్సిన అవసరం ఉంది. స్త్రీ సామాజిక పాత్ర ఏమిటి? మహిళల విద్యా, వృత్తిపరమైన ప్రాధాన్యతలు ఏమై ఉండాలి? ఇస్లామీయ కుటుంబంలో భార్యాభర్తలు పిల్లలు కాక ఇతర రక్త సంబంధీకులతో సంబంధ బాంధవ్యాలు ఎలా ఉండాలి? వ్యష్టి (న్యూక్లియర్) కుటుంబాలు ఉండాలా? ఉమ్మడి కుటుంబాలు ఉండాలా? లేక రెండింటి కలయికతో మరో కొత్త విధానం ఏర్పడాలా? కుటుంబంలో టీవీ ఇంటర్నెట్‌ల స్థానం ఏమై వుండాలి? దాని పరిమితులు ఏమిటి? లాంటి పదుల అంశాలపై ఇప్పటివరకు ఎలాంటి పనీ జరగలేదు. జరిగినా సాంప్రదాయిక విషయాలే పునరావృతమవుతున్నాయి కానీ కాల పరిస్థితులకనుగుణంగా ఇజ్తిహాద్ ప్రయత్నాలు జరగలేదు. జరిగినా వివరణాత్మక లోపాలున్నాయి లేదా ఫిఖా పరిధిలో కేవలం చర్చలు మాత్రమే జరిగాయి. సామాజిక సమస్యలకు సంబంధించి లోతైన విషయ పరిజ్ఞాన విశ్లేషణ జరగలేదు.

మహిళల పాత్రకు సంబంధించి మౌలానా మౌదూదీ (రహ్మాలై) అద్భుతమైన రచన పరదా, మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమ్రీ గారి రచనలు ముస్లిం మహిళల హక్కులు వాటిపై అభ్యంతరాల పరిశీలనలు, ముస్లిం సమాజంలో స్త్రీ వంటివి అమూల్యమైన రచనలు. అయితే ఈ రచనలు అధికశాతం ఇస్లాం విరోధులను ఉద్దేశించి చేసిన వాదనలు. రెండో విషయం ఆయా పుస్తకాల్లో జమాఅతే ఇస్లామి హింద్‌తో సహా అంతర్జాతీయ స్థాయిలో మహిళా ఇస్లామీయ ఉద్యమాలలో ఇరవయ్యో శతాబ్దిలో ముస్లిం మహిళల క్రియాశీలక పాత్ర, ఉద్యమ సామాజిక స్ఫూర్తికి సంబంధించిన విషయాలు మచ్చుకు కూడా కానరావు.

మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ గారి రచన– ఇస్లాం కౌటుంబిక వ్యవస్థ– ఇస్లామీయ కుటుంబంలోని పలు కోణాలను అద్భుతమైన రీతిలో వివరిస్తుంది. మౌలానా రజియుల్ ఇస్లాం నద్వీ గారు జిందగీ ఎ నౌలో ఈ విషయాలకు సంబంధించి వచ్చిన కొన్ని ప్రశ్నలకు ధార్మిక ఫిఖా దృక్కోణంలో ఇచ్చిన

జవాబులు, ఇస్లామీ అకాడమీ సెమినార్లో ప్రస్తావించబడిన వ్యాసాలు ప్రతిపాదనలు కూడా ప్రాధాన్య పూర్వకమైనవయినప్పటికీ ఈ విషయాలన్నీ సంక్షిప్తంగానే ఉన్నాయి. వీటిలో ఆధునిక యుగానికి చెందిన ఇస్లామీయ కుటుంబానికి సంబంధించిన కొన్ని సూచనలయితే లభిస్తాయి కానీ ఒక సంపూర్ణమైన పటిష్టమైన దృక్పథమంటూ ఏదీ లేదు. ఈ సూచనలపై మరింత కృషి జరగాల్సిన అవసరం ఉంది. ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో ఇస్లామీయ కుటుంబ వివరణాత్మక రూపం తెరపైకి రావాల్సిన అవసరం ఉంది.

ఇస్లామీయ కుటుంబానికి సంబంధించి మరో ప్రధాన సమస్య ముస్లిం మహిళలకు సంబంధించిన కొన్ని సమస్యలు, ఆ సమస్యల పరిష్కారంలో సాంప్రదాయిక పర్సనల్ లా తరఫున ఎదురవుతున్న అవరోధాలు. వీటిపై మన దేశానికి చెందిన ఆధునిక ఉదారవాదులు అనేకసార్లు ధ్వజమెత్తారు. అందులో ఓ ప్రధాన సమస్య భర్త ద్వారా భార్యపై జరిగే దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎటువంటి ముక్తిదాయక మార్గం లేకపోవడం. ఈ విషయంలో మౌలానా మౌదూదీ (రహ్మలై) తన రచన భార్యాభర్తల హక్కులు అనే పుస్తకంలో ఎంతో దీటైన వాదన వినిపించారు. ఈ దృక్పథంపై కూడా ఆశించిన స్థాయిలో పని జరగలేదు. ఎన్నో అధ్యయనాలు గణాంకాలు సజీవ సాక్ష్యంగా ఉన్నప్పటికీ మన నాయకులు మాత్రం ఈ సమస్య అసలు లేదనే అంటుంటారు. కానీ సాధారణ పరిశీలనలు కూడా ముస్లిం సమాజంలో ఈ సమస్య ఉందనే నిర్ధారిస్తున్నాయి. ఇందులో సందేహం ఉంటే మనమే స్వయంగా శాస్త్రీయ అధ్యయనమో సర్వేనో చేయించవచ్చు. అలా అని సమస్యను విస్మరించనూ లేము. ఆయా సమస్యల పరిష్కారం షరియా కోర్టుల ద్వారా కూడా సాధ్యపడదు. షరియా కోర్టులు సరిపోక పోవటమే కాక వృత్తిపరమైన శిక్షణ లేని ఖాజీలు ఆ సమస్యలను పరిష్కరించనూ లేరు. కనుక ఈ తరహా సమస్యలకు షరియా పరిధిలో ధార్మిక పరమైన దూరదృష్టి దార్శనికతతో ఆచరణాత్మకమైన పరిష్కారాన్ని అన్వేషించే కార్యంలో ఇస్లామీయ ఉద్యమం నాయకత్వ పాత్రను పోషించాలి.

ఇస్లామీయ కుటుంబానికి సంబంధించి మౌలానా సుల్తాన్ అహ్మద్ ఇస్లాహీ (రహ్మలై) కొన్ని ముఖ్యమైన ఆలోచనలను అందించారు. ప్రధానంగా ఉమ్మడి కుటుంబం, ప్రవాస జీవితానికి సంబంధించి ఆయన ఆలోచనా ధారలు అసాధారణమైన ప్రాధాన్యత గలవి. కానీ ఆ ఆలోచనలపై చర్చ జరిగిన తరువాతే తుది నిర్ధారణకు రావాల్సిన అవసరం ఉంది.

(ఆ). నేరుగా సైద్ధాంతిక, విజ్ఞాన రంగాల్లో పని చేయడంతోపాటు సాధారణ ప్రజలు సులభమైన శైలిలో చదవగలిగే ప్రజా సాహిత్యాన్ని కూడా అభివృద్ధి చేసే విషయమై దృష్టి సారించాలి. ఈ కళ నేటి ఆధునిక ప్రపంచంలో చాలా ప్రాచుర్యంలో ఉంది. ఉన్నతమైన లోతైన వ్యాసాలు కూడా సులభమైన శైలిలో అత్యంత ప్రభావవంతంగా అందిస్తున్నారు. తాత్విక బోధన, ఆధ్యాత్మికతపై ఆచార్య రజనీష్ పుస్తకాలు, వ్యక్తిత్వ వికాసంపై స్టీఫెన్ కోవే రచనలు, అర్థశాస్త్రంపై ఫ్రైడ్మెన్ పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా చదవబడుతున్నాయి. ఏ పుస్తకాల షాపుకు వెళ్ళినా నాన్ ఫిక్షన్ పుస్తకాలలో అన్నిటికన్నా అత్యంత ఆదరణీయమైన వాటిలో ఇవే ఉంటాయి.

1. మేనేజ్మెంట్, బిజినెస్ స్టడీస్, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే పుస్తకాలు

2. పిల్లల కథల పుస్తకాలు

3. పిల్లల పెంపకం, గృహ నిర్వహణ, ఆహార ఆరోగ్యానికి సంబంధించిన మహిళల పుస్తకాలు

మన వద్ద ప్రజలకు కావలసిన సాహిత్యం, ప్రధానంగా ఈ మూడు కేటగిరీలపై ఆశించిన స్థాయిలో పని జరగలేదు. ఈ మూడు కేటగిరీలలో విలువలు విశ్వాసాలు భావజాలాలను ప్రజలకు చేరవేయగలిగే అత్యద్భుతమైన శక్తి సామర్థ్యాలున్నాయి. మహిళల సాహిత్యంలో ఒకప్పుడు 'బతూల్' మాస పత్రిక మంచి పాత్రను పోషించింది. కానీ గత కొన్ని రోజుల నుండి ఈ రంగంలో ఎటువంటి పనీ జరగడం లేదు. 'పాకీజా ఆన్చల్' లాంటి మ్యాగజైన్లు, వాటి ప్రచురణా సంస్థలు ఈ రంగాన్ని ఆక్రమించుకున్నాయి. మన మహిళా విభాగ బాధ్యులతో పాటు ఉద్యమం మొత్తం కూడా ఈ సమస్యపై దృష్టి సారించాలి.

అదే విధంగా పిల్లల సాహిత్యం తయారుచేయడం చాలా ప్రయాసతో కూడుకున్న పని. ఇప్పుడు పిల్లల అభిరుచులు మారిపోయాయి. కేవలం కథల పుస్తకాలే కాక ఆరేడు ఏళ్ల పిల్లలు కూడా పెద్ద పెద్ద సమాచార పుస్తకాలు చదువుతున్నారు. వారి కొరకు ప్రింటింగ్ పేపర్ క్వాలిటీలతో ఆధ్యాత్మిక లక్షణాల పరంగా అత్యున్నతమైన స్థాయి గల పుస్తకాలు ఉండాలి. మార్కెట్లో వారి కొరకు పుస్తకాల ఓ పెద్ద ప్రపంచమే ఉంది. పాశ్చాత్య ప్రపంచంతో పాటు ఈ రంగంలో హైందవ సంస్థలు కూడా చాలా చురుగ్గా ఉన్నాయి. పుస్తకాల ప్రతి షాపులోనూ కృష్ణ, హనుమాన్, పంచతంత్ర, చోటాభీమ్ లాంటి అత్యంత ఆకర్షణీయమైన అందమైన పుస్తకాలు పిల్లలను ప్రేరేపిస్తుంటాయి. మనదేశంలో

సానిఇస్తైన్ ఖాన్ సంస్థ, గుడ్ వర్డ్ పబ్లికేషన్, అంతర్జాతీయ స్థాయిలో చికాగో లోని సౌండ్ అండ్ విజన్ అనే సంస్థ మంచి ప్రయత్నాలు ప్రారంభించాయి. అయినప్పటికీ ఇస్లామీయ ఉద్యమాలు కూడా దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఉరుకులు పరుగుల జీవితంలో పట్టణ జీవనంలో ఎదురయ్యే ఒత్తిళ్ళు, ఆధ్యాత్మికత అవసరాల కారణంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా self improvement, వ్యక్తిత్వ వికాస సాహిత్యానికి అసాధారణమైన ఆదరణ ఉంది. వాటిలో అందమైన భాష, ఆకర్షణీయమైన శైలిలో జీవిత సూత్ర సిద్ధాంతాలు, వివరింపబడతాయి. కథలు, కవితలు, ఉపమానాల ద్వారా కష్టమైన తత్వాలను సులభంగా వివరించడం జరుగుతుంది. ఈ పుస్తకాలు అలసి సొలసిన మనసులను ఆహ్లాదపరిచి, ఒత్తిళ్ల నుండి ఉపశమనాన్నిచ్చి జీవిత సమస్యలను పరిష్కరించే ప్రధాన సాధనాలుగా ఉపయోగపడతాయి. ఇస్లామీయ చరిత్రలో సాదీ షీరాజీ, మౌలానా రూమ్‌లు ఈ కళను అత్యున్నత స్థాయికి చేర్చారు. ఓషో రజనీష్ ఆ తరహా శైలి ద్వారానే ప్రపంచమంతా తన ఆలోచనలను పరివ్యాపింపజేశాడు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి సాహిత్యం ప్రముఖ సాహిత్యంగా పరిగణించబడుతుంది. విమానాల నుండి పార్కులు కార్యాలయాల వరకు ప్రతి చోటా ప్రజలు ఇలాంటి పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఇస్లామీయ వర్గాలలో కూడా అరబీ భాషలో ఇలాంటి పుస్తకాల పరంపర మొదలైంది కానీ ఉర్దూ ఇంగ్లీషులో దీనిపై ఇంకా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

*(ఈ వ్యాసం జూలై 2012 హైదరాబాదులో సెంటర్ ఫర్ స్టడీ అండ్ రిసెర్చ్ లిటరేచర్ రివ్యూ సెమినార్లో ప్రజెంట్ చేయడం జరిగింది ఆ తరువాత తర్జుమానుల్ ఖురాన్ లాహోర్ మాసపత్రిక 2016 మార్చి సంచికలో వెలువడింది)*

**ఆధార గ్రంథాలు**


1) God is not great : Cristoper Hitchens

2) The Origin of the universe

3) The Kalam Cosmological Argument

4) These is a God : Antony flew with Roy Abraham varghese

# సంప్రదాయ వాదం, ఆధునికవాదం: మౌలానా మౌదూది (రహ్మాలై) మధ్యేమార్గం

ఇరవయ్యో శతాబ్దిలో ఉనికిలోకొచ్చిన వాదాలు, వాటి ఆచరణాత్మక రూపాల విషయమై సరైన ఇస్లామీయ వైఖరి ఏమిటనేది ఇస్లామీయ మేధావుల ముందు ఓ ప్రధాన ప్రశ్నగా మారింది. యూరప్ సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో పుట్టి యూరప్ దేశాల వలసవాద రాజ్యాలనే కాక ప్రపంచ వ్యాప్తమైన ప్రాచ్య సమాజాలనూ ప్రభావితం చేసిన ఆలోచనా ధారలు ఆచరణా ధోరణులే ఆధునికతావాదంగా పేరుగాంచాయి ...

మానవ మేధస్సు సైద్ధాంతికంగా, తాత్వికంగా అపరిమితమైన ఆధిపత్యంతో దూసుకెళుతూ, సామూహిక సామాజిక వ్యవహారాలలో మతాన్నీ, మత బోధనలను విస్మరించడమే ఈ ధోరణి ప్రధానాంశం. జ్ఞానానికి మూలం మానవ మేధస్సు, మానవ ఇంద్రియాలేననీ, మనిషి బుద్ధీ విజ్ఞానాలు ప్రయోగాలకు పరిమితమైన విషయాలే శాస్త్రీయమైనవని ప్రకటించడం జరిగింది. అంతేకాక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, స్త్రీ పురుష సమానత్వాలు , ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా వాదం, ఫెమినిజం, మార్క్సిజం లాంటివి కూడా ఆధునికతావాదం ప్రభావం వల్ల ఉనికిలోకి వచ్చాయి.

ఆచరణా రంగంలో సాంకేతిక ఆధునిక వనరుల వినియోగం, సరికొత్త రాజకీయ ఆర్థిక వ్యవస్థలు, సంస్థాగతా నిర్మాణానికి దోహదపడే అధునాతన పద్ధతులు, ఆధునిక విద్యా విజ్ఞానాలు, అన్వేషణా ఆవిష్కరణలన్నీ ఆధునికవాద ఆచరణాత్మక రూపాలుగా భావించబడ్డాయి.

ఆధునిక వాదానికి దీటుగా సాంప్రదాయ సమాజాల్లో ఎదురైన ప్రతి ఘటనా విధానాలే భారతీయ ముస్లిం సమాజంలో కూడా ఎదురయ్యాయి.

ఆధునిక వాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించే వర్గం ఒకటయితే సంప్రదాయానికి కట్టుబడి ఉండాలనే పట్టుదల మరో వర్గంలో ఉండింది. మత వర్గాలు, మేధావులు ఆధునిక వాద విధానాలన్నిటినీ ఇస్లాం ధర్మానికి ప్రమాదకారకాలుగా పరిగణించారు. ఆంగ్ల భాషను వ్యతిరేకించడం, పాశ్చాత్య దేశాల శాస్త్రాలన్నిటినీ ఆధునిక శాస్త్రాలుగా పేర్కొనడం, వాటి పట్ల అయిష్టతను ఏర్పరచుకొని, అటువంటి విద్యనభ్యసించడాన్ని ప్రాపంచిక వ్యామోహంగా పరిగణించడం జరిగింది. వైద్యశాస్త్రం లాంటి శాస్త్రీయ విద్యలను కూడా ఆంగ్లం, దేశీయ విభాగాల్లో విభజించడమేగాక ఆంగ్ల ఔషధాలను అసహ్యించుకోవడం, ప్రాచ్యశైలిని పాటించడం ప్రధాన అవశ్యకత గా మారింది. స్కూల్లు, రేడియోలు, రైళ్లు, లౌడ్ స్పీకర్లకు వ్యతిరేకంగా ఫత్వాలు జారీ అయ్యాయి. స్వచ్ఛమైన సాంప్రదాయిక రూపాలే ఇస్లామీయ విధి విధానాలని భావించడం, భావింప జెయ్యడం జరిగింది.

ఆధునిక వాదానికి మూలమైన లౌకిక, మతరహిత సిద్ధాంతాలను సంపూర్ణంగా స్వాగతిస్తూ, తద్వారా ఇస్లాం ధర్మానికి వీడ్కోలు పలకడం, లేదా ఏకపక్ష వివరణలు, వక్రభాష్యాలు వక్రీకరణల ద్వారా ఆధునిక వాదానిక నుగుణంగా ఇస్లాంలో సంస్కరణలు చేపట్టే ప్రయత్నానికి పూనుకోవడమూ జరిగింది. టర్కీలో ముస్తఫా కమాల్ నాయకత్వంలో ఏర్పడిన విప్లవమే దీనికి ప్రధాన నిదర్శనం. అక్కడ సెక్యులరిజానికి సంబంధించిన అతివాద భావజాలమే జాతి జీవన వేదంగా మారింది. భారత ఉపఖండం, ఈరాన్, ఈజిప్టు లాంటి దేశాలలో ఉన్న విద్యాధిక వర్గాలు కుటుంబాలలో కూడా ఈ వైఖరే ఏర్పడింది. సర్ సయ్యద్ చేపట్టిన విద్యా సైద్ధాంతిక ఉద్యమం, ప్రధానంగా ఆయన చేసిన ఖురాన్ వ్యాఖ్యానం కూడా ఈ ధోరణికి దర్పణంగా నిలిచింది. ఆయన (ఇజ్తిహాద్) అన్వయ కృషికి అనుగుణంగా ఉన్న వ్యాఖ్యానాలు ఆదరణకు నోచుకోలేక పోయినప్పటికీ ఆయన ఆధునిక భావనలు ముస్లిం సమాజంలోని విద్యాధిక వర్గాలపై మాత్రం తీవ్రమైన ప్రభావాలను వేశాయి.

ఈ రెండు ఆలోచనా ఆచరణా ధారల మధ్య మరో మూడవ ఆచరణా ధార కూడా ఉంది. సంప్రదాయిక మత వర్గాలలో, ఆధునిక వాద విద్యా

వర్గాలలో రెండు చోట్లా ప్రాచీన సంప్రదాయాలు, ఆధునిక భావాలను రంగరించిన అసహజమైన ఆచరణా ధోరణిని అవలంబించిన వాళ్లు కూడా ఉన్నారు. ఆయా వర్గీయులు ఆరాధనలు, ఆచరణా విధానాలు, అనేక సామాజిక అంశాల్లో ప్రాచీన సంప్రదాయాలకే కట్టుబడి ఉన్నారు. ఆ విషయాలలో ఆధునిక వాదులకు– వారికీ ఎటువంటి వ్యత్యాసముండేది కాదు. వారి జీవనశైలి, వృత్తి వ్యాపారాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాలు ఆధునిక భావనలకు ప్రతిరూపంగా ఉండేవి. ఇస్లాంలో సంస్కరణల విషయమై పైకి మాట్లాడనప్పటికీ ఆచరణాత్మక జీవితంలో రెండు వేర్వేరు దృక్పథాలు కలిగి ఉండేవారు. వారి కుడి చేతిలో ఖురాన్ ఉంటే ఎడమ చేతిలో ఆధునిక వాదం ఉండేది. ఆ రెండిటి స్థానమూ వేర్వేరుగానే ఉండేది. వారి పిల్లలు స్కూళ్ళలో సైన్సు సాంకేతిక శాస్త్రాలను చదివితే, ఇంట్లో మౌల్వీలు ఖురాన్ హదీసుల బోధనలు చేసేవారు. ఆ రెండు విద్యల ఆచరణా విధానాలు, ఆదర్శాల పరిధులు కూడా పరస్పర విరుద్ధంగానే ఉండేవి. సాధారణ ముస్లిం సమాజంలోని గణనీయమైన భాగం ఈ ధోరణికే అలవాటు పడింది.

అలాంటి పరిస్థితుల్లో రెండు పరస్పర విరుద్ధమైన ధోరణుల మధ్య మౌలానా మౌదూదీ (రహ్మాలై) ఇస్లాం సూచించే మధ్యస్థ మార్గాన్ని బలమైన వాదనల ద్వారా వివరించారు. మారుతున్న కాలానికనుగుణంగా స్పందించే సామర్థ్యాలతో కూడిన సమతుల్యమైన స్పందనా విధానాన్ని రూపొందించారు. ఇస్లాం ధర్మాన్ని విస్మరించకుండానే, ఇస్లామీయ పునాదులపై మరింత పటిష్టమైన లోతైన, విషయ పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేకతలు దాని స్వంతమయ్యాయి. మౌలానా ఆధునికవాదానికి జడుసుకునే ధోరణిని విడనాడటమేకాక, ఆధునిక రూపంలో అలరింపజేస్తున్న మతరహిత సిద్ధాంతాలన్నిటినీ తీవ్రంగా ఖండించడంతోపాటు ఆధునిక అన్వేషణా ఆవిష్కరణలు ఆధునిక జీవన విధానంలో ఉన్న అనుకూల అంశాలను ఇస్లామీయ బోధనల వెలుగులో అంగీకరించేందుకు మరీ ప్రోత్సహించారు. ఆపై ఇస్లాం సంపూర్ణ జీవన దృక్పథం, దాని సిసలైన సైద్ధాంతిక పునాదులను విస్మరించి ఉభయ భావాలను కలగాపులగం చేసే అసహజమైన జీవన ధోరణిని కూడా దుయ్యబట్టారు. మౌలానా మౌదూదీ (రహ్మాలై) చేసిన విశిష్టమైన కార్యమేమంటే ఆయన ఇస్లామీయ జీవన వ్యవస్థలో ఉన్న సంపూర్ణరూపురేఖలను అవిభాజ్య ఏకాంకంగా

మార్చి, ఆ రూపురేఖల పరిధిలోనే ఆధునిక వాదంలో ఉన్న అనుకూల అంశాలను సద్వినియోగం చేసుకొనే సభ్యతా సంస్కృతిని నేర్పారు. ఇది మౌలానా (రహ్మాలై) చేసిన మహత్తరమైన కార్యమే కాక ఆయన (రహ్మాలై) మన యుగానికి చేసిన గొప్ప మేలు అని చెప్పవచ్చు.

నేడు ముస్లిం సమాజంలో మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తోంది. పాశ్చాత్య ఆలోచనాధోరణి, ఆపై పాశ్చాత్య సంస్కృతీ జీవన విధానాలు మరోమారు ఇస్లాంపై, ముస్లిం సమాజాలపై తీవ్రమైన పోరు సలిపేందుకు ప్రయత్నిస్తు న్నాయి. తత్ఫలితంగా ముస్లిం సమాజాలలో ఆ విధమైన ధోరణులే కనిపిస్తు న్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఇస్లాం సూచించే మధ్యేమార్గం దాని ప్రత్యేకతల పరిజ్ఞానాన్ని నవ యువకుల్లో పెంపొందించడం అత్యవసరం.

## సనాతన వాదంపై మౌలానా మౌదూదీ (రహ్మాలై)

మౌలానా మౌదూదీ(రహ్మాలై ) ఆధునికవాదంలో ఉన్న మంచి విషయాల్లో ఇస్లామీయ స్ఫూర్తిని పొందుపరచి, సంపూర్ణమైన స్థాయిలో వాటిని సద్విని యోగం చేసుకోవాలని, అందులో ఉన్న అధర్మమైన అంశాలు, సిద్ధాంతాలను విడనాడటమే కాక వాటిని తీవ్రస్థాయిలో తిరస్కరించాలనే తర్ఫీదునిచ్చారు. ఆధునిక వాదాన్ని వ్యతిరేకిస్తూ అసహజమైన ఛాందసత్వానికి కట్టుబడే విధానాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకించారు.

మదీనా నగరాన్ని పోలి ఉండే రాజ్యాన్ని స్థాపించడమంటే వాస్తవ రూపంలో స్థాపించాలనుకుంటున్నామనే అర్థం కాదు. ప్రస్తుత ప్రపంచ సంస్కృతిని నేటికీ 14 వందల ఏళ్ల క్రితం అరేబియాలోఉన్న సంస్కృతిలోకి తీసుకెళ్ళాలనే ఉద్దేశం అసలే కాదు. ప్రవక్త(స) అనుసరణా విధానంలో ఉన్న ఈ అర్థం సరైంది కాదు.అనేకమంది ధార్మికులు దురదృష్టవశాత్తు ఇటువంటి తప్పుడు అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. వారి దృష్టిలో ప్రవక్త సహచర మాన్యులను అనుసరించడమంటే వారు ధరించినటువంటి దుస్తులనే ధరించా లని, వారు భుజించినటువంటి ఆహారమే భుజించాలని, వారి గృహాలలో ఉన్నటువంటి జీవనశైలినే అనుకరించాలని, అప్పుడున్న సాంస్కృతిక స్థితినే ప్రళయం వరకు కొనసాగించేందుకు ప్రయత్నించాలని భావిస్తున్నారు. ముస్లిం సమాజ సాంస్కృతిక పతనం అనంతరం అనుకరణకు సంబంధించిన ఈ ధోరణి అనేక శతాబ్దాల తరబడి ధార్మిక ముస్లిముల మనో మస్తిష్కాలలో కూరుకు

పోయింది. ఇది ఇస్లాం స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమైనది. ఇస్లాం మనుషులను ప్రాచీన యుగపు సజీవ శిలలుగా ప్రాచీన సంస్కృతికి ప్రతీకలుగా ఉండాలని ఎన్నటికీ బోధించదు.

ఆధునిక వాదంలో ఉన్న సానుకూల అంశాల గురించి మౌలానా మౌదూదీ (రహ్మాలై) స్ట్రాటజీని అవగాహన చేసుకునేందుకు ఇమామ్ మహదీ గురించి వారి భావనలను తెలుసుకోవడం సముచితంగా ఉంటుంది. రాబోయే కాలంలో ఇమామ్ మహదీ ముస్లింల ఆదర్శ నాయకుడిగా ఉంటారు. ఒక ఆదర్శ ముస్లిం నాయకుడి విశిష్టతలన్నీ ఆయనలో ఉంటాయి. ఇస్లామీయ పునాదులను దృఢంగా పటిష్టపరచడమే కాక ఇస్లాంను పునరుద్ధరించడమే ఆయన ఏకైక ఆశయ సాధనమయి ఉంటుంది. అయినప్పటికీ ఆయన తన ప్రజ్ఞా పాటవాలు, విజ్ఞాన వనరులను సద్వినియోగం చేసుకునే విషయంలో ఆధునిక అవసరాలకనుగుణంగా అత్యాధునిక నాయకుడిగా అలరారుతారనే భావనను వ్యక్తపరిచారు.

నా అంచనా ప్రకారం ఇమామ్ మహదీ తన కాలంలో అత్యాధునిక విధానాన్ని అవలంబించే నాయకుడే కాక ఆ కాలంలోని అన్ని ఆధునిక శాస్త్రాలపై అంతర్దృష్టిని కలిగి ఉంటాడు. జీవితంలోని అన్ని రకాల సమస్యలను బాగా అవగాహన చేసుకునే వాడై ఉంటాడు. తన మేధోశక్తి, రాజకీయ దూరదృష్టి, తన పోరాట స్ఫూర్తితో ప్రపంచమంతటా తనదైన ముద్రను వేస్తాడు. తన కాలంలోని ఆధునికవాదులందరికి ఆదర్శంగా మనగలుగుతాడు. అతని ఆవిష్కరణలకు వ్యతిరేకంగా సూఫీలు మౌల్వీలే ఎక్కువగా తిరగబడతారని నేను భయపడుతున్నాను. అంతిమంగా అతను అజ్ఞాన శక్తియుక్తులను కూలదోసి, అత్యద్భుతమైన ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపిస్తాడు. అందులో ఒకవైపు ఇస్లాం స్ఫూర్తి, సహజత్వాలు ఉట్టిపడుతుంటే మరోవైపు శాస్త్రీయ పురోగతి అంబరాన్ని తాకుతుంది.

## ప్రాధాన్యతల పరిజ్ఞానం

ఆధునిక వాదంపై స్పందించే విషయంలో మౌలానా మౌదూదీ (రహ్మాలై) ప్రాధాన్యతల చైతన్యాన్ని మేల్కొలిపారు. ఆధునికవాదం అసలు దోషమంతా దుస్తులు వస్తువులు ఇతర బాహ్య వ్యక్తీకరణలో కాదనీ, దాని ఆలోచనా విధానం తాత్వికతలో దాగి ఉందనే విషయాన్ని స్పష్టమైన వాదనల ద్వారా వివరించారు.

“వారిలో ధార్మిక విషయాల ఆచరణా విధానం ఏ స్థాయిలో ఉందంటే గడ్డం ఒక నిర్దిష్ట పరిమాణం కన్నా కొంచెం తగ్గినా అవిధేయతా తీర్పులు చెయ్యడం జరుగుతుంది. ప్యాంటు చీల మండలానికి కొద్దిగా కిందికి దిగినా నరకం పాలవుతారనే తీర్పు వినిపించడం జరుగుతుంది. మరోవైపు ధార్మిక నియమ నిబంధనల విషయంలో వారి నిర్లక్ష్యం ఏ స్థాయికి చేరిందంటే ముస్లింల జీవితాలు రాజకీయ ప్రయోజనాలు పట్టువిడుపు వైఖరులకే పరిమిత మయ్యాయి. వారు ధర్మసంస్థాపనా కృషి నుండి తప్పుకునేందుకు అసంఖ్యాకమైన మార్గాలను వెతుక్కున్నారు”.

పాశ్చాత్య సంస్కృతి పురుడు పోసిన ఈ ఆధునిక ఆలోచనా విధానాలే ఇస్లామీయ సంస్కృతికి సరికొత్త సవాలుగా మారాయి. సర్వోన్నతుడు సర్వజ్ఞాని అయిన సృష్టికర్తకు భయపడే ఆస్కారమే లేదక్కడ. ప్రవక్తలు, దైవవాణీ, దైవిక మార్గదర్శకాల ఊసే లేదు. మరణానంతర జీవితం ఉందన్న భావన అసలే లేదు ఐహిక భోగలాలసాలే సర్వస్వమైన జీవితాలలో జవాబుదారీతనానికి స్థానమంటూ లేదు. మనిషి బాధ్యతాయుతుడనే భావన, అత్యున్నతమైన ఆశయ స్పృహకు అవకాశం లేదు. అది కేవలం భౌతిక సంస్కృతి. ఇస్లాం దృక్పథానికి భిన్నమైన సంస్కృతి. ఇస్లాం అవలంబించే మార్గానికి అతి విరుద్ధమైన మార్గం. ఒక్కమాటలో చెప్పాలంటే పాశ్చాత్య సంస్కృతి ఇస్లామీయ వ్యవస్థ పరస్పర విరుద్ధమైన దిశలో పయనించే రెండు నావల్లాంటివి.

కనుక ప్రజలను సూటుబూటులనుండి కాపాడడం కాదు. ఆధునికత పేరుతో అలరింపచేస్తున్న ఆ ఆలోచనా విధానం సాంస్కృతిక దాడి నుండి రక్షించడమే సిసలైన సమస్య. అందుకోసం మూఢ సంప్రదాయాన్ని అట్టి పెట్టుకోవడం, ఆధునికవాదాన్ని గుడ్డిగా అనుకరించడం రెండూ వినాశకర ధోరణులే.

టర్కీ యువకులకన్నా టర్కీ ఉలమా మేధావి వర్గాలే అపరాధు లనడంలో అతిశయోక్తి లేదేమో. వారి నిర్లిప్తత కారణంగానే ఐదు వందల సంవత్సరాల నుండి తమ శక్తియుక్తులను ధారపోసిన ధార్మిక యోధులు ఇస్లాం ధర్మం నుండి జారుకొని ఆధునిక వాదం వైపు అడుగులేశారు. ఇలాంటి మూఢులే ఇతర ముస్లిం సమాజాలను కూడా అదే మార్గాన పడవేస్తారనే భయం ఉంది. మరోవైపు ఆధునికవాదులు అంకారా (టర్కీలోని నగరం పేరు) నుండి

వెలువడిన ప్రతీ విషయాన్ని ఖురాన్ హదీసులకతీతంగా భావిస్తూ, మార్గదర్శకమంటే అది ముస్తఫా అతాతుర్క్ ఆదర్శంలోనేనంటూ, విజ్ఞాన కిరణాలంటే అంకారా ఆకాశంనుండి అవతరించినవే అనే ధోరణిని ముస్లింల ముందు వ్యక్తపరుస్తున్నారు.

## బౌద్ధిక ఆధిపత్యం

మౌలానా మౌదూది (రహ్మాలై) బుద్ధీ జ్ఞానాలు మేధో మథన ప్రాధాన్యతల విషయమై ప్రోత్సహించడంతో పాటు అంధానుకరణ, సాంప్రదాయిక వాదాన్ని అట్టి పెట్టుకునే వైఖరినీ విమర్శించారు. అన్వయ కృషి (ఇజ్తిహాద్)కి అధిక ప్రాధాన్యతనిచ్చారు.

ఇది పూర్తిగా శాస్త్రీయమైన హేతుబద్ధమైన ధర్మం. కనుక బుద్ధి వివేకాలు విద్యాజ్ఞానాలు లేకుండా దీన్ని అనుసరించడం సాధ్యపడదు. ఇక్కడ అడుగ డుగునా అవగాహనా అన్వేషణల అవసరం ఉంటుంది. ఈ ధర్మంలో దాగి వున్న ఆంతర్యాన్ని గ్రహించలేని వ్యక్తి, దాని ఔచిత్యాలను అవగాహన చేసుకోలేని వ్యక్తి, దాని నియమ నిబంధనలను అర్థం చేసుకోలేని వ్యక్తి, దాని బోధనలపై ఆలోచన చేయలేని వ్యక్తి, ఆ ధర్మం చూపే మార్గంపై స్థిరంగా నడవలేడు. అతని నోటి ద్వారా అంగీకరించినంత మాత్రాన అంతఃప్రేరణ జరగకపోతే అతను విశ్వాసంలో అర్థమే లేదు. విజ్ఞతా వివేచనా శూన్యమైన అతని ఆచరణ కూడా అసంపూర్ణమే. అతని మనో మస్తిష్కాలపై ప్రభావం చూపలేని శాసనాంగ స్ఫూర్తి కూడా అర్థరహితమైనదే.

మౌలానా మౌదూదీ (రహ్మాలై) మానవ మేధస్సు పరిమితమైనదనీ, అతనికి దైవిక మార్గదర్శకాల ఆవశ్యకత ఉందని కూడా ఉద్ఘాటించారు.

## మానవ ఆలోచనా విధానంలోని ప్రధాన విశిష్టత ఏమంటే

అందులో లోపభూయిష్టమైన, పరిమిత జ్ఞాన ప్రభావాలు తప్పక గోచరిస్తాయి. దీనికి భిన్నంగా దైవం అందజేసే ఆలోచనా విధానంలో అపార మైన జ్ఞానం, వాస్తవ జ్ఞాన విశిష్టతలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. దైవ దత్తమైన విషయాలలో ఏ కాలంలోనూ శాస్త్రీయ నిరూపణలకు సత్యదూరమైన ఏ విషయాన్ని కనుగొనలేరు. అలాగే విషయ వాస్తవికతలో లొసుగులున్నటువంటి

ఎటువంటి రచనా కానరాదు. వారి శాస్త్రోక్తమైన ఊహాగానాలు నిజమయ్యే అవకాశాలు ఎంత మెరుగ్గా ఉంటే తప్పని తేలే అవకాశాలు కూడా అంటే ఎక్కువగా ఉంటాయి. చివరి వరకు సత్యమని నిరూపితమైనవి వైజ్ఞానిక చరిత్రలోనే బహు తక్కువన్నది గమనార్హం.

కనుక దైవిక మార్గదర్శకాల పరిధిలోనే బుద్ధిని ఉపయోగించాలి. బుద్ధిని దైవ మార్గదర్శకానికి అతీతమైనదిగా భావించకూడదు. మానవ ప్రయత్నమే తుది ప్రయత్నంగా భావించకూడదు. దైవిక మార్గదర్శకాలు విజ్ఞతా వివేచనల ప్రాతిపదికనే విషయాలను అంగీకరించాలి.

మౌలానా మౌదూదీ (రహ్మలై) దృష్టిలో ఛాందసత్వానికి అలవాటు పడిన వారిలో సంప్రదాయవాదులే కాక ఆధునిక వాదులు కూడా ఉన్నారు. సాంప్రదాయిక వాదులు తమ బుద్ధీ జ్ఞానాలను పణంగా పెట్టి శతాబ్దాల క్రితం నాటి గ్రంథాలను అనుసరిస్తుంటే ఆధునికవాదుల మేధో వికాసాలు పాశ్చాత్య విజ్ఞాన వెలుగులకు బానిసలయ్యాయి.

వారు పాశ్చాత్య ప్రపంచం నుండి వైజ్ఞానిక బోధనలనభ్యసించినప్పటికీ, ఆ జ్ఞాన మూలాలు యూరప్ నుండి లభించినవే కనుక వారి మేధో శక్తులు పాశ్చాత్యపరమైనవే కానీ స్వతంత్రమైనవి, సహజమైనవి కావు. వారు పాశ్చాత్య ప్రపంచం నుండి పొందిన విమర్శనా విధానాల సారాంశం కూడా పాశ్చాత్య సూత్రాలను సత్యబద్ధంగా భావించి వాటి ప్రామాణికతల ప్రాతిపదికనే పాశ్చాత్యేతర విషయాలను పరిశీలించాలనేదే.

మౌలానా మౌదూదీ (రహ్మలై) సాంప్రదాయ, ఆధునిక ఉభయవర్గాలను అంధానుకరణకు అలవాటు పడిన వారుగా పేర్కొంటూ సోదాహరణంగా వ్రాశారు.

దురదృష్టవశాత్తూ రెండు వర్గాలలో ఏ ఒక్కరూ మనకు ఇజ్తిహాద్ స్ఫూర్తి గలవారు కానరావటం లేదు. ఎంతో సాహసోపేతంగా సాంప్రదాయిక వాదులలో ఎవరైనా ఇజ్తిహాద్ చేపట్టినప్పటికీ తన పురాతన నావలోనే కొన్ని విద్యుత్ బల్బులను పెట్టి, కొంత మేరకు ఆధునిక సౌకర్యాలను సమకూర్చుకొని, ఒక చిన్నపాటి ఆవిరియంత్రం కొని, దానిద్వారా దూరాన్నుండి ఇది అధునాతన నావ అంటూ బాకాలూదుతూ ప్రజలను మభ్యపెట్ట ప్రయత్నిస్తున్నారు. దీనికి దీటుగా ఆధునిక నావలోని ప్రయాణికులు (ఆధునికవాదులు) ఇతరుల బోటుపై

శర వేగంగా వ్యతిరేక దిశలో ప్రయాణిస్తున్నప్పటికీ, ఇరవయ్యో శతాబ్దికి చెందిన ఆధునిక బోటులో మరో నలుగురైదుగురు నావికులను కూడా కూడబెట్టుకుని, ఇది కూడా ఇస్లామీయ బోటేనంటూ లండన్ మార్గం గుండా కాబా యాత్రకై ప్రయాణిస్తుందని తమను తామే గాక ముస్లిం సమాజాన్ని మభ్యపెడుతున్నారు.

## విద్యా బోధనల విషయంలో

మౌలానా మౌదూదీ (రహ్మలై) ప్రాచీన, ఆధునిక విద్యా వ్యవస్థ రెండిటిని తీవ్రంగా వ్యతిరేకించేవారు. అంతేగాక విద్యలో రెండు విధాలా విభజన ముస్లింల వెనుకబాటుతనానికి ప్రధాన కారణమనేవారు.

విద్యను ధార్మిక ప్రాపంచిక రెండు వేర్వేరు రంగాలలో విభజించడం ధార్మిక, ప్రాపంచిక భావజాలాన్ని వేర్వేరుగా చూడటమే. ఇది ధర్మానికి విరుద్ధమైన భావన. ఇస్లాం సూచించే ధార్మిక భావన ప్రకారం మొత్తం ప్రాపంచిక విద్యలన్నిటినీ ధార్మిక విద్యలుగా మలచాల్సి ఉంది. అలా జరగని పక్షంలో ప్రాపంచిక విద్యలో ధార్మిక దృక్కోణం లేకపోతే, ప్రాపంచిక విద్యల కతీతంగా ధార్మిక విద్యాభ్యాసం జరిగితే ఆయా విద్యలను అభ్యసించే విద్యార్థి మొదటి నుండి లభ్యమైన వాతావరణం వల్ల ధార్మిక ,ప్రాపంచిక జీవితాలు పరస్పరం వేర్వేరనే మనస్తత్వాన్ని ఏర్పరచుకుంటాడు.

ప్రాచీన విద్యా వ్యవస్థ గురించి ఆయన అభిప్రాయం ఏమంటే వాస్తవానికి అందులో ధార్మిక బోధన బహు తక్కువగా ఉంటుంది. ఎందుకంటే అది నేటికీ రెండున్నర శతాబ్దాలకు పూర్వం ఉన్న సివిల్ సర్వీస్ బోధన. అందులో ఇస్లామీ ఫిఖహ్‌ను ధార్మిక విద్య గానే పేర్కొనడం జరిగింది అయితే అందులో ధార్మిక బోధనా విషయాలు బహు కొద్దిగానే ఉన్నాయి–ఈ విధంగా ఆ విద్యా వ్యవస్థ మనం ఆశించిన రీతిలో మన ధార్మిక అవసరాలకు సరిపడే విధంగా లేదు. ఇక ప్రాపంచిక ప్రయోజనాల విషయానికి వస్తే వాటితో దానికి ఎటువంటి సంబంధం లేదు.

నేడు అమలులో ఉన్న ధార్మిక విద్యాబోధన పద్ధతులతో ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువని చెప్పవచ్చు. అవి ఇస్లాం ధర్మానికి దర్పణంగా లేకపోవడమే కాక ప్రస్తుత జీవన సమస్యలకు ఇస్లాం చూపే పరిష్కారాలు కూడా వాటిలో శూన్యమే. కనీసం ధార్మిక సూత్రాలపై జాతికి దిశానిర్దేశన చేసే

సామర్థ్యాలు కానీ సామూహిక జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే తెలివిడి గానీ అందులో లేవు. ఒక్క మాటలో చెప్పాలంటే అవి ధర్మోన్నతికి సహాయపడే బదులు ధర్మ విచ్ఛిత్తికి కారకమవుతున్నాయి.

ఆధునిక విద్యా వ్యవస్థ గురించి మౌలానా (రహ్మాలై) ఈ విధంగా అనేవారు.

ఆధునిక విద్యా వ్యవస్థలో జరుగుతున్న ముస్లిం సమాజ భావి పౌరుల విద్యాబోధనల పద్ధతులు, శిక్షణా శైలిని చూస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా కనిపించడం లేదు. ఆయా విద్యాలయాలు మదరసాలలో సైన్సు సాంకేతిక శాస్త్రాలు, ఆర్థిక, రాజకీయ, న్యాయ శాస్త్రాలేకాక నేడు మార్కెట్లో చలామణిలో ఉన్న ఇతరత్రా శాస్త్రాలన్నీ బోధించడం జరుగుతుంది. కానీ ఇస్లాం తత్వశాస్త్రం, ఇస్లామీయ చరిత్ర తదితర శాస్త్రాల ఊసే ఉండదు. తత్ఫలితంగా విద్యార్థుల ఆలోచనా విధానాలు ఇస్లామేతర రూపురేఖలకు అనుగుణంగానే రూపుదిద్దు కుంటాయి. ఇస్లామేతర విధివిధానాలే వారి మనో మస్తిష్కాలలో పాదుకుంటాయి. జీవితంలోని ప్రతీ విషయాన్ని ఆ దృక్కోణం లోనే చూడడానికి వారు అలవాటు పడిపోతారు.

ఈ రెండు అతివాదాలకు భిన్నంగా మౌలానా మౌదూదీ (రహ్మాలై) సారవంతమైన, సమతుల్యమైన ఇస్లామీయ విద్యా వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఆ వ్యవస్థ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందడమే కాక దానిపై అనేక ప్రయోగాలు కూడా జరుగుతున్నాయి. మౌలానా ఆ విద్యా వ్యవస్థలో ఉన్నటువంటి మూడు విశిష్టతలను వివరించారు.

1) నీతి నిజాయితీలు, నైతికతా విలువలు, సామర్థ్యాలతో కూడిన ఈ విద్యా వ్యవస్థ సామూహిక జీవనాన్ని మన సాంస్కృతిక నావపై నడపగలిగే, తద్వారా అభివృద్ధి బాటలో ప్రయాణించే సామర్థ్యం కలిగిన వ్యక్తులను తీర్చిదిద్దేదై ఉండాలి.

2) ప్రాపంచిక విద్య, ధార్మిక విద్య వంటి విభజనలను పక్కనపెట్టి ఆర్థిక, తత్వశాస్త్రాలు, న్యాయ శాస్త్రాల్లాంటి బోధనలన్నీ ధార్మిక దృక్కోణంలోనే జరగాలి. ఆ తరువాత ఎటువంటి ప్రత్యేక ధార్మిక బోధన అవసరం ఉండకూడదు.

3) మూడవ ప్రత్యేకత ఏమిటంటే అందులో విద్యాభ్యాసానికన్నా వ్యక్తిత్వ వికాసానికే అత్యంత ప్రాధాన్యత ఉండాలి.

## సాంకేతిక, ఆధునిక వనరులు

మౌలానా మౌదూదీ (రహ్మలై) టెక్నాలజీని ఒక సమతుల్యాత్మకమైన విషయంగా భావించారు. అసలు లోపం టెక్నాలజీలో లేదు, టెక్నాలజీని వినియోగించే సంస్కృతిలో ఉందనేది ఆయన ఉద్దేశం.

అశ్లీలత అనైతికత అనేవి వనరులలో కాదు, ఆయా వనరుల ద్వారా అభివృద్ధి చెందుతున్న అధర్మ సంస్కృతిలో ఉంది. రేడియో స్వతహాగా అపవిత్రమైంది కాదు. అపవిత్రత అనేది సత్యాన్ని విస్మరించి అసత్యాన్ని వ్యాపింప చేసేటటువంటి వ్యవస్థకు కారణభూతమైన సంస్కృతిలోనే ఉంది. విమానం అపవిత్రమైన వస్తువు కాదు. దైవాజ్ఞకు బదులు పైశాచిక శక్తులకు ప్రేరణగా నిలుస్తున్న సంస్కృతిలో ఉంది. సినిమా, చలన చిత్రాలు అపవిత్రమైనవి కావు దైవం ప్రసాదించిన శక్తియుక్తులను ఉపయోగించి అశ్లీలం విశృంఖలత్వాల వ్యాప్తికి కారకమవుతున్న సంస్కృతి అపవిత్రమైనది. ఈ శక్తియుక్తులన్నీ ఖడ్గాలవంటి ఆయుధాలు. పవిత్రమైన ప్రయోజనాలకైనా లేక అపవిత్రమైన ప్రయోజనాలకు వినియోగించుకున్నా, ఏదైనా సరే వినియోగించుకున్న వాళ్ళే విజయాలు సాధించగలరు.

ఇటీవల టెక్నాలజీకి సంబంధించి ఇస్లామీయ వర్గాలలో సరికొత్త చర్చలు జరుగుతున్నాయి. టెక్నాలజీ సంస్కృతుల ద్వారా ఉనికిలోకి వస్తుంది కనుక అది సంపూర్ణంగా సాంస్కృతిక ప్రభావాల కతీతం కాదనేది ఒక దృక్పథం. కనుక ఈ భావజాలం కూడా ప్రధాన విషయంగా మారింది.

పాశ్చాత్య టెక్నాలజీ భౌతికవాద సంస్కృతికి ప్రతీకగా నిలిచింది కనుక ప్రకృతి వనరుల విచ్ఛిన్నం, పర్యావరణ సంక్షోభం, అశ్లీలం అనైతికతలు, అతి వినాశకర ఆయుధాలు, ఆపై కేవలం సంపన్నవర్గాల అడుగులకు మడుగులొత్తే విధానాలు ఈ టెక్నాలజీ ప్రముఖ లక్షణాలుగా మారిపోయాయి.

ఇస్లామీయ సంస్కృతికి ప్రతిబింబంగా ఉండే టెక్నాలజీ, ప్రకృతి సహజ మైనదిగా పర్యావరణకు అనుకూలంగా మానవాళికి అవసరమైన వాస్తవ అన్వేషణలకు ప్రతిరూపంగా ఉంటుంది. కనుక ఇస్లామీయ సంస్కృతికి తనదంటూ ఓ ప్రత్యేకమైన టెక్నాలజీ అవసరం కూడా ఉంది.

## ఆర్థిక రాజకీయ వ్యవస్థలు

మౌలానా మౌదూదీ (రహ్మలై) దృష్టిలో పాశ్చాత్య ఆలోచనా విధానం తరువాత మనం ఎదుర్కోవాల్సిన అత్యంత శక్తివంతమైన మరో ఆయుధం దాని రాజకీయ వ్యవస్థ కూడాను.

ఇస్లామీయ రాజకీయ వ్యవస్థ దైవిక సార్వభౌమాధికారాల ప్రాతిపదికన నెలకొంటే ఆధునిక పాశ్చాత్య రాజకీయ వ్యవస్థ ప్రజాస్వామ్య పునాదులపై నిలబడి ఉంది.

ఇక్కడ నిర్ణయాధికారం, పాలనాధికారం కేవలం అల్లాహ్‌కే స్వంతం – అల్లాహ్ సార్వభౌమాధికారం విశ్వవ్యాప్తంగా ఎలా ఆవరించి ఉందో అదేవిధంగా నైతిక రాజకీయ సైద్ధాంతిక శాసనాంగ స్థాయిలోనూ ఉంటుంది. రాజకీయ శాసనాపరమైన భావన ఇస్లామీయ మౌలిక సూత్రాలకు మూలమంటే అతిశయోక్తి కాదేమో...

దైవాజ్ఞాబద్ధమైన ప్రభుత్వ పరిధిలో మౌలానా మౌదూదీ (రహ్మలై) ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించడమే కాక దానికి సంపూర్ణ మద్దతునిచ్చారు.

ఆయన సూచించిన ఇస్లామీయ రాజ్యంలోని ప్రజాస్వామిక సూత్రాలలో ప్రభుత్వాల నిర్వహణా ఏర్పాట్లు, మార్పులు చేర్పులన్నీ ప్రజాభిప్రాయంతోనే జరగాలనేటువంటి అభిప్రాయం ఉంది. అయితే అందులో నిర్ణయాధికారం ప్రజల చేతుల్లో ఉండదు. దైవం, దైవ ప్రవక్తల శాసనాంగ సూత్రాలు పరిధులు పరిమితులు నైతిక బోధనలు మార్గదర్శకాల వెలుగులో ప్రజాకాంక్షలను నియంత్రించడం జరుగుతుంది.

మౌలానా (రహ్మలై) తన రాజకీయ సిద్ధాంత సారాంశాన్ని హాకిమియ్యతే ఇలాహ్ (దైవాజ్ఞాబద్ధమైన ప్రభుత్వం) ఖిలాఫతే జమ్హూర్ (ప్రజా ప్రాతినిధ్య పాలన) లాంటి పదాలలో వివరించారు.

ఈ పదబంధం ప్రకారం విశ్వాస సమూహంలోని ప్రతి వ్యక్తీ ఖిలాఫత్‌లో భాగస్వామియే. ఏ వ్యక్తికీ, వర్గానికీ, ఇతర సామాన్య ప్రజల ప్రాతినిధ్య అధికారాన్ని వశపరుచుకొనేందుకు ఎటువంటి హక్కూ లేదు. అందుకనే ఖిలాఫత్‌లో రాచరికం, వర్ణ వర్గాల ఆధిపత్యం, మత పండితుల ప్రమేయానికి ఎటువంటి స్థానం లేదు. కీలకమైన ప్రజాస్వామ్య వ్యవస్థపైనే ప్రభుత్వం నడుస్తుంది. పాశ్చాత్య ప్రజాస్వామ్యంలో ప్రజలే శాసనకర్తలయితే ఇస్లామీయ

ప్రజాస్వామ్య ప్రాతినిధ్యంలో మాత్రం ప్రజలు స్వయంగా దైవిక ప్రభుత్వాన్ని అంగీకరించి, తద్వారా త్రికరణశుద్ధితో తమ అధికారాలను దైవిక శాసనాలనకు లోబడి వినియోగించుకుంటారు.

అదేవిధంగా ఆర్థిక విషయాలలో మౌలానా కమ్యూనిజం భావజాలాన్నీ వ్యతిరేకించారు. క్యాపిటలిజంపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ రెండు సిద్ధాంతాలకు దీటుగా మధ్యే మార్గమైన ఇస్లామీయ ఆర్థిక సిద్ధాంతాన్ని రచించారు. అందులో వ్యక్తిగత స్వేచ్ఛ, లాభదాయక విధానాల ఆధారంగా సంపద ఉత్పత్తి వేగంగా జరగడమే కాక ప్రజా సంక్షేమం, సంపద సమ న్యాయ విభజన, నిరుపేదల సమస్యల పరిష్కార మార్గాలు ఉన్నాయి. ఈ విధంగా కమ్యూనిజం కాపిటలిజం రెండింటి లక్షణాలూ అందులో ఉన్నాయి. ఆ రెండింటిలో ఉన్న లోపాలకు అతీతంగా ముక్తిదాయక మార్గం కూడా ఇస్లాంలో ఉందనే విషయాన్ని వివరించారు.

## కార్యరంగ విధి విధానాలు

ప్రతి మంచి మాట, అనుభవం మానవజాతి సమిష్టి వారసత్వమని, దాన్ని విస్మరించకుండా తప్పక అనుసరించాలని మౌలానా మౌదూదీ (రహ్మాలై) బాహాటంగా వివరించారు.

ఒక జాతి నుండి మరొక జాతి ఏదైనా కాంక్షిస్తే, అవలంబించాల్సిన విలువైన విషయాలేవైనా ఉంటే అవి ఆ జాతి సృజనాత్మక సంపద, శాస్త్రీయ పరిశోధనా ఫలాలు, ఆ జాతిని విజయ పథాన నడిపించిన ఆచరణాత్మక విధానాలే అయి ఉంటాయి. ఆయా జాతుల చారిత్రక, సంస్థాగత, నైతిక విలువలలో ప్రయోజనకరమైన పాఠమేదైనా ఉంటే దాన్ని తప్పకుండా గ్రహించాల్సిందే. దాని అభివృద్ధికి దోహదపడిన కారకాలనూ కూడా పూర్తి స్థాయిలో విశ్లేషించాల్సిందే. ప్రయోజనకరమైన పాఠాలు, విలువైన విషయాలు మానవాళి వారసత్వం. వాటిని ఆదరించకపోవడం ఆయా విషయాలను అవలంబించే విషయంలో జాతి దురభిమానం కారణంగా సంకుచిత మనస్తత్వానికి లోనవడం అజ్ఞానం తప్ప మరొకటి కాజాలదు.

దాని ప్రధాన ఉదాహరణ జమాఅతే ఇస్లామీ సంస్థాగతా స్వరూపమే. ఇది దాదాపు ఆధునిక సంస్థాగతా విధివిధానాల ద్వారానే గ్రహించబడింది. అందులో సంస్థ సభ్యత్వం, నిర్ణాయక సంస్థలు, సంస్థాగత బాధ్యులు వారి

శిక్షణ, Hierarchy, నిర్ణయాలు గైకొనే సమావేశాలు, నిర్ణయాత్మక విధానాల విషయాలలో ఆధునిక సంస్థాగత పద్ధతుల ద్వారా సంపూర్ణ స్థాయిలో జరిగింది. అందులో ఎక్కడా అంధానుకరణ జరగలేదు. ఇస్లామీయ నియమ నిబంధనల ప్రకారం కొన్ని ప్రత్యేకమైన విశిష్టమైన విషయాలు ఉన్నాయి. ఉదాహరణకు: అభ్యర్థిత్వం లేకుండా ఎన్నికల విధానం, నాయకుడి కేంద్రీయ స్థానం, పదవిని కాంక్షించే వ్యక్తిని బాధ్యతలకు అనర్హుడిగా ప్రకటించడం వగయిరా...

ఈ విషయంలో మౌలానా అభిప్రాయ సారాంశం ఈ విధంగా ఉంది.

మనం ప్రవక్త(స), ఆయన అనుయాయుల ఆదర్శాలను అనుసరించాల్సిన సిసలైన విధానం ఏమంటే వారు ప్రకృతి నియమాలను షరియా నియమాలకు అనుగుణంగా ఉపయోగించి, దేవుని భువిపై దైవ ప్రాతినిధ్య బాధ్యతను పరిపూర్ణంగా నిర్వర్తించారు. వారి కాలాలలో ఉన్న సంస్కృతులలో ఇస్లామీయ స్ఫూర్తిని నింపి, ఆయా కాలాలలో మనిషి వశపరచుకున్న ప్రకృతి వనరులన్నిటినీ ఆ ప్రత్యేక సంస్కృతికి ఉపయోగపడే విధంగా మలిచారు. అభివృద్ధికి అవసరమైన సాంస్కృతిక వనరులన్నిటి ద్వారా ప్రయోజనం పొందుతూ సత్య తిరస్కారులను సైతం ఓడించి ముందుకు దూసుకుపోయారు. తద్వారా దైవ తిరస్కార సంస్కృతికి దీటుగా దైవ ప్రాతినిధ్య ధ్వజ వాహకుల సంస్కృతి వర్ధిల్లింది.

*(రఫీఖే మన్జిల్ జూన్ 2009 మాసపత్రికలో ప్రచురితమైన వ్యాసం)*

**ఆధార గ్రంథాలు**


1) తన్కీహాత్
2) తఫ్హీమాత్
3) తాలీమాత్
4) ఖిలాఫత్ వ ములూకియత్
5) ఇస్లామీ నిజామే తాలీమ్
6) తహ్రీక్ ఔర్ కార్కున్
7) ఇస్లామీ రియాసత్

# ధర్మ సంస్థాపనా దృక్పథంపై అభ్యంతరాలు : స్థూల పరిశీలన

ఈ వ్యాసంలో ధర్మ సంస్థాపనా భావనలపై కొందరు ముస్లిం మేధావులు చేసిన విమర్శలను పరిశీలించే ప్రయత్నం జరిగింది. ఈ విమర్శల్లో రెండు రకాలు ఉన్నాయి. రాజకీయాల్లో సామాజిక వ్యవహారాలలో ఇస్లాం దిశానిర్దేశన చేస్తుందనే విషయాన్ని ససేమిరా ఒప్పుకోని వాళ్ళు కొందరయితే, ఒకవేళ మార్గనిర్దేశనం చేసినా నేటికాలపు పరిస్థితుల్లో దాన్ని అనుసరించడం అనవసరం అనేది మరికొంతమంది వాదన. సమకాలిక, లౌకిక సిద్ధాంతాలకు ప్రభావితమైన ఈ వర్గం ఇస్లాం సహా అన్ని మతాలు వ్యక్తుల వ్యక్తిగత జీవితానికే పరిమితమని, సామాజిక వ్యవహారాలలో మత ప్రమేయం అశాంతి అలజడులకు దారి తీస్తుందని, అసలు ఈ విషయాలు మతానికి సంబంధించినవి కావనేది వారి అభిప్రాయం. రాజ్య పరిపాలన, శాసనాంగ సంబంధమైన ఇస్లామీయ బోధనలు కేవలం ఓ ప్రత్యేక కాల పరిస్థితుల అవసరాలకే తప్ప నేటి యుగంలో ఆయా బోధనలు జ్ఞానోదయానికయితే ఉపయోగపడతాయి కానీ వాటిని యధావిధిగా అనుసరించడం అసాధ్యము అనవసరం కూడాను అనేది వారి భావన. అయితే ఈ వ్యాఖ్యలను ఈ వ్యాసంలో చర్చించటం లేదు. ఈ అంశంపై ప్రత్యేకంగా వివరణాత్మక విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఈ విషయాలను ఇక్కడ ఉటంకించడంలో ఉద్దేశం తదుపరి చర్చల్లో దాని ప్రస్తావన రానుంది.

ప్రస్తుతం మన ముందున్నది ఇస్లాం సమగ్ర వ్యవస్థను, సామాజిక జీవితానికి సంబంధించిన బోధనలను అంగీకరించే ముస్లిం మేధావులు విద్వాంసుల వర్గం. వీరు ఇస్లాంలో రాజ్య భావన కూడా ఉందని, అది రాజ్యానికి

శాసనాలను కూడా ప్రతిపాదించిందని, ఆయా బోధనలు ఇస్లాం, ఇస్లామీయ షరీయత్‌కు చెందిన విభాగాలేనని అంగీకరించినప్పటికీ ఆ నిబంధనలు సాధారణ ముస్లింలకు వర్తించవనేది వారి వాదన. వాటి సంబోధితులు కేవలం పరిపాలకులే. ఏ వ్యక్తికైనా ప్రభుత్వ అధికారాలు లభిస్తే అతను రాజ్య పరిపాలన, శాసనా పరమైన విషయాలలో దైవాదేశాలను పాటించాలే తప్ప ప్రభుత్వాధికారం లేని సామాన్య ముస్లింలకు ఈ ఆదేశాలు వర్తించవు. దివ్య ఖురాన్ బోధించే షరియా బోధనలను స్థాపించే, సామాజిక కృషి సలిపే బరువు బాధ్యతలు కూడా వారిపై లేవు. వారి బాధ్యత కేవలం సామాజిక విషయాలకతీతంగా వ్యక్తిగత జీవితాలలో ఆ బోధనలు పాటించడం వరకే పరిమితం. నేటి సభా నిర్వాహకులు ప్రధానంగా మౌలానా వహీదుద్దీన్ ఖాన్, జనాబ్ జావీద్ అహ్మద్ గామిదీ గారి అభ్యంతరాలను సమీక్షించాలని సూచించారు. ఆ ప్రయత్నం చేస్తున్నాను.

## ఇఖామతే దీన్ అంటే ఏమిటి?

ఈ దృక్పథంపై మాట్లాడే ముందు సంక్షిప్తంగా ఇఖామతే దీన్ (ధర్మ సంస్థాపన) గురించి తహ్రీకే ఇస్లామీ, మౌలానా మౌదూదీ (రహ్మలై) భావాల సారాంశాన్ని స్పష్టం చేయడం అవసరం అనిపిస్తోంది.

జమాఅతే ఇస్లామీ హింద్ నిబంధనావళిలోని 4వ అధికరణలో జమాఅత్ ధ్యేయాన్ని ఈ విధంగా వివరించడం జరిగింది.

జమాఅతె ఇస్లామీ హింద్ ధ్యేయం ఇఖామతే దీన్, ధర్మ సంస్థాపన. దీనికి అసలు ప్రేరణ కేవలం దైవ ప్రసన్నత, పరలోక సాఫల్యం పొందడం మాత్రమే..

నసబుల్ ఐన్ (ధ్యేయం) వివరణ ఈ అధికరణలో ఈ విధంగా ఉంది.

ఇఖామతే దీన్‌లో దీన్ అనే పదానికి అర్థం, విశ్వ ప్రభువు అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా విభిన్న కాలాల్లో విభిన్న దేశాల్లో పంపించిన దీనె హఖ్‌– సత్య ధర్మం. దానిని ఆయన అంతిమంగా పరిపూర్ణ రూపంలో మానవులందరికీ మార్గదర్శకంగా తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా అవతరింపజేశాడు. ఇప్పుడు ప్రపంచంలో అదొక్కటే ప్రామాణికమైన సురక్షితమైన దైవసన్నిధిలో స్వీకార యోగ్యమైన 'ధర్మం'. దాని పేరే 'ఇస్లాం'.

ఈ ధర్మం మానవుని అంతర్బాహ్యాలనూ, అతని జీవితంలోని సకల వ్యక్తిగత సామాజిక కోణాలను ఆవరించి ఉంది. విశ్వాసాలు, ఆరాధనలు,

నైతికతా ప్రమాణాలు మొదలుకొని ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలన్నింటి వరకు మానవ జీవితపు ఏ ఒక్క విభాగమూ దీని పరిధికి వెలుపల లేదు.

ఈ ధర్మం దైవ ప్రసన్నత పరలోక సాఫల్యానికి ఏ విధంగా హామీ ఇస్తుందో అదే విధంగా ఇది ప్రాపంచిక సమస్యల సముచిత పరిష్కారానికి అత్యుత్తమ జీవన వ్యవస్థ కూడా. వ్యక్తిగత సామూహిక జీవితాన్ని సంస్కార వంతంగా, ప్రగతి శీలంగా నిర్మించడం దీని సంస్థాపన ద్వారానే సాధ్యం.

ఈ ధర్మ సంస్థాపన అంటే ఎలాంటి భేదభావం, వివక్షను పాటించకుండా సంపూర్ణ ధర్మాన్ని ఏకాగ్ర చిత్తంలో ఏకోన్ముఖులై అనుసరించాలి. మానవ జీవితంలోని వ్యక్తిగత సామూహిక కోణాలన్నింటిలో దీన్ని అమలు పరచాలి. తద్వారా వ్యక్తి ప్రగతి, సమాజ నిర్మాణం, రాజ్య రూపకల్పన అంతా ఈ ధర్మం ప్రకారమే జరగాలి.

జమాఅత్ నిబంధనావళి ఐదవ అధికరణలో ధ్యేయ సాధనకై అవలంబించే విధివిధానాల గురించి ప్రస్తావిస్తున్న క్రింది వాక్యాలు గమనించ దగినవి.

జమాఅత్ తన ధ్యేయ సాధన కొరకు నిర్మాణాత్మకమైన శాంతియుతమైన విధానాలను అనుసరిస్తుంది. అంటే అది ప్రచారం, ప్రబోధం, భావ ప్రకటనల ద్వారా మనసులను, స్వభావ శీలాలను సంస్కరిస్తుంది. ఈ విధంగా దేశ సామూహిక జీవితంలో కావలసిన సంస్కార ప్రధాన విప్లవం తెచ్చేందుకు ప్రజాభిప్రాయాన్ని మలుస్తుంది.

ఈ అధికరణలో వున్న కొన్ని విషయాలు ప్రధానంగా గమనించదగ్గవి.

1. ఇఖామతే దీన్ ధర్మసంస్థాపన అంటే కేవలం రాజకీయ స్థాయిలో ఇస్లామీయ ఆదేశాలను అమలుపరచడం కాదు. జీవితంలోని అన్ని రంగాలలో ఇస్లాంను అనుసరించడం. అందులో రాజ్య పరిధి కూడా ఉంది. దైవంతో వ్యక్తుల సంబంధాలు, భావోద్వేగాలు, ఆరాధనలు నైతిక నియమాలు సామాజిక వ్యవహారాలన్నీ మిళితమై ఉన్నాయి.

2. ధర్మ సంస్థాపన, అలాగే జీవితంలోని అన్ని రంగాల్లో దాన్ని అమలు పరిచే కార్యం నిర్బంధం ద్వారా జరగదు. ప్రజల స్వభావాలనూ, ప్రజాబి ప్రాయాన్ని మలచటం ద్వారానే సాధ్యమవుతుంది.

3. ఈ విషయాలు జమాఅత్ నిబంధనావళిలో స్పష్టంగా ఉన్నాయి. మౌలానా మౌదూది (రహ్మలై) భావాలలో కూడా అత్యంత స్పష్టంగా ఈ విషయాలు పునరావృతమవడమే గాక ఆయన రచనలలో ఈ విషయాలు ఇతోధికంగా కనపడతాయి.

ప్రభుత్వ వ్యవస్థకు సామాజిక జీవితంతో దృఢమైన సంబంధం ఉంది. సామాజిక జీవితంలో మార్పు రానంత వరకు, కృత్రిమ మార్గాలు ఆలోచనల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలో సుస్థిరమైన మార్పు సాధ్యం కాదు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) లాంటి పరిపాలకుల వెనుక తాబయీలు, తబే తాబయీల ఓ పెద్ద జమాఅత్ ఉన్నప్పటికీ సంస్కరణ కోసం సమాజం సర్వతోముఖంగా సంసిద్ధంగా లేనందున వారు ఈ విషయంలో పూర్తిగా విఫలమయ్యారు. తుగ్లక్, ఔరంగజేబు ఆలంగీర్ లాంటి పరిపాలకులు కూడా వ్యక్తిగత ధార్మిక భావజాలంతో వ్యవస్థను మార్చలేకపోయారు. సర్వాధికారాలు వ్యక్తుల పరమైన సందర్భాల పరిస్థితి ఇది. ఒక ప్రజా ఉద్యమం దివ్య ఖురాన్ చూపే సైద్ధాంతిక భావనలు, ప్రవక్త పవిత్ర సందేశం, ఆచరణాత్మక పాత్రల ఆధారంగా సామాజిక జీవితపు స్వభావాలు, నైతికతా విలువలు మానసిక సాంస్కృతిక పునాదులను శక్తివంతమైన సాధనాల ద్వారా మార్చగలిగినప్పుడే ఇస్లామీయ విప్లవం సాధ్యమవుతుంది.

మీరు ఆకలిదప్పులకు అలమటించినా, శత్రుమూకల దాడులకు మీ దేహాలు ఛిద్రమైనా సహన స్థైర్యాలు, స్థిర చిత్తాలతోనే మీ సంస్కరణోద్యమాన్ని బహిరంగంగా నైతిక నియమాలు, చట్టపరిధిలో నడపాలనేదే తరచూ నా హితబోధ.

కమ్యూనిజం లాంటి వ్యవస్థలు ప్రజలపై బలవంతంగా రుద్దొచ్చు గాని ఇస్లాం అటువంటి వ్యవస్థ కాదు. ఇస్లాం మొదట ప్రజల హృదయాలలో విశ్వాస మాధుర్యాన్ని జనింప చేయడం అవసరమని భావిస్తుంది. ఎందుకంటే ప్రజల మదిలో విశ్వాసపు బీజాలు నాటుకోకపోతే ఆయన చూపిన మార్గం పై స్థిరంగా ఉండలేరు. ఇస్లాం ధర్మంలో ఉన్న సూత్రప్రాయమైన అవగాహన, దాని సత్యసంధతపై ప్రజలను ప్రధానంగా పాలకులను తగిన రీతిలో సంతృప్తి పరచకపోతే దాని ఆదేశ బోధనలు సరైన విధంగా అమలు చేయడం సాధ్యపడదని అది భావిస్తుంది. ఆపై అది ప్రజలూ పాలకుల స్వభావాలలో,

వారి ఆలోచనా విధానాలలో, నైతిక వ్యవహారాలలో తన సహజ స్వభావానికి అనుగుణంగా మార్పును కాంక్షిస్తుంది. ఈ విధమైన ప్రక్రియ జరగకపోతే ఇస్లాం ధర్మ పవిత్ర బోధనలు ఉన్నత నియమాలను వాటి స్వభావ స్ఫూర్తులతో అమలు చేయడం సాధ్యపడదు. ధర్మసంస్థాపనకు నేను ఉదహరించిన విషయాలన్నీ అవసరమైనవే. వాటిలో ఉన్న ఏ ఒక్క విషయాన్ని కూడా ప్రజల మనో మస్తిష్కాలపై బలవంతంగా రుద్దలేము.

ఇస్లామీయ ఉద్యమ శ్రేణులకు నేను చేసే మరో హితబోధ ఏమంటే వారు రహస్య ఉద్యమాలు నడిపేందుకు, ఆయుధాల ద్వారా విప్లవాన్ని చేపట్టేందుకు ప్రయత్నించకూడదు. ఇది తొందరపాటుతనం దుందుడుకు వైఖరి. ఒక సత్యప్రదమైన విప్లవం ఎల్లప్పుడూ ప్రజా ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుంది. మీ సందేశ ప్రచార కర్తవ్యాన్ని బహిరంగంగా నిర్వర్తించండి. విస్తృతమైన స్థాయిలో ప్రజల స్వభావాలు ఆలోచనలు వారి మనో మస్తిష్కాలను సంస్కరించండి. వారి దృక్పథాలను మార్చండి. నైతిక నడవడికతో వారి హృదయాలను గెలవండి. ఈ ప్రయత్నంలో ఎదురయ్యే ఆటంకాలు అవరోధాలను అత్యంత ఆత్మవిశ్వాసంతో అధిగమించండి. ఈ విధంగా దశలవారీగా వచ్చే విప్లవమే పటిష్టమైన విప్లవానికి నాంది పలుకుతుంది. అప్పుడే అది వ్యతిరేక శక్తులు సృష్టించే ఉధృత తుఫానుగాలికి ఏమాత్రం బీటలు వారకుండా దృఢంగా నిలవగలుగుతుంది. తొందరపాటు నిర్ణయాలతో కృత్రిమ విధానాలకు పాల్పడి సాధించిన విప్లవాలు, అవి ఏ మార్గం నుండి వచ్చాయో అదే మార్గాన మటుమాయమయ్యే అవకాశాలూ లేకపోలేదు.

చర్చను ముందుకు తీసుకెళ్లే క్రమంలో తహ్రీకే ఇస్లామీ, మౌలానా మౌదూదీ (రహ్మలై) దృష్టిలో ధర్మసంస్థాపన, దానికి చేరువయ్యే మార్గాలేమిటో స్పష్టం చేసేందుకు ఈ విషయాలను ఇక్కడ ఉటంకించడం జరిగింది.

ధర్మసంస్థాపన అంటే కేవలం ప్రభుత్వాలను ఏర్పరచడమో మార్చటమో కాదు. ఇది వ్యక్తుల, సమాజాల సర్వతోముఖమైన సంస్కరణోద్యమం. నిస్సందేహంగా రాజ్య రూపకల్పనా లక్ష్యాలు అందులో కలగలసి ఉన్నప్పటికీ ధర్మసంస్థాపనా భావన రాజ్య సంస్కరణ వరకే పరిమితం కాదు. ధర్మసంస్థాపన సిసలైన ఉద్దేశం అది కాదు. ఈ విషయాల ద్వారా స్పష్టమయ్యే ధర్మసంస్థాపనా భావం ఏమిటంటే ప్రజలకు ఇస్లాం సందేశం చేర వేయాలి. దాన్ని ప్రజలు

విశ్వసించాలి. తద్వారా వారి సహజ స్వభావాలూ, నీతీ నడవడికలు ఈ ధర్మానికి అనుగుణంగా మారాలి. తత్ఫలితంగా ఆదర్శ సమాజ స్థాపనా మార్గాలు సుగమమవుతాయి. ప్రజాభిప్రాయాలను మలిచే క్రమంలో రాజ్యాలు కూడా ఇస్లామీయ రంగులో రూపుదిద్దుకుంటాయి. ధర్మ సందేశం, శాంతియుత విధానాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని మలచగలిగినప్పుడే ధర్మసంస్థాపనా లక్ష్యం నెరవేరుతుంది.

## "తాబీర్‌కి గల్తీ"లో గల అభ్యంతరాలు

మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారు "తాబీర్‌కి గల్తీ"లో ధర్మ సంస్థాపనా భావనపై చేసిన అభ్యంతరాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

వహీదుద్దీన్ ఖాన్ గారి అభ్యంతరాలు క్లుప్తంగా : 1) సూరె షూరా, 13వ ఆయత్‌లో 'దీన్' అంటే అర్థం ప్రవక్తలందరి సందేశంలో ఉన్న సంయుక్త అంశం. ఈ ధర్మం మౌలిక విశ్వాసాలైన తౌహీద్, రిసాలత్, ఆఖిరత్‌ల వరకు మాత్రమే పరిమితం. ఆయా విశ్వాసాలకు సంబంధించిన అనుసరణ, వాటిని ప్రచారం చేసే ఆజ్ఞలు మాత్రమే అందులో ఉన్నాయి. 2) సూరయె సఫ్-9, సూరయె తౌబా -33, ఫతహ్: 28 వచనాలలో ఏవిధమైన ఆజ్ఞా లేదు. అందులో సమాచారం మాత్రమే ఉంది. ఇది అల్లాహ్ అభిలాష. ధర్మాన్ని తన ప్రవక్త (స) ద్వారా ప్రాబల్యం వహించేలా చేస్తాడు. ఇందులో విశ్వాసులకు ఏవిధమైన ఆజ్ఞా లేదు. 3) దైవ ధర్మ ఆశయం, దైవం- దాసుల మధ్య సంబంధ బాంధవ్యాలను పటిష్ట పరచడం. ఇదే ఒక ముస్లిం జీవిత ధ్యేయం (నస్బుల్ ఐన్). ఒక ముస్లిం ధర్మం ప్రకారం ఆచరిస్తూ, ధర్మం వైపునకు పిలవాలే తప్ప ప్రభుత్వాన్ని మార్చేందుకు ప్రయత్నించటం అతని పరిధిలో లేదు.

ఇస్లామీయ ఉద్యమానికి చెందిన అనేకమంది మేధావులు పై అభ్యంతరాలను క్షుణ్ణంగా సమీక్షించారు. మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారు స్వయంగా దీన్ (ధర్మం) జీవితంలోని ప్రతి వ్యవహారంతోనూ ముడిపడి ఉందనే విషయాన్ని అంగీకరిస్తారు కానీ ధర్మాన్ని స్థాపించాలన్న ఆజ్ఞ ఉన్న సూరయె షూరాలోని పదమూడవ వచనంలో 'దీన్' అనే పదానికి అర్థం కేవలం మౌలిక విశ్వాసాలు మాత్రమేననీ, ఈ అర్థాన్నే చాలామంది వ్యాఖ్యాతలు తీసుకున్నారని వాదిస్తారు. మా దృష్టిలో ఈ వైఖరి సరైనది కాదు. ఎందుకంటే ఏ వ్యాఖ్యాతలైతే ఈ వచనాన్ని విశ్వాసాలకు పరిమితం చేస్తూ వ్యాఖ్యానించారో వారు చేయాల్సినవి ఏమిటి,

చేయకూడనివి ఏమిటి అన్న దానిలో కూడా దైవాజ్ఞాపాలనను దీన్ (ధర్మం)గా పరిగణించారు. దైవాజ్ఞా పాలనలో ధర్మానికి చెందిన సమగ్ర బోధనలు ఉన్నాయి. వివరాలకు మౌలానా రజిఉల్ ఇస్లామ్ నద్వి గారి "ఇఖామతే దీన్ ఔర్ నిఫాజె షరీయత్" అనే పుస్తకం చూడగలరు. అందులో ఆయన ఖతాదా, అల్లామా ఇబ్నుల్ అరబీ, జమఖ్షరీ, ఖుర్తుబీ, ఆలూసీ, ఇబ్నె కసీర్, బైజావీ, రాజీ, మొదలైన ముఖ్యమైన విద్వాంసుల అభిప్రాయాలను ఉదహరించారు. దీని ఆధారంగా విద్వాంసులు ధర్మం అనే పదాన్ని విశ్వాసాల వరకే పరిమితం చేశారనడం సరికాదని తెలుస్తోంది. ఈ వచనంలోని "వల్లజీ ఔహైనా ఇలైక" అనే వాక్యం ద్వారా నీపై (ప్రవక్త(స) వారిపై అవతరించిన ప్రతీదీ అనే అర్థం కూడా చేరి ఉంది. అందులో ప్రవక్త(స) వారిపై అవతరించిన సమస్త ఆజ్ఞలు వాటంతటవే వచ్చేస్తాయి. వాస్తవమేమిటంటే ప్రవక్తల బోధనలు కేవలం విశ్వాసాలకే పరిమితం కావు. వారందరి సందేశ సారాంశం ఒక్కటే. వారి షరీయత్‌లో మౌలిక బోధనలు కూడా ఒకటే. ఒకవేళ షరీయత్‌లలో వ్యత్యాసాలు ఉన్నా అవి మౌలిక విషయాలలో కాదు, పాక్షిక సాపేక్షిక విషయాలలో మాత్రమే. ఈ ఆయత్‌లో ఉన్న విషయాన్ని మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ (రహ్మాలై) ఇలా వివరించారు :

"విద్వాంసులు (అంటే ఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్తల) దృష్టిలో ధార్మిక సూత్రప్రాయక బోధనలు, ప్రవక్తలు (అలైహిముస్సలాం) తీసుకువచ్చిన సమగ్రమైన బోధనల ఆచరణాత్మక వివరణ ఏమై ఉంటుంది? ప్రజలు దైవాదేశాలన్నింటికీ విధిగా కట్టుబడాలి. ఆయన నిషేధించిన వాటన్నింటినీ మానుకోవాలి . దీనిపై రెండు సమాధానాలు వచ్చే ఆస్కారమే లేదు. ఆ జవాబు తప్పనిసరిగా ఒక్కటే కావాలి. అదేమంటే ముస్లిం సమాజం తన ప్రవక్త(స) తీసుకు వచ్చిన ధర్మం, షరీయత్‌లకు సంబంధించిన సమస్త ఆజ్ఞలను ఖచ్చితంగా పాటించాలి. తదనుగుణంగా ఈ ఆయత్ వెలుగులో ముస్లింల కొరకు ఈ షరీయత్‌ను సంపూర్ణంగా అనుసరించడం, స్థాపించడం తప్పనిసరి విధి అవుతుంది. ఈ ఆయత్ ద్వారా అర్థమయ్యేది ఇదే. సాధారణంగా వ్యాఖ్యానాలలో ఈ భావమే గోచరిస్తుంది. ఇక్కడ ధర్మం, ధర్మ సంస్థాపనా ఆజ్ఞను కేవలం విశ్వాసాల వరకే పరిమితం చేయడానికి తగు కారణమేదీ కనిపించదు".

విశ్వాసుల ధ్యేయం దైవ ప్రసన్నతను చూరగొనటం. ధర్మ సంస్థాపన

కొరకు కృషి చేయడం అనేది ధర్మ ఆవశ్యకత కాగలదు కానీ ధ్యేయం కాజాలదు అనేది మరో అభ్యంతరం. ఇక్కడ తారతమ్యం ఉచ్చరించిన పదాలు, సంభాషణ శైలిలోనే ఉంది తప్ప సారాంశంలో ఎంత మాత్రం లేదు. మేము జమాఅత్ ధ్యేయానికి సంబంధించి ఇచ్చిన వివరణలో దైవ ప్రసన్నత, పరలోక సాఫల్యాలు ధర్మ సంస్థాపనకు వాస్తవ ప్రేరణలని చెప్పాము. అర్థం ఏమిటంటే అసలు లక్ష్యం దైవ ప్రసన్నత, పరలోక సాఫల్యమే. కానీ దైవ ప్రసన్నతను చూరగొనటం ఒక ప్రత్యేకమైన నిరంతర కృషిపైనే ఆధారపడి ఉంటుంది. ఈ నిరంతర కృషి ప్రధాన లక్ష్యం ధర్మ సంస్థాపన అయి ఉండాలి. ఈ విషయం కేవలం జమాఅత్ నిబంధనావళిలోనే కాదు, మౌలానా మౌదూదీ (రహ్మాలై) సాహిత్యం, జమాఅత్ సాహిత్య మంతటిలోనూ ఈ భావనే మాటిమాటికీ పునరావృతమవుతూ ఉంటుంది. ఇప్పుడు మీరు దైవప్రసన్నతా సాధననే మీ జీవితాశయంగా మలచుకుంటే అందుకోసం ధర్మసంస్థాపన అవసరమని అనుకుంటే కేవలం పదాలు మారినంత మాత్రాన ఆచరణలో ఎటువంటి మార్పు రాదు. ఈ రూపంలో కూడా ధర్మసంస్థాపన ఒక విధిగానే పరిగణించబడుతుంది.

## జావీద్ అహ్మద్ గామీదీ గారి అభ్యంతరాలు

జనాబ్ జావీద్ అహ్మద్ గామిదీ గారు ధర్మసంస్థాపనా భావనపై విస్తృతమైన విమర్శలు ఆయన వ్యాసం **'తావీల్కీ గల్తీ'**లో ఆ తర్వాత ఆయన రాసిన పుస్తకం **బుర్హాన్**లో కూడా ఉన్నాయి. అంతేకాకుండా అనేక వీడియోలలో గామిదీ గారు తన అభిప్రాయాలను వ్యక్త పరిచారు. ఇతర వ్యాసాలు వ్యాఖ్యానాలలో కూడా దీనికి సంబంధించి తన వైఖరిని తెలిపారు. వాటన్నింటి సారాంశమిది :

1) ఇఖామత్ అన్న పదానికి అర్థం ఖాయమ్ కర్నా లేదా నాఫిజ్ కర్నా కాదు. పైరవీ కర్నా (అనుసరించడం), ఖాయమ్ రఖ్నా అని అర్థం. అందుకే సూరయె షూరా 13వ ఆయత్ లో కేవలం ధర్మానుసరణ అనే ఆజ్ఞ మాత్రమే ఉందంటారాయన.

2) ధర్మ ప్రాబల్యం అనేది మహాప్రవక్త (స)కు మాత్రమే వర్తిస్తుంది. దైవ సందేశహరుణ్ణి పంపినపుడు ధర్మం ఆధిపత్యం వహించి తీరడమనేది అల్లాహ్ సంప్రదాయం. ఈ సంప్రదాయం ప్రవక్త(స) గారితో పరిపూర్తయింది. నేడు సామాన్య ముస్లింలకు ఈ ఆయత్లు వర్తించవు.

3) ధార్మిక పరమైన రాజకీయ, సామాజిక ఆజ్ఞలు పాలకులకు మాత్రమే వర్తిస్తాయి. నేడు సాధారణ ముస్లింల పని కేవలం తమ పరిధిలో ధర్మంపై అమలు చేయడం, సందేశాన్ని ప్రజలకు అందించడం మాత్రమే. జనాబ్ గామిదీ గారు అరబీ కవిత్వాన్ని ఉదహరిస్తూ అఖీమూ అంటే స్థాపించడం కాదు నిర్వహించడం అని నిరూపించే ప్రయత్నం చేస్తారు. మా దృష్టిలో ఇఖామత్ అనే పదానికి అనువాదం స్థాపించడమని చేసినా, నిర్వహించడమని చేసినా అసలు చర్చపై దాని ప్రభావం ఏమీ పడదు. మౌలానా మౌదూదీ (రహ్మాలై) తన వ్యాఖ్యానం తఫ్హీముల్ ఖుర్ఆన్‌లో ఖాయమ్ కర్నా అని తర్జుమా చేసినా ఖాయమ్ రఖ్నా అనే అర్థం వస్తుందన్న వాదనతో ఏకీభవించారు కూడా. ధర్మాన్ని స్థాపించడమన్నా అలాగే ధర్మంపై స్థిరంగా ఉండడమన్నా ఈ రెంటి అర్థం ఒకటే. జీవితంలోని అన్ని విభాగాలలోనూ ధర్మాన్ని అనుసరించాలి. ఈ విషయాన్ని జావీద్ అహ్మద్ గామిదీ గారు కూడా అంగీకరిస్తారు, అంతేకాకుండా ధర్మం పై స్థిరంగా ఉండడం అనే అర్థంలో చట్టం, షరీఅత్, జిహాద్, యుద్ధం మొదలైన ఆజ్ఞలన్నిటినీ చేర్చారు. కానీ ఆయన చెప్పేదేమిటంటే అఖీమూ అంటే అర్థం కేవలం ధర్మానికి సంబంధించిన మన వ్యక్తిగత అంశాలపై అమలు చేయడం వరకే పరిమితమై ఉంటుంది. ఏ వ్యవహారాల సంబంధమైతే మనతో లేదో వాటిపై అమలు చేయడం, వాటిని స్థాపించడానికి ప్రయత్నించడం అఖిమూ (స్థాపించడం) అనే అర్థంలో రాదు. ఈ దృక్పథం ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు చేసిన వ్యాఖ్యానాలకు విరుద్ధంగా ఉంది. మౌలానా గౌహర్రహ్మాన్, మౌలానా రజీఉల్ ఇస్లాం నద్వీలు తమ రచనలలో ఆయా వ్యాఖ్యాతల వివరణాత్మకమైన ఉదాహరణలు ఇచ్చారు. వివరాలకు చూడండి మౌలానా గౌహర్రహ్మాన్ గారి తఫ్హీముల్ మసాయెల్, డాక్టర్ రజి ఉల్ ఇస్లాం నద్వీ గారి నిఫాజె షరీయత్... వ్యాఖ్యాతలందరి దృష్టిలో ధర్మాన్ని స్థాపించడం కూడా చేరి ఉంది. కానీ డాక్టర్ జావీద్ అహ్మద్ గామిదీ గారు చెప్పిన దానిని అంగీకరించినా ధర్మంపై అమలు పరచడమే నిఘంటువు ప్రకారం అఖీమూ అనే పదానికి సరైన అర్థం అనుకుంటే అసలు ధర్మాన్ని అమలు పరచడం అంటే ఏమిటి? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీన్ పరిధిలో మంచిని ఆజ్ఞాపించడం, చెడు నుండి వారించడం, దావత్, జిహాద్, దైవ ధర్మానికి తోడ్పడటం. మానవాళి సమక్షంలో సత్య సాక్ష్యం, మొదలైన ఖుర్ఆన్ పదేపదే నొక్కి పలికిన విషయాలు ధర్మం పరిధిలోకి రావా? ఆయా అంశాలు ధర్మంలో ప్రాధాన్య పూర్వకమైన విషయాలని అన్నప్పుడు (గామిదీ గారు కూడా వీటిని

అంగీకరిస్తారు) అఖీమూ అనే పదంలోని రెండు అర్థాలలో దేనిని తీసుకున్నా ధర్మసంస్థాపనలో ఈ పనులన్నీ వాటంతట అవే చేరిపోతాయి. ఒకవేళ అఖీమూ అంటే అర్థం నా వ్యక్తిగతానికి సంబంధించినవే అయితే, వాటిని పరిపూర్తి చేయడమన్నా అప్పుడు కూడా సందేశం, జిహాద్, ధర్మానికి సహాయ సహకారాలు అందించడం వంటి ఆజ్ఞలు నా వ్యక్తిగతానికి సంబంధించినవే వాటి వర్తింపు ధర్మ సంస్థాపనా ఆవశ్యకతే ఔతుంది. వాస్తవానికి ధర్మ సంస్థాపన ఏదో ఒక ఆయత్ వరకు పరిమితమై లేదు. ఖురాన్ బోధనలన్నీ 'ధర్మ సంస్థాపన'కు కేంద్ర బిందువులయి ఉన్నాయి. ఖుర్ఆన్ ఈ కృషిని అనేక పారిభాషిక పదాల ద్వారా వివరించింది. ధర్మ ప్రాబల్యం, న్యాయ స్థాపన, మానవాళి ముందు సత్య ధర్మసాక్ష్యం, మంచిని ఆజ్ఞాపించడం, చెడును వారించడం, ధర్మ పరిచయ కార్యం– వీటన్నింటిలో ధర్మ సంస్థాపనా అర్థమే అంతర్గతంగా నిగూఢమై ఉంది. ధర్మంపై అమలు చేస్తూనే మానవాళిని ధర్మం వైపునకు ఆహ్వానించి, ఇస్లామీయ సమాజంలో అల్లాహ్ ఆజ్ఞలను స్థాపించేం దుకు కృషి చేయాలనేదే ఈ ఆదేశాలలో నిబిడీకృతమై ఉన్న సారాంశం. మౌలానా మౌదూదీ, ఇస్లామీయ ఉద్యమాలు ఈ విషయాలనే ధర్మసంస్థాపన అని పేర్కొంటాయి.

గామిదీ గారు ఖుర్ఆన్‌లోని అనేక ఆజ్ఞలను మహాప్రవక్త(స)కే పరిమితం చేస్తారు. నిజానికి సాధారణ నియమేమిటంటే ఖుర్ఆన్‌లో అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఉద్దేశించి, ఏ ఆజ్ఞలనైతే ఇచ్చాడో అవన్నీ ముస్లిం సమాజానికీ వర్తిస్తాయి. అవి మహాప్రవక్త(స) వారి వరకే పరిమితం చేయబడ్డాయనడానికి స్పష్టమైన ఆధారం ఉండాలి. సూరయె సఫ్ "ఆయనే తన ప్రవక్త (స) కు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు. దానిని సకల ధర్మాలపై ప్రాబల్యం వహించే ధర్మంగా చేయడానికి, ఇది బహు దైవారాధకులకు ఎంత అయిష్టమైనా సరే" అని ప్రస్తావించిన ఆయత్ గురించి గామిదీ గారు ఏమంటారంటే అందులో ప్రవక్త (సఅసం)ను గురించి అల్లాహ్ వాగ్దానం, సంప్రదాయాల ప్రస్తావన ఉంది. ఆయన 'ముష్రికూన్' అంటే అరబ్ ముష్రికులు అని, అలద్దీనికుల్లిహీ అంటే అరబ్‌లోని మత ధర్మాలని అనువాదం చేస్తారు. కానీ అలా భావించడానికి ఎలాంటి ఆధారాలు లేవు. ధర్మ ఆధిక్యత

అనేది ప్రవక్తల పరంపరలో ప్రవక్తల సంప్రదాయం అనే ఒకే ఒక వివరణ మాత్రమే ఆయన ఇస్తున్నారు. అది తప్ప మరో ఆధారం లేదు. అల్లాహ్, మహాప్రవక్త(స) ద్వారా ధర్మ ప్రాబల్యాన్ని పరిపూర్ణం చేశాడన్నది నిర్వివాదాంశం. సూరయె సఫ్‌లోని ఈ ఆయత్లో లియుజ్హిరహూ అనే పదాలు ఇక్కడ ధర్మ ఆధిపత్యాన్ని ప్రవక్త(స) మిషన్, లక్ష్యాలుగా పేర్కొనడం జరిగింది. ఇక్కడ కేవలం అల్లాహ్ ఆకాంక్ష మాత్రమే కాక, ప్రవక్త (స) మిషన్, లక్ష్యాల వ్యక్తీకరణ కూడా ఉంది. ఒకవేళ కేవలం ధర్మ ఆధిక్యానికి సంబంధించిన దైవాభిలాషను వ్యక్తీకరించడమే లక్ష్యమైతే ప్రవక్త(స) ప్రస్తావన దాని తర్వాత ధర్మ ఆధిక్యత ప్రస్తావనతో పాటు యుజ్హిరహూ అని చెప్పవలసిన అవసరం లేదు. నిస్సందేహంగా ధర్మ ఆధిపత్యం అల్లాహ్ ప్రణాళిక అనడంలో సందేహం లేదు. కానీ తన ఈ ప్రణాళికను ప్రవక్త (స) ద్వారా పరిపూర్ణం గావించాలన్నది అల్లాహ్ ఆకాంక్ష. అందుకే ఆయన ప్రవక్తను ప్రభవింపజేశాడు. అందుకే ఇది ప్రవక్త మిషన్ అని అనబడుతుంది. ఒకవేళ ఇది ప్రవక్త పని అయినప్పుడు ప్రవక్త తర్వాత ఇది ఉమ్మత్ కార్యం ఎందుకు  కారాదు? గామిదీ గారు ధర్మ ఆధిపత్యాన్ని గురించి ఎలా ప్రస్తావిస్తారంటే వాటి ఆధారంగా ఇలా అనిపిస్తుంది– అల్లాహ్ తన సంప్రదాయాన్ని ప్రాకృతిక ఆదేశం ద్వారా పూర్తి చేస్తాడు. ఇస్లామీయ చరిత్రలో 'జబ్రియా' అనే ఒక వర్గం దేవుని ప్రాకృతిక ఆదేశాల లోనూ, షరీఅత్ పరమయిన ఆదేశాలలోనూ చాలా పెద్ద పొరపాటు చేసింది. చర్చనీయాంశం అవుతున్న  విషయంలో  (గామిదీ గారి ఆలోచన ద్వారా) ఈ పొరపాటే ధర్మాధిపత్యపు సంప్రదాయం విషయంలో కూడా జరిగినట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఈ వచనంలో ధర్మ ఆధిపత్యం అనేది అల్లాహ్ సంప్రదాయం అనడానికి ప్రవక్త(స)ను పంపడం అనే ప్రస్తావనే స్పష్టమైన ఆధారం. ప్రవక్త (స)  కృషి ద్వారానే ఈ సంప్రదాయం పూర్తవుతుంది. దేవుని మార్గనిర్దేశననుసరించి ప్రవక్త (స) నిర్ణయాలు చేస్తారు. ఆచరణ కొరకు ప్రణాళికలు చేస్తారు, జిహాద్ చేస్తారు. ఒడంబడికలు చేసుకుంటారు. అవసర మైన చోట దేవుని మార్గబోధననుసరించి పోరాడతారు, సంధి చేసుకుంటారు. సందేశం, హిజ్రత్,  జిహాద్ మలుపుల ద్వారా సాగిపోతారు. రాజకీయ ప్రణాళికను రచిస్తారు. తన వ్యూహాలతో, దైవ చిత్తానికి లోబడి ఈ సంప్రదా యాన్ని పరిపూర్తి చేస్తారు. అల్లాహ్ తన ప్రవక్త(స) అదర్శాన్ని ముస్లింలందరి

కోసం నమూనాగా నిర్ధారించాడు. ప్రవక్త(స) నిర్వర్తించిన పవిత్రమైన కార్యాన్ని నేడు ఈ ఉమ్మత్ (ముస్లిం సముదాయం) కొనసాగించ వలసిన అవసరం ఉంది. ధర్మ ఆధిక్యత అనే గురుతర బాధ్యతను ప్రవక్త(స) వరకు మాత్రమే పరిమితం చేయడం, ముస్లిం సమాజానికి ఈ కార్యం నుండి దూరం చేయడానికి ఎలాంటి సుస్పష్టమైన ఆధారం లేదు. క్రింద ప్రస్తావించ బడిన ఆయత్‌లు, హదీసుల ద్వారా ధర్మ ఆధిక్యత అనేది తర్వాతి కాలాల్లో కూడా అవసరమని చెప్పవచ్చు. "కృంగిపోకండి, దుఃఖ పడకండి. మీరు విశ్వాసులే ఐతే మీరే ప్రాబల్యం పొందుతారు" (ఆలి ఇమ్రాన్ : 139). "మీలో విశ్వసించి మంచి పనులు చేసేవారికి అల్లాహ్ చేసిన వాగ్దానం ఏమిటంటే వారికి భూమిపై వారికి ముందు గతించిన ప్రజలకు అనుగ్రహించినట్లుగానే అధికారాన్ని ప్రసాదిస్తాడు. వారి కొరకు వారి ధర్మాన్ని పూర్తి స్థాయిలో స్థాపిస్తాడు. "(సూరె నూర్ : 55, జావీద్ గామిదీ గారి తర్జుమా) హదీసులో ఇలా ఉంది. "ఇస్లాం ప్రపంచంలో ప్రాబల్యం వహించడానికి వచ్చింది గాని లోబడి ఉండటానికి రాలేదు" (బైహకీ). ఇమామ్ ముస్లిం తన సహీహ్ కితాబుల్ ఇమారహ్ క్రింద "నా ఉమ్మత్లోని ఒక వర్గం ఎల్లప్పుడూ సత్యంపై స్థిరంగా ఉంటుంది. అంతేకాకుండా అది శత్రువులపై ఆధిపత్యం వహిస్తుంది" అనే హదీసును ఒక అధ్యాయంగా నెలకొల్పారు. అలాగే సహీహ్ బుఖారీలో కూడా ఒక అధ్యాయం ఉంది. ఇందులో అనేక హదీసులు ఉటంకించబడ్డాయి. వీటిలో సత్యవంతుల ఒక వర్గం ఇస్లాం కోసం నిరంతరం కృషి చేస్తూ ఉంటుంది. కడకు దానికి ఆధిపత్యం లభిస్తుంది. ఉదాహరణకు సహీహ్ ముస్లింలో హజ్రత్ ముఆవియాచే ఉల్లేఖించబడిన హదీస్‌లో ఇలా ఉంది. "అల్లాహ్ ఎవరికైతే మేలు చేయదలిచాడో అతనికి ధర్మావగాహనను ప్రసాదిస్తాడు. ఎల్లప్పుడూ ఒక జమాఅత్ ముస్లింల హక్కుల కోసం పోరాడుతూ ఉంటుంది. ప్రళయ దినం వరకూ తనపై పోరాడే వారిపై అది ఆధిపత్యాన్ని సాధిస్తుంది".

## బౌద్ధిక ఆధారాలు

ధర్మ సంస్థాపనా అంశాన్ని లోతుగా అధ్యయనం చేయదలచిన వారు మౌలానా అహ్మద్ ఉరూజ్ ఖాద్రి గారి ఇఖామతె దీన్ ఫర్జ్ హై, మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ గారి "ఫరీజె ఇఖామతె దీన్", మౌలానా జలాలుద్దీన్ ఉమ్రీ గారి "మారూఫ్ వ మున్కర్" పుస్తకాలను అధ్యయనం చేయగలరు. మేము

ప్రస్తుతానికి కామన్ సెన్స్ (common sense) దృక్కోణం నుండి ఈ అంశాన్ని చూడదలచాము. 1. ఆక్షేపణలకు తెరలేపిన మౌలానా వహీదుద్దీన్ ఖాన్, జావీద్ అహ్మద్ గామిదీలు ఇద్దరూ సామూహిక వ్యవహారాలకు సంబంధించి ఇస్లాం వివరణాత్మకమైన బోధనలను ప్రసాదించిందని అంగీకరించినవారే. ఈ బోధనలపై అమలు నేటి ఆధునిక కాలంలో కూడా తప్పనిసరని వారు నమ్ముతారు. ఇదే మానవ సాఫల్యానికి దైవ ప్రణాళిక అని కూడా నమ్ముతారు. అల్లాహ్ తన దాసులైన మానవుల కొరకు ఒక సామూహిక వ్యవస్థను ఇష్టపడినప్పుడు, మరి దానిని నేడు దైవదాసులకు పరిచయం చేసేందుకు, ఆ విధానాన్ని కొనసాగించేందుకు ఏదైనా వ్యవస్థ ఉందా? అనేది ప్రశ్న. ఒక కాలంలో ఈ ధర్మ సంస్థాపనా కార్యాన్ని అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా నెరవేర్చాడు. నేడు సామాన్య ముస్లింలు ఈ బాధ్యతను స్వీకరించకపోతే ఈ బాధ్యత మరెవరిపై ఉంటుంది?

## విచిత్రమైన విషయం

సృష్టికర్త అయిన అల్లాహ్ మానవుల కొరకు ఒక సంపూర్ణ జీవిత విధానాన్ని అవతరింపజేశాడు. దీనిని ఎంతో కూలంకషంగా విడమరచి చెప్పాడు. ఈ బోధనలను పరిరక్షించే ఏర్పాట్లు కూడా చేయడమే కాక ఒకప్పుడు తన ప్రవక్తల ద్వారా దీని ప్రచార స్థాపనలకు కూడా ఏర్పాట్లు చేశాడు. కానీ తర్వాతి కాలాల్లో ఈ జీవన వ్యవస్థను మానవులచే అంగీకరింపచేసే, ముస్లిం సమాజంలో ఈ కృషిని నిరంతరాయంగా కొనసాగించే ఏవిధమైన ఏర్పాటునూ చేయలేదు అనడం హాస్యాస్పదమైనదే కాక విచిత్రమైన విషయం కూడాను. ఆధునిక యుగంలో ఈ మాటను విజ్ఞత, వివేకాలు గల ఏ వ్యక్తి కూడా కేవలం సామూహిక జీవన వ్యవస్థను పరిచయం చేస్తే చాలు అది దానికదే స్థాపించ బడుతుంది అనే మాటను అంగీకరించడు. ఒకవేళ ఎవరైనా అమాయకంగా ఏ వ్యవస్థ ఐనా దానికదే స్థాపించబడుతుంది అన్న విషయాన్ని నమ్ముతుంటే నేటి రాజకీయ, సామాజిక జ్ఞానాలు ఆ భావనను ఖండించడానికి సరిపోతాయి. ప్రతి సిద్ధాంతం, వ్యవస్థ తన స్థాపన కొరకు సామూహిక మానవ ప్రయత్నాన్ని అవి ఆశించిన జీవన వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని సాగాలని కోరుతాయి. ఒకవేళ సిద్ధాంతం, సూత్రాలే సరిపోతే ఖుర్ఆన్ అవతరణే సరిపోయి ఉండేది. ప్రవక్తల అవసరమే ఉండేది కాదు. ఏ విధంగానైతే వ్యక్తిగత జీవితానికి

సంబంధించిన ఇస్లామీయ ఆజ్ఞలు మానవ శ్రేయస్సు కొరకే ఇవ్వబడ్డాయో అలాగే సామూహిక జీవితానికి సంబంధించిన ఆజ్ఞలు కూడా మానవ శ్రేయస్సు, సాఫల్యాల కోసమే ఇవ్వబడ్డాయి. ఏ విధంగానైతే బహుదైవారాధన, అబద్ధాలు ఒక వ్యక్తి కొరకు నష్టదాయకమో అలానే వడ్డీ, జాతీయతత్వం, మానవుని అపరిమిత స్వయం ప్రతిపత్తులు కూడా మానవ సముదాయాలకు నష్టదాయకమే. అల్లాహ్ తన దాసుల వ్యక్తిగత, సామూహిక సాఫల్యాన్ని ఇష్టపడినప్పుడు మానవులకు అత్యంత ముఖ్యమైన, తాను అవతరింప చేసిన నియమాలను స్థాపించే ఎలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడమనేది అంగీకార యోగ్యం కాని విషయం. (వ్యక్తులను సంస్కరించడంలో ప్రధాన అంశం సామాజిక సంస్కరణ అనే వాదనను మనం ఇక్కడ లేవనెత్తడం లేదు) అల్లాహ్ తన ధర్మాన్ని స్థాపించే కార్యాన్ని మానవుల ద్వారానే చేయించు కుంటాడు. అందుకనే అల్లాహ్ ఖుర్ఆన్లో తన దాసులు ధర్మానికి సహాయం చేయాలనే విషయాన్ని చెబుతాడు. (విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్‌కు సహాయం చేస్తే అల్లాహ్ మీకు సహాయం చేస్తాడు. మీ పాదాలను స్థిరంగా ఉంచుతాడు (సూరె ముహమ్మద్ : 7) అంతేకాకుండా అల్లాహ్‌కు సహాయకులుగా రూపొందాలనే ఆజ్ఞ ఇవ్వబడింది. "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు సహాయకులు కండి". (సూరయె సఫ్- 14) దీని అర్థం ధర్మం విషయంలో దైవ ప్రణాళిక పరిపూర్తి కొరకు నిరంతర కృషి చేయాలన్నది కాక మరేమి కాగలదు? ఒకవేళ ఈ ధర్మం జీవితపు వ్యక్తిగత, సామూహిక వ్యవహారాలలో మానవుల మార్గదర్శి కావడమే దైవ ప్రణాళిక అయితే ఈ ప్రణాళిక పరిపూర్తి కొరకు కృషి చేయడమే ధర్మానికి చేసే సహాయంగా పేర్కొనబడుతుంది. ఈ కృషినే ఇస్లామీయ ఉద్యమాలు ధర్మసంస్థాపనా కృషి అని అంటాయి. మానవ సమాజపు వ్యవస్థను దారితప్పిన పైశాచిక వ్యవస్థలు, సిద్ధాంతాల పునాదులపై నిర్మించ ప్రయత్నం చేసే శక్తులు మానవ సమాజాలలో ఎల్లప్పుడూ కదం తొక్కుతూనే ఉన్నాయి. కమ్యూనిజం రూపంలో ఒక పటిష్ట ఉద్యమం కొనసాగడం, పెట్టుబడిదారీ వ్యవస్థ స్థాపన కొరకు ప్రణాళికాబద్ధమైన కృషి కొనసాగడం, ఫెమినిస్ట్ ఉద్యమాలు, స్వలింగ సంపర్కం, ఫాసిస్టు జాతీయ వాదాలు బలపడి తమ రాజకీయ, ఆర్థిక భావనల స్థాపనకై కృషి కొనసాగిస్తూ ఉండగా దేవుని పరిపూర్ణ ధర్మం మానవ శ్రేయస్సు కొరకు గ్యారంటీ ఇచ్చిన

జీవన వ్యవస్థ కేవలం గ్రంథాలలో బందీ కావడమే దేవుని ఇచ్ఛ ప్రణాళిక కాగలదా? లేదా దైవాజ్ఞలను స్థాపించడం తన బాధ్యతగా భావించే పాలకుల కోసం ఎదురు చూస్తూ ఉండి పోదామా? ఇవి బుద్ధి జ్ఞానాలతో పొసగని విషయాలు.

ఒకవేళ అల్లాహ్ మానవుల కోసం ఏదైనా ఒక ప్రత్యేక సిద్ధాంతాన్ని ఇష్టపడితే దాన్ని స్థాపించేందుకు నిరంతర కృషి చేసే బాధ్యత ఎవరో ఒకరిపై పెట్టవలసిన అవసరం ఉంటుంది. ఆ బాధ్యతను ఆ సిద్ధాంతాన్ని నమ్మే వారి పైనే పెట్టడం అనేది అతి సహజమైన విషయం.

2. ఒకవేళ సామూహిక విషయాలలో ధర్మం ఇచ్చిన హక్కులను స్థాపించే బాధ్యత కేవలం పాలకులపైనే ఉంటే అప్పుడు కూడా సాధారణ ముస్లింలు మంచిని ఆజ్ఞాపించే చెడు నుండి వారించే పనికి బద్ధులు కారా?

ఒకవేళ పాలకులు తమ బాధ్యతలను విస్మరిస్తే బహిరంగంగా దైవ శాసనాల పట్ల వైముఖ్యం కనబరుస్తుంటే అమలు దిశగా పాలకుల దృష్టి మరల్చడం ముస్లింల బాధ్యత కాదా?

ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు.

"శ్రేయోభిలాషకు మారుపేరు ఇస్లాం ధర్మం. శ్రేయోభిలాష అల్లాహ్ కోసం, అల్లాహ్ గ్రంథం కోసం, ముస్లింల నాయకుల కోసం, సాధారణ ముస్లింల కోసం". (సహీహ్ ముస్లిం, విశ్వాసాల ప్రకరణం)

అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఇలా అంటున్నారు.

మర్వాన్ ఈద్ రోజు మెంబర్ని తొలగింప చేశాడు. నమాజ్ కంటే ముందుగానే ఖుత్బా ప్రారంభించాడు. అప్పుడు ఒక వ్యక్తి "మర్వాన్! మీరు సున్నత్ కి వ్యతిరేకంగా చేశారు. మీరు మెంబర్ని తొలగింపచేశారు. నిజానికి ఈ రోజు మెంబర్ తొలగించబడదు. మీరు నమాజ్ కంటే ముందే ఖుత్బా ప్రారంభించారు. నిజానికి నమాజ్ కంటే ముందు ఖుత్బా లేదు" అన్నాడు.

అబూ సయీద్ ఖుద్రీ (రజి)ఇలా అన్నారు. ఆ వ్యక్తి తన పైనున్న ఆ బాధ్యతను నిర్వర్తించాడు..

నేను ప్రవక్త (స) చెబుతుండగా విన్నాను... మీలో ఎవరైనా ఏదైనా షరీయత్‌కి వ్యతిరేకమైన పనిని చూస్తే ఒక వేళ దానిని చేతితో ఆపే శక్తి ఉంటే చేతితో ఆపాలి. లేకపోతే నోటితోనైనా ఆపాలి. అదీ సాధ్యం కాకపోతే హృదయంలో నైనా దాన్ని తప్పుగా భావించాలి. ఇది విశ్వాసపు సామాన్య (కనిష్ట) స్థాయి. (సునన్ ఇబ్ను మాజా)

ఒక పవిత్ర హదీసులో ఇలా చెప్పబడింది :

ఉమ్మె సలమా (ర.అ) ఉల్లేఖనం:

"అతి త్వరలో కొంతమంది పాలకులు వస్తారు వారిని మీరు గుర్తించి ధిక్కరిస్తారు. వారి నిజస్వరూపాన్ని ఎరిగినవాడు మోక్షాన్ని పొందుతాడు. బహిరంగంగా తిరస్కరించిన వాడు శాంతి బాటలో ఉంటాడు. వారి పట్ల సంతృప్తి చెంది వారి ఆజ్ఞాపాలన చేసేవాడు శాంతి మార్గాన లేడు మోక్షాన్ని పొందనూ లేడు"

అనుయాయ గణం "దైవప్రవక్తా! అటువంటి పాలకులను ఎదిరించి వారితో యుద్ధం చేయవద్దా?" అని ప్రశ్నించగా "వారు నమాజ్ ఆచరిస్తున్నంత వరకు అలా చేయకూడదు" అని ప్రవక్త శిఖామణి సెలవిచ్చారు.

ఈ హదీసును ఇమామ్ ముస్లిం తన ప్రామాణిక గ్రంథంలో 'పాలకులు ధర్మ శాస్త్రానికి విరుద్ధంగా వ్యవహరిస్తే వారి తిరస్కారం తప్పనిసరి' అనే మకుటంతో ఒక పూర్తి అధ్యాయాన్ని నెలకొల్పి అందులో క్రోడీకరించారు. అంటే ఏ పాలకులు ధర్మశాస్త్రాన్ని (షరీయత్‌ను) బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారో వారి ఉద్వాసన మరియు వారితో యుద్ధానికి సంబంధించిన షరతులు వేరుగా ఉన్నాయి. అయితే వారి చర్యను ఖండించడం వారిని మంచి వైపునకు ఆహ్వానించడం ఇంకా ఇస్లాం సంస్థాపన కోసం వారిని ప్రోత్సహించడం లాంటివి చెయ్యడం ఎలాంటి పరిస్థితుల్లోనైనా విశ్వాసుల బాధ్యత..

3. నేటి కాలంలో దేశాల వ్యవస్థలు, చట్టాలకు కేవలం పాలకులు మాత్రమే బాధ్యులు కారు. ప్రజలు కూడా బాధ్యులౌతారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజాస్వామిక వ్యవస్థ అమలులో ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలు మాత్రమే అసలైన పాలకులౌతారు. ప్రభుత్వ పనిని వీరు ఎన్నుకున్న ప్రతినిధులు నిర్వహిస్తారు. దేశ చట్ట, విధాన నిర్ణయాలు ప్రజల్లో ఉన్న ధోరణుల ప్రకారమే

జరుగుతాయి. కనుక నేటి కాలంలో పాలన గురించి ధర్మాదేశాలు పాలకులనే సంబోధిస్తాయి కానీ ప్రజలను కాదన్నది సరైన భావన కాదు. ప్రజాస్వామిక ప్రభుత్వాలలో రూపొందించే విధానాలకు ప్రజలు పూర్తిగా బాధ్యత వహిస్తారని ఇప్పుడు విశ్వవ్యాప్తంగా అంగీకరించబడుతుంది. ప్రజల ముందు జవాబుదారీ తనం, ప్రజల ఓట్లతో ఎన్నుకోబడే ప్రభుత్వాలు, దైవాజ్ఞలను బహిరంగంగా ఉల్లంఘిస్తుంటే అల్లాహ్ అవతరింప చేసిన చట్టం ప్రకారం తీర్పు చెయ్యని స్థితికి వస్తే ఆ సమాజంలో నివసించే ముస్లింలు ఎలా తమ బాధ్యతల నుంచి తప్పించుకోగలరు ? "బాధ్యతల నుండి విముక్తి పొందే ఏకైక మార్గం సమాజాన్ని ఇస్లాం స్థాపన కొరకు తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నం చేయడమే". వాస్తవానికి, వారు తమ శక్తికి మించిన పనులకు బాధ్యులు కారు. కాని తాము శాయశక్తులా చేయగలిగిన పనుల నుండి వారెలా తప్పించుకోగలరు. ఇస్లాంలో సామూహిక బాధ్యతా భావన కూడా ఉంది. సమాజపు సామూహిక చెడులకు సమాజంలోని ప్రతి వ్యక్తినీ బాధ్యుడుగా చేయడం జరిగిందని మనకు తెలుసు. "ఆ ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి, దానివలన కలిగే హాని ప్రత్యేకంగా మీలో పాపం చేసిన వారికే పరిమితమై ఉండదు" (అన్ఫాల్ : 25) జావీద్ అహ్మద్ గామిదీ గారు స్వయంగా ఈ ఆయతు వ్యాఖ్యానం ఇలా చేశారు: "ఒక్కో సందర్భంలో ఒక సమూహం చేసిన నేరాలకు జాతిమొత్తం శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఈ ఆయత్లో అలాంటి వైఖరినే వారిస్తూ సంస్కరించుకోమని హెచ్చరించడం జరిగింది. లేకపోతే అలాంటి ఉపద్రవానికే బలైపోతారు. ఆ ఉపద్రవం మొత్తం జమాఅత్‌నే కాక రాబోయే తరాలను కూడా చుట్టుముట్టి వేస్తుంది. ఈ కారణంగానే అల్లాహ్ ధర్మంలో ముస్లింలను ఇతరులకు మంచిని ఆజ్ఞాపించేందుకు, చెడునుండి వారించేందుకు బదులుగా చేయడం జరిగింది. (అల్ బయాన్ అల్ అన్ఫాల్ సూరా వ్యాఖ్యానం, జావీద్ అహ్మద్ గామిదీ). హదీస్ ఇలా ఉంది : ఒకవేళ ఏదైనా జాతిలో పాప కార్యాలు సర్వసాధారణం అయి వారిని ఆ పనుల నుండి ఆపడానికి ఏ ప్రయత్నమూ జరగనప్పుడు, త్వరలోనే అక్కడి వారందరినీ అల్లాహ్ శిక్షకు గురి చేస్తాడు. (ఇబ్నె మాజహ్, ముస్నద్ అహ్మద్).

4) ఏ సిద్ధాంతాన్నైనా మనం బలంగా నమ్ముతున్నామంటే ఆ సిద్ధాంతాన్ని స్థాపించేందుకు కృషి చేయడం కూడా తప్పనిసరి అయినట్లే. మానవ నైజం కాంక్షించేది కూడా ఇదే. ఒకవేళ ఇస్లాం బోధించే సామూహిక ఆజ్ఞల పట్ల అమలు చేయడం తప్పనిసరి కాదని ఎవరైనా అనుకుంటే అలాంటి వారి

విషయం వేరు (దీని గురించి ప్రారంభంలోనే వివరించాము). కానీ ఎవరైతే ఇస్లామ్ రాజకీయాల సమేతంగా మానవ జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తుందని నమ్ముతారో, ఆ మార్గదర్శకత్వం ద్వారానే మానవ సాఫల్యం సాధ్యమని విశ్వసిస్తారో అలాంటి వారికి ఆ వ్యవస్థను స్థాపించే కలగనడం, దాని కొరకు సాధ్యమయ్యే కృషి చేయడం దానంతటదే వారి బాధ్యత ఔతుంది. జీవిత లక్ష్యం, ధ్యేయాల లోతైన సంబంధం విశ్వాసాల (Belief System)తో ముడిపడి ఉంటుంది. ప్రతి ఆశయం ఏదో ఒక సిద్ధాంతానికి మూలమవుతుంది. ప్రతి సిద్ధాంతం తప్పనిసరిగా ఏదో ఒక ధ్యేయాన్ని జనింపజేస్తుంది. Belief System, Life Missionల లోతైన సంబంధం నిర్వహణా జ్ఞానం, సాంఘిక మనస్తత్వ శాస్త్రం, సామాజిక శాస్త్రాల్లో అంగీకారయోగ్యమైన విషయమే. ఈ శాస్త్రాలన్నింటిలోనూ వ్యక్తి తన గురించి, ఇతర మానవుల గురించి, విశ్వం గురించి ఏ దృక్పథాన్నయితే కలిగి ఉంటాడో (belief system) అలాగే ఏ విలువలు నియమాలయితే తన కోసం ఇతర మానవుల కోసం సరైనవిగా భావిస్తాడో (Value System) వీటిపైనే అతని జీవితాశయం నిర్మితమవుతుంది. ఏ రంగంలో నయినా మార్పుపై పటిష్ట నమ్మకం ఆ వ్యక్తిని ఆ మార్పు కోసం ఉద్యమాన్ని నడిపేలా వివశుడిని చేస్తోంది. అందుకనే ఇస్లాం దైవ ధర్మం, ఇస్లాం ద్వారానే మానవ సాఫల్యం సాధ్యమన్న విశ్వాసం తప్పనిసరి ఫలితం ధర్మసంస్థాపనే కాగలదు. బుద్ధి రీత్యా మానవుడు ఇస్లాంను విశ్వసించడం ఇస్లాం ధర్మసంస్థాపన అతని ధ్యేయం కాకపోవడం అనేది సాధ్యం కాదు. ఉదాహరణకు నేను క్యాన్సర్ నివారణ కొరకు ఒక కొత్త మందును కనుగొన్నాననుకోండి. అలాగే ఈ ఔషధం ద్వారా క్యాన్సర్‌కు గురైన ప్రతి రోగి తప్పనిసరిగా స్వస్థత పొందగలడని నమ్మకం నాలో ఉంటే ఈ అమూల్యమైన ఔషధాన్ని ప్రమోట్ చేయడం సామాన్య మానవుల అవసరం. అయితే ఈ విశ్వాస ఫలితం ఔషధాన్ని ప్రమోట్ చేయడం దానిని దేశ ఆరోగ్య శాఖ ద్వారా ఆమోదింప చేసుకోవడం నా ధ్యేయం అవుతుంది. ఒకవేళ ఔషధంపై సంపూర్ణ నమ్మకం కలిగి ఉంటూ కూడా ఆ విషయాన్ని నేను ఇంట్లోనే ఉంచుకుని కూర్చుంటే నా ఈ మౌనం మానవత్వానికి వ్యతిరేకం అవుతుంది. అంతేగాక నా మనస్సాక్షికి మానవ నైజానికి కూడా వ్యతిరేకం కాగలదు. కమ్యూనిజం లాంటి అనేక ఇజాల ధ్వజవాహకులకు తమ సిద్ధాంతాలను స్థాపించడానికి పుస్తకాలు పదబంధాలు నిఘంటువుల అధ్యయనం చేయించి ఈ వ్యవస్థల స్థాపన మీ బాధ్యత అని చెప్పే అవసరం రాలేదు. ఆ వ్యవస్థ

మానవులకు మేలు చేసేదనే వారి విశ్వాసమే దాని స్థాపనను వారి జీవిత లక్ష్యం చేసుకునేలా చేసింది. ఈ సంస్థాపనా కార్యాన్ని బలవంతంగా చేయరాదని ఇస్లామీయ నియమం చెబుతుంది. నేను క్యాన్సర్ మందులు ఉపయోగించమని ఎవరినీ బలవంత పెట్టను డాక్టర్‌కి కూడా ఇలా బలవంతంగా వినియోగింప చేసే అనుమతి ఉండదు. ఎవరికైనా ఈ ఔషధం సరైనది కాదు అనిపించినప్పుడు లేదా నష్టదాయకమని అనిపించినప్పుడు వారి అభిప్రాయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి నేను వ్యతిరేకించను. కానీ నేను నా లక్ష్యం కోసం చివరిదాకా ప్రజలు ఈ ఔషధాన్ని వాడేందుకు సంసిద్ధులయ్యేదాకా నా ప్రయత్నం తప్పక చేస్తాను. ధర్మసంస్థాపన సాధ్యమయ్యేలా ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు ప్రయత్నిస్తాను. ఈ కృషినే నేను ఇస్లాం కొరకు కూడా చేయవలసి ఉంది.

(ఈ వ్యాసం జామియా ఇస్లామియా శాంతాపురంలో నవంబర్ 2017లో మౌలానా మౌదూదీ సైద్ధాంతిక భావ ధారలపై నిర్వహించబడిన కాన్ఫరెన్స్‌లో చేయడం జరిగింది. ఆ తర్వాత లాహెూర్ నుండి వెలువడే తర్జుమానుల్ ఖురాన్ మాస పత్రికలో జనవరి 2018లో, జిందగీ నౌ మాస పత్రిక 2018 ఫిబ్రవరి సంచికలో ప్రచురితమైంది.)

## ఆధార గ్రంథాలు

1) జమాఅత్ నిబంధనావళి

2) తఫ్హీమాత్ : మౌలానా మౌదూది (రహ్మాలై)

3) తావీల్ కి గల్తీ (జావేద్ అహ్మద్ గామిదీ)

4) ఫరీజయె ఇఖామతె దీన్ (సద్రుద్దీన్ ఇస్లాహీ)

5) మారూఫ్ వ మున్కర్ (జలాలుద్దీన్ ఉమ్రీ)

6) ఇఖామతె దీన్ ఫర్జ్ హై (ఉరూజ్ అహ్మద్ ఖాద్రీ)